
'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 312

బుధవారం 26-7-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




హర్మన్‌పై 2 మ్యాచ్‌ల నిషేధం

బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో అనుచిత ప్రవర్తనపై ఐసీసీ చర్యలు - 12లో



విశాఖలో క్రికెట్ కిక్

ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌తో జరిగే టెస్టు, టీ20 మ్యాచ్‌లు కేటాయింపు - 12లో



ఐదోసారి కక్ష్య దూరం పెంపు

చంద్రయాన్-3 మిషన్ కక్ష్య దూరాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు ఐదోసారి మంగళవారం విజయవంతంగా పెంచారు.

వివరాలు 6లో ▸



అబుదాబిలో మెర్స్-కోవ్ వైరస్

యూఏఈలోని అబుదాబిలో 28 ఏళ్ల యువకుడికి ప్రాణాంతకమైన మెర్స్-కోవ్ వైరస్ సోకింది.

వివరాలు 6లో ▸



వనమా ఎన్నిక చెల్లదు

తెలంగాణలోని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదని ఆ రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చింది.

వివరాలు 3లో ▸

దశదిశ లేని కూటమి.. 'ఇండియా'



- దేశం పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరు
- దేశాన్ని పాలించి, విభజించాలన్నదే విపక్ష కూటమి లక్ష్యం
- ఈస్ట్ ఇండియా కంపెనీ, ఇండియన్ ముజాహిదీన్‌లో కూడా 'ఇండియా' అనే పేరుంది
- నా మూడో టర్మ్‌లో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్
- బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో ప్రధాని మోదీ స్పష్టీకరణ

6లో

కేంద్రంపై అవిశ్వాసం..!



- నేడు 'ఇండియా' కూటమి సమావేశంలో నిర్ణయం
- మణిపూర్ హింసాకాండపై అట్టుడికిన ఉభయ సభలు
- ప్రధాని మోదీ పార్లమెంట్‌కు వచ్చి చర్చించాలని డిమాండ్
- 51 మంది విపక్ష ఎంపీల నోటీసులు
- నిరసనలకు మద్దతు పలికిన బీఆర్ఎస్.. విపక్షాలు కలసి రావాలంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా లేఖ

6లో

న్యూస్‌రీల్


బలపడిన అల్పపీడనం



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడింది. నేడు వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్న వర్షాలు మరో 3 రోజులు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆరు జిల్లాల్లో అత్యంత భారీవర్షాలు కురుస్తాయయంటూ.. రెడ్ అలెర్ట్ జారీ చేసింది. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని హెచ్చరించింది.

వివరాలు 14లో ▸

ఆల్మట్టిలో పెరిగిన వరద ఉధృతి



పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా నది ప్రధాన పాయలో వరద ప్రవాహం పెరిగింది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 1.16 లక్షల క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 74.67 టీఎంసీలకు చేరింది. అలాగే తుంగభద్ర డ్యామ్‌లోకి 83,842 క్యూసెక్కులు వచ్చి చేరుతుండటంతో నీటి నిల్వ 32.86 టీఎంసీలకు చేరింది. వరద ప్రవాహం పెరుగుతుండటంతో ప్రకాశం బ్యారేజీ నుంచి 11,840 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

వివరాలు 14లో ▸

గోదావరిలో మళ్లీ పెరుగుతున్న వరద



పరీవాహక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటం, ఉప నదులు ఉప్పొంగుతుండటంతో గోదావరిలో వరద ఉధృతి పెరుగుతోంది. భద్రాచలం వద్ద ప్రవాహం 7,59,015 క్యూసెక్కులకు పెరగడంతో నీటి మట్టం 38.9 అడుగులకు చేరింది. పోలవరం నుంచి 7,62,000 క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతుండగా.. ధవళేశ్వరం బ్యారేజి నుంచి 6,76,760 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు.

వివరాలు 14లో ▸





ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు వర్చువల్‌గా ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రైతుకు మరింత రొక్కం

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో పంటలకు ఇంకా మెరుగైన ధరలు: సీఎం జగన్

ఆరు ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రారంభోత్సవం, ఐదింటికి శంకుస్థాపనలు చేసిన ముఖ్యమంత్రి

- ఆర్బీకేల స్థాయిలో ప్రాథమిక, జిల్లా స్థాయిలో సెకండరీ ఎఫ్‌పీవోలు
- కేంద్ర ప్రభుత్వం ఇవ్వని పంటలకూ రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్‌పీని ప్రకటించింది
- చిరుధాన్యాలకు సైతం మద్దతు ధర ప్రకటించిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్
- ధరలు తగ్గిన ప్రతిసారి అన్నదాతలను ఆదుకున్నాం
- మార్కెట్ జోక్యంతో నాలుగేళ్లలో రూ.8,000 కోట్లతో పంటల కొనుగోళ్లు

2లో



ప్రారంభమైన ఎఫ్‌పీవోలు

- చిత్తూరు జిల్లాలో 3, అన్నమయ్య జిల్లాలో ఒకటి చొప్పున మొత్తం నాలుగు పండ్లు, కూరగాయల ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభం.
- విజయనగరం జిల్లా ఎల్ కోట మండలం రేగ గ్రామంలో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం.
- కర్నూలు జిల్లా తడకనపల్లెలో 100 మైక్రో యూనిట్స్‌తో ఆనియన్, టమాటా సోలార్ డీ హైడ్రేషన్ క్లస్టర్ ప్రారంభం.



వీటికి సీఎం శంకుస్థాపన

- తిరుపతి జిల్లా శ్రీసిటీలో మోన్ డ లీజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్‌కు శంకుస్థాపన.
- శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో గ్రౌండ్‌నట్ ప్రాసెసింగ్ యూనిట్‌కు భూమిపూజ.
- అనంతపురం జిల్లా, శ్రీసత్యసాయి జిల్లాల్లో మూడు టమాటా ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన.

కేంద్రం కంటే మిన్నగా..

- నెలరోజులుగా రాష్ట్రంలో సబ్సిడీ టమాటా విక్రయాలు
- బహిరంగ మార్కెట్‌లో నేటికీ రూ.120కు తగ్గని ధర
- రైతుల నుంచి సగటున కిలో రూ.104 చొప్పున కొనుగోలు
- రైతుబజార్లలో కిలో రూ.50కే సరఫరా.. ఇప్పటికే రూ.11.82 కోట్లు ఖర్చుచేసి 1,137 టన్నుల పంపిణీ
- ఏపీ బాటలో సబ్సిడీ విక్రయాలకు కేంద్రం శ్రీకారం
- కిలో రూ.80 చొప్పున విక్రయాలు..
- ధరలు పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు కొనసాగించాలని నిర్ణయం

3లో



ఆకస్మిక వర్షాలతో పలు రాష్ట్రాల్లో టమాటా పంట దెబ్బతినడంతో వాటి ధరలు దేశవ్యాప్తంగా చుక్కలనంటాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో కిలో రూ.200కు పైగా పలుకుతుండగా.. రాష్ట్రంలోని బహిరంగ మార్కెట్‌లో రూ.120కు తగ్గట్లేదు. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుబజార్ల ద్వారా సబ్సిడీపై కిలో రూ.50కే టమాటాలను విక్రయిస్తూ వినియోగదారులకు బాసటగా నిలుస్తోంది. ఇప్పటివరకు రూ.11.82 కోట్లు ఖర్చు చేసి 1,137 టన్నుల టమాటాలను ప్రభుత్వం వినియోగదారులకు పంపిణీ చేసింది. ఏపీ బాటలో కేంద్ర ప్రభుత్వం కూడా కిలో రూ.80 చొప్పున విక్రయిస్తోంది.

దారుణంగా దర్యాప్తు



- వివేకా హత్య కేసులో కల్పిత కథనాలతో డైలీ సీరియల్‌లా సీబీఐ ఛార్జ్ షీట్: సజ్జల
- ప్రజాక్షేత్రంలో సీఎం జగన్‌ను ఎదుర్కోలేని గుంటనక్కలకు వేదికలా దర్యాప్తు సంస్థ
- భారతమ్మతో కలసి నేను సునీతమ్మ ఇంటికి వెళ్లలేదు
- హత్య జరిగిన పది రోజుల తర్వాత నా భార్యతో కలసి పరామర్శకు వెళ్లా
- వివేకా గౌరవానికి భంగం కలగకూడదని ఇంతకాలం భరించాం.. మేం మౌనం వహిస్తుంటే... సునీతమ్మ బతికున్నవారినే బజారుకీడుస్తున్నారు
- జీవితాలను నాశనం చేసే స్థితికి వచ్చాక మేమెందుకు మౌనంగా ఉండాలి?
- వివేకా హత్య కేసులో ఆధారాలు ఒకవైపు.. దర్యాప్తు మరోవైపు
- సీఎం జగన్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసే కుట్ర ఇదంతా
- ఉగ్రవాదుల కంటే ఘోరంగా ఎల్లో మీడియా తీరు

2లో



104 మొబైల్ మెడికల్ యూనిట్‌ను పరిశీలిస్తున్న తమిళనాడు వైద్య శాఖ బృందం

ఏపీ వైద్య శాఖ విధానాలపై

తమిళనాడు ఆసక్తి

- ఆ రాష్ట్ర వైద్యశాఖ ఐఏఎస్ అధికారి గోవిందరావు ఏపీకి రాక
- రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల పరిశీలన
- వైఎస్సార్ విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలుపై ఆరా
- క్షేత్రస్థాయిలో పర్యటించి కార్యక్రమాల అమలు తీరుపై అధ్యయనం.. ఈ విధానాలు బాగున్నాయని కితాబు

2లో

ఇదేం జాతర



ఇతను లంచం తిన్నాడ్సార్!

కాలువల ద్వారా పోర్టులకు

సరుకు రవాణా



- వాటిని అనుసంధానిస్తూ అంతర్గత జలరవాణా అభివృద్ధి.. ఇలా రాష్ట్రంలో 1,555 కి.మీ జలరవాణాకు అవకాశం
- తొలిదశలో ముక్త్యాల నుంచి మచిలీపట్నంకు జలమార్గం
- ఆ తర్వాత విజయవాడ నుంచి కాకినాడ, పెన్నా నది ద్వారా కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానం
- డీపీఆర్‌లు సిద్ధంచేసిన ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ

5లో

దేశవ్యాప్తంగా

చినుకుతో వణుకు



- ఢిల్లీ నుంచి గల్లీ దాకా దేశమంతా అదే వ్యథ
- ఆక్రమణలు, అడ్డగోలు నిర్మాణాలే కారణం
- మొన్న ముంబై, నిన్న చెన్నై, ఇవాళ ఢిల్లీ.. నగరమేదైనా అదే కథ
- యమునా నది మహోధృతి ధాటికి కనీవినీ వరదలతో ఢిల్లీ అతలాకుతలం
- ఏమిటీ పరిస్థితి? ఎందుకీ దుస్థితి?

6లో

క్లుప్తంగా...

'ఆయుష్మాన్ భారత్' అమలులో దేశంలోనే ముందంజ

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ నివాస్



ఐఈసీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న నివాస్ తదితరులు

సాక్షి, అమరావతి: ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్(ఏబీడీఎం) కార్యక్రమం అమలులో దేశంలోనే రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ముందంజలో ఉందని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్ అన్నారు. మంగళగిరిలోని తన కార్యాలయంలో ఏబీడీఎంపై వైద్య వర్గాల్లో అవగాహన కల్పించడం కోసం తయారు చేసిన ఐఈసీ మెటీరియల్‌ను నివాస్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీడీఎంపై వైద్య శాఖ సిబ్బందిలో అవగాహన పెంచడం కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ క్రమంలో సోమ, మంగళవారాల్లో 26 జిల్లాల నుంచి 52 మంది మాస్టర్ ట్రైనర్స్‌కు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని తెలిపారు. వైద్యశాఖలో పనిచేసే కింది స్థాయి ఆరోగ్య కార్యకర్తల వరకూ ప్రతి ఒక్కరికీ కార్యక్రమంపై అవగాహన కల్పించడం, నైపుణ్యాలు పెంపొందించడంలో మాస్టర్ ట్రైనర్‌ల పాత్ర కీలకమైనదని చెప్పారు.

జల విద్యుత్ ఉత్పత్తిలో 'సీలేరు బేసిన్' రికార్డు



సాక్షి, అమరావతి/మోతుగూడెం: సీలేరు బేసిన్‌లోని జలవిద్యుత్ ప్రాజెక్టులు సోమవారం ఒక్కరోజే 416.1 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి రికార్డు నమోదు చేశాయి. గత పదేళ్లలో రోజువారీ విద్యుత్ ఉత్పత్తిలో ఇదే అత్యధికం. సీలేరు బేసిన్‌లో నాలుగు జల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులున్నాయి. అప్పర్ సీలేరు(240 మెగావాట్లు), లోయర్ సీలేరు(460 మెగావాట్లు), డొంకరాయి కెనాల్ పవర్ హౌస్ (25 మెగావాట్లు) ప్రాజెక్టులను ఏపీజెన్‌కో నిర్వహిస్తుండగా.. మాచ్‌ఖండ్ నదిపై ఉన్న 120 మెగావాట్ల హైడల్ పవర్ ప్రాజెక్టుల్లో ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్(ఏపీజెన్‌కో), ఒడిశా హైడల్ పవర్ కార్పొరేషన్‌లకు సమాన వాటా ఉంది. సోమవారం లోయర్ సీలేరులో 202.60 మెగావాట్లు, మాచ్‌ఖండ్‌లో 118.5 మెగావాట్లు, అప్పర్ సీలేరులో 87.5 మెగావాట్లు, డొంకరాయిలో 7.4 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా రికార్డు నమోదు చేశారు.

వేస్ట్ టు వెల్త్ కేంద్రాలతో సత్ఫలితాలు



మార్టూరు వర్మీకంపోస్టు యార్డును పరిశీలిస్తున్న సాక్షి శ్రీవాత్సవ

అనకాపల్లి టౌన్/మునగపాక (అనకాపల్లి జిల్లా): సంపద తయారీ కేంద్రాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని స్వచ్ఛభారత్ మిషన్ బృందం కితాబు ఇచ్చింది. ఢిల్లీ నుంచి వచ్చిన ఈ బృందం మంగళవారం అనకాపల్లి మండలం మార్టూరు, మునగపాక గ్రామాల్లోని సంపద తయారీ కేంద్రాలను సందర్శించింది. బృందం ప్రతినిధి సాక్షి శ్రీవాత్సవ కేంద్రంలో తయారవుతున్న వర్మీకంపోస్ట్ అమ్మకాల ద్వారా ఇంతవరకు వచ్చిన ఆదాయంపై వివరాలను తెలుసుకున్నారు. ఎరువుల తయారీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆహ్లాదకర వాతావరణంలో నడుస్తున్న ఈ కేంద్రాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ జనాభా, తడి, పొడి చెత్త సేకరణకు సంబంధించి సర్పంచ్ దిమ్మల అప్పారావుతోపాటు జిల్లా పంచాయతీ అధికారి శిరీషరాణిని అడిగి పలు వివరాలు తెలుసుకున్నారు.

మరింత పక్కాగా మద్యం నాణ్యత నిర్ధారణ



సాక్షి, అమరావతి: మద్యం నాణ్యతను మరింత పక్కాగా నిర్ధారించేందుకు రాష్ట్రంలో అత్యాధునిక ఎక్సైజ్ ల్యాబొరేటరీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దక్షిణ భారత్‌లోనే తొలిసారిగా ఎక్సైజ్ శాఖ రూ.12.50 కోట్లతో విశాఖ, కాకినాడ, గుంటూరు, కర్నూలు, చిత్తూరుల్లో వీటిని నిర్మించింది. ఈ 5 ల్యాబ్‌లను త్వరలోనే ప్రారంభించనున్నారు. డిస్టిలరీలు ఉత్పత్తి చేసే మద్యం నమూనాలను ఈ ల్యాబ్‌ల్లో పరీక్షించి.. ఆమోదించిన తర్వాతే వాటిని మద్యం దుకాణాలకు సరఫరా చేస్తారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో మద్యం నమూనాలను పరీక్షించే వ్యవస్థ లేకుండా పోయింది. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిర్దేశిత ప్రమాణాలతో ఉన్న ఇతర ల్యాబ్‌లో మద్యం నమూనాలను పరీక్షించేవారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలోనే అధునాతన ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది..

రైతుకు మరింత రొక్కం!

ప్రాసెసింగ్ యూనిట్లతో పంటలకు ఇంకా మెరుగైన ధరలు: సీఎం జగన్





మోన్ దలీజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులను సత్కరిస్తున్న సీఎం వైఎస్ జగన్.. ద టింబక్టు కలెక్టివ్ ఉత్పత్తులను పరిశీలిస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: రైతన్నలు పండించే పంటలకు మరింత మెరుగైన ధరలను కల్పించే లక్ష్యంతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పుతున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఆర్బీకేల స్థాయిలో ప్రైమరీ ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లు, జిల్లా స్థాయిలో సెకండరీ ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వీటి వల్ల రైతులు పండించిన పంటలకు మరింత విలువ తోడై మెరుగైన ధర లభిస్తుందన్నారు. గత నాలుగేళ్లలో పంటలు ధరలు తగ్గిన ప్రతిసారి మార్కెట్ జోక్యం ద్వారా రూ.8,000 కోట్లతో పంట ఉత్పత్తులను కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకున్నట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించని పంటలకు సైతం రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరలను ప్రకటించిందని తెలిపారు. చిరుధాన్యాలకు సైతం కనీస మద్దతు ధర ప్రకటించిన ఏకైక రాష్ట్రం దేశంలో ఆంధ్రప్రదేశ్ ఒక్కటేనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్ మంగళవారం తన క్యాంపు కార్యాలయం నుంచి పలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు (ఎఫ్‌పీవోలు) వర్చువల్‌గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

ఆర్బీకేల స్థాయిలో అనుసంధానం..

ఇవాళ 421 ప్రైమరీ ప్రాసెసింగ్ కలెక్షన్ సెంటర్లను ప్రారంభించుకున్నాం. ఇవన్నీ 1,912 ఆర్బీకేలతో మ్యాపింగ్ చేసినవి. మొత్తం 945 కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. తొలిదశలో 344 కోల్డ్ రూమ్‌ల పనులు జరుగుతుండగా 43 కోల్డ్ రూమ్‌లను ఇవాళ ప్రారంభించుకున్నాం. ఇవి 194 ఆర్బీకేలతో అనుసంధానమయ్యాయి. ప్రతి ఆర్బీకేను కోల్డ్ రూమ్స్, కలెక్షన్ సెంటర్లకు మ్యాపింగ్ చేస్తూ ప్రైమరీ ప్రాసెసింగ్‌లో డ్రయ్యింగ్ ప్లాట్‌ఫామ్‌లు, కలెక్షన్ సెంటర్లు, వ్యవసాయ ఉపకరణాలు లాంటి వాటిని రైతు భరోసా కేంద్రం పరిధిలోకి తేవాలి. గ్రేడింగ్, సెగ్రిగేషన్ లాంటివి ఆ స్థాయిలో జరిగితే సెకండరీ ప్రాసెసింగ్ జిల్లా స్థాయిలో చేపట్టేలా అడుగులు పడుతున్నాయి.

పోటీ పెంచేలా మద్దతు ధరల ప్రదర్శన

రైతులు పండించిన ఉత్పత్తులను ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ఇవ్వని పంటలకు సైతం కనీస మద్దతు ధర కల్పిస్తూ ఆర్బీకేలలో పోస్టర్ల ద్వారా ప్రదర్శిస్తున్నాం. తద్వారా మార్కెట్‌లో పోటీ నెలకొనేలా చర్యలు తీసుకున్నాం. ఏదైనా పంటకు ధరలు పడిపోతే సంబంధిత ఆర్బీకే స్థాయిలోనే జోక్యం చేసుకుని మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటున్నాం. ప్రైమరీ, సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్లు ఇందుకు ఉపయోగపడతాయి. రాబోయే రోజుల్లో ఈ మార్పులన్నింటితో రైతు తాను పండించే పంటకు ఇంకా మెరుగైన రేటు పొందే పరిస్థితి వస్తుంది. మార్కెట్‌లో రైతులకు మద్దతు ధరలు తగ్గిన ప్రతిసారి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోళ్లు చేపట్టి తోడుగా నిలుస్తున్నాం. ఆర్బీకేలో ప్రదర్శించే రేటు కన్నా రైతులకు ఎక్కడైనా తక్కువ ధర వస్తుంటే ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఆ పంటలను సేకరిస్తుంది. ధరల స్థిరీకరణ నిధి ద్వారా ఏటా రూ.3 వేల కోట్లు కేటాయిస్తూ నాలుగేళ్లలో పంటల కొనుగోలు కోసం దాదాపు రూ.8 వేల కోట్లు వెచ్చించాం.

ప్రభుత్వంపై నమ్మకానికి నిదర్శనం

శ్రీసిటీలో మరో రూ.1,600 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన పనులకు ఈరోజు శంకుస్థాపన చేయడం ఆనందాన్ని కలిగిస్తోంది. 'మోన్ డ లీజ్' కంపెనీ రెండో విడతలో రూ.1,500 కోట్లు పెట్టుబడి పెట్టడానికి ముందుకు రావడం రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న నమ్మకాన్ని మరోసారి స్పష్టం చేస్తోంది. చాక్‌లెట్, క్యాడ్‌బరి, బోర్న్‌వీటా లాంటివి తయారు చేస్తున్న ఈ ఫ్యాక్టరీ దినదినాభివృద్ధి చెంది మంచి జరగాలని మనసారా కోరుకుంటున్నా.

ధర్మవరం వేరుశెనగ రైతులకు లబ్ధి

శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుతో వేరుశెనగ పంటకు మరింత విలువ పెరిగి స్థానిక రైతన్నలకు ప్రయోజనం చేకూరుతుంది. వేరుశెనగ రైతులకు మెరుగైన ధరలు ఇవ్వగలిగే పరిస్థితి రావాలని ఈ యూనిట్ల ఏర్పాటుకు నిర్ణయించాం. రూ.75 కోట్లతో వేరుశెనగ ప్రాసెసింగ్ యూనిట్ ధర్మవరంలో ఏర్పాటవుతోంది. 55,620 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన ఈ యూనిట్ 15 వేల మంది రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. మరో 9 నెలల్లో ఈ ప్రాజెక్టు పూర్తి కావడం ద్వారా వేరుశెనగ పంట నుంచి చిక్కీ, వేరుశెనగ నూనె, పీనట్ బటర్ లాంటి ఉప ఉత్పత్తులు తయారై పంటకు మార్కెటింగ్ పెరుగుతుంది. దీనివల్ల స్థానికంగా రైతన్నలకు చాలా మేలు జరుగుతుంది.

రెండు జిల్లాల్లో 4 ఎఫ్‌పీవోలు

ఇవాళ చిత్తూరు జిల్లాలో 3, అన్నమయ్య జిల్లాలో ఒకటి చొప్పున మొత్తం నాలుగు ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రారంభిస్తున్నాం. దాదాపు 14,400 మెట్రిక్ టన్నులకు సంబంధించి పండ్లు, కూరగాయల ప్రాసెసింగ్ యూనిట్లు అందుబాటులోకి రావడం ద్వారా మార్కెటింగ్ సౌకర్యం పెరిగి రైతులకు మంచి ధరలు లభిస్తాయి.

10,800 టన్నుల టమాటా ప్రాసెసింగ్ యూనిట్లు

శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో 3,588 మంది రైతులకు మేలు చేస్తూ 10,800 టన్నుల టమాటా ప్రాసెసింగ్ యూనిట్లకు ఇవాళ శంకుస్థాపన చేస్తున్నాం. మరో నాలుగు నెలల్లో వీటిని ప్రారంభించుకోబోతున్నాం. దీనివల్ల టమాటా రైతులందరికీ మంచి జరుగుతుంది. 250 మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుతో టమాటా రైతుల ఇబ్బందులు తీరతాయి. మార్కెట్‌లో ధరలు పడిపోయినా అయినకాడికి అమ్ముకోవాల్సిన అవసరం ఉండదు. మంచి ధరలకు విక్రయించుకునే అవకాశం కలుగుతుంది.

విజయనగరంలో మిల్లెట్స్ ప్రాసెసింగ్

మిల్లెట్స్‌లో దాదాపు 13 సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మరో 32 పైచిలుకు ప్రైమరీ ప్రాసెసింగ్ మిల్లెట్ యూనిట్లు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. దేశంలో ఎక్కడా లేనివిధంగా మిల్లెట్స్‌కు కూడా ఎంఎస్‌పీ అందిస్తోంది మన రాష్ట్రంలోనే. మిల్లెట్స్ రేటు పడిపోతే జోక్యం చేసుకుని కొర్రలు లాంటి చిరుధాన్యాలకు ఎంఎస్‌పీ అందించాం. విజయనగరంలో 7,200 మెట్రిక్ టన్నుల కెపాసిటీతో సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్ రావడం వల్ల ఈ ప్రాంతంలో రైతులకు మంచి జరుగుతుంది. రైతుల ఉత్పత్తులకు మంచి ధర లభిస్తుంది.

కర్నూలు ఉల్లి రైతన్నకు ఆదాయాన్నిచ్చేలా

కర్నూలులో ఆనియన్ డీహైడ్రేషన్ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టు కింద వంద చోట్ల చేస్తున్నాం. రూ.లక్ష పెట్టుబడితో ప్రతి ఒక్కరికి దాదాపు రూ.12 వేల ఆదాయాన్నిచ్చే కార్యక్రమమిది. రానున్న రోజుల్లో ఈ యూనిట్లను మరింత విస్తరిస్తూ ఐదువేల వరకు పెంచుతాం.

చిరుధాన్యాల రైతులకు లబ్ధి



నాబార్డు సహకారంతో చిరుధాన్యాల ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నాం. 1,500 మంది సభ్యులున్నారు. ఎక్కడ విక్రయించాలో తెలియక ఇబ్బంది పడుతున్న సమయంలో సీఎం జగన్ మా కష్టాలు తీర్చారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా రూ.4 కోట్ల విలువైన యూనిట్‌ను ఏర్పాటు చేయడంతో నేరుగా 30 మంది ఉపాధి పొందుతున్నాం. ప్రత్యక్షంగా 2 వేల మంది, పరోక్షంగా 10 వేల మంది రైతులు లబ్ధి పొందుతున్నాం. ఆర్బీకేల ద్వారా గ్రామంలోనే అన్నీ అందుతున్నాయి. సచివాలయ వ్యవస్థ చక్కగా పని చేస్తోంది.

– సరస్వతి, సీఈవో, ఆరోగ్య మిల్లెట్స్ ఎఫ్‌పీవో, విజయనగరం జిల్లా

సేంద్రీయ సాగుకు ప్రోత్సాహం



గత 30 - 35 ఏళ్లుగా రైతులతో కలిసి పనిచేస్తున్నాం. రైతులతో కలిసి 'ధరణి' ఎఫ్‌పీవోని ప్రమోట్ చేస్తున్నాం. సేంద్రీయ వ్యవసాయాన్ని, మిల్లెట్స్‌ను ప్రోత్సహిస్తున్నాం. మేం నెలకొల్పిన సొసైటీలో 2 వేల మందికి పైగా రైతులున్నారు. 115 ఉత్పత్తులను తయారు చేసి 500 రీటెయిలర్స్ ద్వారా 13 రాష్ట్రాలలో వ్యాపారం చేస్తున్నాం. సేంద్రీయ కూరగాయలు, పండ్లు అందుబాటులోకి తెచ్చేందుకు ఇప్పుడు మాకు అవకాశం లభించింది.

– మేరీ, కో ఫౌండర్, ద టింబక్టు కలెక్టివ్, అనంతపురం జిల్లా

నేరుగా పంట ఉత్పత్తుల ప్రాసెసింగ్



పలమనేరులో కూరగాయలు పండించే రైతులతో నాబార్డు సహకారంతో రైతు సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నాం. రైతులు పండించే కూరగాయలను సార్టింగ్, గ్రేడింగ్ చేసి కార్పొరేట్ సంస్థలకు అందించే మా ఎఫ్‌పీవోను గుర్తించి ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. సుమారు రూ.4 కోట్లతో మిషనరీ, కోల్డ్ స్టోరేజ్, ట్రాన్స్‌పోర్ట్ వెహికల్స్ ఏర్పాటు చేశారు. 720 మంది రైతులు ఈ యూనిట్‌ను వినియోగించుకుని దళారీలతో సంబంధం లేకుండా నేరుగా తమ ఉత్పత్తులను ప్రాసెస్ చేసుకుంటున్నారు. మాకు చాలా ఉపయోగకరంగా ఉంది. దాదాపు 1000 మంది రైతులు దీనిని వినియోగించుకుని లబ్ధిపొందుతున్నారు.

– హరిబాబు, పలమనేరు రైతు ఉత్పత్తిదారుల సంస్థ సీఈవో

దారుణంగా దర్యాప్తు

- వివేకా హత్య కేసులో కల్పిత కథనాలతో డైలీ సీరియల్‌లా సీబీఐ ఛార్జ్ షీట్: సజ్జల
- ప్రజాక్షేత్రంలో సీఎం జగన్‌ను ఎదుర్కోలేని గుంటనక్కలకు వేదికలా దర్యాప్తు సంస్థ
- భారతమ్మతో కలసి నేను సునీతమ్మ ఇంటికి వెళ్లలేదు
- హత్య జరిగిన పది రోజుల తర్వాత నా భార్యతో కలసి పరామర్శకు వెళ్లా
- వివేకా గౌరవానికి భంగం కలగకూడదని ఇంతకాలం భరించాం
- మేం మౌనం వహిస్తుంటే... సునీతమ్మ బతికున్నవారినే బజారుకీడుస్తున్నారు
- జీవితాలను నాశనం చేసే స్థితికి వచ్చాక మేమెందుకు మౌనంగా ఉండాలి?
- వివేకా హత్య కేసులో ఆధారాలు ఒకవైపు.. దర్యాప్తు మరోవైపు
- సీఎం జగన్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీసే కుట్ర ఇదంతా
- ఉగ్రవాదుల కంటే ఘోరంగా ఎల్లో మీడియా తీరు



సాక్షి, అమరావతి: సీబీఐ లాంటి ప్రతిష్టాత్మక సంస్థ కూడా చెత్తగా దర్యాప్తు చేస్తుందనేందుకు మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నిదర్శనంగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేని గుంటనక్కలకు సీబీఐ వేదికగా మారిందని మండిపడ్డారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల సీబీఐ దాఖలు చేసిన సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ మొత్తం కల్పిత కథేనని కొట్టిపారేశారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు బాకాలు ఊదే ఎల్లో మీడియాకు నాలుగు రోజులు మసాలా కథనాలు వండి వార్చడానికి మాత్రమే సీబీఐ ఛార్జ్‌షీట్ ఉపయోగపడుతుంది కానీ ఈ డైలీ సీరియల్ న్యాయస్థానాల్లో నిలబడదని తేల్చి చెప్పారు. వైఎస్ భారతమ్మ, తాను కలిసి సునీతమ్మ ఇంటికే వెళ్లలేదని సజ్జల స్పష్టం చేశారు. అలాంటప్పుడు ఎంపీ అవినాష్‌రెడ్డిని వెనకేసుకురావాలని సునీతమ్మను తాను ఎలా కోరుతానని ప్రశ్నించారు. సునీతమ్మ పచ్చి అబద్ధాలు చెబుతున్నట్లు స్పష్టమవుతోందన్నారు. సజ్జల ఇంకా ఏమన్నారంటే..

ఆ మాత్రం ఇంగితజ్ఞానం లేదా?

ఎలాంటి ఆధారాలు లేకున్నా కేవలం వ్యక్తుల వాంగ్మూలాలను కల్పిత కథకు అనుకూలంగా మారుస్తూ సీబీఐ ఛార్జ్‌షీట్లు దాఖలు చేస్తోంది. వైఎస్ వివేకా హత్య వల్ల నష్టం ఎవరికి? అని ప్రశ్నిస్తే.. వైఎస్సార్ సీపీకి, జగన్‌కే అని చిన్న పిల్లాడైనా చెబుతాడు. ఇంకా చెప్పాలంటే నాడు కడప ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అవినాష్‌రెడ్డికి నష్టం. రాజకీయంగా ఆత్మహత్య చేసుకోవాలని ఆయన ఎందుకు అనుకుంటారు? ఏ చిన్న దర్యాప్తు సంస్థ అయినా, ప్రైవేట్ డిటెక్టివ్ సంస్థకైనా ఈమాత్రం ఇంగితం ఉంటుంది. వివేకా హత్య కేసును రెండు సిట్‌లు దర్యాప్తు చేశాయి. అవి సేకరించిన కాల్ రికార్డ్స్, డేటాను సీబీఐ ఏం చేసిందో తెలియదు.

వ్యవస్థల్లోకి వైరస్‌లా చంద్రబాబు..

అన్ని వ్యవస్థల్లో వైరస్‌లా పాకిన చంద్రబాబు తన అనుచరులతో జాతీయ స్థాయిలో మేనేజ్ చేసేలా చక్రం తిప్పుతున్నారు. వివేకా హత్య వల్ల నాడు అధికారంలో ఉన్న చంద్రబాబుకు రెండు లాభాలు. ఒకటి వైఎస్ జగన్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం.. రెండోది.. పాదయాత్ర పూర్తిచేసి అభ్యర్థులను ప్రకటించేందుకు సిద్ధమైన వైఎస్ జగన్‌ను తేరుకోనివ్వకుండా చేయడం.

తెలంగాణ హైకోర్టు ప్రశ్నించడంతో..

తెలంగాణ హైకోర్టు గత మే 31న మొదటిసారిగా కేసును క్షుణ్ణంగా పరిశీలించి సీబీఐని పలు ప్రశ్నలు అడిగింది. మేం ముందు నుంచీ వ్యక్తం చేస్తున్న సందేహాలే అవి. అవినాష్‌రెడ్డి జూన్ 19న సీబీఐ డైరెక్టర్‌కి లేఖ రాయడంతో సునీతమ్మ స్టేట్‌మెంట్ మరొకటి రికార్డు చేశారు. హింసాత్మక సంఘటనలు జరుగుతాయనే లేఖను బయట పెట్టలేదని సునీతమ్మ చెబుతున్నారు. అది అసహజం. సొంత తండ్రి చనిపోయినా లేఖ విషయాన్ని పట్టించుకోలేదంటే ఎలా నమ్మడం?

పది రోజుల తర్వాత పరామర్శకు వెళ్లా..

2019 మార్చి 23వ తేదీన భారతమ్మ వచ్చి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పినట్లు చేయమన్నారని సునీతమ్మ స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు. అవినాష్‌ను సమర్థించాలని నేను కోరినట్లు కథ అల్లారు. ఆ రోజు భారతమ్మ, నేను కలిసి ఆమె ఇంటికి వెళ్లలేదు. వివేకా హత్య జరిగిన తర్వాత పది రోజులకు నా భార్యతో కలసి పరామర్శించడానికి వెళ్లా. బాగా షాక్‌తో ఉంటారనుకున్నాగానీ అంత ఇదిగా అయితే కనిపించలేదు. షాకింగ్ సంఘటన జరిగినప్పుడు మొదట ఇంటికి పెద్దలా ఉన్న వైఎస్ జగన్‌కు ఫోన్ రావాలి. కానీ సునీతమ్మ వైపు నుంచి ఫోన్ రాలేదు. వివేకా వ్యక్తిత్వాన్ని హననం చేసిన ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ, ఈనాడు ఈరోజు ఆమెకు మిత్రులు, సలహాదారులు, సన్నిహితులు. వివేకాకు మచ్చ రాకూడదని అవినాష్‌రెడ్డి కుటుంబం మూడేళ్లు మౌనంగా అన్నీ భరించింది. చనిపోయిన వ్యక్తి గౌరవాన్ని కాపాడాలని మేం తపన పడుతుంటే బతికున్న వారినే సునీతమ్మ బజారుకీడుస్తున్నారు. బతుకులను నాశనం చేసే పరిస్థితికి వచ్చాక మౌనం వీడి నోరు తెరవాల్సి వస్తోంది.

దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ట్రైనింగ్

ఆధారాలు, పరిసరాలు, హత్యలో పాల్గొన్న వ్యక్తులు ఇలా అన్నీ ఒక వైపు చూపిస్తుంటే.. దర్యాప్తు మరోవైపు సాగుతోంది. ఎప్పుడైతే సునీతమ్మ ఆలోచన విధానం మారిందో అప్పుడే కేసును బలవంతంగా తిప్పడం మొదలుపెట్టారు. చంద్రబాబుకు లాభం చేకూరేలా మార్చారు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో సిద్ధహస్తులు కాబట్టి సీబీఐ చేతికి వచ్చాక వారికి తగ్గట్లుగానే అన్నీ జరుగుతూ వచ్చాయి. అవినాష్ వైపు వేలు చూపించేందుకు దస్తగిరిని అప్రూవర్‌గా మార్చి ట్రైనింగ్ కూడా ఇచ్చారు.

వివేకా కోసం అవినాష్ ధర్నా

నిజానికి నాడు వివేకాకు ఎమ్మెల్సీ టికెట్ ఇవ్వాలని జగన్‌కు ప్రతిపాదన చేసింది అవినాషే. ఒక ఎంపీటీసీని టీడీపీ నేతలు ఎత్తుకెళితే వివేకా కోసం అవినాష్‌రెడ్డి స్వయంగా ధర్నాకు కూర్చున్నాడు. 2011లో పార్టీ పెట్టినప్పటి నుంచీ పులివెందుల విషయంలో తన ప్రతినిధిగా అవినాష్‌ను జగన్ ఎంపిక చేసుకున్నారు. వైఎస్సార్‌కు వివేకా ఎలాగో ఇప్పుడు జగన్‌కు కూడా అవినాష్ అలానే.

ప్రత్యర్థుల క్యాంపులో సునీతమ్మ..

కారణాలు ఏమిటో తెలియదుగానీ వివేకా కుమార్తె సునీతమ్మ ఆ తర్వాత వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే ఆమె పూర్తిగా ప్రత్యర్థుల క్యాంపులోకి వెళ్లినట్లు అనిపించింది. కథ మలుపు తిరగాలన్నపుడల్లా వారికి అనుగుణంగా ఆరేడు సార్లు సునీతమ్మ స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. వారికి కావాల్సిన స్టేట్‌మెంట్లు తీసుకుంటూ ఇన్వెస్టిగేషన్ రివీల్డ్ అంటున్నారు. సునీల్ యాదవ్ అనే నిందితుడు బెయిల్‌కి దరఖాస్తు చేసినప్పుడు గూగుల్ టేకవుట్‌ను తెరపైకి తెచ్చి అవినాష్‌రెడ్డి తండ్రిని లోపల పెట్టేశారు. గూగుల్ టేకవుట్ ఈ కేసులో నిలబడదని తెలియగానే యూనివర్సల్ టైమ్ కో-ఆర్డినేటర్ ప్రకారం మన సమయానికి 5.30 గంటలు కలపాలన్నారు. ఆ లెక్కన వారు చెప్పిన టైం మరుసటి రోజు 8 గంటలు కావడంతో దాన్ని పక్కన పెట్టేశారు. అది నిలబడదని వారికీ అర్థమైంది.

గుంట నక్కలకు వేదిక..

వివేకాను వారే హత్య చేశారనేందుకు పది పన్నెండు కారణాలున్నాయి. ఆస్తి, కుటుంబ పరువు విషయాలే ప్రధానంగా హత్యలకు దారి తీస్తాయి. వివేకా చెక్ పవర్‌ను రద్దు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివేకా రెండో భార్య షమీమ్ స్టేట్‌మెంట్లో అన్నీ ఉన్నాయి. వివేకా బావమరిది శివప్రకాశ్‌రెడ్డి బెదిరించాడని, మనుషులను పంపించాడని ఆమె స్టేట్‌మెంట్ ఇచ్చింది. దీనిపై సీబీఐ ఎందుకు విచారించదు? అన్ని శక్తులు ఉడిగిపోయిన గుంటనక్కలన్నీ ఒకచోట చేరి సీఎం వైఎస్ జగన్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకు సీబీఐని వేదికగా చేసుకుంటున్నాయి. పది బండలు వేస్తే ఒకటన్నా నమ్మకపోతారా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కోర్టు ఒకసారి మొట్టికాయలు వేసింది. న్యాయమూర్తి అమ్ముడుపోయాడంటూ ఆంధ్రజ్యోతి డిబేట్‌లో నేరుగా బురద చల్లే దుస్సాహసానికి ఒడిగట్టింది. జర్నలిజం పేరుతో బెదిరింపులకు పాల్పడుతూ ఉగ్రవాదుల కంటే దారుణంగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు, ఎల్లో మీడియా కరివేపాకులా సునీతమ్మను వాడుకుంటున్నారు. ఎన్నికలు ముగియగానే ఆమెను అనాథలా పక్కన పెట్టడం ఖాయం.

ఉపాధి, శిక్షణపై విస్తృత అధ్యయనం

ముగిసిన మంత్రి బుగ్గన విదేశీ పర్యటన



సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ మంత్రి వియత్నాం పర్యటన ముగిసింది. ఏపీ యువతకు ఉపాధి, పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, వృత్తి విద్య, శిక్షణపై అధ్య యనమే లక్ష్యంగా దక్షిణ కొరియా, వియత్నాం దేశాలలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ పది రోజుల పర్యటించారు. ఈ పర్యటనలో చివరి రోజైన మంగళవారం హోచిమిన్ సిటీలోని సైగాన్ హైటెక్ ఇండస్ట్రియల్ పార్క్‌లో ఉన్న అంతర్జాతీయ ఎలక్ట్రానిక్స్ ట్రైనింగ్ సెంటర్‌ను అధికారుల బృందంతో కలిసి సందర్శించారు. పార్కును తీర్చిదిద్దిన తీరు, టెక్నాలజీ అంశాలపై సైగాన్ హైటెక్ పార్కు అధ్యక్షుడు న్గుయెన్ అన్హ్ థీని అడిగి తెలుసుకున్నారు. ఏపీలో పెట్టుబడులకు అవకాశాలున్న రంగాలపై ప్రతినిధులతో చర్చించారు. పెద్దఎత్తున యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం ఆంధ్రప్రదేశ్‌లో శిక్షణ కేంద్రాల ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నట్లు మంత్రి చెప్పారు. వాణిజ్యం, పెట్టుబడులు, వృత్తి శిక్షణలో సహకారం, అవకాశాలపై మన అధికారుల బృందం అధ్యయనం చేసింది. వియత్నాంలోని అతిపెద్ద సీఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ 'మోవి'ని మంత్రి బుగ్గన సందర్శించారు. సాల్మన్ ఫిష్ (మాఘ చేప), ట్యూనా ఫిష్ (తూర చేప)లను శుద్ధి చేసే యూనిట్లోని టెక్నాలజీని అడిగి తెలుసుకున్నారు. డాంగ్ నై ప్రావిన్స్ వైస్ చైర్మన్‌తో ఆర్థిక మంత్రి బుగ్గన సమావేశమై, ఏపీలో పర్యటించాలని వైస్ చైర్మన్‌ను ఆహ్వానించారు.

దేవాలయాల ఆదాయంలో పురోగతి

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పలు దేవాలయాల ఆదాయంలో మంచి పురోగతి కనిపిస్తోందని ఉప ముఖ్యమంత్రి(దేవదాయ, ధర్మాదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఆదాయానికి తగినట్టుగా భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దేవాలయాల వర్గీకరణను త్వరలో చేపట్టనున్నట్లు చెప్పారు. మంగళవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.15 లక్షల నుంచి 50 లక్షలలోపు ఆదాయమున్న దేవాలయాలను అసిస్టెంట్ కమిషనర్, రూ.50 లక్షల నుంచి రూ.కోటిలోపు ఆదాయమున్న వాటిని డిప్యూటీ కమిషనర్, రూ.కోటికి పైగా ఆదాయమున్న ఆలయాలను జాయింట్ కమిషనర్ పర్యవేక్షణలో ఉంచామన్నారు. ఇప్పుడు ఆ 3 కేటగిరీల ఆదాయ పరిమితిని పెంచే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. రూ.2 కోట్ల నుంచి రూ.7 కోట్లలోపు ఆదాయం ఉన్న దేవాలయాలను అసిస్టెంట్ కమిషనర్ పరిధిలోకి, రూ.7 కోట్ల నుంచి రూ.12 కోట్లలోపు ఆదాయమున్న ఆలయాలను డిప్యూటీ కమిషనర్ పరిధిలోకి, రూ.12 కోట్లకు పైగా ఆదాయమున్న వాటిని జాయింట్ కమిషనర్ ఆధ్వర్యంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఏపీ వైద్య శాఖ విధానాలపై తమిళనాడు ఆసక్తి

- ఆ రాష్ట్ర వైద్యశాఖ ఐఏఎస్ అధికారి గోవిందరావు ఏపీకి రాక
- రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల పరిశీలన

సాక్షి, అమరావతి: 'కార్పొరేట్'కు దీటుగా రాష్ట్ర ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న సీఎం జగన్ ప్రభుత్వం వైద్యశాఖలో అనేక రకాల సంస్కరణలను చేపట్టి ఆదర్శంగా నిలుస్తోంది. ఇక్కడ అమలుచేస్తున్న కార్యక్రమాలు పలు రాష్ట్రాలకు మోడల్‌గా నిలుస్తున్నాయి. ఆయా రాష్ట్రాల నుంచి అధికారులు ఇక్కడికొచ్చి ఏపీలో అమలవుతున్న కార్యక్రమాలను అధ్యయనం చేస్తున్నారు. ఈ క్రమంలో గత నెలలో మహారాష్ట్ర వైద్య బృందం రాష్ట్రానికి వచ్చి మన కార్యక్రమాలపై అధ్యయనం చేసి, ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అమలును ప్రశంసించారు. ఇప్పుడు తాజాగా తమిళనాడు ప్రభుత్వం కూడా ఏపీ విధానాలపై ఆసక్తి కనబరుస్తోంది. దేశంలోనే ఎక్కడాలేని రీతిలో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ కోసం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ తరహా కార్యక్రమాన్ని తమిళనాడులోనూ అమలు చేయాలని అక్కడి ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో.. తమిళనాడు హెల్త్ సిస్టమ్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఐఏఎస్ అధికారి ఎం. గోవిందరావు సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలో పర్యటించారు. గుంటూరు జిల్లా జంగంగుంట్లపాలెం గ్రామంలోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను సందర్శించారు. ఈ గ్రామంలో



మంగళగిరి వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న గోవిందరావు

ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు, హెల్త్ క్లినిక్ సేవలను పరిశీలించారు. పేపర్ రహిత వైద్యసేవల కల్పనకు అవలంబిస్తున్న విధానాలను తెలుసుకున్నారు. విజయవాడ జీజీహెచ్, మంగళగిరి ఇందిరా నగర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ మిషన్ (ఏబీడీఎం) అమలును పరిశీలించారు.

ప్రజల వద్దకే డాక్టర్ వెళ్లడం బాగుంది

తన పర్యటనలో ఏపీలోని ఆరోగ్య కార్యక్రమాల పరిశీలన అనుభవాలను గోవిందరావు 'సాక్షి'తో పంచుకున్నారు. ఏపీలో ఫ్యామిలీ డాక్టర్ అమలు విధానం చాలా బాగుందన్నారు. నెలలో రెండుసార్లు పీహెచ్‌సీ వైద్యులు గ్రామాల్లో ప్రజల వద్దకే వెళ్లి సేవలు అందించడం మంచి పరిణామమన్నారు. గ్రామస్థాయిలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ ద్వారా 12 రకాల వైద్యసేవలు, 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులో ఉంచడం ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని కితాబిచ్చారు. మరోవైపు.. ఏబీడీఎం అమల్లో భాగంగా ఇక్కడి వైద్యశాఖ అనుసరిస్తున్న విధానాలనూ తెలుసుకున్నామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ తరహా కార్యక్రమం అమలుకు తమిళనాడు ప్రభుత్వం ఆసక్తిగా ఉందని వివరించారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్తగా వై.వి.సుబ్బారెడ్డి



సాక్షి, అమరావతి: విజయనగరం, అనకాపల్లి, విశాఖ జిల్లాలతోపాటు అరకు లోక్‌సభ స్థానం పరిధిలోని అరకు, పాడేరు శాసనసభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్తగా టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిని నియమించారు. సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు వై.వి.సుబ్బారెడ్డిని ప్రాంతీయ సమన్వయకర్తగా నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.

వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్తగా మంత్రి బొత్స



సాక్షి, అమరావతి: శ్రీకాకుళం జిల్లా, అరకు లోక్‌సభ స్థానం పరిధిలోని కురుపాం, సాలూరు, పార్వతీపురం, పాలకొండ శాసనసభ స్థానాలకు వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్తగా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను నియమించారు. ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి బొత్స సత్యనారాయణను ప్రాంతీయ సమన్వయకర్తగా నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.

మణిపూర్ ఘటనలపై హైకోర్టు న్యాయవాదుల నిరసన

సాక్షి, అమరావతి: మణిపూర్‌లో మహిళలపై జరిగిన అమానుష చర్యలను ఖండిస్తూ మంగళవారం హైకోర్టు న్యాయవాదులు నిరసన కార్యక్రమం చేపట్టారు. భోజన విరామ సమయంలో హైకోర్టు ఎదుట కళ్లు, చెవులు మూసుకుని నిరసన తెలియజేశారు. మహిళలకు రక్షణ కల్పించి, మణిపూర్‌లో మానవ హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వరరావు, పౌర హక్కుల సంఘం ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ, నూతలపాటి కృష్ణమూర్తి, నల్లూరి మాధవరావు, నర్రా శ్రీనివాసరావు, సైకం రాజశేఖర్, సంపర శ్రీనివాసరావు, మౌలాలి, సయ్యద్‌బాబు పాల్గొన్నారు.

కేంద్రంపై దుష్ప్రచారం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



గుంటూరు (మెడికల్): ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం ఎంతో సాయం అందిస్తున్నా ఏమీ చేయలేదంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మంగళవారం గుంటూరులో బీజేపీ కోస్తాంధ్రా జోనల్ సమావేశానికి హాజరైన ఆమె మీడియాతో మాట్లాడుతూ దేశంలోనే ఏపీకి అత్యధిక ఇళ్లను కేంద్రం కేటాయించిందని చెప్పారు. సర్పంచ్‌ల ఉద్యమాలకు మద్దతుగా ఆగస్టు 10న అన్ని జిల్లాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు ఆమె పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థాయిలో ఆగస్టు 17న విజయవాడలో భారీ ఆందోళన చేస్తామన్నారు. ఏపీ రాజధానిగా అమరావతికి కేంద్రం కట్టుబడి ఉందని చెప్పారు. బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ దియోధర్ మాట్లాడుతూ మణిపూర్ ఘటనలపై అవాస్తవాలను ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో బీజేపీ పట్ల వ్యతిరేకత పెంచేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు.

ముంపు మండలాల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి ధర్మానకు సీపీఎం నేతల వినతి

సాక్షి, అమరావతి: అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో గోదావరి వరద తాకిడితో ఇబ్బందులు పడే ముంపు మండలాల ప్రజల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సీపీఎం రాష్ట్ర ప్రతినిధులు విన్నవించారు. ఈ విషయమై రాష్ట్ర మంత్రి ధర్మాన ప్రసాదరావును సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. గత ఏడాది జూలై 11న వచ్చిన గోదావరి వరదతో రెండు జిల్లాలకు చెందిన కూనవరం, వీఆర్ పురం, దేవీపట్నం, ఎటపాక, చింతూరు, కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాల్లోని 193 గ్రామాలు పూర్తిగా నీట మునిగిపోయాయని గుర్తు చేశారు. అది గోదావరి చరిత్రలోనే అతి పెద్ద వరద అని, వేలాది కుటుంబాలు కొండలు, గుట్టలు ఎక్కి వారాల తరబడి అక్కడే ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని గోదావరి పరీవాహక ప్రాంతంలో వరద తీవ్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.

టీడీపీ నెల్లూరు రూరల్ ఇన్‌చార్జిగా కోటంరెడ్డి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని టీడీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆ పార్టీ నియమించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు నెల్లూరు రూరల్ ఇన్‌చార్జిగా అబ్దుల్ అజీజ్ ఉన్నారు. ఆయన్ను తప్పించి వలస వచ్చిన నేత శ్రీధర్‌రెడ్డిని ఇన్‌చార్జిగా నియమించారు.



ఈయన పేరు సోమిశెట్టి రామచంద్రరావు. విజయవాడ ఇందిరా కాలనీలో ఉంటున్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో టమాటా కిలో రూ.120–150 పలుకుతుండగా, కృష్ణలంక రైతుబజార్‌లో రాష్ట్ర ప్రభుత్వం కిలో రూ.50కే అందిస్తుండడం మాబోటి వారికి చాలా ఊరటగా ఉందని ఆయన చెప్పుకొచ్చారు. ఇప్పటికే నాలుగైదుసార్లు వెళ్లి తెచ్చుకున్న ఆయన.. టమాటాలు తాజాగా, నాణ్యతతో ఉంటున్నాయంటూ ఆయన తన ఆనందాన్ని 'సాక్షి'తో పంచుకున్నారు.

కేంద్రం కంటే మిన్నగా..



విశాఖలోని సీతమ్మధార రైతు బజార్‌లో సబ్సిడీపై టమాటాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

నెలరోజులుగా రాష్ట్రంలో సబ్సిడీపై టమాటా విక్రయాలు

- బహిరంగ మార్కెట్‌లో నేటికీ రూ.120కి తగ్గని కిలో ధర
- రైతుల నుంచి సగటున కిలో రూ.104 చొప్పున కొనుగోలు
- రైతుబజార్లలో కిలో రూ.50కే సరఫరా
- ఇప్పటికే రూ.11.82 కోట్లు ఖర్చు చేసి 1,137 టన్నుల పంపిణీ
- ఏపీ బాటలో సబ్సిడీపై టమాటా విక్రయాలకు కేంద్రం శ్రీకారం
- ఉత్తరాది రాష్ట్రాల్లోని మండీల్లో కిలో రూ.80 చొప్పున విక్రయాలు
- ధరలు పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు కొనసాగించాలని నిర్ణయం

సాక్షి, అమరావతి



విశాఖలోని రైతుబజార్‌లో సిద్ధంగా ఉన్న టమాటాలు

టమాటా ధరలు చుక్కలనంటుతున్న ప్రస్తుత తరుణంలో రైతుబజార్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై టమాటాలను విక్రయిస్తూ వినియోగదారులకు బాసటగా నిలుస్తోంది. ఆకస్మిక వర్షాలతో మహారాష్ట్రతో పాటు పలు రాష్ట్రాల్లో టమాటా పంట దెబ్బతినడంతో ధరలు దేశవ్యాప్తంగా చుక్కలనంటాయి. దాదాపు 40 రోజులు కావస్తున్నా డిమాండ్ సరిపడా నిల్వల్లేక ధరలు అదుపులోకి రాని పరిస్థితి. ధరలు పతనమైనప్పుడు మార్కెట్‌లో జోక్యం చేసుకుని రైతులకు కనీస మద్దతు ధర దక్కేలా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. అదే రీతిలో ప్రస్తుతం మార్కెట్‌లో ధరల పెరుగుదలను దృష్టిలో పెట్టుకుని వినియోగదారులకు బాసటగా నిలిచింది. దేశంలో మరెక్కడా లేని విధంగా దాదాపు నెలరోజులుగా ఆర్థిక భారాన్ని లెక్కచేయకుండా సబ్సిడీపై టమాటాలు విక్రయాలను కొనసాగిస్తోంది.

రంగంలోకి మార్కెటింగ్ శాఖ..

ప్రస్తుతం ఉత్తరాది రాష్ట్రాల్లో కిలో రూ.200కు పైగా పలుకుతుండగా, రాష్ట్రంలో బహిరంగ మార్కెట్‌లో నేటికీ కిలో రూ.120 నుంచి రూ.150కు తగ్గలేదు. ధరలు పెరుగుదల మొదలైన వెంటనే క్షణం కూడా ఆలస్యం చేయకుండా మార్కెటింగ్ శాఖను రంగంలోకి దింపిన ప్రభుత్వం మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీమ్ కింద రైతులు, వ్యాపారుల నుంచి సేకరించి వాటిని రైతుబజార్ల ద్వారా కిలో రూ.50 చొప్పున సబ్సిడీపై వినియోగదారులకు అందిస్తోంది. రాష్ట్రంలో సబ్సిడీపై టమాటా విక్రయాలు ప్రారంభించిన మూడు వారాల తర్వాత కేంద్రం కూడా ఏపీ బాటలో వినియోగదారులకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చింది. దక్షిణాది రాష్ట్రాల నుంచి సేకరించి ఉత్తరాదిలోని మండీల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా కిలో రూ.80 చొప్పున విక్రయాలకు శ్రీకారం చుట్టింది.

సబ్సిడీ కోసం రూ.11.82 కోట్లు ఖర్చు..

రోజూ రాష్ట్రంలోని వివిధ టమాటా మార్కెట్లలో వ్యాపారులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం వేలం పాటల్లో పాల్గొని రైతుల నుంచి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తోంది. డిమాండ్‌ను బట్టి స్థానిక వ్యాపారుల నుంచి కూడా సేకరిస్తోంది. ఇలా ఇప్పటివరకు సగటున కిలో రూ.104 చొప్పున రూ.11,82,40,000 ఖర్చుచేసి 1,136.90 మెట్రిక్ టన్నుల టమాటాలను సేకరించింది. రోజూ 40–70 టన్నుల చొప్పున సేకరిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 105 ప్రధాన రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా మనిషికి ఒక కిలో చొప్పున విక్రయిస్తోంది.

కిలో రూ.123.50 చొప్పున కొనుగోలు..

మంగళవారం సగటున కిలో రూ.123.50 చొప్పున రూ.49.40 లక్షల విలువైన 40 టన్నుల టమాటాలను అధికారులు సేకరించారు. వీటిని విశాఖ, విజయనగరం, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని 40 రైతుబజార్ల ద్వారా వినియోగదారులకు సరఫరా చేశారు. ఇలా దాదాపు నెలరోజులుగా సబ్సిడీపై టమాటా విక్రయాలను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తుండడంపట్ల వినియోగదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. రెండేళ్ల క్రితం కూడా ఇదే రీతిలో కిలో రూ.100 దాటినప్పుడు రైతుల నుంచి సేకరించి సబ్సిడీపై రైతుబజార్ల ద్వారా విక్రయించారు. గతంలో ఎన్నడూ ఇలా ధరలు పెరిగినప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకున్న సందర్భాల్లేవని వినియోగదారులు చెబుతున్నారు.

పేదవారికి ఊరట



టమాటా ధరలు చుక్కలనంటుతున్న తరుణంలో నెలరోజులుగా రైతుబజార్ల ద్వారా కిలో రూ.50కే నాణ్యమైన టమాటాలు అందిస్తుండడం మాలాంటి పేదవారికి ఎంతో ఉపయోగకరం. ప్రభుత్వం సబ్సిడీపై ఇస్తున్న టమాటాలను ప్రజలు పొదుపుగా వాడుకుంటే మంచిది.

– కె. నాయుడు, కార్మికుడు, సీతమ్మధార, విశాఖపట్నం

నాణ్యంగా ఉంటున్నాయి



ప్రభుత్వం అండగా నిలవకపోతే ఈ సమయంలో బహిరంగ మార్కెట్‌లో మాలాంటివారు కొనే పరిస్థితి ఉండదు. నెలరోజులుగా సీతమ్మధార రైతుబజారులో సబ్సిడీపై టమాటాలు అందిస్తున్నారు. కాయలు చాలా నాణ్యంగా ఉంటున్నాయి. చాలా సంతోషంగా ఉంది.

– పైడి రమణమ్మ, పాత వెంకోజీపాలెం, విశాఖపట్నం

ధరలు తగ్గే వరకు కొనసాగిస్తాం



సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు గత నెల 27న సబ్సిడీపై టమాటాల విక్రయాలకు శ్రీకారం చుట్టాం. సగటున కిలో రూ.104 చొప్పున కొనుగోలు చేసి వినియోగదారులకు కిలో రూ.50లకే విక్రయిస్తున్నాం. ధరలు పూర్తిగా అదుపులోకి వచ్చేవరకు రైతుబజార్లలో సబ్సిడీ కౌంటర్లు కొనసాగుతాయి.

– రాహుల్ పాండే, కమిషనర్, ఏపీ మార్కెటింగ్ శాఖ

'కారుణ్య' ఉద్యోగులకు శుభవార్త

- కంప్యూటర్ పరీక్షలో ఉత్తీర్ణులైతే చాలు.. సర్వీసు క్రమబద్ధీకరణ
- తెలుగు, ఇంగ్లిష్ టైప్ రైటింగ్ పరీక్షలకు ఇక స్వస్తి
- ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలో చేరినవారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. కారుణ్య నియామకం కింద టైపిస్ట్, ఎల్‌డీ టైపిస్ట్, యూడీ టైపిస్ట్, టైపిస్ట్ కమ్ అసిస్టెంట్ ఉద్యోగాలు పొందినవారు కంప్యూటర్ పరీక్ష పాసైతే వారి సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలో చేరిన వారు ఇక నుంచి తెలుగు, ఇంగ్లిష్ టైప్ రైటింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలనే నిబంధనకు స్వస్తి చెబుతూ సాధారణ పరిపాలన శాఖ (సర్వీసెస్) కార్యదర్శి పోలా భాస్కర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందిన ఉద్యోగులు రెండేళ్లలోపు కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధిస్తే వారి సర్వీసును క్రమబద్ధీకరించనున్నట్లు స్పష్టంచేశారు. ఈ మేరకు గత నిబంధనలను సడలించినట్లు తెలిపారు. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర సచివాలయ విభాగాలు, శాఖాధిపతులు, జిల్లా కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో సూచించారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

ఎంతోకాలంగా ఇబ్బందిపడుతున్న కారుణ్య నియామక ఉద్యోగుల సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వెంకటరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సర్వీస్ రూల్స్ ప్రకారం కారుణ్య నియామకం కింద టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ ఉద్యోగాలు పొందినవారు తెలుగు, ఇంగ్లిష్ టైప్ రైటింగ్ టెస్ట్ పాస్ అయితేనే వారి సర్వీసు రెగ్యులర్ చేసేవారని, టైపింగ్‌కు ప్రాధాన్యత తగ్గిపోవడంతో అది నేర్పించేవారు లేక, ఆ పరీక్ష పాస్ కాలేక చాలా మంది ఉద్యోగులు సంవత్సరాల తరబడి రెగ్యులర్ కాక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తాము సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం కారుణ్య నియామకం ద్వారా విధుల్లో చేరిన ఉద్యోగులకు తెలుగు, ఇంగ్లిష్ టైప్ రైటింగ్ పరీక్షల నుంచి మినహాయింపు ఇచ్చిందని వివరించారు.

అధిష్టాన నిర్ణయమే శిరోధార్యం


- వైఎస్సార్‌సీపీని వీడేది లేదు
- ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ స్పష్టీకరణ



రామచంద్రపురం: 'పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా అధిష్టానం నిర్ణయం తీసుకుంటుంది. పార్టీ అధిష్టాన నిర్ణయమే శిరోధార్యం. వైఎస్సార్‌సీపీ నా సొంత పార్టీలా భావిస్తాను. ఇటీవల కొన్ని పత్రికలు, చానల్స్‌లో నేను పార్టీ మారుతున్నట్లు వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు. నేను వైఎస్సార్‌సీపీని వీడేది లేదు...' అని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ స్పష్టంచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా తనకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కూడా అదేవిధంగా తనకు ఎంతో ప్రాముఖ్యతను ఇస్తున్నారని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తల మనోభావాలు దెబ్బతింటున్నాయనే బాధతోనే ఎంపీ పదవికి రాజీనామా చేసి అసెంబ్లీకి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని చెప్పానని వివరించారు. ఇది బాధాకరమైన విషయమన్నారు. ఈ అంశంపై మీడియా ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి క్షమాపణ చెబుతున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలో అన్ని అంశాలను పరిగణలోనికి తీసుకుని పార్టీ కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా మంచి నిర్ణయం తీసుకుంటామని అధిష్టానం చెప్పిందని వెల్లడించారు. నియోజకవర్గంలో పరిపూర్ణమైన సర్వేలు జరిగాక సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని అధిష్టానం హామీ ఇచ్చిందన్నారు. అంతవరకు పార్టీ అభివృద్ధికి పాటుపడాలని సూచించిందని తెలిపారు. పార్టీ నిర్ణయం మేరకు ఇక్కడ పని చేస్తానన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త పార్టీ కోసం పనిచేయాలని కోరారు. కార్యకర్తల్లో ఎవరికి అన్యాయం జరిగినా అండగా ఉంటానన్నారు. పార్టీ నిర్మాణం, ఓదార్పు యాత్రలో తాను ప్రముఖ పాత్ర పోషించానన్నారు. త్వరలోనే తమ పార్టీ అధిష్టానం మంచి నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఇంతటితో ఈ ఎపిసోడ్‌ను ముగించాలని మీడియాకు బోస్ విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి పెరిగింది.. పేదరికం తగ్గింది

- నీతి ఆయోగ్ నివేదికే నిదర్శనం
- ఏపీ ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ విష్ణు



తిరుపతి అర్బన్: రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని.. పేదరికం బాగా తగ్గిందని ఏపీ ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఇందుకు నీతి ఆయోగ్ నివేదికే నిదర్శనమని చెప్పారు. మంగళవారం ఆయన తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. నీతి ఆయోగ్ లెక్కల ప్రకారం సాధారణంగా 10 శాతానికి లోపు పేదరికం ఉంటే అభివృద్ధి చెందిన రాష్ట్రాల జాబితాలో చేరుస్తారని చెప్పారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో పేదరికం 11.77 శాతం ఉంటే.. వైఎస్ జగన్ పాలనలో 6.6 శాతానికి తగ్గిందని పేర్కొన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన 98 శాతానికి పైగా హామీలను వైఎస్ జగన్ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. గడప గడపకు వెళ్లి ప్రజలకు ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఏ పార్టీ నాయకులు కూడా ప్రజల వద్దకు ఇంతగా వెళ్లలేదన్నారు.

చదవాల్సిన పుస్తకం 'అల్లుడు సుద్దులు'

జలవనరుల శాఖ మంత్రి అంబటి



'అల్లుడు సుద్దులు' పుస్తకావిష్కరణలో మంత్రి అంబటి రాంబాబు, లక్ష్మీపార్వతి తదితరులు

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): 'అల్లుడు సుద్దులు' పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సూచించారు. చంద్రబాబు చెప్పిన సుద్దులు, ఆయన ఘన కార్యాలు, ఆయనలోని రెండో కోణాన్ని ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీపార్వతి పుస్తక రూపంలో తీసుకొచ్చారని తెలిపారు. విజయవాడలోని నాడార్స్ ఫంక్షన్ హాల్‌లో ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి అధ్యక్షతన 'అల్లుడు సుద్దులు' పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అంబటి రాంబాబు మాట్లాడుతూ ఈ పుస్తకం చదివి చంద్రబాబు నిజ స్వరూపాన్ని తెలుసుకోవచ్చన్నారు. చంద్రబాబును దగ్గర్నుంచి చూసిన వారిలో ఈ పుస్తకం రాసిన లక్ష్మీపార్వతి ఒకరన్నారు. చంద్రబాబు నిజస్వరూపాన్ని ఆయన తోడల్లుడైన వెంకటేశ్వరరావు గతంలో రాసిన 'ఒక చరిత్ర.. కొన్ని నిజాలు' పుస్తకంలో ఆవిష్కరించారని గుర్తుచేశారు. అత్యంత సన్నిహితుల ద్వారా చంద్రబాబు నిజస్వరూపాన్ని, అధికారం కోసం ఎంత కుతంత్రానికైనా వెనకాడని మనస్తత్వాన్ని తెలుసుకోవచ్చని వివరించారు. అటువంటి వారి నీచ చరిత్రను పుస్తక రూపంలో తీసుకొచ్చిన లక్ష్మీపార్వతి ప్రయత్నాన్ని అభినందించారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ పూనూరు గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నీచ రాజకీయ చరిత్రను 'అల్లుడు సుద్దులు' ద్వారా లక్ష్మీపార్వతి చక్కగా ఆవిష్కరించారని పేర్కొన్నారు. లక్ష్మీపార్వతి మాట్లాడుతూ స్వీయానుభవాలను, దివంగత ఎన్టీఆర్‌కు చంద్రబాబు చేసిన మోసాన్ని ఈ పుస్తకం ద్వారా ఆవిష్కరించానన్నారు. ప్రెస్ అకాడమీ అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ జనరల్ మేనేజర్ టి.మనోహర్‌నాయుడు మాట్లాడారు.

1.8 కోట్ల మందికి గ్రామాల్లోనే వైద్యం

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి విడదల రజిని


సాక్షి, అమరావతి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానంతో గ్రామీణ ప్రజలకు ఎంతో మేలు కలుగుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇప్పటివరకు 1.8 కోట్ల మంది వైద్యసేవలు పొందారని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలుపై మంత్రి రజిని మంగళవారం మంగళగిరిలోని తన కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గర్భిణులకు మరింత సులభంగా ప్రభుత్వ వైద్యసేవలు అందుతున్నాయని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో వైద్యసేవలపై మరింత పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలవుతున్న తీరు, ఓపీ సేవలపై ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణకు ఒక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు చెప్పారు. రక్తహీనత సమస్యను అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్‌లు అవగాహన కల్పించాలన్నారు. బీపీ, షుగర్ వంటి అసాంక్రమిక వ్యాధులపై రాష్ట్రవ్యాప్తంగా మరోసారి పూర్తిస్థాయి సర్వే చేపట్టాలని సూచించారు. గత ఏడాది ప్రారంభించిన ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) సర్వేలో భాగంగా మొత్తం జనాభాలో ఏకంగా 82.47 శాతం మందికి పరీక్షలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఎన్‌సీడీ బాధితులకు ఫ్యామిలీ డాక్టర్ ద్వారా చికిత్స కూడా అందిస్తున్నామని వివరించారు. తాజాగా మరోసారి సర్వే చేపట్టాలని, సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఈ సర్వే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జిల్లాల నోడల్ ఆఫీసర్లు తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లి ఓపీలతోపాటు ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, జె.నివాస్, డాక్టర్ రామిరెడ్డి పాల్గొన్నారు.

చిరంజీవిపై కేసు కొట్టివేత



సాక్షి, అమరావతి: ప్రముఖ సినీ హీరో, కాంగ్రెస్ పార్టీ మాజీ నాయకుడు కొణిదెల చిరంజీవిపై ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించారంటూ 2014 ఏప్రిల్ 27న గుంటూరు అరండల్‌పేట పోలీసులు నమోదు చేసిన కేసును హైకోర్టు కొట్టేసింది. చిరంజీవి కాంగ్రెస్ పార్టీ తరఫున 2014 ఏప్రిల్ 27న రాత్రి 10.45 గంటల వరకు గుంటూరులో ఎన్నికల ప్రచారం చేశారు. దీనివల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిందని గుంటూరు అసిస్టెంట్ సిటీ ప్లానర్, అరండల్‌పేట హెడ్ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిరంజీవిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ రైల్వేస్ కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ కేసును కొట్టేయాలంటూ చిరంజీవి ఇటీవల హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి మంగళవారం విచారణ జరిపి చిరంజీవిపై నమోదు చేసిన కేసును కొట్టేశారు. చిరంజీవి తరఫు న్యాయవాది ఎ.స్వరూపారెడ్డి వాదించారు.

రాష్ట్రంలో వ్యవసాయ శాఖ లేదు: చంద్రబాబు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వ్యవసాయ శాఖ లేదని, ఆ శాఖను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మూసేసిందని ప్రతిపక్ష నేత చంద్రబాబు విమర్శించారు. రాష్ట్రంలోని రైతులందరూ వెంటిలేటర్‌పై ఉన్నా సీఎం వైఎస్ జగన్ పట్టించుకోవడం లేదన్నారు. ఆయన మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఈ సీజన్‌లో దారుణమైన పరిస్థితులు ఉన్నా రైతుల పరిస్థితి, వ్యవసాయ స్థితిగతులపై సీఎం సమీక్ష చేయలేదని విమర్శించారు. నాలుగేళ్లలో 3వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయి తప్ప, ఏ సాగు జరగడం లేదన్నారు. చనిపోయిన రైతు కుటుంబాలకు సాయంగా రూ.210 కోట్లు ఇవ్వాలని, కేవలం 672 మంది చనిపోయినట్టు చూపించి, రూ.47 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 93 శాతం రైతులు అప్పులపాలయ్యారన్నారు. రైతు భరోసా కేంద్రాలు దోపిడీ కేంద్రాలుగా మారాయని తెలిపారు. మిర్చి, పత్తి, వరి, వేరుశనగ సహా అన్ని పంటలతోపాటు ఆక్వా సాగును కూడా సంక్షోభంలోకి నెట్టారని విమర్శించారు. అప్పుల కోసం రైతుల మోటార్లకు మీటర్లు పెడుతున్నారన్నారు. అమరావతి రైతుల త్యాగాన్ని బూడిదలో పోసిన పన్నీరు చేసిన సీఎం దానకర్ణుడిలా పేదలకు ఇళ్ల స్థలాలిస్తున్నట్టు చెబుతున్నారని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అన్నదాత పథకాన్ని అమలు చేస్తామని, సాగుకు అండగా నిలిచేలా నూతన వ్యవసాయ విధానం ప్రకటిస్తామన్నారు.

బాబు 14 ఏళ్ల పాలనలో 12 ఏళ్లు కరువే

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి



సాక్షి, అమరావతి: చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో 12 ఏళ్లు కరువేనని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వ్యవసాయం, సాగునీరు, రైతుల గురించి చంద్రబాబు మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు. ఉచిత విద్యుత్ ఇస్తే కరెంటు తీగల మీద బట్టలు ఆరేసుకోవాలనడం, బషీర్‌బాగ్‌లో రైతులపై కాల్పులు జరిపించడం, రైతు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి రైతాంగాన్ని నట్టేట ముంచడం వంటి ఘటనలను ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. వ్యవసాయం దండగన్న చంద్రబాబు, ఎన్నికలు వస్తున్నాయని రైతులపై కపట ప్రేమ చూపుతున్నారని విమర్శించారు. చంద్రబాబు, కరువు కవల పిల్లలు అని అనేక సందర్భాల్లో నిజమైందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. 'వ్యవసాయం, రైతు అని బాబు పలికితే అసహ్యంగా ఉంటుంది. రైతులకు అది చేస్తున్నా.. ఇది చేస్తున్నా.. అని ఊరించి ఉడికించటం, తర్వాత పంగనామాలు పెట్టడం బాబు నైజం. నోటిపై చేయని పంటలకు కూడా మేం గిట్టుబాటు ధరలు కల్పించాం. ఇది బాబు తెలుసుకోవాలి. బాబూ.. నీ ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ ఏంటో తెలుసా? హైదరాబాద్‌ను అభివృద్ధి చేశాననడం కాదు. ఓటుకు కోట్ల వ్యవహారం. హైదరాబాద్‌లో నీవు అడ్డంగా దొరికిన దొంగతనం' అని మంత్రి కాకాణి ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారు. నాలుగేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. కరువు మండలాల ప్రకటనే లేదు. అదే చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ఏటా సగటున 300కు పైగా కరువు మండలాలు ప్రకటించారు. ప్రస్తుతం ఏటా సగటున 12 లక్షల టన్నుల నుంచి 14 లక్షల టన్నుల ధాన్యం అధికోత్పత్తి అవుతోందని గణాంకాలు చెబుతున్నాయి కదా. ట్రాక్టర్ల కేటాయింపులోనూ చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారు. ప్రతి ట్రాక్టర్‌పై రూ.లక్ష దోచుకున్నారు. కానీ మేము రైతులే ట్రాక్టర్ కొనుక్కుంటే వారి ఖాతాలో నగదు జమ చేశాం.' అని మంత్రి చెప్పారు.

తెలంగాణ

వనమా ఎన్నిక చెల్లదు

సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం శాసనసభ్యుడు వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. వనమా సమీప ప్రత్యర్థి జలగం వెంకట్రావు (పిటిషనర్)ను శాసనసభ్యుడిగా ప్రకటించాలని ఎన్నికల అధికారులను ఆదేశించింది. 2018 డిసెంబర్ 12 నుంచి జలగమే ఎమ్మెల్యే అని స్పష్టంచేసింది. ఉద్దేశపూర్వకంగా అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చినందుకు వనమా వెంకటేశ్వరరావుకు రూ.5 లక్షల జరిమానా విధించింది. వెంకట్రావుకు కోర్టు ఖర్చులను చెల్లించాలని స్పష్టం చేసింది. 'వెంకటేశ్వరరావుపై క్రిమినల్ కేసులున్నా చెప్పలేదు. గత ఎన్నికల్లో పేర్కొన్న పలు స్థిర, చరాస్తుల వివరాలను 2018 ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించలేదు. భూముల ఆధారంగా రైతుబంధు లాంటి ప్రభుత్వ పథకాలు కూడా పొందారు. అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇవ్వడం లేదా వివరాలను దాచడం చట్టవిరుద్ధం. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం వనమా ఎన్నిక చెల్లదు. అలాగే ఎన్నికల పిటిషన్‌పై విచారణ సందర్భంగా సాక్ష్యమిచ్చేందుకు వనమా హాజరు కాలేదు. సాక్ష్యం ఇవ్వని పక్షంలో ఆరోపణలు వాస్తవమని భావించవచ్చు' అని కోర్టు తీర్పులో పేర్కొంది. 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన వెంకటేశ్వరరావు.. టీఆర్‌ఎస్ అభ్యర్థి జలగం వెంకట్రావుపై గెలిచారు. ఎన్నికల అఫిడవిట్‌లో వనమా తప్పుడు సమాచారం ఇచ్చారని జలగం వెంకట్రావు హైకోర్టులో 2019 జనవరిలో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం మంగళవారం 84 పేజీల తీర్పు వెలువరించింది. ఇదిలా ఉండగా ప్రస్తుతం వనమా, జలగం ఇద్దరూ బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతుండటం గమనార్హం.



మన ఆలోచనలతోనే మనం
ఈ ప్రపంచాన్ని రూపొందిస్తాం.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 26 జూలై 2023

సమతూకపు నియంత్రణ!

అసలేమీ చేయకుండా ఉండే కన్నా, ఆలస్యంగానైనా కళ్ళు తెరిచి ఆచరణలోకి దిగడం మంచిదే! కృత్రిమమేధ (ఏఐ)ను నియంత్రించడానికి చట్టబద్ధమైన స్వతంత్ర సంస్థను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన అలాంటిదే. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా అథారిటీ ఆఫ్ ఇండియా పేర ఒక సంస్థను నెలకొల్పాలంటూ భారత టెలికామ్ నియంత్రణ ప్రాధికార సంస్థ (ట్రాయ్) చేసిన తాజా సిఫార్సు స్వాగతించాల్సిన అంశం. టెలికామే కాక బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సేవలు, రవాణా, విద్య, వ్యవసాయం లాంటి అనేక రంగాలపై ఏఐ అమితమైన ప్రభావం చూపుతున్న విషయాన్ని ఇప్పటికైనా గుర్తించి, సమగ్రమైన నియంత్రణకు సమకట్టడం సరైన చర్య. ట్రాయ్ ప్రతిపాదించిన నియంత్రణ సంస్థ ఏఐ సంబంధిత రంగాలన్నిటికీ సలహా దారుగా, నియంత్రణకర్తగా వ్యవహరిస్తుంది. సాంకేతిక సంస్థలు మాత్రం తమ నియంత్రణకు మరిన్ని చట్టాల ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నాయి. ఏఐ కోసం స్వతంత్ర చట్టబద్ధ సంస్థను పెట్టాలన్న ట్రాయ్ సిఫార్సుపై తీవ్రంగా స్పందిస్తున్నాయి. అయితే, సాంకేతికతతో వచ్చే లాభాలను స్వీకరిస్తూనే, జరిగే హానిని కూడా గుర్తించి, సమతూకం సాధించడం అవసరం. ప్రపంచవ్యాప్తంగా పాల కుల ముందున్న సవాలు ఇది.

5జీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) లాంటి సాంకేతికతలు ఏఐతో ముడిపడ్డాయి. వీటికి విడివిడి విధానాలతో లాభం లేదు. అన్నిటినీ సమన్వయపరిచే సమగ్రమైనది అవసరం. ట్రాయ్ తన 141 పేజీల నివేదికలో ఆ మాటే ప్రస్తావించి, తాజా సిఫార్సు చేసింది. నూతన సాంకేతిక ఆవిష్కరణలు శరవేగంతో వస్తుంటే, మన విధాన నిర్ణేతలు ఎంతో వెనుకబడి ఉన్నారు. రెండు దశాబ్దాల క్రితం ఆరంభమైన ఆన్‌లైన్ వేదికలకు సైతం నేటికీ సరైన నియంత్రణ వ్యవస్థ లేని దేశం మనది. 1998లో వచ్చిన గూగుల్, 2004లో ఆరంభమైన ఫేస్‌బుక్ లాంటివి ఇప్పటికీ వినియోగదారుల డేటాను యథేచ్ఛగా వాడుకుంటూ, లాభాలు మూట గట్టుకుంటున్నాయి. దాన్ని నియంత్రించడానికి ఉద్దేశించిన వ్యక్తిగత సమాచార భద్రత బిల్లు వగైరాలను దేశం దీర్ఘకాలంగా చర్చిస్తూనే ఉంది. సరైన నియంత్రణ లేక సామాజిక మాధ్యమ వేదికలు యూజర్ల డేటాను తస్కరిస్తూనే ఉన్నాయి. కొన్ని వేదికలు వేధింపులనూ, విద్వేషాలనూ రాజేస్తున్నాయి. ఏఐ ఆవిర్భావంతో డేటా దుర్వినియోగం ఎల్లలు దాటిందనే అనుమానం తలెత్తింది. వ్యక్తిగత గోప్యతే కాదు... ఆర్థికవ్యవస్థ పైనా ప్రభావం చూపే పరిస్థితి. ఏఐ నియంత్రణకు స్వతంత్ర వ్యవస్థ ఆలోచనను ఈ నేపథ్యం నుంచి చూడాలి.

గత నవంబర్‌లో ఓపెన్ ఏఐ సంస్థ తన ఛాట్‌బాట్ అయిన 'ఛాట్ జీపీటీ'ని విడుదల చేసినప్పటి నుంచి ఏఐ పట్ల ఉత్సాహం ఎంత ఉందో, ఆందోళనా అంతే ఉంది. ఛాట్ జీపీటీ లాంటి నమూనాల రూపకల్పనపై 6 నెలల మారటోరియం విధించాలని ఎలాన్ మస్క్ లాంటి నిపుణులు సైతం అనడం గమనార్హం. వివిధ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చి, మానవకృషికి కొత్త మార్గాలు తెరిచి, మామూలు పనుల్ని సైతం సృజనాత్మకంగా చేయడానికి ఏఐ ఉపయుక్తమే. కానీ మనుషుల కృత్రిమ రూపాల తయారీ, తప్పుడు సమాచార వ్యాప్తి సహా ప్రమాదాలున్నాయి. ఏఐని అణ్వస్త్రపోరుతో పోలుస్తూ, మానవజాతి మనుగడకే ప్రమాదకారి అంటున్న శాస్త్రవేత్తలూ లేకపోలేదు. అందుకే, ఏఐని విశృంఖలంగా వదిలేయరాదన్నది నిపుణులు, పాలకుల ఏకాభిప్రాయం. నవీన ఆవిష్కరణల్ని ఆహ్వానిస్తూనే, వాటిని నైతికబద్ధంగా వాడేలా సమతౌల్య సాధన కీలకమనేది ప్రధాన సూత్రం.

ఏఐ ప్రతికూల ప్రభావాన్ని కట్టడి చేయడానికి విశ్వవ్యాప్తంగా అనేక ప్రైవేట్ సంస్థలు ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించాయి. విదేశాలు చట్టాలు చేస్తున్నాయి. కెనడా ముసాయిదా చట్టం చేసింది. అమెరికా ఏఐ బిల్లు తెచ్చింది. సురక్షితంగా, పారదర్శకంగా ఏఐ అభివృద్ధి సాగేలా చూస్తామంటూ అమెజాన్, గూగుల్, మెటా, మైక్రోసాఫ్ట్, ఓపెన్ ఏఐ తదితర 7 ప్రధాన ఏఐ సంస్థల నుంచి ఈ నెల 21నే అమెరికా ప్రభుత్వం స్వచ్ఛంద వాగ్దానాలు తీసుకుంది. చైనా సైతం పాలనా చర్యలపై ఒక ముసాయిదా సిద్ధం చేసి, ప్రజాస్పందన కోసం ఉంచింది. బ్రెజిల్, జపాన్‌లు ఏఐ నియమావళి సిద్ధం చేశాయి. అభివృద్ధి చెందిన దేశాలతో కూడిన 'గ్లోబల్ పార్ట్‌నర్‌షిప్ ఆన్ ఏఐ' సంస్థాపక సభ్యదేశమైన భారత్ వంతు ఇప్పుడు ట్రాయ్ సిఫార్సుతో వచ్చిందనుకోవాలి. ఏఐ అభివృద్ధిలో భాగస్థులు పాటించాల్సిన బాధ్యతల్ని నాస్కామ్ ఇప్పటికే వెల్లడించింది. కానీ ఏఐపై మోజులో ప్రమాణాలు, నైతికత, జవాబుదారీతనం గాలికి పోవచ్చు. కాబట్టి నియంత్రణ సంస్థ పెట్టాలన్న మాట బంగారు బాట.

నిజానికి, పార్లమెంట్‌లో 'డిజిటల్ వ్యక్తిగత సమాచార భద్రత బిల్లు'ను ప్రవేశపెట్టనున్నారు. 2000 నాటి ఐటీ చట్టం స్థానంలో వచ్చే డిజిటల్ ఇండియా చట్టం కొంతవరకు ఏఐని నియంత్రిస్తుందని భావిస్తున్నారు. అయితే, ఏఐకి ప్రత్యేక చట్టం యత్నాలేవీ ఇప్పటికీ లేవు. ఇది ఆలోచించాల్సిన విషయం. యూజర్లకు హాని ఏ మేరకు కలుగుతుందనే కోణం నుంచి ఏఐపై కేంద్ర ప్రభుత్వ నియంత్రణ వైఖరి ఉంటుందనీ, ఇప్పటికిప్పుడు తీవ్రమైన చర్యలేమీ అవసరం లేదనీ సంబంధిత కేంద్ర మంత్రివర్యుల ఉవాచ. ముందుగానే ఏఐపై కఠిన నిబంధనలు పెట్టి, నవీన సాంకేతికకు ఉరితాళ్ళు బిగించరాదన్న మాట నిజమే! అదే సమయంలో రాబోయే కష్టనష్టాలను కూడా ముందుగా ఆలోచించడం, అవసరమైన చట్టాలతో యుద్ధానికి సిద్ధంగా ఉండడం వివేకం. ఏఐకి సంబంధించి చట్టబద్ధమైన స్వతంత్ర నియంత్రణ సంస్థ ఆలోచన అందుకు తొలి అడుగు కావాలి. ఏఐపై ప్రాథమిక నిబంధనలు, హద్దు మీరితే జుల్మానాలు, దోషులపై పట్టు బిగించే అధికారాలతో సంస్థ ఏర్పాటు కావాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, తిథి: శు.అష్టమి ఉ.10.25 వరకు తదుపరి నవమి, నక్షత్రం: స్వాతి రా.8.55 వరకు తదుపరి విశాఖ, వర్జ్యం: రా.2.36 నుండి 4.15 వరకు, దుర్ముహూర్తం: ప.11.41 నుండి 12.30 వరకు, అమృతఘడియలు: ఉ.11.50 నుండి 1.29 వరకు.

సూర్యోదయం : 5.40
సూర్యాస్తమయం: 6.32
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

భారత - చైనా బంధం బలపడేనా?

విశ్లేషణ



శ్యామ్ శరణ్

సరిహద్దు సమస్యను పూర్తి స్థాయి సంబంధాలలో ఒక అంశంగా మాత్రమే ఉంచాలనీ, అది సంబంధాల మొత్తం స్వభావాన్ని నిర్వచించకూడదనీ చైనీయులు పట్టుబట్టడం కొనసాగిస్తున్నారు. సరిహద్దులో పరిస్థితి 'అసాధారణం'గా ఉందనీ, ఇది ద్వైపాక్షిక సంబంధాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నదనే భారత వైఖరిని ఇది పరోక్షంగా తిరస్కరించడమే! అయితే గల్వాన్ ఘర్షణలు చైనా ప్రణాళికాబద్ధంగా జరిపినవన్న భారత్ అభిప్రాయం తప్పు అనీ, అది కేవలం 'అనుకోని ఘటన' అనీ పీఎల్ఏ అధికారి చెప్పిందే నిజమైతే, మరి యథాతథ స్థితిని ఎందుకు పునరుద్ధరించకూడదు? అయితే ఎల్ఏసీ అమరిక గురించి భారత్‌కు కచ్చితమైన ఆలోచన ఉంది. ఎల్ఏసీ గురించి సందేహం ఉందని మనం పరోక్షంగా కూడా సూచించకూడదు.

వార్షిక వరల్డ్ పీస్ ఫోరమ్‌లో పాల్గొనడానికి నేను ఈ నెల ప్రారంభంలో బీజింగ్‌లో ఉన్నాను. ఆ సమావేశంలోనే అదనంగా భారత్–చైనా సరిహద్దు సమస్యపై ఒక ఆంతరంగిక చర్చ జరిగింది. దీనికి పలువురు చైనా విద్వాంసులు హాజరయ్యారు. ప్రస్తుత, మాజీ చైనా అధికారులు కొందరితో సంభాషణకు కూడా వీలు కలిగింది. ఇవి భారత్–చైనా సంబంధాలకు సంబంధించిన అవకాశాల గురించి చైనా అవగాహన విషయంలో ఒక కొత్త గవాక్షాన్ని అందించాయి.



సరిహద్దు సమస్యను పూర్తి స్థాయి సంబంధాలలో ఒక అంశంగా మాత్రమే ఉంచాలనీ, అది సంబంధాల మొత్తం స్వభావాన్ని నిర్వచించకూడదనీ చైనీయులు పట్టుబట్టడం కొనసాగిస్తున్నారు. సరిహద్దులో పరిస్థితి 'అసాధారణం'గా ఉందనీ, ఇది ద్వైపాక్షిక సంబంధాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నదనే భారత వైఖరిని ఇది పరోక్షంగా తిరస్కరించడమే. చైనీయుల ప్రకారం, సరిహద్దు పరిస్థితి 'స్థిరీకరించబడింది'. ఘర్షణకు సంబంధించిన కొన్ని అంశాలను పరిష్కరించడంలో పురోగతి సాధించామనీ, అయితే మరికొన్ని మిగిలి ఉన్నాయనీ భారతదేశం గుర్తిస్తోంది. 2020 జూన్‌లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో జరిగిన హింసాత్మక ఘర్షణలకు ముందు ఉన్న యథాతథ స్థితికి తిరిగి రావడానికి చైనా సుముఖంగా ఉన్నట్లు ఎవరూ భావించడం లేదు.

భారత–చైనా సరిహద్దు ప్రశ్న (2005) పరిష్కారానికిగానూ రాజకీయ పారామితులు, మార్గదర్శక సూత్రంతో సహా – వాస్తవాధీన రేఖను (ఎల్ఏసీ) స్పష్టం చేయడం కోసం ఉమ్మడి కసరత్తును చేపట్టేందుకు – అనేక శాంతి భద్రతల ఒప్పందాలను ఇరుపక్షాలు అంగీకరించినప్పటికీ, చైనీయులు అలా చేయడానికి నిరాకరించారు. భూభాగాన్ని 'కొద్దికొద్దిగా కొరుక్కు తింటూ' చైనాను భారతదేశం దూరంగా నెడుతోందని ఒక ఆరోపణ వచ్చినప్పుడు, భారత్ చేపట్టడానికి సిద్ధంగా ఉన్న ఎల్ఏసీ స్పష్టీకరణ ద్వారా అటువంటి కబళింపును కచ్చితంగా నిరోధించవచ్చని ఎత్తి చూపడం ద్వారా ఒకరు దీనిని ప్రతిఘటించారు. దీనికి సమాధానం ఏమిటంటే, 2004లో జరిగిన సమావేశంలో ఈ కసరత్తు ప్రారంభమైనప్పుడు, చైనా ప్రాదేశిక క్లెయిమ్‌లను బలహీనపర్చగల 'అతిశయోక్తి' క్లెయిమ్‌లను భారతదేశం పశ్చిమ సెక్టార్‌లో ముందుకు తెచ్చింది.

ఎల్ఏసీని సరిగా స్పష్టం చేయకపోవడం వల్ల భారత్ అధీనంలో ఉన్న భూభాగాన్ని ఆక్రమించుకోవడానికి సందిగ్ధతలను ప్రదర్శించగల వీలు చైనాకు కలుగుతుంది. అయితే ఎల్ఏసీ అమరిక గురించి భారత్‌కు కచ్చితమైన ఆలోచన ఉంది. కొన్ని అంశాల్లో ఎల్ఏసీకి సంబంధించి 'భిన్నమైన అవగాహనలు' ఉన్నాయని మనం చెప్పుకోకూడదు. భారత్ పేర్కొన్నట్లుగా ఎల్ఏసీపై పోటీ పడటంలో చైనా పక్షానికి కొంత సమర్థన ఉందని ఇది పరోక్షంగా అంగీకరిస్తుంది.

ఎల్ఏసీ అమరికలో మనం పరిగణించే వాటిపై చైనీస్ పక్షాన్ని పోటీ పడనివ్వండి. ఎల్ఏసీ ఎక్కడ ఉందనే దాని గురించి మనకు సందేహం ఉందని మనం పరోక్షంగా కూడా సూచించకూడదు. మొత్తంమీద, సరిహద్దు వద్ద ప్రతిష్టంభన కొనసాగే అవకాశం ఉంది. అయితే రెండు వైపులా భారీ సైన్యాన్ని మోహరించే అవకాశం లేదు. ఎల్ఏసీ వైపు చైనా నిర్మించిన తాజా శాశ్వత, పాక్షిక–శాశ్వత నిర్మాణాలను కూల్చివేయడం, తొలగించడం కూడా అసంభవం. భారత్ అలవర్చుకోవాల్సిన మెరుగైన సామర్థ్యానికి ఇవి సూచికలా పనిచేస్తాయి.

భవిష్యత్‌లో ఏం జరగవచ్చో సూచించే రెండు ఘటనలు కూడా ఉన్నాయి. సరిహద్దు సమస్యపై తరచూ వ్యాఖ్యానించే చైనా మాజీ పీఎల్ఏ అధికారి ఒకరు, గల్వాన్ ఘర్షణలు చైనా బలగాలు ముందస్తుగా, ప్రణాళికాబద్ధంగా జరిపిన ఆపరేషన్ అని భారత్ భావిస్తున్న అభిప్రాయం తప్పు అనీ, అది కేవలం 'అనుకోని ఘటన' అనీ నాతో అన్నారు. నేను ఇంతకు ముందు ఇది వినలేదు. పీఎల్ఏ అధికారి చెప్పిందే నిజమైతే, మరి యథాతథ స్థితిని ఎందుకు పునరుద్ధరించకూడదు?

ప్రస్తుతం చైనీస్ కమ్యూనిస్ట్ పార్టీ కమిషన్ ఫర్ ఫారిన్ ఎఫైర్స్ ఆఫీస్ డైరెక్టర్‌గా ఉన్న వాంగ్ యీ(జూలై 25నే తిరిగి విదేశాంగ మంత్రి అయ్యారు) ఇటీవల జకార్తాలో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో జరిపిన భేటీలో, 'నిర్దిష్ట సమస్యలు మొత్తం సంబంధాన్ని నిర్వచించనివ్వకుండా, సరిహద్దు సమస్యకు ఇరు పక్షాలు పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొనాలి' అన్నారు. ఇది చైనా వైఖరికి పునఃప్రకటన. అయితే, 'భారత పక్షం చైనాతో సంబంధాలు మెరుగుపర్చుకునేలా, సరిహద్దు సమస్యకు ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కనుగొంటుందని ఆశిస్తున్నట్లు' ఆయన కొనసాగించారు.

ఆ ప్రాంతం చైనా సార్వభౌమ భూభాగమనీ, దానిని కాపాడుకుంటామనీ చైనా ప్రకటనలు పేర్కొంటున్నాయి కాబట్టి గల్వాన్ సంఘటన నేపథ్యంలో, ఇది సాపేక్షంగా సామరస్యపూర్వకమైన భాషగా కనిపిస్తోంది. దీంతో సంబంధాలు 'మెరుగుపర్చుకునే' అవకాశం లేకుండా పోయింది. మారిన భాషను మనం అతిగా వ్యాఖ్యానిస్తున్నామేమో! కాలమే దీన్ని తేల్చి చెబుతుంది.

ప్రధాని మోదీ వాషింగ్టన్‌లో ఉన్నత స్థాయి అధికారిక పర్యటన విజయవంతంగా ముగించిన తర్వాత వెంటనే బీజింగ్‌లో నా సంభాషణలు జరిగాయి. భారత్–అమెరికా సంబంధాల్లో పురోగతిపై చైనా ఆందోళన స్పష్టంగా కనిపించింది. చైనాను నిలువరించే అమెరికా వ్యూహంలో భారత్ భాగమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసియాలో 'నాటో' పాత్రకు భారతదేశం మద్దతు ఇస్తుందా అనేది నాకు వారు సంధించిన ఒక ప్రశ్న. నా అభిప్రాయం ప్రకారం, నాటో అనేది యూరోపియన్ భద్రతకు సంబంధించినదనీ, ఆసియాన్ నేతృత్వంలోని యంత్రాంగాలతో సహా ఈ ప్రాంతంలో శాంతి భద్రతలను కాపాడుకోవడానికి ఆసియా అనేక యంత్రాంగాలను కలిగి ఉందనీ నేను చెప్పాను. గ్లోబల్ సౌత్ నుండి చైనాను మినహాయించాలని భారతదేశం ప్రయత్నిస్తున్నదా అనే ఆందోళన కూడా వారిలో ఉంది. తాము గ్లోబల్ సౌత్‌లో భాగమా, కాదా అనేది నిర్ణయించుకోవాల్సింది చైనాయేనని నేను చెప్పాను. త్వరలో జరగనున్న జీ20 సదస్సు సన్నాహాల్లో భాగంగా, గ్లోబల్ సౌత్ సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు మోదీ చొరవ తీసుకోవడం చైనాను ఆశ్చర్యానికి గురిచేసింది.

ఆర్థికపరమైన చిక్కులను కలిగించవచ్చు కాబట్టి, చైనాకు 'అభివృద్ధి చెందుతున్న దేశం' హోదాను నిరాకరించే అమెరికా ప్రయత్నాల గురించి వారు ప్రస్తావించారు.

చైనా చేసిన మరొక ఫిర్యాదు ఏమిటంటే, 'షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్' (ఎస్సీఓ) సమావేశాన్ని భారత్ వ్యక్తిగత స్థాయిలో కాకుండా, క్లుప్తంగా ఆన్‌లైన్ సదస్సును నిర్వహించడం ద్వారా దాని 'స్థాయిని తగ్గించింది' అని. ఇది అమెరికా ప్రభావంతో జరిగిందనే అనుమానం చైనాకు ఉంది.

మొత్తంమీద, చైనా తన గురించి తాను అస్పష్టంగానే ఉందనే భావన కలుగుతుంది. అదే సమయంలో భారత్ తన ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడంలో ప్రావీణ్యతనూ, చురుకుదనాన్నీ ప్రదర్శించిందనే అభిప్రాయం ఉంది. పెట్టుబడి, సాంకేతికత ప్రవాహానికి భారతదేశం కొత్త గమ్యస్థానంగా మారినట్లు కనిపిస్తున్న నేపథ్యంలో, ఇది చైనా ఆర్థిక అవకాశాల గురించి గుర్తించిన ఒక నిర్దిష్ట నిరాశావాదానికి సంబంధించినది కావచ్చు. ఇది భారతదేశం పట్ల చైనా వైఖరిలో మార్పును సూచిస్తుందా? ఇకపై సంఘటనలు ఎలా వెల్లడవుతాయో చూద్దాం.

వ్యాసకర్త విదేశాంగ మాజీ కార్యదర్శి,
ఆనరరీ ఫెలో, సీపీఆర్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

మారాల్సినది...



నన్ను నమ్మండి... జనాలు మతాల ఆధారంగా చీలిపోవడం లేదు. వారి వారి ఆలోచనా దృక్పథాల ఆధారంగా చీలిపోతున్నారు.

– జాహక్ తన్వీర్, కాలమిస్ట్

వేగం... వేగం...



జనాలు ఎంతమాత్రమూ పుస్తకాలు చదవడం లేదు, వాళ్లు ట్వీట్స్ చదువుతున్నారు. జనాలు వార్తాపత్రికలు చదవడం లేదు, కేవలం హెడ్‌లైన్స్ చదువుతున్నారు. జనాలు సినిమాలు చూడటం లేదు, రీల్స్ చూస్తున్నారు.

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

ఎవరికైనా జరగొచ్చా?



షీ జిన్‌పింగ్ చైనా: ప్రభుత్వంలో ప్రజలకు అత్యంత తరచుగా కనబడే ఒక ముఖం, ఒక విదేశాంగ మంత్రి, నెల రోజులుగా ప్రజలకు కనబడకుండా మాయమైపోతారు; ఏ కారణమూ ఇవ్వకుండా ఆయన్ని తొలగిస్తున్నట్టు వెలువరించిన ఏకవాక్య ప్రకటన ప్రజలను అయోమయంలో ఉంచుతుంది. ఇది ఆయనకే జరిగితే...

– అనంత్ కృష్ణన్, జర్నలిస్ట్

వాళ్లెలా భరిస్తారో!



వాసన అత్యంత దుర్భరంగా ఉందిక్కడ. ఇజ్రాయిలీ ప్రజాస్వామ్య అనుకూల నిరసనకారుల మీద మొదటిసారి ఇజ్రాయిల్ పోలీసులు స్కంక్ స్ప్రే (రోజుల తరబడి మురికి వాసనొచ్చే ఒక రసాయనిక మిశ్రమం) ఉపయోగించారు. దీన్ని ఎలా తట్టుకోవాలో మేము పాలస్తీనియన్ల నుంచి నేర్చుకోవాలి!

– జెస్సికా మోంటెల్, యాక్టివిస్ట్

ఏర్పాటు చేసుకోవాలి!



బంధువు: నువ్వు విమానాశ్రయంలో ఉన్నప్పుడు పాపరాజ్జీ నీ ఫొటోలు తీయరా? నేను: నేను వారిని పిలవను. బంధువు: మనం పాపరాజ్జీని పిలవాల్సి ఉంటుందా? నేను: లేకపోతే వాళ్లు ఊరికే ఎయిర్ పోర్ట్‌లో మన కోసం కాచుకుని కూర్చుంటారనుకుంటున్నావా?

– వీర్ దాస్, కమెడియన్

దూరం... దూరం...



ఉన్నట్టుండి కళ్లకలక/ఐ ఫ్లూ కేసులు పెరుగుతున్నాయి. ఈసారి వైరస్ మరింత వేగంగా వ్యాపిస్తోంది. దీన్ని ఆపగలిగే ఐ డ్రాప్స్ లేవు కాబట్టి చేతుల్ని తరచుగా కడుక్కోండి. కళ్లను తాకొద్దు. ఇతరులకు సోకకుండా ఆపేందుకు ఇది సోకిన మనిషిని కళ్లల్లో నీళ్లు, స్రావం ఆగే వరకు విడిగా ఉంచండి.

– పారుల్ ఎం.శర్మ, ఐ సర్జన్

ఇప్పటికి అర్థమైంది!



ఇస్లాం గురించి మాట్లాడే మాజీ–ముస్లింల బాధల గురించి వినడానికి మొన్నటిదాకా ఎవరూ సిద్ధంగా లేరు. అది మీ అనుభవం అని చెప్పి వాళ్లు మా నోళ్లు మూయించారు. కానీ ఇప్పుడు సోషల్ మీడియా యూరప్‌లో రాడికల్ ఇస్లాం ప్రమాదాల గురించి మాత్రమే మాట్లాడుతోంది. ఆఖరికి ముస్లింలను అక్కున చేర్చుకునే ఉదారవాదులు కూడా!

– జారా కే, యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

నాస్తికోద్యమ నిర్మాత

మూఢ నమ్మకాల్లో మునిగిపోయి ఉన్న ఈ 'దైవ కేంద్ర' సమాజాన్ని 'మానవ కేంద్ర' సమాజంగా మార్చడానికి జీవితాంతం కృషి చేసిన మహోన్నతుడు గోపరాజు రామచంద్రరావు (గోరా). వృక్షశాస్త్ర అధ్యాపకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధీజీ అనుచరుడు, జాతీయస్థాయి కాంగ్రెస్ కార్యనిర్వాహకుడు అయిన గోరా తాను ఏం చెప్పారో అదే ఆచరించి చూపారు. అస్పృశ్యతా నివారణకూ, ఆర్థిక సమానత్వ సాధనకూ కృషి చేస్తూనే ప్రజల్లో కులమత తత్వ నిర్మూలనకు నడుం బిగించిన కార్యకర్త. సమష్టి భోజనాలను నిర్వహిస్తూ జనాన్ని మతాంతర వివాహాల వైపు నడిపించిన కార్యశీలి. దేశంలో ఉన్నత విద్య సులభంగా అందుబాటులో లేని కాలంలో దాని కోసం తపించి స్నాతకోత్తర పట్టా సాధించిన వైజ్ఞానిక విద్యార్థి.



గోరా

ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా 'ఛత్రపురం'లో సంప్రదాయ కుటుంబంలో జన్మించారు (1902) గోరా. స్వతంత్ర భావాలు గలవారు కావడంతో ఎక్కడా ఏ ఉద్యోగంలోనూ నిలకడగా ఉండలేకపోయేవారు. నాస్తికునిగా మారుతున్న దశలో ఆయన ఇంట్లో ఉండే ఆచార, సంప్రదాయాలతో రాజీపడేవారు కాదు. తండ్రికి తన ప్రవర్తన నచ్చకపోవడంతో భార్య, పిల్లలతో ఇల్లు వదిలి బయటికి వచ్చేశారు. సమాజంలో మార్పు తేవడానికి భార్య 'సరస్వతీ గోరా'తో ఆలోచించి కృష్ణా జిల్లా 'ముదునూరు'లో 'నాస్తిక' కేంద్రాన్ని (1940) స్థాపించారు. సంపూర్ణ గ్రామీణాభివృద్ధి సాధించడానికి కుల మతాలకు అతీతంగా మానవ వాద మూలాలపై ఇది నడిచింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కార్యకలాపాలు విస్తృత పరచడానికి నాస్తిక కేంద్రాన్ని విజయవాడకు మార్చారు. ప్రపంచ హేతువాద, నాస్తికోద్యమాలకు గోరా స్థాపించిన ఆ నాస్తిక కేంద్రమే కేంద్ర బిందు వయ్యింది. 1972లో తొలి 'ప్రపంచ నాస్తిక మహాసభలు' విజయవాడలో నిర్వహించిన ఘనత గోరాదే. అప్పటికి ఆయన వయసు 70 ఏళ్లు. 'భారత గ్రామీణ సమాజంలో ఎలా మార్పు తేవాలి' అనే అంశంపై ఉపన్యసిస్తూనే 1975 జూలై 26న గోరా తుదిశ్వాస విడిచారు. 2002 గోరా శత జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం తపాలా బిళ్ల విడుదల చేసింది. వాస్తవాలు చెప్పేవారు లేక ఈ తరం యువత దారి తప్పుతున్నారు. గోరా జీవితం, ఆయన రచనలూ ఇటు వంటి వారికి ప్రపంచం, జీవితం గురించిన వాస్తవాలు తెలియజేస్తాయి.

డా॥ దేవరాజు మహారాజు; సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త
(నేడు 'గోరా' వర్ధంతి)

తన గొయ్యి తాను తీసుకోవడమే!

వాలంటీర్ వ్యవస్థ పై అనుచిత వ్యాఖ్యలు చేసి, 'జనసేన' అధినేత పవన్ కల్యాణ్ సెల్ఫ్ గోల్ చేసుకున్నారా? చాలామంది అవుననే అంటున్నారు. వాలంటీర్లు తప్పు చేస్తే, రాజకీయ లేదా వ్యక్తిగత వివక్ష చూపితే కచ్చితంగా వాళ్లను నిలదీయొచ్చు. మీడియాకు చెప్పవచ్చు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు. పోనీ, ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ వారైనా అలా చేశారా అంటే అదీ లేదు. వామపక్షాల నుంచి కూడా విమర్శ లేదు. దీనికి కారణం, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల్లో అన్ని పార్టీల వారూ ఉండడం.

వాలంటీర్లు వైసీపీ కార్యకర్తలు కాదు. అసలు, వాలంటీర్లు అంటేనే స్వచ్ఛంద సేవకులు. రూ. 5,000 రూపాయల గౌరవ వేతనాన్ని అంగీకరించి, ఆ బాధ్యతలు స్వీకరించడానికి తమంతట తాముగా ముందుకు వచ్చిన వారు. ఈ వ్యవస్థ ప్రారంభమైన తొలి రోజుల్లో, కొన్నిచోట్ల వాలంటీర్లపై టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యం చేసిన ఘటనలు ఉన్నాయి. దీనికి కారణం వారు రాజకీయ వివక్ష చూపుతున్నారని కాదు. టీడీపీ సానుభూతిపరుల మనసులు మారిపోతున్నాయనే అక్కసు. వాలంటీర్ల వ్యవస్థ వల్ల తమ పార్టీకి ఇటువంటి ముప్పు రానున్నదని, మొట్టమొదట గ్రహించిన రాజకీయ నాయకుడు చంద్రబాబు నాయుడే! ఆదిలోనే ఈ వ్యవస్థను ఆయన వ్యతిరేకించారు. దళారుల ప్రమేయం లేకుండా, నేరుగా ప్రభుత్వ పథకాలను లబ్ధిదారుడి ఇంటి ముందుకే వాలంటీర్లు తీసుకు వెళుతున్నారు. పెన్షన్ డబ్బు అందజేసినప్పుడు ఏ ఒక్క వాలంటీరైనా, రూపాయి అడిగినట్టు పవన్ చెప్పగలరా? ఆయనకు క్షేత్రస్థాయి కార్యకర్తల కరువు ఉందని అనుకుందాం. టీడీపీ వారైనా చెప్పగలరా? వారి అనుకూల మీడియాలోనైనా ఒక్క వార్త వచ్చిందా? వీటికి జవాబులు రావు. ఎందుకంటే, అంత కక్కుర్తి పడవలసిన అవసరం వాలంటీర్లకు లేదు. ఠంచనుగా గౌరవ వేతనం అందుతుండడమే కాదు, 50 ఇళ్ల దగ్గరా వారికి



లభిస్తున్న గొప్ప గౌరవం, ప్రేమ. రాష్ట్ర ప్రభుత్వం వారి సేవల స్థాయిని బట్టి, అవార్డులు ఇచ్చి మరీ గౌరవిస్తోంది. శాసన సభ్యుల మన్ననలు అందుతున్నాయి.

దేశానికే మన వాలంటీర్ల వ్యవస్థ ఆదర్శమవుతోంది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారు వారధులయ్యారు. మండల స్థాయి అధికార యంత్రాంగానికి వాలంటీర్లు, సచివాలయాల వల్ల పని భారం తగ్గింది. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ వ్యవస్థ ఫలితాలను గమనించింది. తనకు కూడా అవసరమని గుర్తించింది. 'నెహ్రూ యువ కేంద్ర సంఘటన్' పర్యవేక్షణలో, యువ వాలంటీర్ల నియామ కానికి సన్నాహాలు చేస్తోంది. ఒకటి రెండు మండలాలకు ఒక వాలంటీర్ని నియమించి, వారి ద్వారా కేంద్ర పథకాల ప్రచారం, పరిచయం, ఉద్యోగ మేళాల నిర్వహణ వంటి కార్యక్రమాలను అమలు చేయబోతోంది. వీరి ఎంపికకు జిల్లా కలెక్టర్లు నోటిఫికేషన్లు ఇస్తారు.

బీజేపీ – టీడీపీ మధ్య దాగుడుమూతలు ఆడుతున్న పవన్‌కు ఈ పరిణామం మింగుడు పడుతుందా? 'సినిమా కాదు జీవితం అంటే, ప్రజా జీవితంలో రాణించాలంటే, ప్రజల జీవితపు లోతుల్ని చూడాలి' (రెవిన్యూ మంత్రి ధర్మాన). చంద్రబాబు, ఆయన శ్రేయో మీడియా భయాలను లేదా అభిప్రాయాలను పదేపదే ప్రకటించడం ద్వారా, పవన్ 'సెల్ఫ్ గోల్' చేసుకున్నాడన్న చాలామంది అభిప్రాయం నిజమే అనిపిస్తుంది. ఆయన మాటలతో, దాదాపు 3 లక్షల మంది వాలంటీర్ల కుటుంబాలు ఆయనకు దూరమైపోయాయి. వారిలో పవన్ సినీ అభిమానులు, టీడీపీ సానుభూతి పరులు కూడా ఉన్నారన్న స్పృహ కూడా లేకుండా, పవన్, చంద్రబాబు ఈ వ్యవస్థపై దాడి చేయడం రాజకీయంగా వారికి పెను నష్టాన్ని కలుగజేయనుంది.

– నల్లి ధర్మారావు, కవి, రచయిత,
సీనియర్ జర్నలిస్ట్ । 76609 67313

అహాన్ని వదలాలి!

ఒకసారి రామకృష్ణ పరమహంస శిష్యులతో ఈ విధంగా చెప్పారు: ''ఎల్లప్పుడు మృత్యువును జ్ఞాపకముంచు కోవాలి. మరణించాక ఉండేదేమీ లేదు. ఏమీ తీసుకుని ఈ లోకంలోకి రాలేదు మనం. ఇక్కడ నుండి ఏమీ తీసుకుపోలేము. మన ఊరు నుండి పట్టణానికి ఉద్యోగం చేయడానికి వచ్చి నట్టుగా ఏవో కొన్ని కర్మలు నిర్వర్తించడానికి ఇక్కడకు వచ్చాము. అదెలా అంటే ఒక యజమాని తోటను చూడడానికి ఎవరైనా వస్తే అక్కడి తోటమాలి వారిని వెంటబెట్టుకుని వెళ్లి తోటని చూపిస్తూ 'ఇది మా తోట. ఇది మా తటాకం' అని అంతా తన దైనట్టు వర్ణిస్తాడు. అతడి వల్ల ఏదైనా పొరపాటు జరిగి కోపంతో యజమాని పని నుండి తొలగిస్తే అక్కడ నుండి మామిడి చెక్కతో చేసిన తన పెట్టెను కూడా తీసుకు పోలేడు. ద్వారపాలకుడి చేత రహస్యంగా పెట్టెను తెప్పించుకుంటాడు. అతడు పెట్టెనైనా పట్టుకు పోగలడు. మనం అదీ చేయలేము.

జ్యోతిర్మయం

భగవంతుడు రెండు సందర్భాలలో మనుషుల ప్రవర్తనకు నవ్వుతాడు. రోగి తల్లితో వైద్యుడు 'ఏ భయమూ లేదమ్మా. నీ బిడ్డకు నయం చేస్తాను' అని చెప్పినప్పుడు. 'నేను చంపబోతున్నాను. వైద్యుడు తానే రక్షించేవాడినని భావిస్తున్నాడు కాబోలు. వీడెంత అమాయకుడు' అని మొదటిసారి నవ్వుతాడు. వైద్యుడు తానే కర్తను అనుకున్నాడు కానీ భగవంతుడే కర్త అని మర్చిపోయాడు. ఇద్దరు అన్నదమ్ములు ఆస్తిని పంచుకుంటూ 'ఈ భూమిలో ఇటు వైపు నాది, ఆ వైపు నీది' అనుకుంటున్నప్పుడు 'నా ప్రపంచాన్ని నాది నీది అని పంచుకుంటున్నారు. వీళ్ళెంత మూర్ఖులు' అనుకుని నవ్వుతాడు. ఇందులోని మర్మం గ్రహించాలి జ్ఞానులు. నేను, నాది అనే అహంకారం వదిలి దైవానుగ్రహ సాధనకై కృషి చేయాలి. ఉన్నంతకాలం మంచి పనులు చేస్తూ కీర్తిని గడించాలి. అదే ఈ భూమి మీద వారి జ్ఞాపకమై నిలిచి ఉండేది.''

– అమ్మాజీ ఉమామహేశ్వర్

క్లుప్తంగా...

ఆగస్టు ఒకటి నుంచి 31 వరకు శ్రీవారి పుష్కరిణి మూసివేత

తిరుమల: తిరుమలలో శ్రీవారి ఆలయం వద్ద ఉన్న పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించి పైపులైన్ల మరమ్మతులు, సివిల్ పనులు చేపట్టేందుకు ఆగస్టు ఒకటి నుంచి 31వ తేదీ వరకు పుష్కరిణిని మూసివేయనున్నారు. ఈ కారణంగా నెల రోజుల పాటు పుష్కరిణి హారతి ఉండదు. సాధారణంగా స్వామి పుష్కరిణిలో నీరు నిల్వ ఉండే అవకాశం లేదు. పుష్కరిణిలోని నీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించేందుకు అత్యుత్తమ రీసైక్లింగ్ వ్యవస్థ అందుబాటులో ఉంది. నిరంతరాయంగా కొంత శాతం చొప్పున నీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగిస్తారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఒక నెల రోజుల పాటు పుష్కరిణిలో నీటిని తొలగించి చిన్న చిన్న మరమ్మతులను పూర్తి చేస్తారు. పుష్కరిణి మరమ్మతుల కోసం మొదటి పది రోజుల పాటు నీటిని తొలగిస్తారు. ఆ తర్వాత పది రోజులు మరమ్మతులు ఏవైనా ఉంటే పూర్తి చేస్తారు. చివరి పది రోజులు పుష్కరిణిలో నీటిని నింపి పూర్తిగా సిద్ధం చేస్తారు. పుష్కరిణిలోని నీటి పీహెచ్ విలువ ఏడు ఉండేలా చూస్తారు. టీటీడీ వాటర్ వర్క్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ పనులు చేపడతారు.

21,22 తేదీల్లో ఏపీఎన్జీవో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఆగస్టు 21, 22 తేదీల్లో విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాసరావు, కె.శివారెడ్డి తెలిపారు. విజయవాడలోని ఎన్జీవో హోంలో అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ..ఉద్యోగుల సమస్యలే ప్రధాన అజెండాగా కౌన్సిల్ సమావేశాలను నిర్వహిస్తామని చెప్పారు. సమావేశాలకు సీఎం హాజరుకావడం ఆనవాయితీ అని, ఈసారి కౌన్సిల్ సమావేశాలకు సీఎం జగన్‌ను ఆహ్వానించామన్నారు. సమావేశాలకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా ఉద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇక్బాల్, పి.రమేష్, బి.సతీష్‌కుమార్, డి.విశ్వనాథ్, రామకృష్ణ, ఎం.రాజుబాబు, నాగేంద్రరావు, బీవీ రమణ, సీహెచ్.దిలీప్‌కుమార్, జి.గోపాలకృష్ణ, కె.శివలీల తదితరులు పాల్గొన్నారు.

ఏవోబీలో అప్రమత్తం

మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో రాత్రి బస్సు సర్వీసుల నిలిపివేత

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్ర–ఒడిశా సరిహద్దు (ఏవోబీ)లో మావోయిస్టుల వారోత్సవాలు ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే బలగాలు మోహరించి విస్తృత తనిఖీలు చేపడుతున్నాయి. విశాఖ నుంచి సీలేరు మీదుగా తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు వెళ్లే బస్సు సర్వీసుల విషయంలో అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రత్యేకించి రాత్రి బస్సు సర్వీసులను నిలుపుదల చేస్తూ, పగటి వేళ మాత్రమే సర్వీసులను నడిపేలా సిబ్బందికి మార్గదర్శకాలు జారీ చేశారు.

23 నుంచి తెలుగు రాష్ట్రాల జర్నలిస్టు ఓపెన్ క్రికెట్ టోర్నీ

సాక్షి, అమరావతి: తెలుగు రాష్ట్రాల జర్నలిస్టు ఓపెన్ క్రికెట్ టోర్నీని ఆగస్టు 23వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర, తెలంగాణలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులు అందరినీ ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లాకు ఒకే జట్టు ఉండాలనే నిబంధన లేదని, అక్రెడిటేషన్ కార్డు, సంస్థ గుర్తింపు కార్డుతో పోటీలకు హాజరుకావాలని కోరారు. టోర్నీ విజేతకు రూ.లక్ష నగదు బహుమతితో పాటు ట్రోఫీ బహూకరిస్తామన్నారు. ఆగస్టు 10వ తేదీలోగా జట్ల ఎంట్రీలను పంపాలని కోరారు. పోటీలను అనంతపురం పట్టణంలోని ఆర్డీటీ ప్రధాన క్రికెట్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆంధ్ర, తెలంగాణలో పనిచేస్తున్న స్పోర్ట్స్ జర్నలిస్టులకు ప్రత్యేక ఎంట్రీలు ఇస్తామన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో విజిలెన్స్ ఏడీజీ

ఉక్కునగరం: రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ మంగళవారం స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించారు. విశాఖ పర్యటనలో భాగంగా ఆయన ఇంటెలిజెన్స్ ఎస్పీ వి.సత్యయేసుబాబుతో స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ యూనిట్‌కు విచ్చేశారు. అక్కడ సీఐఎస్ఎఫ్ కమాండెంట్ అత్తార్ మహ్మద్ హనీఫ్‌తో అగ్ని ప్రమాదాలపై స్టీల్‌ప్లాంట్ తీసుకుంటున్న చర్యలు గురించి చర్చించారు. అనంతరం కమాండెంట్‌తో స్టీల్‌ప్లాంట్‌లోని ఫైర్ కాంప్లెక్స్‌కు వెళ్లారు. అక్కడ ఫైర్ సేఫ్టీపై తీసుకుంటున్న జాగ్రత్తలు, వాటికి సంబంధించిన యంత్రాలు, సామగ్రిని ప్రత్యక్షంగా తిలకించారు. అనంతరం ఈడీ (వర్క్స్) బిల్డింగ్‌లోని మోడల్ రూమ్, అవార్డు గ్యాలరీలను సందర్శించారు. అక్కడ ఆయనకు స్టీల్‌ప్లాంట్ లేఅవుట్, ముడి పదార్థాల సరఫరా, ఉత్పత్తుల రవాణా గురించి వివరించారు.

కాలువల ద్వారా పోర్టులకు సరుకు రవాణా

వాటిని అనుసంధానిస్తూ అంతర్గత జలరవాణా అభివృద్ధి

- ఇలా రాష్ట్రంలో 1,555 కి.మీ జలరవాణాకు అవకాశం
- తొలిదశలో ముక్త్యాల నుంచి మచిలీపట్నంకు జలమార్గం
- ఆ తర్వాత విజయవాడ నుంచి కాకినాడ, పెన్నా నది ద్వారా కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానం
- డీపీఆర్‌లు సిద్ధంచేసిన ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సుదీర్ఘ తీర ప్రాంతమున్న మొత్తం 974 కి.మీలను వినియోగిస్తూ ప్రస్తుతమున్న ఆరు పోర్టులకు అదనంగా మరో నాలుగు పోర్టులను నిర్మిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పుడు వీటిని నదులు, కాలువల ద్వారా అనుసంధానించే ప్రక్రియపై దృష్టిపెట్టింది. రోడ్డు మార్గంతో పోలిస్తే అత్యంత తక్కువ వ్యయంతో వేగంగా సరుకు రవాణాకు అంతర్గత జలరవాణా మార్గాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలను సిద్ధంచేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీని ఏర్పాటుచేస్తూ చట్టాన్ని తీసుకురావడమే కాక బోర్డును సైతం ఏర్పాటుచేసింది. రాష్ట్రంలో సుమారు 1,555 కి.మీ మేర జలరవాణా మార్గాలున్నప్పటికీ.. అందులో వినియోగంలో ఉన్నది చాలా తక్కువే. పర్యావరణ హితం, తక్కువ వ్యయంతో కూడిన జలరవాణా పెంపుపై కేంద్రంప్రత్యేక దృష్టి సారించడంతో దానితో కలిసి పలు ప్రాజెక్టులను చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రాజెక్టు నివేదికలను సిద్ధంచేస్తోంది. నిజానికి.. ప్రపంచవ్యాప్తంగా అంతర్గత జలరవాణా మార్గాలు 22.93 లక్షల కి.మీ.లు ఉండగా అందులో భారత్ కేవలం 0.20 లక్షల కి.మీ మాత్రమే కలిగి ఉంది. ఇందులో అత్యధికంగా పశ్చిమ బెంగాల్‌లో 4,543 కి.మీ మేర జలరవాణా మార్గాలుండగా, ఏపీ 1,555 కి.మీ.లతో 4వ స్థానంలో ఉంది. ఇందులో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నేషనల్ వాటర్‌వేస్ ప్రాజెక్టుల కింద కృష్ణా–గోదావరి–కాకినాడ–ఏలూరు, బకింగ్‌హామ్ కెనాల్‌ను అభివృద్ధిచేయడానికి ఎన్‌డబ్ల్యూ–4 కింద ప్రకటించింది. ఎన్‌డబ్ల్యూ–79 కింద పెన్నా నదిలో, ఎన్‌డబ్ల్యూ–104 కింద తుంగభద్ర నదిలో జలరవాణా మార్గాలను కేంద్రం చేపట్టనుంది. వీటికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరికొన్ని జలరవాణా మార్గాలను అభివృద్ధి చేయడానికి నడుం బిగించింది.

తొలుత ముక్త్యాల–మచిలీపట్నం రూట్

ఇక ఇటీవలే నిర్మాణ పనులు ప్రారంభమైన మచిలీపట్నం పోర్టును అనుసంధానిస్తూ ముక్త్యాల నుంచి అంతర్గత జలరవాణా చేపట్టడానికి ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ అడుగులు వేస్తోంది. ఇందుకోసం ప్రకాశం బ్యారేజీ వద్ద బందరు కాలువ లాకులను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. ఈ జలమార్గం అందుబాటులోకి వస్తే జగ్గయ్యపేట వద్ద ఉన్న సిమెంట్ పరిశ్రమలకు చెందిన ఉత్పత్తులు, బియ్యంను తీసుకెళ్లడంతోపాటు ఇబ్రహీంపట్నం వద్ద ఉన్న థర్మల్ పవర్ కేంద్రానికి దిగుమతి చేసుకున్న బొగ్గును చౌకగా రవాణా చేయవచ్చు. రెండో దశలో ఇబ్రహీంపట్నం నుంచి ఏలూరు, కాకినాడ కాలువల ద్వారా కాకినాడ పోర్టును అనుసంధానించే ప్రాజెక్టును చేపట్టనున్నారు. అలాగే, పెన్నా, తుంగభద్ర నదుల పరీవాహక ప్రాంతాలను వినియోగించుకుంటూ కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానిస్తారు. ఇప్పటికే ముక్త్యాల–మచిలీపట్నం జలరవాణా మార్గానికి డీపీఆర్ సిద్ధంచేయగా కేంద్రం ఆమోదం కోసం ఎదురుచూస్తున్నారు.

రాష్ట్రంలోని నదులు, కాలువల జలమార్గం కి.మీలలో..

నది/కాలువ	కి.మీ
గోదావరి	250
కృష్ణా	171
పెన్నా	256
తుంగభద్ర	232
ఏలూరు కాలువ	139
కొమ్మమూరు కాలువ	113
కాకినాడ కాలువ	50
బకింగ్‌హామ్	258
బందరు కాలువ	86
మొత్తం	1,555

'పెన్నా'లో 16 మిలియన్ టన్నుల సరుకు రవాణా..

పెన్నా నది పరీవాహక ప్రాంతంలో అనేక పరిశ్రమలు ఉండటంతో ఏటా 16 మిలియన్ టన్నుల సరుకు రోడ్డు మార్గం ద్వారా రవాణా అవుతున్నట్లు అంచనా. ఇదే జలమార్గం ద్వారా రవాణాచేస్తే టన్నుకు కి.మీ.కు రూ.2.50 తగ్గడంతో పాటు డీజిల్ వినియోగం, పర్యావరణ కాలుష్యం తగ్గుతాయి. ఇంతకాలం కాగితాలకే పరిమితమైన ఈ ప్రాజెక్టులను పట్టాలెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా అథారిటీని ఏర్పాటుచేసింది. రాష్ట్రంలో పలు నౌకాశ్రయాలు నిర్మాణం జరుగుతుండటంతో వాటికి అనుసంధానం చేసే విధంగా ప్రణాళికలు సిద్ధంచేస్తున్నాం.

– ఎస్‌వీకే రెడ్డి, సీఈఓ, ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ

దివ్యాంగ విద్యార్థులకు సాంకేతిక బోధన నైపుణ్యం

- దేశంలోనే మొదటిసారిగా ఏపీలో 'ఫస్ట్ ఇన్‌క్లూజివ్ డిజిటల్ ఫెస్టివల్'
- సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు


ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు అందుకుంటున్న సమగ్ర శిక్ష ఎస్పీడీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులకు సాంకేతిక విద్యా బోధన అందించేందుకు దేశంలోనే తొలిసారిగా ఫస్ట్ ఇన్‌క్లూజివ్ డిజిటల్ ఫెస్టివల్ నిర్వహిస్తుందని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు సకల సౌకర్యాలతో డిజిటల్ విద్యను అందిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర సమగ్ర శిక్ష, రూరల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ (ఆర్‌డీటీ అనంతపురం) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అనంతపురం ఆర్‌డీటీ ఆడిటోరియంలో జరిగిన 'ఫస్ట్ ఇన్‌క్లూజివ్ డిజిటల్ ఫెస్టివల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాయలసీమలోని ఆరు జిల్లాల (అనంతపురం, అన్నమయ్య, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల, కడప) నుంచి 300 మంది దివ్యాంగ, సాధారణ విద్యార్థులతో కలిపి విజువల్ కోడింగ్, ఆక్సెస్బుల్ కోడింగ్, రోబోటిక్, వెబ్ డిజైన్, యానిమేషన్ గేమ్స్ డెవలప్‌మెంట్ వంటి 100 డిజిటల్ నైపుణ్యాల ప్రాజెక్టులను ప్రదర్శించి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు సాధించడం అభినందనీయమన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ ఎం.రామకృష్ణారెడ్డి, ఆర్‌డీటీ డైరెక్టర్ దశరథ్, చక్షుమతి ఫౌండేషన్ ప్రతినిధి రామ్‌కమల్, సైబర్ స్క్వేర్ సీఈవో ఎస్.పి.హరిష్, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డు ఏపీ ప్రతినిధి పాల్గొన్నారు.

వేటగాళ్ల ఉచ్చులో చిక్కి చిరుత మృతి

- చిరుత కాళ్లు కత్తిరించుకుని వెళ్లిన దుండగులు


చిరుత కళేబరాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి

రామకుప్పం: వేటగాళ్ల ఉచ్చులో పడి చిరుత మృతి చెందిన ఘటన చిత్తూరు జిల్లా రామకుప్పం మండలంలోని అటవీ ప్రాంతంలో మంగళవారం వెలుగు చూసింది. 89 పెద్దూరు నారాయణపురం బీట్ పరిధిలో వన్యప్రాణుల కోసం వేటగాళ్లు అమర్చిన విద్యుత్ ఉచ్చుకు తగిలి చిరుత పులి మృతి చెందింది. మంగళవారం అటుగా వెళ్తున్న పశువుల కాపరులు గుర్తించి అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. మృతి చెందిన చిరుత ముందర కాళ్లను దుండగులు సగానికి నరికి తీసుకెళ్లారు. డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి, కుప్పం అటవీ క్షేత్రాధికారి వైసీ రెడ్డి మాట్లాడుతూ.. ఐదు రోజుల క్రితం విద్యుత్ షాక్‌కు గురై చిరుత చనిపోయినట్టు భావిస్తున్నట్టు తెలిపారు. దీని వయసు సుమారు 7 సంవత్సరాలు ఉంటుందన్నారు.

వివేకానందుడి గురించి నాయనమ్మ చెప్పేది

- స్వామి వివేకానంద పినతండ్రి మునిమనుమరాలు సంధ్య బిశ్వాస్
- ఏయూను సందర్శించిన వివేకానంద స్వామి కుటుంబ సభ్యులు
- ఏయూ నుంచి డిగ్రీ పూర్తి చేసిన నేటి తరం


సంధ్య బిశ్వాస్‌ను సత్కరిస్తున్న దూరవిద్య డైరెక్టర్ విశ్వేశ్వర రావు

ఏయూ క్యాంపస్ (విశాఖ): తన నాయనమ్మ నుంచి స్వామి వివేకానంద జీవిత చరిత్ర కథలుగా తెలుసుకున్నానని స్వామి వివేకానంద పినతండ్రి మునిమనుమరాలు సంధ్య బిశ్వాస్ చెప్పారు. తన కుమార్తెను దూరవిద్యలో పీజీ డిప్లమా ఇన్ మేనేజ్‌మెంట్ కోర్సు పరీక్షలు రాయించడానికి విశాఖ విచ్చేసిన ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. తన నాయనమ్మ మృణాళినీదేవి చిన్నతనంలో వివేకానందుడి జీవిత గాథను కథల రూపంలో చెప్పేవారని గుర్తుచేసుకున్నారు. తాను బెంగాలీలో బీఏ పూర్తిచేశానని, తన ఇద్దరు కుమార్తెలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలనేది తన ఆకాంక్ష అని చెప్పారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి తమ పిల్లలు డిగ్రీ చదవడం గర్వంగా భావిస్తున్నానన్నారు. తన పెద్ద కుమార్తె శ్యామాశ్రీత్ బిశ్వాస్ బీఏ పూర్తిచేసి త్వరలో ఎంబీఏలో చేరాలని భావిస్తోందన్నారు. ప్రస్తుతం రెండో కుమార్తె బీఏ పూర్తిచేసి పీజీ డిప్లమో పరీక్షలు రాసిందన్నారు. గతంలో తాము కలకత్తాలోని బాలీగంజ్ ప్రాంతంలో నివాసం ఉండేవాళ్లమని, భర్త ఉద్యోగ రీత్యా జంషెడ్‌పూర్‌కి మారామన్నారు. తన భర్త టాటా సంస్థలకు అనుబంధంగా ఉన్న సంస్థలో పని చేసేవారని, ఇటీవలే కాలం చేశారని వెల్లడించారు. ప్రస్తుతం తన కుమార్తెలిద్దరూ టాటా సంస్థలకు అనుబంధంగా ఉన్న సంస్థల్లో ఉద్యోగాలు చేసుకుంటూ దూరవిద్యలో ఉన్నత విద్యను పూర్తి చేయాలని తపన పడుతున్నారన్నారు. పరీక్షలు రాయడానికి వచ్చిన తన ఇద్దరు కుమార్తెలతోపాటు తనకు జిల్లా పరిషత్ వద్దనున్న శ్రీ కృష్ణ మందిరంలో వసతి కల్పించారని చెప్పారు. మంగళవారం పరీక్షలు ముగియడంతో తిరుగు ప్రయాణం అవుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఏయూలోని గాంధీ అధ్యయన కేంద్రాన్ని సంధ్య బిశ్వాస్ సందర్శించారు. సంధ్య బిశ్వాస్‌ను గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకులు కె.సీతామాణిక్యం, ఏయూ దూరవిద్య కేంద్రం సంచాలకులు కె.విశ్వేశ్వరరావు సత్కరించారు.

ఆ స్నేహమానందగీతం!


అలనాటి గుర్తులను నెమరువేసుకున్న మంత్రి రోజా, నటి రమ్యకృష్ణ


రమ్యకృష్ణను, ఆమె కుమారుడిని ఆహ్వానిస్తున్న మంత్రి రోజా దంపతులు

నగరి (చిత్తూరు జిల్లా): తెలుగు, కన్నడ, తమిళ భాషల్లోని పలు చిత్రాల్లో కలిసి నటించిన మంత్రి రోజా, రమ్యకృష్ణలు మంచి స్నేహితులు. సినీ పరిశ్రమలో ఉన్నప్పుడు వీరు తరచుగా కలుసుకుండేవారు. ఆపై రాజకీయాల్లోకి వచ్చి రోజా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రమ్యకృష్ణ బిజీ అయ్యారు. వీరు కొంతకాలం తరువాత మంగళవారం కలుసుకున్నారు. తిరుమల శ్రీవారి దర్శనానంతరం రమ్యకృష్ణ తిరుగు ప్రయాణంలో నగరిలోని మంత్రి రోజా నివాసానికి తన కుమారుడు రిత్విక్ వంశీతో పాటు వచ్చారు. ఆమెను మంత్రి పుష్పగుచ్ఛాలతో సత్కరించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు తమ తీపి గురుతులను నెమరువేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు రమ్యకృష్ణను సత్కరించారు.

ట్రిపుల్ ఐటీల మొదటి విడత అడ్మిషన్లు ముగిశాయి

- త్వరలో రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం
- ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ వెల్లడి


అడ్మిషన్లు పొందుతున్న విద్యార్థులు

వేంపల్లె : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు సంబంధించి 2023–24 విద్యా సంవత్సరానికి కొత్తగా ప్రవేశానికి మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియ మంగళవారం ముగిసింది. ఒంగోలు క్యాంపస్‌లో ప్రవేశానికి రెండో రోజు 547 మంది విద్యార్థులకు కాల్ లెటర్స్ పంపగా, 426 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరై అడ్మిషన్లు పొందారు. మిగిలి పోయిన సీట్లకు త్వరలోనే రెండో విడత ప్రక్రియలో అడ్మిషన్లు పూర్తి చేయనున్నట్లు ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.సంధ్యారాణి తెలిపారు. ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ, ఒంగోలు ట్రిపుల్ ఐటీలకు సంబంధించి 441 సీట్లు మిగిలినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఓ రాంభూపాల్‌రెడ్డి, ఎఫ్ఓ కె.దినేష్‌రెడ్డి, ఓఎస్డీ వై.శివగంగిరెడ్డి, డీన్ అకడమిక్స్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

బోరు బావి నుంచి మంటలు

- అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఘటన


బోరు బావి నుంచి ఎగసిపడుతున్న మంటలు

ఉప్పలగుప్తం : చమురు నిక్షేపాల, సిస్మిక్ సర్వే నిమిత్తం గతంలో ఆక్వా చెరువుల మధ్యన ఏర్పాటు చేసిన బోరు బావి నుంచి మంగళవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి పంచాయతీ రాఘవులుపేటలో జరిగిన ఈ ఘటనతో స్థానికంగా కలకలం రేగింది. రాఘవులుపేటలో కడియం భైరవస్వామికి చెందిన ఆక్వా చెరువుల సమీపానగల గట్టుపై ఉన్న బోరు బావి నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీనిపై స్థానికులు వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చారు. తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు, చమురు సంస్థ వేదాంత సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. వేదాంత సంస్థ ఫైర్ చీఫ్ శ్రీనివాసరావు, జిల్లా అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. గతంలో వేసిన ఈ బావి నుంచి తరచూ పైకి నీరు చిమ్మేదని, ఈ రోజు అకస్మాత్తుగా మంటలు చెలరేగాయని రైతు భైరవస్వామి చెప్పారు. ఘటన స్థలం జనావాసాలకు దూరంగా ఉండటంతో ప్రమాదం తప్పిందన్నారు. రాజమహేంద్రవరం నుంచి ఓఎన్‌జీసీ క్రైసిస్ మేనేజ్‌మెంట్ గ్రూపు అధికారులు వచ్చి ఈ సమస్యకు పరిష్కారం చూపుతారని తహసీల్దార్ వెంకటేశ్వరి చెప్పారు. కాగా, జిల్లాలోని రాజోలు మండలం శివకోటి గ్రామంలో కూడా ఆక్వా చెరువు నీటి కోసం ఏర్పాటు చేసిన ఓ బోరు బావి నుంచి ఈ నెల 15న 20 అడుగుల ఎత్తు వరకు అగ్నికీలలు ఎగసిపడ్డాయి. ఇది మరువక ముందే మరో ఘటన జరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డుపక్క రూ.2వేల నకిలీ నోట్ల కట్టలు!


సూట్‌కేసు, అట్టపెట్టెల్లో నగదు

బనశంకరి: రోడ్డుపక్కన రెండు పెద్ద సూట్‌కేసులు, ఏమున్నాయో అని చూసిన స్థానికులకు కట్టలకొద్దీ రెండువేల రూపాయల నోట్లు కనిపించడంతో సంభ్రమానికి లోనయ్యారు. మంగళవారం బెంగళూరు నగర శివారులో కనకపుర రోడ్డు పక్కన పెద్ద సూట్‌కేసు, కొన్ని అట్టపెట్టెలు కనిపించాయి. గమనించిన స్థానికులు స్థానిక తలఘట్టపుర పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి సూట్‌కేసును, అట్టపెట్టెలను తెరవగా కట్టలకొద్దీ రూ.2 వేల నోట్లు దర్శనమిచ్చాయి. నోట్లను క్షుణ్ణంగా పరిశీలించగా అన్నీ నకిలీవని తెలిసింది.

తుది దశకు అంబేడ్కర్ స్మృతి వనం పనులు

- పనులను పరిశీలించిన మంత్రి ఆదిమూలపు సురేష్


అంబేడ్కర్ స్మృతివనం పనులను పరిశీలిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్ తదితరులు

సాక్షిప్రతినిధి, విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ స్వరాజ్ మైదానంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ స్మృతి వనం, విగ్రహ నిర్మాణ పనులు తుది దశకు చేరాయని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. స్వరాజ్ మైదానంలో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహ నిర్మాణం, స్మృతి వనం పనులను ఆయన మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే 95 శాతం పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులు తుది దశకు చేరాయని, విగ్రహ నిర్మాణంలో అత్యంత కీలకమైన అంబేడ్కర్ చూపుడు వేలుకు సంబంధించి పనులు జరుగుతున్నట్టు తెలిపారు. రూ.400 కోట్లతో 518 టన్నుల స్టీల్, కంచును విగ్రహ నిర్మాణానికి వాడుతున్నామన్నారు. 500 మందికి పైగా కూలీలు నిరంతరం పనిచేస్తున్నారని చెప్పారు. దేశ వ్యాప్తంగా లక్షలాది మంది పర్యాటకులు అంబేడ్కర్ స్మృతి వనాన్ని చూసేందుకు వస్తారని, వారికి అవసరమైన వసతులు కల్పిస్తున్నామన్నారు. అంబేడ్కర్ జీవితంలోని ప్రతి ఘటనను ప్రదర్శించేలా ఆధునిక ఏసీ థియేటర్, మ్యూజియం, లైబ్రరీతో పాటు విగ్రహం చుట్టూ నీటి కొలనులు ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి వివరించారు.

పీడీఎస్ పర్యవేక్షణకు విజిలెన్స్ కమిటీలు

సాక్షి, అమరావతి: ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతోపాటు జాతీయ ఆహార భద్రత చట్టం–2013ను మరింత సమర్థంగా అమలు చేసేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. ఈ మేరకు రాష్ట్ర, జిల్లా, మండల, చౌక దుకాణాల(గ్రామీణ/పట్టణ) స్థాయిల్లో విజిలెన్స్ కమిటీలను పునర్నియమించాలని పౌరసరఫరాలశాఖ ఎక్స్‌అఫీషియో సెక్రటరీ హెచ్.అరుణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. వెంటనే జిల్లాల కలెక్టర్లు విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ అందిస్తోంది. ఇందులో ఎక్కడా లోపాలు తలెత్తకుండా పర్యవేక్షించేందుకు ఆయా స్థాయిల్లోని విజిలెన్స్ కమిటీల్లో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్, వీఆర్వోలతోపాటు స్థానిక ఎస్సీ, ఎస్టీ, మహిళలు, నిరాశ్రయులు, దివ్యాంగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులకు ప్రాతినిధ్యం కల్పించారు. రాష్ట్ర స్థాయి కమిటీకి చైర్మన్‌గా సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి, జిల్లా స్థాయి కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, మండల స్థాయిలో తహసీల్దార్ చైర్మన్‌గా కొనసాగుతారు. గ్రామీణ ప్రాంతాల్లో కమిటీ చైర్మన్‌గా సర్పంచ్, అర్బన్ ప్రాంతాల్లో మున్సిపల్ కార్పొరేటర్/కౌన్సిలర్ చైర్మన్‌గా ఉంటారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి విజిలెన్స్ కమిటీలు సమావేశమై ప్రజా పంపిణీ వ్యవస్థ పారదర్శకంగా పనిచేసేలా చర్యలు చేపట్టనున్నాయి.

ఎస్ఆర్ఎం గ్లోబల్ ఆసుపత్రిలో వృద్ధునికి అరుదైన చికిత్స


శస్త్రచికిత్స అనంతరం రాజమణితో వైద్యులు

చెన్నై: తమిళనాడులోని చెన్నై అర్బన్ ప్రాంతమైన కట్టన్‌కులత్తూర్ ఎస్ఆర్ఎం గ్లోబల్ ఆసుపత్రిలో వృద్ధుడికి అరుదైన శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా చేశారు. తీవ్ర అస్వస్థతతో ఉన్న మణివక్కంకు చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి రాజమణి(82)ను ఆయన కుటుంబీకులు ఎస్ఆర్ఎం ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆ సమయంలో ఆయన హార్ట్‌బీట్ ఎక్కువగా ఉండటంతో పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. వైద్యం చేస్తున్న క్రమంలో ఒకే రోజులో ఆయనకు 6 చోట్ల కార్డియాక్ అరెస్ట్ అయినట్లు వైద్యులు గుర్తించారు. వైద్య పరిభాషలో 'ఎలక్ట్రిక్ స్ట్రామ్'గా పిలవబడే ఈ పరిస్థితిని అధిగమించాలంటే ఐసీడీ (ఇంప్లాంటబుల్ కార్డియాక్ డెఫిబ్రిలేటర్) ఇంప్లాంటేషన్ చేయాలని డాక్టర్లు నిర్ణయించారు. వయసు రీత్యా ఎక్కువ రిస్క్ అయినప్పటికీ అత్యంత జాగ్రత్తలు తీసుకుని రాజమణికి శస్త్ర చికిత్సను విజయవంతంగా చేశారు. ఆపరేషన్‌లో భాగంగా రాజమణి ఛాతి ఎడమవైపున 3 సె.మీ లోపలికి ఐసీడీ డివైజ్‌ను వైద్యులు అమర్చారు. ప్రస్తుతం ఆయన పూర్తిగా కోలుకుని మంగళవారం డిశ్చార్జ్ అయినట్లు ఎస్ఆర్ఎం గ్లోబల్ ఆసుపత్రి ప్రెసిడెంట్ డాక్టర్ పి.సత్యనారాయణన్ మీడియాకు చెప్పారు. మీడియా సమావేశంలో ఎస్ఆర్ఎం గ్లోబల్ ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ వీపీ చంద్రశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో దూకి యువకుడి ఆత్మహత్య

- మృతుడు మిర్యాలగూడకు చెందిన ఐఐటీ విద్యార్థి
- హైదరాబాద్ నుంచి విశాఖ రాక


మృతుడు కార్తీక్ (ఫైల్)

ఆరిలోవ (విశాఖ తూర్పు): మిర్యాలగూడకు చెందిన ఐఐటీ విద్యార్థి విశాఖ బీచ్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జోడుగుళ్లపాలెం బీచ్‌కు ఈ నెల 21న ఓ యువకుడి మృతదేహం కొట్టుకొచ్చింది. మృతుడి వివరాలు తెలియక పోవడంతో ఆరిలోవ పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు కేసు నమోదు చేశారు. ఆ మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచారు. కాగా, మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులు వచ్చి అతడిని గుర్తించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన కార్తీక్ (21) హైదరాబాద్‌లో కంది ఐఐటీలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. కార్తీక్ ఈ నెల 17న క్యాంపస్ నుంచి బయటకు వెళ్లాడు. అప్పటినుంచి తిరిగి కళాశాలకు చేరలేదు. ఈ నెల 18న తల్లిదండ్రులు కార్తీక్‌కు ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో వారు కళాశాలకు వెళ్లి కార్తీక్ గురించి ఆరా తీశారు. కార్తీక్ బయటకు వెళ్లి తిరిగి రాలేదని సిబ్బంది చెప్పడంతో అతడి తల్లిదండ్రులు సంగారెడ్డి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసులు దర్యాప్తులో భాగంగా.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో విశాఖ వెళుతున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఎక్కినట్లు సీసీ ఫుటేజీలో వెల్లడైంది. ఆ రైలులో విశాఖ చేరుకున్న కార్తీక్ ఆర్కే బీచ్ ప్రాంతంలో తిరిగినట్టు ఇక్కడ సీసీ ఫుటేజీలలో నమోదైంది. ఇదిలా ఉండగా కార్తీక్ సముద్రంలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్టు నిర్ధారణకు వచ్చారు. తండ్రి లుంబ్లా, బంధువులకు అతడి మృతదేహాన్ని అప్పగించినట్టు ఎస్ఐ జి.అప్పారావు తెలిపారు.

ఉద్యోగుల సంఘం నేత సూర్యనారాయణ సస్పెన్షన్

సాక్షి, అమరావతి: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ సస్పెండ్ అయ్యారు. ఆయన్ను సస్పెండ్ చేస్తూ వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ గిరిజా శంకర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్రమశిక్షణా చర్యలు పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2019 నుంచి 2021 మధ్య గుంటూరు జిల్లా కుంచనపల్లిలోని వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన కేఆర్ సూర్యనారాయణతోపాటు ఆయన సహ ఉద్యోగులు మెహర్‌కుమార్, సంధ్య, వెంకట చలపతి, సత్యనారాయణ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని తెలిపారు. ఉద్యోగ సంఘ నాయకుడిగా, వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘం నాయకుడిగా ఆయన పలువురు వ్యాపారుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారనే అభియోగంపై విజయవాడ సిటీ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఆయన పరారీలో ఉన్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్న ప్రభుత్వం, ఉద్యోగిగా ఉంటూ విచారణకు సహకరించకపోవడంతో సస్పెండ్ చేసినట్లు తెలిపింది.

క్లుప్తంగా...

వాపస్ ఇవ్వబోమంటూ గ్రహీతలు అంగీకరిస్తేనే అవార్డులివ్వాలి

పార్లమెంటరీ స్థాయీ సంఘం సూచన

న్యూఢిల్లీ: దేశంలో కొన్నేళ్ల క్రితం 'అవార్డుల వాపసీ' కార్యక్రమం సంచలనం సృష్టించింది. కేంద్ర ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేస్తూ కొందరు తమ అవార్డులను తిరిగి ఇచ్చేశారు. ఇకపై అలాంటి అవాంఛనీయ పరిణామం పునరావృతం కాకుండా, పార్లమెంటరీ స్థాయీ సంఘం కీలక సిఫార్సు చేసింది. రవాణా, పర్యాటకం, సంస్కృతిపై ఏర్పాటైన ఈ స్థాయీ సంఘం ఇచ్చిన నివేదికను తాజాగా పార్లమెంట్‌లో సమర్పించారు. సాహిత్య అకాడమీ, ఇతర సాంస్కృతిక సంఘాలు, అకాడమీలు పూర్తిగా రాజకీయేతర సంస్థలని స్థాయీ సంఘం పేర్కొంది. రాజకీయాలతో వాటికి సంబంధం లేదని వెల్లడించింది. అందుకే ఇలాంటి సంస్థలు అందజేసే అవార్డుల విషయంలో గ్రహీతల నుంచి ముందుగానే అంగీకారం పొందాలని సూచించింది. రాజకీయ కారణాలతో అవార్డులను వెనక్కి ఇవ్వబోమంటూ వారు అంగీకరించేలా చూడాలని స్పష్టం చేసింది. ఒకవేళ అవార్డును వాపస్ చేస్తే భవిష్యత్తులో అలాంటి మరో అవార్డు కోసం వారి పేర్లను పరిగణనలోకి తీసుకోవద్దని తేల్చిచెప్పింది. ప్రభుత్వం ప్రదానం చేసిన పురస్కారాలను వెనక్కి ఇవ్వడం దేశాన్ని అవమానించడమే అవుతుందని పార్లమెంటరీ స్థాయీ సంఘం అభిప్రాయపడింది. అవార్డుల ప్రతిష్టను, హోదాను కూడా దెబ్బతీస్తుందని పేర్కొంది.

ఎస్సీ, ఎస్టీలు మినహా కుల గణన లేదు: కేంద్రం

న్యూఢిల్లీ: దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీలు మినహా కులాల వారీగా జనాభా లెక్కల సేకరణ జరగడం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ మంగళవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. త్వరలో జరగబోయే జన గణనలో భాగంగా కులాల వారీ గా జనాభా లెక్కలను సైతం సేకరించాలని కొన్ని రాజకీయ పార్టీలు, సంఘాలు కోరుతున్నాయని చెప్పారు. రాజ్యాంగం(ఎస్సీలు) ఆర్డర్–1950, రాజ్యాంగం(ఎస్టీలు) ఆర్డర్– 1950లో పేర్కొన్న కులాల మినహా ఇతర కులాల లెక్కలను స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ప్రభుత్వం సేకరించడం లేదని గుర్తుచేశారు.

బ్రిటన్ వీసా దరఖాస్తులకు ఆహ్వానం

లండన్: 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న పట్టభద్రుల కోసం యూకే–ఇండియా యంగ్ ప్రొఫెషనల్ స్కీమ్ కింద రెండో దశ బ్యాలెట్‌ను బ్రిటన్ ప్రారంభించింది. భారత యువ వృత్తి నిపుణులు బ్రిటన్‌లో స్థిరపడి పని చేస్తూ చదువుకోవడానికి ఉపయోగపడే ఈ పథకం కింద 2023కు 3,000 సీట్లున్నాయి.

చినుకుతో వణుకు

ఢిల్లీ నుంచి గల్లీ దాకా దేశమంతా అదే వ్యథ

ఆక్రమణలు, అడ్డగోలు నిర్మాణాలే కారణం

మొన్న ముంబై. నిన్న చెన్నై. ఇవాళ ఢిల్లీ.. నగరమేదైనా అదే కథ.. అదే వ్యథ..

చినుకే వరదై రాజధాని తల్లడిల్లిపోతోంది

యమునా నది మహోధృతి ధాటికి కనీవినీ వరదలతో అతలాకుతలమవుతోంది..

ఏమిటీ పరిస్థితి..? ఎందుకీ దుస్థితి..?

యమునా నది ఢిల్లీ పరిధిలో 48 కి.మీ. మేరకు ప్రవహిస్తుంది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహించింది. జూలై 10న సంభవించిన వరదల కారణంగా రాజధాని నగరానికి రూ.10 వేల కోట్లకు పైగా ఆర్థిక నష్టం సంభవించినట్లు అంచనా. ఢిల్లీలో చిత్తడి నేలలు, బావులు, సరస్సులు వంటి జల వనరులు 1,040కి పైగా ఉన్నాయి. వీటికి అధికారిక గుర్తింపు లేదు. ప్రభుత్వం నోటిఫై చేయకపోవడంతో అవి సులభంగా ఆక్రమణలకు గురవుతున్నాయి. ఫలితంగా ఢిల్లీని వరద కష్టాలు వెంటాడుతున్నాయి. నిజానికి దేశంలోని అన్ని చిన్నా పెద్దా నగరాలదీ ఇదే సమస్య...



- ఢిల్లీలో మురుగునీటి పారుదల వ్యవస్థ 1970ల నాటిది. నాటితో పోలిస్తే నగర జనాభా కనీవినీ ఎరగనంతగా పెరిగిపోయింది.
- దాంతో చిన్నపాటి వర్షానికే రోడ్లన్నీ జలమయంగా మారుతున్నాయి. ఇక అడ్డగోలు నిర్మాణాలతో డ్రైనేజీ వ్యవస్థ కుదించుకుపోయి సమస్య మరీ పెద్దదవుతోంది.
- ఢిల్లీలో యమున వరద నీరు చేరే ప్రాంతం దాదాపుగా 97 చదరపు కిలోమీటర్లుంటుంది. నగర భూభాగంలో ఇది 7%. ఇందులో అత్యధిక భూభాగాన్ని ఆక్రమణలు, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులు కట్టడానికి కేటాయించడంతో నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి.
- సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నివేదిక ప్రకారం ఢిల్లీలో యమున వరద నీరు చేరే ప్రాంతాలు 600కు పైగా ఉన్నాయి. వీటిలో 60% వరకు నీరు లేక ఎండిపోయాయి. ఒక్క రోజులోనే అతి భారీ వర్షం కురవడంతో అవన్నీ ఇప్పుడు నీట మునిగాయి.
- పైగా వీటిలో చాలా ప్రాంతాలు ఆక్రమణలకు లోనయ్యాయి. వాటిని వ్యవసాయ క్షేత్రాలుగా మార్చుకొని లక్షలాది మంది బతుకుతున్నారు. మరెన్నో భూముల్ని అభివృద్ధి ప్రాజెక్టులకు కేటాయించారు. 2010లో కామన్‌వెల్త్ క్రీడల కోసం నిర్మించిన గ్రామం, అక్షరధామ్ ఆలయం వంటివెన్నో వరద ప్రాంతాల్లోని ఆక్రమిత భూములపై నిర్మించినవే.
- చిత్తడి నేలలు సహజసిద్ధంగా నీటిని పీల్చుకొని భూగర్భ జలాలను పెంపొందిస్తాయి. కానీ ఢిల్లీలోని చిత్తడి నేలల్లో 200కు పైగా ఎండిపోయి ఆక్రమణలకు గురయ్యాయి.

హతినికుండ్ వివాదం



➤ హరియాణాలో 1996లో కట్టిన ఈ ఆనకట్ట ద్వారా నీళ్లు యమున నది తూర్పు, పశ్చిమ కాలువల్లోకి ప్రవహిస్తాయి. హరియాణా ప్రభుత్వం ఈ బ్యారేజ్ గేట్లు ఎత్తేయడంతో నేరుగా యమున నదిలోకి వరద నీరు చేరి ప్రమాదకరంగా మారుతోందని ఢిల్లీ ప్రభుత్వం ఆరోపిస్తోంది. అయితే తాము నిబంధనలకనుగుణంగానే వ్యవహరిస్తూ లక్ష క్యూసెక్కులు దాటితేనే నీటిని వదులుతున్నామని హరియాణా ప్రభుత్వం వాదిస్తోంది. ఈ నెల 10వ తేదీన హతినికుండ్ ప్రాజెక్టు నుంచి ఏకంగా 3.59 లక్షల క్యూసెక్కుల నీరు యమునలోకి వచ్చింది. అందుకే ఢిల్లీ నీట మునిగిందన్న వాదనలు కూడా ఉన్నాయి. అయితే 2010 వర్షాకాలంలో 7 లక్షల క్యూసెక్కుల నీరు హతినికుండ్ నుంచి విడదల చేసినప్పటికీ అప్పట్లో నగరానికి పెద్దగా ముప్పు రాలేదు. ఇప్పుడు మూడు లక్షల క్యూసెక్కులకే ముప్పు రావడానికి ఆక్రమణలు, అడ్డగోలు నిర్మాణాలే కారణమని సౌత్ ఆసియా నెట్‌వర్క్ ఆన్ డామ్స్, రివర్స్, పీపుల్ కోఆర్డినేటర్ హిమాంశు ఠక్కర్ అభిప్రాయపడ్డారు.

చిత్తడి నేలల పునరుద్ధరణ..

➤ వరద ప్రభావాన్ని తగ్గించాలంటే ఆక్రమణలను తొలగించి నదీ తీర ప్రాంతాలను పునరుద్ధరించాల్సిన అవసరం చాలా ఉంది. నగరంలో డ్రైనేజీ వ్యవస్థను యుద్ధ ప్రాతిపదికన మెరుగుందుకు ప్రభుత్వం కృషి చేయాలి. యమునా నది పొంగి పొర్లకుండా ఢిల్లీకి రక్షణ కవచంలా ఉండే చిత్తడి నేలలు, సరస్సులు, చెరువుల వంటివి తగ్గిపోతున్నాయి. అవి లేకుండా యమున ప్రవాహం సవ్యంగా సాగదన్న అభిప్రాయాలున్నాయి. ఈ సరస్సులు, చెరువులు, బావుల వంటివి నీటిని స్టోరేజ్ చేయడం వల్ల డ్రైనేజీలోకి వెళ్లే నీటి ప్రవాహం తగ్గుతుంది. ''నదుల వరదను శాపంగా చూడకూడదు. పరివాహక ప్రాంతంలో గడ్డివాములు, చెట్లు పెంచడం వంటివి చేస్తే వరద ముప్పు నుంచి తప్పించుకోవచ్చు'' అని సీనియర్ సైంటిస్ట్ ఫయాద్ ఖుద్‌సర్ చెప్పారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

> ఢిల్లీ రెండు రకాల సమస్యలు ఎదుర్కొంటోంది. నిర్మాణాలు పెరిగి కాంక్రీట్ జంగిల్‌గా మారింది. వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కొనే సన్నద్ధత లేదు. అందుకే నగరం ఇలా వరద ముప్పుకు లోనవుతోంది.
> – రితేశ్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ వెట్‌ల్యాండ్స్ ఇంటర్నేషనల్, సౌత్ ఏషియా



ఢిల్లీని కారెత్తిస్తున్న వరద బీభత్సానికి తాజా సాక్ష్యమీ ఫొటో. మంగళవారం హిండన్ నది పొంగి పొర్లి ఢిల్లీ పరిసర ప్రాంతాలను ముంచెత్తింది. దాంతో నోయిడాలో ఎకోటెక్ సమీపంలో ఇలా వందలాది కార్లు నీట మునిగిపోయాయి.


..సీఐసీ తీర్పును వాడుకోరాదు: సుప్రీం

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలను సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) పరిధిలోకి తేవాల్సిందిగా తమను కోరేందుకు కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) ఆదేశాన్ని వాడుకోజాలరని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పార్టీలను ఆర్‌టీఐ పరిధిలోకి తేవాలంటూ దాఖలైన రెండు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం మంగళవారం విచారించింది. అధికారిక విధులు నిర్వర్తించాల్సిందిగా కేంద్రాన్ని ఆదేశిస్తూ రిట్ ఆఫ్ మాండమస్ జారీ చేయాలంటూ సీఐసీ తీర్పు ఆధారంగా సుప్రీంకోర్టును కోరజాలరని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు విన్పించారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు విన్పించారు.

ఐదోసారి చంద్రయాన్–3 కక్ష్య పెంపు

జాబిల్లి వైపు దూసుకెళ్తున్న చంద్రయాన్ మిషన్

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సతీష్ ధావన్ స్పేస్ సెంటర్–షార్ నుంచి ఈ నెల 14న ప్రయోగించిన చంద్రయాన్–3 మిషన్ కక్ష్య దూరాన్ని మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటలకు శాస్త్రవేత్తలు విజయవంతంగా పెంచారు. ప్రపొల్షన్ మాడ్యూల్‌లో నింపిన అపోజీ ఇంధనాన్ని మండించి చంద్రయాన్–3 మిషన్‌ను ప్రస్తుతం భూమికి దగ్గరగా 236 కిలోమీటర్ల ఎత్తుకు, భూమికి దూరంగా 1,27,609 కిలోమీటర్లు ఎత్తుకు పెంచి భూమధ్యంతర కక్ష్యలో పరిభ్రమించేలా చేశారు. ఎల్‌వీఎం3–ఎం4 ఉపగ్రహ వాహక నౌక ద్వారా చంద్రయాన్–3 మిషన్‌ను మొదట భూమికి దగ్గరగా 170 కిలోమీటర్లు, భూమికి దూరంగా 36,500 కిలోమీటర్ల ఎత్తులో భూమధ్యంతర కక్ష్యలోకి ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే నాలుగు విడుతలుగా చేపట్టిన వివిధ ఆపరేషన్లలో భూమికి దగ్గరగా 233 కిలోమీటర్ల ఎత్తుకు, భూమికి దూరంగా 71,351 కిలోమీటర్ల ఎత్తుకు పెంచారు. తాజాగా ఐదోసారి కక్ష్య దూరాన్ని విజయవంతంగా పెంచారు. భూమికి సంబంధించిన కక్ష్యలో ఇదే చివరి ఆపరేషన్. ఆగస్టు 1న అర్ధరాత్రి 12.30 గంటలకు ట్రాన్స్ లూనార్ ఇంజెక్షన్ అనే ఆపరేషన్‌తో చంద్రయాన్–3 మిషన్ చంద్రుడి దిశగా ప్రయాణిస్తుంది. ఆగస్టు 17న లూనార్ ఆర్బిట్(జాబిల్లి కక్ష్య)కు చేరుకుంటుంది. ఐదు రోజులు పాటు చంద్రుడి చుట్టూ పరిభ్రమిస్తూ ఆగస్టు 23న చందమామ ఉపరితలంపై 30 కిలోమీటర్ల ఎత్తులో ప్రపొల్షన్ మాడ్యూల్ ల్యాండర్‌ను విడిచిపెడుతుంది. ఆగస్టు 23న సాయంత్రం 5.47 గంటలకు ల్యాండర్ చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో ఉపరితలంపై దిగుతుంది. ఆ తరువాత ల్యాండర్ లోపల అమర్చిన రోవర్ బయటకు వచ్చి, చంద్రుడిపై 14 రోజుల పాటు పరిశోధనలు చేసి, ఇస్రోకు సమాచారం చేరవేస్తుంది.



కేంద్రంపై అవిశ్వాసం!

నేడు 'ఇండియా' కూటమి భేటీలో నిర్ణయం

- మణిపూర్‌పై అట్టుడికిన ఉభయ సభలు
- ప్రధాని పార్లమెంటుకు వచ్చి చర్చించాలి
- 51 మంది విపక్ష ఎంపీల నోటీసులు
- నిరసనలకు మద్దతు పలికిన బీఆర్‌ఎస్
- విపక్షాలు కలసి రావాలంటూ అమిత్ షా లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: మణిపూర్ హింసపై పార్లమెంట్ వెలుపలా, లోపలా నిరసనలతో హోరెత్తిస్తున్నా ప్రధాని నరేంద్ర మోదీ నోరుమెదపకపోవడంపై విపక్షాలు మండిపడుతున్నాయి. ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ (ఇండియా) పేరిట ఇటీవలే ఒక్కటైన కాంగ్రెస్ సహా 26 విపక్షాలు ఈ అంశానికి సంబంధించి కేంద్రంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే యోచనలో ఉన్నాయి. రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన మంగళవారం జరిగిన విపక్షాల భేటీలో అవిశ్వాస తీర్మానంపై కీలక చర్చలు జరిగాయి. బుధవారం నేతలతో మరోసారి సంప్రదించి తుది నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ నేతలు వెల్లడించారు. తీర్మాన ప్రతి ఇప్పటికే సిద్ధమైందని, 50 మంది ఎంపీల సంతకాల సేకరణ ప్రక్రియ జరుగుతోందని వివరించారు. ఆ రోజు విధిగా లోక్‌సభకు హాజరవాలంటూ కాంగ్రెస్ ఇప్పటికే తమ సభ్యులకు విప్ జారీ చేసింది. మరోవైపు, మణిపూర్‌పై చర్చిద్దాం రమ్మంటూ ఉభయ సభల్లో విపక్ష నేతలు ఖర్గే, అధీర్ రంజన్ చౌదరిలకు అమిత్ షా లేఖలు రాశారు. లోక్‌సభలో ఈ మేరకు ప్రకటన కూడా చేశారు. 83 రోజులుగా సాగుతున్న మణిపూర్ హింసపై పార్లమెంటు ఉభయ సభల్లోనూ ప్రధాని మోదీ సమగ్రమైన ప్రకటన చేయాల్సిందేనని ఖర్గే డిమాండ్ చేశారు. అక్కడ పరిస్థితిని మెరుగు పరిచేందుకు కేంద్రం ఏం చేస్తోందో పార్లమెంటుకు చెప్పాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు.

ఖర్గే వర్సెస్ గోయల్

ఉభయ సభల్లోనూ విపక్షాలు మంగళవారం నాలుగో రోజు కూడా కార్యక్రమాలను అడ్డుకున్నాయి. మణిపూర్‌పై మోదీ వచ్చి ప్రకటన చేయాలంటూ నినదాలతో హోరెత్తించాయి. ఉదయం రాజ్యసభ ఆరంభానికి ముందే బీఆర్‌ఎస్‌తో పాటు 51 మంది విపక్ష ఎంపీలు 267 నిబంధన కింద నోటీసులిచ్చారు. 176 నిబంధన కింద ఇచ్చిన నోటీసులపై చర్చకు ప్రభుత్వం సిద్ధమని సభా పక్ష నేత, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. 267 కింద నోటీసులిస్తే 176 కింద ఎలా చర్చ చేపడతారని కాంగ్రెస్ నేత పి.చిదంబరం ప్రశ్నించారు. తమ ఎంపీ సంజయ్‌సింగ్ సస్పెన్షన్‌ను నిరసిస్తూ ఆప్ సభ్యులు ఆందోళన కొనసాగించారు. దాంతో సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది. తిరిగి మొదలవగానే విపక్షాలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళనకు దిగాయి. గోయల్, ఖర్గే మధ్య వాగ్వాదం జరిగింది. మణిపూర్ తగలబడుతుంటే దానిపై చర్చకు 'మోదీ సాబ్' సభకు ఎందుకు రాలేదని ఖర్గే ప్రశ్నించగా, విపక్ష పాలిత రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అకృత్యాల మీదా సభలో చర్చిద్దామని గోయల్ అన్నారు. దాంతో సభ మధ్యాహ్నం రెండింటి దాకా వాయిదా పడింది. ఎస్టీల రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టగానే విపక్షాల ఆందోళన నేపథ్యంలో సభ బుధవారానికి వాయిదా పడింది. లోక్‌సభ కూడా నేరుగా మధ్యాహ్నం రెండింటికి, అనంతరం జీవ వైవిధ్య బిల్లును ప్రవేశపెట్టాక సాయంత్రం ఐదింటికి వాయిదా పడింది. తర్వాత సహకార సంఘాల బిల్లును సభ ఆమోదించింది. ప్రతిష్టంభనకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు అఖిల పక్ష నేతలతో స్పీకర్ ఓం బిర్లా భేటీ అయినా లాభం లేకపోయింది. మోదీ వచ్చి మణిపూర్ హింసపై స్వయంగా చర్చ మొదలు పెట్టాల్సిందేనని వారు స్పష్టం చేశారు. ఏ రోజైనా చర్చకు సిద్ధమని, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చర్చ మొదలు పెడతారని అధికార పక్షం ప్రతిపాదించింది. ఇక సంజయ్ సింగ్ సస్పెన్షన్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద విపక్ష కూటమి సోమవారం రాత్రంతా బృందాలవారీగా చేసిన ధర్నాలో బీఆర్‌ఎస్ ఎంపీలు పాల్గొన్నారు.

మోదీకి 'ఇండియా' పేరు నచ్చినట్టుంది: మమత

కోల్‌కతా: ''ప్రధాని మోదీకి థ్యాంక్స్. విపక్ష కూటమి పేరు 'ఇండియా' ఆయనకు బాగా నచ్చినట్టుంది'' అంటూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ చెణుకులు విసిరారు. విపక్ష కూటమి గురించి బీజేపీ ఎంతగా విమర్శలు చేస్తే, 'ఇండియా' అనే పేరు వారికి అంతగా నచ్చినట్టు అర్థమన్నారు.

మళ్లీ ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగం

రెండు బాలిస్టిక్ మిస్సైళ్లు ప్రయోగించిన కిమ్ ప్రభుత్వం

సియోల్: తమ ప్రత్యర్థి దేశమైన దక్షిణ కొరియాకు అగ్రరాజ్యం అమెరికా ఆయుధ సాయం అందిస్తుండడాన్ని వ్యతిరేకిస్తూ ఉత్తర కొరియా ప్రతీకార చర్యలకు పాల్పడుతోంది. సోమవారం అర్ధరాత్రి తర్వాత రెండు షార్ట్–రేంజ్ బాలిస్టిక్ మిస్సైళ్లను ప్రయోగించింది. ఈ విషయాన్ని దక్షిణ కొరియా జాయింట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మంగళవారం బహిర్గతం చేశారు. ఉత్తర కొరియాలో కిమ్ జోంగ్ ఉన్ ప్రభుత్వం క్షిపణి ప్రయోగం నిర్వహించడం గత వారం రోజుల వ్యవధిలో ఇది మూడోసారి కావడం గమనార్హం. రాజధాని ప్యాంగ్యాంగ్ సమీప ప్రాంతం నుంచి ప్రయోగించిన ఈ రెండు బాలిస్టిక్ మిస్సైళ్లు 400 కిలోమీటర్లు(248 మైళ్లు) ప్రయాణించి తూర్పు కోస్తా తీరంలో సముద్రంలో పడిపోయాయి. ఉత్తర కొరియా క్షిపణి ప్రయోగాలపై జపాన్ ప్రధానమంత్రి ఫుమియో కిషిడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెచ్చగొట్టే చర్యలకు పాల్పడొద్దని హెచ్చరించారు. తమ నిరసనను ఉత్తర కొరియాకు తెలియజేశామని చెప్పారు.

యూపీలో శిశువు ప్రాణాలు బలిగొన్న అడవి పిల్లి

బుదౌన్(యూపీ): ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బుదౌన్ జిల్లాలోని గొత్రపట్టి భౌనీ గ్రామంలో ఘోరం జరిగిపోయింది. తల్లి పక్కన నిద్రిస్తున్న 15 రోజుల శిశువును అడవి పిల్లి నోట కరుచుకొని ఎత్తుకెళ్లింది. ఇంటిపై నుంచి కిందికి వదిలేసింది. దీంతో శిశువు మృతిచెందాడు. సోమవారం రాత్రి ఈ సంఘటన జరిగిందని పోలీసులు చెప్పారు. ఆస్మా అనే మహిళ 15 రోజుల క్రితం కవలలు.. ఆడ శిశువు, మగ శిశువుకు జన్మనిచ్చింది. వారికి అల్‌షిఫా, రిహాన్ అని పేర్లు పెట్టుకున్నారు. సోమవారం రాత్రి ఇంట్లోకి ప్రవేశించిన అడవి పిల్లి మగ శిశువు రిహాన్‌ను ఎత్తుకెళ్లింది. అప్రమత్తమైన ఆస్మా వెంటనే కేకలు వేసింది. అడవి పిల్లిని పట్టుకొనేందుకు ఆమె భర్త హసన్ ప్రయత్నించాడు. దాంతో ఇంటి పైకి చేరిన అడవి పిల్లి శిశువును వదిలేసింది. తీవ్ర గాయాలపాలైన శిశువు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు.

అబూదాబిలో యువకుడికి మెర్స్–కోవ్ వైరస్

అబూదాబి: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లోని అబూదాబిలో ఓ యువకుడికి ప్రాణాంతకమైన మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్ కరోనా వైరస్ (మెర్స్–కోవ్) సోకింది. అల్ అనిన్ నగరానికి చెందిన 28 ఏండ్ల యువకుడు అనారోగ్యం పాలయ్యాడు. పరీక్షలు నిర్వహించగా మెర్స్–కోవ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) వెల్లడించింది. అతడిని కలిసిన 108 మందికి సైతం పరీక్షలు నిర్వహించామని, వారికి వైరస్ సోకలేదని నిర్ధారణ అయినట్లు అబూదాబి అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం బాధిత యువకుడి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందన్న విషయం తెలియరాలేదు. మెర్స్–కోవ్ వైరస్ తొలుత 2012లో సౌదీ అరేబియాలో బయటపడింది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా 27 దేశాల్లో ఈ వైరస్ కేసులు నమోదయ్యాయి. ఇప్పటిదాకా 2,605 మందికి మెర్స్–కోవ్ సోకగా వీరిలో 936 మంది మృతిచెందారు. ఈ వైరస్ ఒంటెల నుంచి వ్యాపిస్తుందని, మనుషుల నుంచి మనుషులకు సోకుతుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, ఇండియాలో మెర్స్–కోవ్ కేసులు నమోదు కాలేదు. ఈ వైరస్‌కు ఇప్పటికైతే టీకా అందుబాటులో లేదు.

లోక్‌సభకు ఒంటరి పోరు: జేడీ(ఎస్)



శివాజీనగర: కాంగ్రెస్‌కు కావాల్సి వచ్చినప్పుడు జేడీ(ఎస్) లౌకిక పార్టీగా కనిపిస్తుంది. అవసరం తీరాక మరోలా కనిపిస్తుంది'' అంటూ జేడీ(ఎస్) అధినేత హెచ్‌డీ దేవేగౌడ మంగళవారం మండిపడ్డారు. ''కాంగ్రెస్ వాళ్లు నిజాయితీపరులు, నీతిమంతులు. అవసరమైనప్పుడు మాత్రం ఎవరితోనైనా పొత్తు పెట్టుకుంటారు'' అంటూ ఎద్దేవా చేశారు. ఇటీవల బెంగళూరులో జరిగిన విపక్షాల భేటీకి తమను పిలవలేదని చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్ని సీట్లు గెలుస్తామో తెలియని, కానీ ఒంటరిగానే బరిలో దిగుతామని చెప్పారు.

దశదిశ లేని కూటమి

దేశం పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించలేరు

- దేశాన్ని విభజించడమే విపక్షాల లక్ష్యం
- నా మూడో టర్మ్‌లో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్
- బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో మోదీ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష కూటమి 'ఇండియా'పై ప్రధాని నరేంద్ర మోదీ విరుచుకుపడ్డారు. ఇలాంటి దశాదిశా లేని కూటమిని దేశంలో గతంలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. ఈస్ట్ ఇండియా కంపెనీ, ఇండియన్ ముజాహిదీన్‌లో కూడా ఇండియా అనే పేరుందని, దేశం పేరును వాడుకుని ప్రజలను తప్పుదోవ పట్టించలేరని స్పష్టం చేశారు. మంగళవారం బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీ మాట్లాడారు. పార్లమెంట్ వర్షకాల సమావేశాలకు ప్రతిపక్షాలు అడ్డు తగులుతుండడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో విపక్షాలు బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నాయని తప్పుపట్టారు. నిరాశలో మునిగిపోయిన విపక్ష ఎంపీలు దశాదిశా లేకుండా వ్యవహరిస్తున్నారని ఆక్షేపించారు. వారి ప్రవర్తనను బట్టి చూస్తే దీర్ఘకాలం విపక్షంలోనే ఉండాలని నిర్ణయించుకున్నట్లు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. ప్రపంచవ్యాప్తంగా భారతదేశ కీర్తి ప్రతిష్టలు పెరుగుతున్నాయి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. తాను అధికారంలోకి వచ్చే సమయానికి మన దేశం ప్రపంచంలో పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేదని, "శాదిశఇప్పుడు ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిందని ఉద్ఘాటించారు. తన మూడో టర్మ్‌లో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తద్వారా మరోసారి కేంద్రంలో మోదీ ప్రభుత్వమే రాబోతోందని పరోక్షంగా తేల్చిచెప్పారు. దేశ అభివృద్ధికి సహకరించాలని, చిత్తశుద్ధితో పని చేయాలని బీజేపీ నేతలకు మోదీ పిలుపునిచ్చారు.



మంగళవారం బీజేపీ పార్లమెంటరీ పార్టీ భేటీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తదితరులతో ప్రధాని మోదీ

అవినీతిపరులంతా ఒక్కటయ్యారు

ప్రతిపక్షాలు ఇండియా పేరిట కూటమిగా ఏర్పడ్డాయని, నిషేధిత ఉగ్రవాద, తీవ్రవాద సంస్థలు సైతం దేశం పేరును వాడుకుంటున్నాయని మోదీ వ్యాఖ్యానించారు. అవినీతి పార్టీలు, అవినీతి నాయకులు కూటమి పేరిట ఒక్కటయ్యారని విమర్శించారు. దేశాన్ని పాలించి, విభజించాలని ప్రతిపక్షాలు కోరుకుంటున్నాయని మండిపడ్డారు. అందుకే ఇండియా, ఇండియన్ అనే పేర్లతో జనాన్ని మభ్యపెట్టాలని చూస్తున్నాయని దుయ్యబట్టారు. వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీల వారసత్వమే ఎన్డీయే అని చెప్పారు.

అవును మేము 'ఇండియా'నే..

మణిపూర్‌లో ఇండియా భావనను పునర్నిర్మిస్తాం: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: ప్రతిపక్ష కూటమి 'ఇండియా'పై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన విమర్శలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ తిప్పికొట్టారు. ''మీ ఇష్టం వచ్చినట్లు మమ్మల్ని పిలుచుకోండి. కానీ, మేము ముమ్మాటికీ ఇండియానే. మణిపూర్‌లో ఇండియా భావనను కచ్చితంగా పునర్నిర్మిస్తాం. మణిపూర్ కోలుకొనేందుకు సహకరిస్తాం. రాష్ట్రంలో ప్రతి మహిళ, ప్రతి చిన్నారి కన్నీటిని తుడిచేస్తాం. ప్రజల కోసం ప్రేమను, శాంతిని తిరిగి తీసుకొస్తాం'' అని రాహుల్ మంగళవారం ట్వీట్ చేశారు.

ఎప్పటికీ భరతమాత బిడ్డలమే: ఖర్గే

తాము మణిపూర్ హింసపై పార్లమెంట్‌లో మాట్లాడుతుంటే ప్రధాని మోదీ మాత్రం ఈస్ట్ ఇండియా కంపెనీ గురించి పార్లమెంట్ బయట మాట్లాడుతున్నారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఇండియా కూటమిని ఈస్ట్ ఇండియా కంపెనీతో పోల్చడం ఏమిటని ప్రశ్నించారు. తాము ఎప్పటికీ భరతమాత బిడ్డలమేనని అన్నారు. ఈ మేరకు ఖర్గే ట్వీట్ చేశారు. బీజేపీ రాజకీయ పూర్వీకులు బ్రిటిష్ పాలకులకు బానిసలుగా పని చేశారని ధ్వజమెత్తారు. వాక్చాతుర్యంతో ప్రజల దృష్టిని మళ్లించడం ఆపాలని ప్రధాని మోదీకి హితవు పలికారు. మణిపూర్ హింసపై ఇకనైనా స్పందించాలని సూచించారు. 'ఇండియా' గురించి నోటికొచ్చినట్లు మాట్లాడొద్దని, ప్రధానమంత్రి పదవికి ఉన్న గౌరవాన్ని దిగజార్చవద్దని చెప్పారు. పేరులో ఏమీ లేకపోతే ప్రతిపక్ష కూటమి పేరును చూసి మోదీ ఎందుకు భయపడుతున్నారని ఖర్గే ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక వీడియో విడుదల చేశారు. పాట్నా, బెంగళూరులో ఇండియా కూటమి సమావేశాలు విజయవంతం కావడాన్ని మోదీ జీర్ణించుకోలేకపోతున్నారని చెప్పారు.



మంగళవారం దివంగత కాంగ్రెస్ నేత ఊమెన్ చాందీ సంస్మరణ సభలో ఆయన కుమారునితో రాహుల్ గాంధీ

ఎన్డీయే.. జాతీయ అపకీర్తి కూటమి

26 పార్టీలతో కూడిన విపక్ష ఇండియా కూటమిని చూసి ప్రధాని మోదీ బెంబేలెత్తిపోతున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఎద్దేవా చేశారు. ఇప్పటికే మృతప్రాయంగా మారిన ఎన్డీయేకు ప్రాణం పోసేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారని, విపక్షాలపై దూషణల ద్వారా ఎన్డీయేకు కొత్త అర్థం చెబుతున్నారని వెల్లడించారు. ఎన్డీయే అంటే జాతీయ ప్రజాస్వామ్య కూటమి కాదని, అది జాతీయ అపకీర్తి కూటమి అని ట్విట్టర్‌లో తేల్చిచెప్పారు. విపక్ష కూటమిపై ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలను తృణమూల్ కాంగ్రెస్, రాష్ట్రీయ జనతాదళ్, ఆమ్ ఆద్మీ పార్టీ, శివసేన(ఉద్ధవ్ ఠాక్రే) తదితర పార్టీల నేతలు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా కూడా తప్పుపట్టారు.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

బుధవారం : 26 : జూలై : 2023

గృహలక్ష్మి అర్జీ దాఖలుకు రద్దీ



తుమకూరు: జిల్లాలోని శిర పట్టణం నగరసభ పరిధిలో మహిళలు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేయడానికి తరలిరావడంతో కేంద్రాల వద్ద రద్దీ ఏర్పడింది. కర్ణాటక వన్ రెండు కేంద్రాలతో పాటు నగరసభ కార్యాలయంలో మరో కేంద్రం, 31వ వార్డులో ఒక కేంద్రం ఏర్పాటైంది. అన్నిచోట్లా మహిళలు పెద్దసంఖ్యలో తరలిరావడంతో అరుపులు, తోపులాట సాధారణమైంది. ఉదయం నంచి సాయంత్రం వరకు క్యూలో ఉన్నా పని కావడం లేదని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి వార్డులోను ఒక కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

న్యూస్‌రీల్

కూతురిపై లైంగికదాడి

- కామాంధునికి జీవిత ఖైదు

మైసూరు: కన్న కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడి ఆమెను గర్భవతిని చేసిన తండ్రికి జీవితఖైదు విధిస్తూ జిల్లా కోర్టు తీర్పు చెప్పింది. వివరాలు... చామరాజనగర జిల్లాకు చెందిన 48 ఏళ్ల వ్యక్తి తన సొంత కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఫలితంగా మైనర్ బాలిక గర్భవతి అయ్యింది. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. విచారణ చేసి కోర్టుకు చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో ఒకటవ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి నిశారాణి ముద్దాయికి జీవితఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు. బాలికకు న్యాయ సేవా ప్రాధికార నుంచి రూ. 6 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించారు.

మైసూర్ పాక్ సంబరం



మైసూరు: మైసూరు మహారాజుల కాలంలో పుట్టిన మైసూరు పాక్ మిఠాయికి ప్రపంచస్థాయిలో పేరు రావడంతో నగరవాసుల్లో ఆనందం వెల్లివిరిసింది. స్నేహ బళగ సంస్థ సభ్యులు మంగళవారం చాముండి కొండ పైన అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు మైసూర్ పాక్‌లను పంపిణీ చేశారు. మన మిఠాయి ప్రపంచ స్వీట్లలో 14వ స్థానం దక్కించుకోవడం గర్వకారణమని వారు అన్నారు.

పరీక్ష ఫీజులతో పరారీ

- మహిళా లెక్చరర్ నిర్వాకం

మైసూరు: విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజులను వసూలు చేసుకుని మహిళా లెక్చరర్ పరారైన ఘటన మైసూరు నగరంలోని వరుణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు... నగరంలోని బన్నూరు రోడ్డులో ఓ ప్రైవేట్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో లెక్చరర్‌గా పనిచేస్తున్న హర్షిత పరీక్ష ఫీజుల పేరుతో దాదాపు 200 మంది విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా డబ్బులు వసూలు చేసుకుని పరారైంది. ఫీజు చెల్లిస్తేనే పరీక్షలకు అనుమతిస్తామని సదరు కళాశాల యాజమాన్యం చెప్పడంతో విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. దీంతో బాధిత విద్యార్థులు పోలీసులను ఆశ్రయించారు.

కాంగ్రెస్‌లో అసంతృప్తి లేదు: డీకే

శివాజీనగర: ఏ ఎమ్మెల్యే కూడా మంత్రులకు వ్యతిరేకంగా లేఖ రాయలేదని, వారిలో ఎలాంటి అసంతృప్తి కూడా లేదని, అన్నీ ఊహాగానాలేనని డీసీఎం డీకే శివకుమార్ అన్నారు.

నగరంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్‌లో ఎలాంటి అసంతృప్తీ లేదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు వారి వారి నియోజకవర్గాల్లో పని చేస్తున్నారు. ప్రస్తుతం బదిలీల సమయం ముగిసిపోయింది. మిగిలి ఉంటే దానిని ముఖ్యమంత్రి చూసుకొంటారని చెప్పారు. గురువారం సీఎల్పీ సమావేశం జరుగుతుంది, 5 గ్యారంటీల అమలు ముఖ్యం. కొందరు ఎమ్మెల్యే నియోజకవర్గాలకు అధిక నిధులు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. అయితే ఒక ఏడాదిపాటు ఓపికతో ఉండాలని చెప్పామన్నారు. సీఎల్పీ భేటీలో అన్నీ చర్చిస్తామన్నారు.

అభివృద్ధి శూన్యం: బొమ్మై

యశవంతపుర: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అరాచకాలు తప్ప అభివృద్ధి సాధన అంటూ ఏమీ లేదని మాజీ సీఎం బసవరాజ బొమ్మై ఆరోపించారు. మంగళవారం ఆయన ఆర్టీ నగరలో నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన మొదటి రోజు నుంచే అన్ని తప్పిదాలేనని, ముఖ్యమంత్రి ఎంపిక కూడా రహస్య ఓటింగ్ చేశారని అన్నారు. డీకే శివకుమార్ చేస్తున్న సింగపూర్ వ్యాఖ్యలు ఇప్పుడు అవసరం లేదు. కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉండగా ఉత్తమ పాలనను వదిలేసి సింగపూర్ రాజకీయాలను ప్రస్తావన చేయటం ఏమిటని ప్రశ్నించారు. హైకోర్టు జడ్జీలకు బెదిరింపు కాల్స్ వచ్చాయంటే సామాన్య ప్రజల పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు.

హ్యాకర్ అరెస్ట్



అరవనీత్ స్వామి

బనశంకరి: ప్రైవేటు కంపెనీ సాఫ్ట్‌వేర్‌ను హ్యాక్ చేసి పైరసీ చేసి విక్రయించిన వ్యక్తిని మంగళవారం దక్షిణ విభాగ సీఈఎన్ పోలీసులు అరెస్ట్ చేశారు. తమిళనాడు తిరుచ్చికి చెందిన ఇంజినీరింగ్ పట్టభద్రుడు అరవనీత్ స్వామి పట్టుబడిన వ్యక్తి. బనశంకరి రెండోస్టేజ్‌లో ఉండే ఒక కంపెనీ స్టాక్ మార్కెటింగ్‌కు సంబంధించి సాఫ్ట్‌వేర్‌ను ఇతడే అభివృద్ధి చేసి విక్రయించాడు. అయితే కంపెనీకి విక్రయించిన సాఫ్ట్‌వేర్‌ను హ్యాక్ చేసి దాన్ని పైరసీ చేసి మరో 80 మందికి అక్రమంగా విక్రయించాడు. దీనిపై కంపెనీ చైర్మన్ దక్షిణ విభాగ సీఈఎన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తిరుచ్చిలో ఉన్న అరవనీత్ స్వామిని అరెస్ట్ చేశారు.



ఉత్తర కన్నడ జిల్లా జోయిడాలో కూలిన సర్కారు బడి



చిక్కమగళూరు వద్ద బాబా బుడన్‌గిరి రోడ్డులో జలపాతం వద్ద సందడి



బెంగళూరు కేఆర్ మార్కెట్లో జల్లుల వర్షంలోనే వ్యాపారాలు

కుండపోత.. కకావికలం

- ఉత్తర, దక్షిణ జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తం
- ఇళ్లు కూలి ముగ్గురు మృతి
- మరో 2 రోజులు వర్షసూచన

బనశంకరి: ఉత్తర కర్ణాటక, మలెనాడు, కళ్యాణ కర్ణాటక ప్రాంతాల్లో కుంభవృష్టి వర్షాలు మూడవరోజు మంగళవారం కూడా కొనసాగాయి. కావేరి, ఉప నదులు పరవళ్లు తొక్కుతుండగా వాగులు వంకలు పొంగిపొర్లడంతో రోడ్లు, వంతెనలు ముంపునకు గురయ్యాయి. సోమవారం రాత్రంతా కురిసిన కుండపోతకు పలుచోట్ల ఇళ్లు కూలిపోయాయి. ఉత్తర కర్ణాటక జిల్లాల్లో ఇళ్లు కూలి ముగ్గురు చనిపోయారు. నిలువ నీడ లేక, జల దిగ్బంధంతో బాధిత ప్రజలు అవస్థలకు గురయ్యారు.

ఉత్తర కన్నడలో వర్షాలు, గాలులు

ఉత్తర కన్నడ జిల్లాలో వర్షం ఉధృతి కొనసాగుతుండగా జిల్లావ్యాప్తంగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. వర్షంతో పాటు 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయవచ్చని, జాగ్రత్తగా ఉండాలని అధికారులు ప్రకటించారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లరాదని తెలిపారు. కాళీ నదిలో ఇన్‌ఫ్లో పెరగగా కద్రా జలాశయం నిండిపోయింది, గేట్లు ఎత్తి 61 వేల క్యూసెక్కులు నీటిని వదిలారు. హళియాళ తాలూకాలో ఇంటిపై చెట్టుకూలిపోవడంతో ఇళ్లు దెబ్బతింది. తాలూకా పరిధిలో 7 ఇంటి గోడలు కూలిపోయాయి. జోయిడా తాలూకా చాపోలి ప్రాథమిక పాఠశాల గోడ కూలింది.



ఉడుపి వద్ద ఇల్లు ధ్వంసం కాగా, పరిశీలిస్తున్న అధికారులు

ప్రమాదకరంగా నదులు

దక్షిణ కన్నడ, ఉడుపి, కొడగు జల్లాల్లో కుండపోతగా వర్షం కురుస్తుండటంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. మంగళూరు యూనివర్శిటీలో పరీక్షలను వాయిదా వేశారు.

శివమొగ్గ, చిక్కమగళూరు జిల్లాల్లో వర్షాలు భారీగా కురుస్తుండటంతో కొప్ప తాలూకా బసరికట్టి, మెట్రిక్ బాలుర హాస్టల్ ప్రహరీ కూలిపోయింది. జిల్లాలో అనేక ప్రాంతాల్లో నదులు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్నాయి. కళశ తాలూకా హెబ్బాళ వంతెన వద్ద విద్యుత్‌వైర్లు తెగిపోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లో కరెంటు కట్ అయ్యింది. ఇక జలపాతాలు పరవళ్లు తొక్కడంతో వర్షంలోనూ జనం చూసేందుకు వెళ్తున్నారు.

శివమొగ్గలో

శివమొగ్గలో భారీ వర్షాలు కొనసాగుతుండగా తీర్థహళ్లి హొసనగర తాలూకా పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ మూడు తాలూకాల్లో వర్షం కొనసాగుతోంది. వర్షం తగ్గుముఖం పడితే పాఠశాలలు తెరవడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. శిరాళకొప్ప పట్టణానికి తాగునీరు అందించే అంజనాపుర జలాశయం భర్తీ కావడంతో ప్రజల్లో సంతోషం నెలకొంది.

రాజధానిలో జల్లువానలు

బెంగళూరులో గత రెండురోజులుగా వర్షం కురుస్తుండగా మంగళవారం కూడా జల్లువానలు పడ్డాయి. రానున్న 48 గంటల్లో దక్షిణ ఒళనాడులోని చిక్కమగళూరు, శివమొగ్గ, కొడగు, ఉత్తర ఒళనాడులోని బెళగావి, హావేరి, కల్బుర్గి జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది.



ధార్వాడ తాలూకా లక్మాపూర్‌లో కూలిన ఓ పాత మిద్దె

బెళగావి, విజయపుర జిల్లాల్లో ఇద్దరు మృతి

- బెళగావి జిల్లాలో భారీ వర్షాలతో ఘటప్రభ నది పొంగిపొర్లుతోంది. గోకాక్- శింగళపుర మధ్య వంతెన జలమయమైంది. సోమవారం హావేరి తాలూకాలోని మాళపుర గ్రామంలో గోడకూలి మూడేళ్ల భాగ్య అనే బాలిక గాయపడగా ఆసుపత్రికి తరలించగా మంగళవారం మృతిచెందింది.
- విజయపుర జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ఇంటిపై కప్పుకూలిన ప్రమాదంలో వృద్ధురాలు శివమ్మ, నాలుగు పశువులు మృతిచెందాయి. గత 24 గంటల్లో విజయపుర జిల్లాలో 42 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

దావణగెరెలో.. ఇల్లు కూలి బాలిక మృతి

యశవంతపుర: వర్షాలకు ఇల్లు కూలి దావణగెరె జిల్లా హరిహర తాలూకా కుంబళూరులో స్ఫూర్తి (4) అనే బాలిక చనిపోయింది. తల్లిదండ్రులు కెంచప్ప, లక్ష్మీలతో కలిసి సోమవారం రాత్రి నిద్రిస్తుండగా ఒక్కసారిగా గోడ కూలింది. తీవ్ర గాయాలతో స్ఫూర్తి అక్కడే మృత్యువాత పడింది. కెంచప్ప దంపతులు ఆర్తనాదాలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి ఇద్దరిని రక్షించారు.

హస్తరేఖలో అసంతృప్త లేఖ

- సీఎం సిద్దరామయ్యకు ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ ఫిర్యాదు
- మంత్రులు తమను పట్టించుకోవడం లేదని విచారం
- అందులో 20 మంది శాసనసభ్యుల సంతకాలు!
- గురువారం హడావుడిగా సీఎల్పీ భేటీ



అధికారం దక్కిందన్న సంతోషం ఎంతకాలం నిలుస్తుంది?

సాక్షి, బెంగళూరు: కొత్తగా గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీలో లుకలుకలు మొదలైనట్లు తెలుస్తోంది. పలువురు మంత్రులు పార్టీ ఎమ్మెల్యేలకు అసలు విలువ నివ్వడం లేదని ఆరోపణలున్నాయి. నియోజకవర్గాల్లో తమను బేఖాతరు చేస్తున్నారని కొందరు సీనియర్ ఎమ్మెల్యేలు సీఎం సిద్దరామయ్యకు లేఖ రాశారు. దీంతో గురువారం అత్యవసరంగా సీఎల్పీ భేటీని ఏర్పాటు చేయడం వెనుక ఇదే కారణమని తెలుస్తోంది.

ఇదీ లేఖ సంగతి

తాజా కలకలానికి కారణం.. ముఖ్యమంత్రికి సీనియర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ లేఖ రాయడం. ఎమ్మెల్యేల అభిప్రాయాలను మంత్రులు పట్టించుకోవడం లేదని అందులో ఆరోపించారు. ఇందుకు విధాన పరిషత్ స్పీకర్ బసవరాజు హొరట్టి సహా 20 మంది సీనియర్ ఎమ్మెల్యేలు సంతకం చేసి వంత పాడారు. తక్షణం సీఎల్పీ భేటీని ఏర్పాటుచేయాలని అందులో కోరారు. మరోవైపు బీజేపీ, సంఘ్ పరివార్ నాయకులు కాంగ్రెస్ పార్టీ అసంతృప్త ఎమ్మెల్యేలను లాక్కొనేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. దీంతో కాంగ్రెస్ పార్టీకి ఇదొక మరో తలనొప్పిగా మారింది.

చిన్న చిన్న అసంతృప్తులుంటాయి: సీఎం

హుబ్లీ: ప్రభుత్వం ఏర్పాటై కేవలం రెండు నెలలే అయింది. చిన్నచితకా అసంతృప్తులు ఉంటాయి. అయితే ఫిర్యాదు చేసే స్థాయిలో అసంతృప్తి కాంగ్రెస్‌లో లేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. హావేరిలో కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన హుబ్లీ విమానాశ్రయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మంత్రులు తమకు సానుకూలంగా స్పందించడం లేదని 30 మంది ఎమ్మెల్యేలు లేఖ రాయడం ద్వారా తమ ఆవేదనను వెల్లడించిన సంగతి తనకు తెలియదన్నారు. మంత్రులకు వ్యతిరేకంగా ఎమ్మెల్యేలు ఇచ్చిన ఫిర్యాదు తన దృష్టికి రాలేదన్నారు. ఎమ్మెల్యేలు సీఎల్పీ భేటీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. గురువారం భేటీలో అన్ని విషయాలపై చర్చ జరుగుతుందన్నారు.

అదో నకిలీ లేఖ: పాటిల్

బనశంకరి: ముఖ్యమంత్రికి లేఖ రాసిన ఎమ్మెల్యే బీఆర్.పాటిల్ అంతలోనే మాట మార్చారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పాత లెటర్‌హెడ్‌తో ఎవరోరాసిన లేఖ అని అన్నారు. అయితే పార్టీలో ఉన్న అసంతృప్తిని చర్చించడానికి సీఎల్పీ భేటీ ఏర్పాటు చేయాలనడం వాస్తవమేనని మరో ఎమ్మెల్యే బసవరాజ రాయరెడ్డి విజయనగరలో తెలిపారు. ప్రభుత్వం, పార్టీకి వ్యతిరేకంగా లేఖ రాయలేదన్నారు.

బ్యాగు బెల్టుల్లో బంగారం చైన్లు

- 2.6 కేజీల పసిడి స్వాధీనం



పట్టుబడ్డ బంగారు గొలుసులు

దొడ్డబళ్లాపురం: బంగారం స్మగ్లర్లు కొత్త కొత్త మార్గాల్లో పసిడి రవాణాకు యత్నిస్తున్నా తనిఖీల్లో పట్టుబడుతున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా బ్యాగుల బెల్టుల్లో కేజీల కొద్దీ బంగారం చైన్లను దాచి తీసుకొచ్చారు కానీ గుట్టు బయటపడింది. ఇలా బెంగళూరు కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో మంగళవారం నాడు అక్రమంగా తరలిస్తున్న రూ.1.59 కోట్ల విలువైన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. భారతదేశానికి చెందిన ఇద్దరు ప్రయాణికులు సింగపూర్ నుంచి బెంగళూరుకు వచ్చారు. వారిపై అనుమానం వచ్చిన కస్టమ్స్ అధికారులు తనిఖీ చేయగా 2 కేజీల 610 గ్రాముల బంగారం దొరికింది. బ్యాగ్‌కు ఉన్న బెల్ట్‌లో ఈ బంగారం దాచి తరలిస్తున్నట్టు కనుగొన్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.



ఆయుధాలు ఇచ్చింది ఎవరు?

- అనుమానిత ఉగ్రవాదుల విచారణ
- టీ.బేగూరులో తుపాకుల అప్పగింత?



బనశంకరి: బెంగళూరు నగరంలో ఇటీవల అరెస్టయిన ఐదుమంది అనుమానిత ఉగ్రవాదుల విచారణలో ముఖ్య సమాచారం వెలుగు చూస్తోంది. వారి వద్ద లభ్యమైన పిస్టల్స్, రివాల్వర్స్, తూటాలను సరఫరా చేసింది ఎవరన్నది సీసీబీ పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. పరారీలో ఉన్న మాస్టర్‌మైండ్ అహ్మద్ జునైద్ సూచన మేరకు అనుమానిత ఉగ్రవాదులు ఫైజల్ రబ్బాని, ముదాసీర్‌లు ఆయుధాల సేకరణలో ఉండేవారు. నెలమంగల సమీపంలోని టీ.బేగూరుకు వెళ్లగా అక్కడ ఓ వ్యక్తి వీరికి ఆయుధాలున్న బ్యాగును ఇచ్చాడు. ఆ వ్యక్తి కదలికలు హెబ్బాల సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రి సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. అతను గతంలో పోక్సో కేసులో జైలు శిక్ష అనుభవించినట్లు తెలిసింది.

నేటితో కస్టడీ ముగింపు

ఆయుధాల సరఫరాపై యశవంతపుర రైల్వేస్టేషన్ చుట్టుపక్కల నెలమంగల టీ.బేగూరులో సీసీబీ పోలీసులు విచారణ జరిపారు. అనుమానిత ఉగ్రవాదులు పోలీస్‌కస్టడీ బుధవారంతో ముగుస్తుంది. వారిని కోర్టులో హాజరుపరిచి మరిన్ని రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరనున్నట్లు తెలిసింది.

అజర్‌బైజాన్‌లో జునైద్

మాస్టర్ మైండ్ జునైద్ 2017లో ఆర్‌టీ.నగరలో జరిగిన హత్య కేసులో పాల్గొన్నాడు. తరువాత విడుదలై ఎర్రచందనం రవాణాకు పాల్పడ్డాడు. పోలీసుల కళ్లుగప్పి 2021లో దుబాయ్‌కి వెళ్లిపోయాడు. పోలీసులు నిర్లక్ష్యం వహించి అతని పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోకపోవడంతో పరారీ సాధ్యమైంది. అతడు దుబాయ్ నుంచి అజర్‌బైజాన్ దేశానికి వెళ్లినట్లు సీసీబీ పోలీసులకు సమాచారం అందింది. ప్రస్తుతం ఇంటర్‌పోల్ సహాయంతో జునైద్ ఆచూకీని కనిపెట్టి పట్టుకురావడానికి సీసీబీ ప్రయత్నాలు చేస్తున్నారు. బెంగళూరులో పలు విధ్వంసక చర్యలకు ప్లాన్ రూపొందించింది ఇతడేనని ఇంటర్‌పోల్‌కు నివేదిక ఇచ్చారు.

సింగపూర్ కుట్ర గురించి తెలియదు: సీఎం

శివాజీనగర: తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు సింగపూర్‌లో కుట్రలు జరుగుతున్నాయన్నది తనకు తెలియదని, అలా చెప్పిన డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌నే అడగాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. మంగళవారం హావేరిలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరువు వస్తుందని బీజేపీవారు ట్రోల్ చేస్తున్నారు, ఇప్పుడు వర్షం కురవడం లేదా. బీజేపీ సర్కారు ఉండగా వరదలు వచ్చి ఒక లక్ష ఇళ్లు కూలిపోయాయి. వరదలు, కరువు రావడం సహజమేనని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో జేడీఎస్, బీజేపీ కలిసినా తమకేం భయలేదు, మేం 15-20 సీట్లలో గెలుస్తామని అన్నారు.

ముడుపులు తీసుకుంటే చర్యలు

గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల నుంచి ఉద్యోగులు సొమ్ము పుచ్చుకొన్నట్లు ఫిర్యాదు, సాక్ష్యం ఉంటే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని సీఎం హెచ్చరించారు.

ఎక్స్‌ప్రెస్ వేలో తనిఖీలు



అధికారులతో మాట్లాడుతున్న ఏడీజీపీ

దొడ్డబళ్లాపురం: బెంగళూరు-మైసూరు ఎక్స్‌ప్రెస్ వేలో వేగ నియంత్రణ, ప్రమాదాల నివారణకు తీసుకున్న చర్యలను ఏడీజీపీ అలోక్‌కుమార్ పరిశీలించారు. ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాదాలు అధికంగా జరుగుతుండడంతో నెల రోజుల క్రితం ఇక్కడకు వచ్చి పలు సూచనలు ఇచ్చిన ఏడీజీపీ మంగళవారం మళ్లీ ఎక్స్‌ప్రెస్‌వేను పరిశీలించారు. నెల రోజుల నుండి ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గడంతో స్థానిక పోలీసులను ఏడీజీపీ అభినందించారు. ఈ సందర్భంగా రామనగర జిల్లా పోలీస్ అధికారులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, ఆర్టీఓ అధికారులు, బీజేపీ రవికాంతేగౌడ, రామనగర ఎస్పీ కార్తీక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బయట పడుతున్న నిషా మోసాలు



నిషా నరసప్ప (ఫైల్)

యశవంతపుర: కన్నడ చిత్ర రంగానికి చెందిన మాస్టర్ ఆనంద్ కుమార్తె వంశికా పేరుతో మోసాలకు పాల్పడిన నిషా నరసప్ప దాదాపు రూ. 2 కోట్ల వరకు వ్యవహారాలు నడిపినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఆమె బ్యాంక్ అకౌంట్లను పోలీసులు పరిశీలించగా రూ. 8 వేలు మాత్రమే ఉన్నాయి. విలాసవంతమైన జీవనానికి అలవాటు పడిన నిషా చిన్నారులకు రియాల్టీ షోలో అవకాశం కల్పిస్తానని నమ్మించి తల్లిదండ్రుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుంది. ఆ డబ్బులు బార్లు, పబ్బులకు ఖర్చు చేసినట్లు పోలీసుల విచారణ తేలింది. అంతేకాకుండా అధిక వడ్డీ ఇస్తానని చెప్పి పలువురి వద్ద నుంచి లక్షల్లో నగదు తీసుకున్నట్లు, ఈ విషయంపై కూడా కేసు నమోదు చేసినట్లు డీసీపీ శ్రీనివాసగౌడ తెలిపారు. ఇటీవల సదాశివనగర పోలీసులు కేసు నమోదు చేసుకున్న తరువాత ఆమెపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడామె జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

క్లుప్తంగా

గ్యారంటీల కోసం జనం పాట్లు



కర్ణాటక-1 కేంద్రం వద్ద గుమిగూడిన జనం

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీ(ఉచితాల)ల కోసం నగరంలోని కర్ణాటక-1 కేంద్రం వద్దకు మంగళవారం జనం భారీగా తరలి వచ్చారు. అయితే కేంద్రం వద్ద ఆధార్ కార్డును, రేషన్ కార్డుకు లింక్ చేయాలని అధికారులు ఆదేశించడంతో ప్రజలు వానను సైతం లెక్క చేయకుండా గొడుగులు పట్టుకుని ఆధార్ లింకింగ్ కోసం బారులు తీరారు. ఒక వైపు వర్షం పడుతుండడంతో ప్రజలు తలదాచుకోడానికి రెవిన్యూ శాఖాధికారులు ఎలాంటి ఆశ్రయం కల్పించకుండా, కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించక పోవడంపై ప్రజలు శాపనార్థాలు పెట్టారు.

వరుణుడి హోరు..కృష్ణమ్మ జోరు

రాయచూరు రూరల్: గత కొన్ని రోజులుగా మహారాష్ట్రలోని పడమటి కనుమల్లో విస్తారంగా కురుస్తున్న వానలతో కృష్ణమ్మ ఉరకలెత్తుతోంది. మహారాష్ట్రలోని కోయ్నా డ్యాం పూర్తిగా నిండడంతో పంచగంగా నది నుంచి కృష్ణా నదిలోకి 58 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. ఉప నదుల్లో కూడా వరద పోటెత్తడంతో ఆల్మట్టి డ్యాం శరవేగంగా నిండుతోంది. ఈ క్రమంలో ముందు జాగ్రత్తగా డ్యాం నుంచి కృష్ణా నదికి లక్షా 10 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. దీంతో ఉత్తర కర్ణాటకలోని బెళగావి, బాగల్‌కోట, విజయపుర, కళ్యాణ కర్ణాటకలోని రాయచూరు, యాదగిరి జిల్లాల్లో నదీ తీర ప్రాంతాల ప్రజలు ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారు.

మృతుల కుటుంబాలకు పరిహారం పంపిణీ



చెక్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే భరత్‌రెడ్డి

బళ్లారిటౌన్: జిల్లాలోని కారిగనూరు వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నగరానికి చెందిన గుగ్గరహట్టి ప్రాంత వాసులు ఉమేష్, ఆంధ్రాశ్ శ్యామ్ కుటుంబాలకు ప్రభుత్వం నుంచి మంజూరైన పరిహారం చెక్‌లను నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పాలికె మేయర్ త్రివేణి, ఉపమేయర్ జానకి, పాలికె కార్పొరేటర్లు జబ్బార్ సాబ్, రామాంజినేయలు, స్థానిక పార్టీ నేతలు సూరి, వన్నూరు స్వామి పాల్గొన్నారు.

రైతులకు సాగునీరివ్వండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

సిరుగుప్ప: తుంగభద్ర నీటిపారుదల సలహా సమితి(ఐసీసీ) సమావేశం ఏర్పరచి రైతాంగానికి సాగు నీరు అందించాలని ఎమ్మెల్యే బి.ఎం.నాగరాజును మాజీ ఎమ్మెల్యే ఎం.ఎస్.సోమలింగప్ప ఒత్తిడి చేశారు. ఆయన మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తాలూకాలో సరైన వర్షాలు కురువక పోవడంతో నదుల్లో నీరు లేక ఇప్పటికే ఖరీఫ్ సాగు నెల రోజులు వెనుక బడి ఇంకా వరి నాట్లు వేయలేక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. డ్యాం నిండిన వెంటనే ఆకస్మికంగా డ్యాం నుంచి నదికి నీరు వదిలి తీర ప్రాంత ప్రజలు ముంపు భీతికి గురికాక ముందే ఐసీసీ సమావేశం జరిపి తక్షణమే రైతుల పొలాలకు సాగునీరు, 45 తాగునీటి చెరువులకు నీరు అందించాలని ఆయన తెలిపారు. దమ్మూరు సోమప్ప, మేకలి సణ్ణవీరేశ, కుంటనాళ్ మల్లికార్జునస్వామి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం



పీర్లదేవుళ్లను ప్రతిష్ఠించిన దృశ్యం

కంప్లి: మొహర్రం సందర్భంగా పట్టణంలోని నడివి మసీదుతో పాటు అనేక ప్రాంతాల్లో పీర్ల దేవుళ్లను ప్రతిష్ఠించారు. ముస్లింలతో పాటు హిందువులు కూడా భక్తిశ్రద్ధలతో ఈ పండుగను నిర్వహిస్తారు. అనేక మంది వివిధ రీతిలో మొక్కుకున్న మొక్కులు తీరిన సందర్భంగా పీర్లదేవుళ్లకు సమర్పించడం ఆనవాయితీ. కొంత మంది తాము కోరుకున్న కోర్కెలు తీరిన సందర్భంగా పెద్ద పులి వేషాల ద్వారా కూడా తమ కానుకలను సమర్పించుకుంటారు.

విద్యుత్ స్తంభంపై మంటలు

గంగావతి: 27వ వార్డులో విద్యుత్ స్తంభంపై నిప్పంటుకొని మంటలు చెలరేగిన ఘటన సోమవారం సాయంత్రం జరిగింది. ఈ విషయాన్ని వెంటనే వార్డు ప్రముఖులు మల్లేశప్ప దేవరమని విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయగా వారు వెంటనే వచ్చి విద్యుత్ సరఫరాను తొలగించడంతో మంటలు నిలిచాయి. పైభాగంలో ఉన్న మీటర్ బోర్డులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

రైలు నిలయం..వసతులు ఘనం

- 127 ఏళ్ల చారిత్రక బళ్లారి రైల్వే స్టేషన్‌కు ఆధునిక హంగులు
- వృద్ధ, దివ్యాంగ ప్రయాణికుల కోసం లిఫ్ట్ సదుపాయం పూర్తి
- ఎస్కలేటర్ పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని డిమాండ్



రైల్వేస్టేషన్‌లో ఎస్కలేటర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రైల్వే క్రియా సమితి అధ్యక్షుడు, సభ్యులు

సాక్షి,బళ్లారి: స్వాతంత్య్ర పూర్వం బ్రిటిష్ హయాంలో 1896లో నిర్మించిన బళ్లారి రైల్వే స్టేషన్‌కు ఘనమైన చరిత్ర ఉంది. స్వాతంత్య్ర పోరాటంలో భాగంగా జాతిపిత మహాత్మాగాంధీజీ దేశ వ్యాప్తంగా పర్యటిస్తూ 1921లో బళ్లారి రైల్వే స్టేషన్‌కు వచ్చి ఇక్కడే 8 గంటల పాటు ఉండి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక కాంగ్రెస్ ప్రతినిధులతో సమావేశమై చర్చించారు. అలాంటి గొప్ప చరిత్ర కలిగిన రైల్వేస్టేషన్‌కు ఎట్టకేలకు ఆధునిక హంగులు సమకూరుతున్నాయి. దేశంలోని ప్రముఖ రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టులు, బస్టాండుల్లో నిర్మించినట్లుగా ఎస్కలేటర్లు, లిఫ్ట్‌ల నిర్మాణాలను ఇక్కడా చేపడుతున్నారు. ఇప్పటికే లిఫ్ట్ సదుపాయం ఏర్పాటు పనులు పూర్తి చేయడంతో ప్రయాణికులకు కొంత ఊరట కలిగింది. రైళ్ల రాకపోకల సమయంలో పెద్ద ఎత్తున ప్రయాణికులు ఒకేసారి రాకపోకలకు లిఫ్ట్‌లో వెళ్లేందుకు వీలుకానందున తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బళ్లారి రైల్వే స్టేషన్ నుంచి దేశంలోని హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా తదితర ప్రముఖ నగరాలతో పాటు షిర్డీ, తిరుపతి, శ్రీశైలం, ధర్మస్థళ తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాలకు రైళ్ల రాకపోకలు ఉన్నాయి. దీంతో జిల్లాతో పాటు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా ప్రయాణికులు ఇక్కడికి వచ్చి రైళ్లలో ప్రయాణిస్తుంటారు.

నత్తనడకన ఎస్కలేటర్ పనులు

ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికులతో కిటకిటలాడే ఈ రైల్వే స్టేషన్‌లో ఇటీవల దశలవారీగా సమస్యలను పరిష్కరించేందుకు రైల్వేశాఖ అధికారులు చొరవ తీసుకోవడంతో ప్రయాణికులకు మేలు చేకూరుతోంది. అయితే లిఫ్ట్ సదుపాయం మాత్రమే ప్రస్తుతానికి అందుబాటులో ఉండగా ఎస్కలేటర్ పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయి. ఎస్కలేటర్ పనులు పూర్తి కాకపోవడంతో ఒక ప్లాట్‌ఫాం నుంచి మరొక ప్లాట్‌ఫాంకు వెళ్లేందుకు వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లగేజీ తీసుకెళ్లాలంటే ప్రయాణికులు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నిత్యం పెద్ద సంఖ్యలో రైళ్లు తిరిగే ఈ రైల్వే స్టేషన్‌లో ఏడాది క్రితం లిఫ్ట్, ఎస్కలేటర్ పనులకు గాను దాదాపు రూ.3 కోట్లకు పైగా నిధులు వెచ్చించి పనులను చేపట్టారు. లిఫ్ట్ మాత్రమే అందుబాటులో ఉంచి ఎస్కలేటర్ పనులు త్వరితగతిన పూర్తి చేయకపోవడంతో ఇబ్బందులు మాత్రం తప్పడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత రైల్వే శాఖ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతానికి లిఫ్ట్ పనులను పూర్తి చేశామని, ఎస్కలేటర్ పనులను కూడా త్వరలో పూర్తి చేసి ప్రయాణికుల ఇబ్బందులను తొలగిస్తామని అన్నారు.

ఆగస్టు 1 నుంచి నందిని పాల ధర పెంపు

- లీటరుకు రూ.3 మేర పెరుగుదల
- కేఎంఎఫ్ అధ్యక్షుడు ఎల్.భీమానాయక్



మాట్లాడుతున్న కేఎంఎఫ్ అధ్యక్షుడు భీమానాయక్ తదితరులు

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో ఆగస్టు 1 నుంచి నందిని పాల ధరను లీటరుకు రూ.3 మేర పెంచుతున్నట్లు కేఎంఎఫ్ అధ్యక్షుడు ఎల్.భీమానాయక్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం నగరంలోని రాబవికొ జిల్లాల పాల సమాఖ్య కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల పాల ఉత్పత్తి రోజు రోజుకు తగ్గుముఖం పడుతోందన్నారు. రాష్ట్రంలో 12 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి తగ్గిపోయిందన్నారు. పాడి రైతులకు నానాటికీ ఆవులు, గేదెల పోషణకు పశుగ్రాసం దొరకడం కష్టతరం అవుతోందని, దీంతో రైతులు పాడిపరిశ్రమకు దూరం అవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు మరింత మేలు చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, సంబంధిత శాఖ మంత్రులతో బెంగళూరులోని కేఎంఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. రైతులతో పాటు వినియోగదారులకు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ధరలు పెంచామన్నారు.

పెంచిన పాల ప్యాకెట్ ధరలిలా

నందిని పాలు బ్లూ ప్యాకెట్ లీటరు ధర రూ.37 నుంచి రూ.40, శుభం లీటరు పాల ధర రూ.43 నుంచి రూ.46, శుభం గోల్డ్ ధర రూ.44 నుంచి రూ.47 అవుతుందని తెలిపారు. నందిని స్పెషల్ అర్ధలీటర్ ధర రూ.22 నుంచి రూ.24 అవుతుందన్నారు. నందిని పాల ధర ఈవిధంగా ప్రతి లీటరుకు రూ.3ల చొప్పున పెరుగుతుందన్నారు. నందిని పెరుగు ధర కూడా ప్రతి లీటరుకు రూ.3లు పెరుగుతుందన్నారు. పొరుగున కేరళ, తమిళనాడు, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల కంటే కర్ణాటకలో పాల ధర తక్కువగా ఉందని గుర్తు చేశారు. తిరుపతి వేంకటేశ్వర స్వామి వారి లడ్డూల తయారీకి గతంలో నందిని నెయ్యి సరఫరా చేసేవారమని, ఈ ఏడాది నుంచి నిలిపివేసినట్లు తెలిపారు. టీటీడీ వారు తక్కువ ధర కేటాయించడం వల్ల తాము టెండర్‌లో పాల్గొనలేదన్నారు. నందిని పాలు, నెయ్యి, పెరుగు నాణ్యతలో రాజీపడబోమన్నారు. ఈసందర్భంగా కేఎంఎఫ్ ఎండీ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

చేళ్లగుర్కి జీపీపై కాషాయ జెండా



చేళ్లగుర్కిలో విజేతలను అభినందిస్తున్న దృశ్యం

బళ్లారిఅర్బన్: తాలూకాలోని చేళ్లగుర్కి జీపీకి మంగళవారం జరిగిన ఎన్నికల్లో ఆ పంచాయతీ సభ్యులు 16 మందికి గాను 12 మంది సభ్యులు బీజేపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేయగా యాళ్పికి చెందిన ఓబుళేష్ గెలుపొంది అధ్యక్ష స్థానం దక్కించుకున్నారు. అలాగే 11 మంది సభ్యులు ఓటు వేయగా బీజేపీ అభ్యర్థిని లోకేశ్వరి ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎస్పీ బోవి తెలిపారు.

మోకా జీపీలో ఎన్నికలు ఏకగ్రీవం

తాలూకాలోని మోకా జీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు పీడీఓ కాంతరాజ్ తెలిపారు. మంగళవారం జీపీ కార్యాలయంలో ఎన్నికల అధికారి 30 మంది జీపీ సభ్యుల అభిప్రాయం మేరకు అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షులుగా హిరేహాళ ఫక్కీరమ్మ సన్న వెంకటేష్, ఉపాధ్యక్షురాలిగా టీ.నాగవేణి నాగరాజ్‌లను ఎన్నుకోగా సభ్యులతో పాటు గ్రామస్తులు వారిని అభినందించారు.

బీడీ హళ్లిలో...

తాలూకాలోని బైరదేవనహళ్లి(బీడీ హళ్లి) జీపీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్షురాలిగా హొన్నూరమ్మ ముద్దప్ప, ఉపాధ్యక్షురాలిగా వెంకటేశ్వరమ్మ లక్ష్మీరెడ్డిలను 19 మంది సభ్యులు ఐకమత్యంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, టీపీ ఈఓ బీ.శ్రీధర్ తెలిపారు. ఈసందర్భంగా గ్రామస్తులు అధ్యక్ష, ఉపాధ్యక్ష, సభ్యులందరినీ అభినందించారు. పీడీఓ వీరేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మెట్రి జీపీ అధ్యక్షురాలుగా హొన్నూరమ్మ

కంప్లి: మెట్రి జీపీకి రెండో విడత అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఎన్నికల అధికారి శ్రీశైల ఆధ్వర్యంలో ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షురాలుగా పీ.హొన్నూరమ్మ, ఉపాధ్యక్షునిగా లోకేష్ ఎంపికైనట్లు అధికారికంగా ప్రకటించారు. అనంతరం పంచాయతీ సభ్యులు నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను సన్మానించారు. ఈ సందర్భంగా కార్యదర్శి హులుగప్ప, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

రైల్వే వంతెనకు నిధులివ్వరూ

- రైల్వే మంత్రికి కొప్పళ ఎంపీ వినతి



రైల్వే మంత్రికి వినతిపత్రాన్ని ఇస్తున్న ఎంపీ సంగణ్ణ

గంగావతి: కొప్పళ నగరంలో కుష్టిగి వెళ్లే రహదారిలో 66వ రైల్వే వంతెన నిర్మాణానికి రూ.11 కోట్ల నిధుల కోసం రైల్వే శాఖ మంత్రికి కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొప్పళ నగరం నుంచి బయటకు వెళ్లే రహదారులకు నాలుగు ప్రాంతాల్లో గతంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.13.50 కోట్లు, కేంద్రం అందించిన రూ.10.50 కోట్ల నిధులు కలిసి రూ.24 కోట్ల నిధులతో వంతెనల పనులను ప్రారంభించామని తెలిపారు. అయితే ఒక వంతెన నక్ష(ప్లాన్) మార్పడంతో వంతెన పనులు పూర్తి కాక పోవడం వల్ల అదనంగా రూ.11 కోట్లు ఇవ్వాలని కేంద్రాన్ని అడిగామన్నారు. ఈ నిధులను త్వరలో విడుదల చేస్తామని రైల్వే మంత్రి హామీ ఇచ్చినట్లు ఎంపీ వివరించారు.

ప్రైవేట్ కంప్యూటర్ కేంద్రాల సీజ్

రాయచూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకంలో పేర్ల నమోదుకు నెట్‌వర్క్, సర్వర్ సమస్యలు తలెత్తుతున్నాయి. జిల్లాలో లబ్ధిదారుల నమోదుకు ఏజెంట్లు, ప్రైవేట్ కంప్యూటర్ కేంద్రాల వారు నిలువు దోపిడీ చేస్తున్నారు. తాలూకాలోని యరగేర జీపీ సభ్యుడు గ్రామ-1 కేంద్రంలో కూర్చొని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. మాన్విలో సూర్యం, లక్ష్మి, ఎక్సెల్ కంప్యూటర్ కేంద్రాల యాజమాన్యం గ్రామ-1 కేంద్రం ఐడీ, పాస్‌వర్డ్‌లను లాగిన్ చేసుకుని లబ్ధిదారుల నుంచి రూ.250 చొప్పున వసూలు చేస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే మంగళవారం తహసీల్దార్ చంద్రకాంత్ ప్రైవేట్ కంప్యూటర్ కేంద్రాలపై దాడి జరిపి సీజ్ చేశారు. కాగా గ్రామ-1 కేంద్రాల్లోనే లబ్ధిదారులు పథకాల కింద పేర్లను నమోదు చేసుకోవాలని అధికారులు సూచించారు.

ఉన్నత విద్యను ప్రోత్సహించాలి



అమృత్‌రెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

రాయచూరు రూరల్: ఉన్నత విద్యకు ప్రోత్సాహం కల్పించాలని ఎస్ఆర్ రెడ్డి టీమ్ అధ్యక్షుడు తలెకాయ మారెప్ప పేర్కొన్నారు. ఆయన సోమవారం నగరంలోని నవోదయ వైద్య కళాశాలలో అమృత్ రెడ్డిని సన్మానించి మాట్లాడారు. విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించి భవిష్యత్‌లో జిల్లాకు మంచి పేరు తెచ్చి సమాజ సేవ చేయాలని కోరారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌రెడ్డి, సిద్దరామస్వామి, రవి, ఆనంద్‌రెడ్డి, శివజాత స్వామిలున్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: మణిపూర్‌లో మహిళలను అర్ధ నగ్నంగా ఊరేగించి అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని వివిధ సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం కలెక్టరేట్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టిన అధ్యక్షుడు అల్తాఫ్ మాట్లాడారు. దేశంలో మహిళలు, బాలికలకు, యువతులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ధర్మస్థలలో జరిగిన సౌజన్య హత్య కేసును పునర్ పరిశీలించాలన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

జోరుగా వరినాట్లు

కంప్లి: గతవారం రోజులుగా తాలూకాలో వర్షాలు కురుస్తుండడంతో రైతాంగం వ్యవసాయ పనుల్లో నిమగ్నులయ్యారు. ఇక రైతు కూలీలకు చేతినిండా పని దొరికింది. చిరుజల్లులు పడుతున్నా మహిళలు నాట్లు వేస్తున్నారు. టీబీడ్యాంలో నీటి ప్రమాణం రోజురోజుకు అధికం అవుతున్నందున త్వరలో కాలువలకు కూడా నీటిని విడుదల చేయవచ్చనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సుల అద్దాలు ధ్వంసం



స్కూల్ ఆవరణలో నిలిపిన బస్సుల అద్దాలను దుండగులు పగులగొట్టిన దృశ్యం

సిరుగుప్ప: తాలూకాలోని సిరిగేరి గ్రామంలో ప్రైవేట్ విద్యా సంస్థ జీహెచ్‌వీ పాఠశాలకు చెందిన మూడు బస్సుల అద్దాలను గుర్తు తెలియని వ్యక్తుల పగులగొట్టిన ఘటన సిరిగేరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్కూల్ ముఖ్యోపాధ్యాయులు విరుపాక్షగౌడ మాట్లాడుతూ రాత్రి సమయంలో స్కూల్ ఆవరణలో నిలిపి ఉంచిన మూడు స్కూల్ బస్సుల అద్దాలను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు విసిరి పగులగొట్టారన్నారు. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని కోరినట్లు తెలిపారు. ఉదయం పిల్లలను స్కూల్‌కు వదిలిపెట్టడానికి వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు ఈ ఘటనపై స్పందించినట్లు తెలిపారు. వ్యక్తిగత విభేదాలు ఉంటే స్కూల్ యాజమాన్యంతో మాట్లాడుకుని పరిష్కరించుకోవాలి కానీ, ఇలాంటి అఘాయిత్యానికి పాల్పడరాదన్నారు.

తుంగభద్రకు పోటెత్తిన వరద



తుంగభద్ర డ్యాం

హొసపేటె: తుంగభద్ర డ్యాంకు వరద పోటెత్తుతోంది. మంగళవారం డ్యాంకు 72,489 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో వరద నీటితో డ్యాం కళకళలాడుతోంది. డ్యాంకు ఎగువన నదీ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో క్రమంగా వరద నీటి రాక భారీగా పెరిగింది. మంగళవారం ఒక్క రోజే డ్యాంలోకి 6 టీఎంసీల నీరు చేరడంతో ప్రస్తుతం నీటినిల్వ 31 టీఎంసీలను దాటింది. మరో రెండు మూడు రోజుల్లో డ్యాంలో నీటినిల్వ 50 టీఎంసీలకు చేరే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం డ్యాంలో నీటిమట్టం 1606.78 అడుగులు, నీటి నిల్వ 31.658 టీఎంసీలు, ఇన్‌ఫ్లో 72,489 క్యూసెక్కులు ఉందని మండలి అధికార వర్గాలు తెలిపారు.

అనర్హులపై చర్యలేవీ?

గంగావతి: ఎస్టీ రిజర్వేషన్లను ఇతర కులాల అనర్హులు కబళిస్తున్నారని ఎస్టీ రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు మంజునాథ్ గొండబాళ్ ఆరోపించారు. ఆయన ఈమేరకు తహసీల్దార్ గవిసిద్దప్ప మణ్ణూరుకు వినతిపత్రాన్ని అందించారు. గతంలో ఇలాంటి కేసులను రెడ్‌హ్యాండెడ్‌గా తాము పట్టుకొని ఫిర్యాదు చేయగా వారిపై చర్యలు తీసుకున్నా కూడా తిరిగి సాగుతున్న ఇలాంటి నకిలీ సర్టిఫికెట్ల బాగోతంపై తనిఖీ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. వాల్మీకి సమాజ తాలూకా అధ్యక్షులు శరణప్ప నాయక్, గోవిందప్ప, మంజునాథ్ పాల్గొన్నారు.

అధికారుల ముమ్మర తనిఖీ

రాయచూరు రూరల్: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో అధికారులు పర్యటించి శాఖా పరంగా తనిఖీలు చేశారు. మంగళవారం జిల్లా ఆరోగ్యాధికారి సురేంద్రబాబు తాలూకాలోని ఉడుంగల్ ఖానాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వానాకాలంలో ప్రజలకు తగిన సేవలు అందించాలని అధికారులకు, సిబ్బందికి సలహా సూచనలు ఇచ్చారు. ఆరోగ్య కార్యకర్తలకు పథకాలపై ప్రజలకు వివరించాలన్నారు.

కూలిన పాఠశాల గోడ పరిశీలన

దేవదుర్గ తాలూకా దేవరగుడ్డ ప్రభుత్వ పాఠశాలను బీఈఓ సుఖదేవ్ తనిఖీ చేశారు. అధ్వానస్థితికి చేరుకున్న నాలుగు తరగతి గదులు, భోజనశాల గది మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆకట్టుకునే హస్తకళా మేళా



చీరలను కొనుగోలు చేస్తున్న మహిళలు



బనశంకరి: ఉద్యాననగరిలో రాజస్థాన్ హ్యాండ్‌లూమ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళా నగరవాసులకు కనువిందు చేస్తోంది. జేపీనగర 7 వ ఫేజ్ ఆర్‌బీఐలేఔట్ సోమేశ్వర సభాభవనలో మేళా జరుగుతోంది. పశ్చిమబెంగాల్, ఒడిశా, రాజస్థాన్ వస్త్రాలు, అలాగే జ్యువెలరీ, బ్యాగులు, వర్ణచిత్రాలు, గృహాలంకరణ సామగ్రి స్టాల్స్ వెలిశాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేతకు చెందిన పట్టుచీరలు, మస్లిన్ శారీస్, కాటన్ చీరలు ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శన ఆగస్టు 4వ తేదీ వరకు నిర్వహిస్తారు.

కోలారు వార్తలు...

రిజిస్టర్ కేంద్రాల లబ్ధి పొందండి



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: పట్టణంలోని పురసభ ప్రాంగణంలో స్థాపించిన రెండు రిజిస్టరు కేంద్రాల ప్రయోజనాలను గృహలక్ష్మి పథకం లబ్ధిదారులు పొందాలని పురసభ రెవిన్యూ అధికారి వి.నాగరాజ్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని పురసభ కార్యాలయంలో భాగ్యలక్ష్మి పథకం లబ్ధిదారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేసి మాట్లాడారు. పథకం లబ్ధి పొందడానికి అన్ని బ్రౌసింగ్ కేంద్రాల ముందు మహిళలు పెద్ద సంఖ్యలో చేరుతుండడాన్ని తప్పించడం కోసం ఇక్కడ రెండు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. లబ్ధిదారులు తలా రూ.12 ఇచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని, రిజిస్టరు చేసుకోవడానికి నిర్ణీత సమయం లేదని తెలిపారు. ఈ సందర్భంగా పురసభ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.శంకర్, ఆరోగ్య అధికారి కేజీ రమేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ అధ్యక్షుడిగా ప్రకాష్

కోలారు: కోలారు రోటరీ సెంట్రల్ జిల్లా 25వ అధ్యక్షుడిగా కెఎన్ ప్రకాష్, కార్యదర్శిగా హెచ్.విశ్వనాథగౌడతో పాటు ఇతర పదాధికారులు మంగళవారం నగరంలోని రోటరీ సెంట్రల్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో బాధ్యతలను స్వీకరించారు. రోటరీ నియోజిత గవర్నర్ బీఆర్ శ్రీధర్ నూతన అధ్యక్షుడు కెఎన్ ప్రకాష్‌కు బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా నిర్గమిత అధ్యక్షుడు సీఎంఆర్ శ్రీనాథ్ మాట్లాడుతూ నూతన అధ్యక్షుడు, పదాధికారులు అందరి సహకారంతో అభివృద్ధి, సేవా కార్యక్రమాలను కొనసాగించాలని పిలుపు నిచ్చారు.


ఆస్తి హక్కులపై అవగాహన

కోలారు: నగరంలోని దేవరాజ్ అరస్ విశ్వవిద్యాలయం విద్యా పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం బౌద్ధిక ఆస్తి హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని లీగల్ అడ్వయిజర్ స్థాపకులు, సీఈఓ ఆఫ్ లెఫ్ట్ ఇంటికట్ కన్సల్టెన్సీ ప్రైవేట్ లిమిటెడ్ లిపికా సాహు మొక్కకు నీరు పోసి ప్రారంభించారు. కార్యక్రమంలోఅనంతరం బౌద్ధిక ఆస్తి హక్కు గురించి సమాచారం అందించారు. కార్యక్రమంలో పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ అజీం, డాక్టర్ మాధవి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి, మూడో సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో కుచ్చుటోపీ

హుబ్లీ: టెలిగ్రాం యాప్‌లో పరిచయం అయిన గుర్తు తెలియని మహిళ పార్ట్‌టైం జాబ్ సాకుతో ఓ వ్యక్తి నుంచి రూ.13,52,559 ఎగనామం పెట్టిన ఘటనపై సైబర్ క్రైం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ధార్వాడ యాలక్కి శెట్టర్ కాలనీకి చెందిన దీపక్ కట్టిమని బాధితుడు. టెలిగ్రాం యాప్‌లో మహిళ దీపక్‌ను పరిచయం చేసుకుంది. ఈ క్రమంలో పార్ట్‌టైం జాబ్ విషయం ప్రస్తావించి ఆ మేరకు ప్రారంభంలో లాభాలు ఇస్తున్నట్లు మభ్య పెట్టింది. మరింతగా డబ్బులు పెట్టుబడి పెడితే ఇంకా ఎక్కువ లాభాలు వస్తాయంటూ యూ ట్రెడ్స్ యాప్ వెబ్‌సైట్‌లో లాభాలు చూపించి నమ్మకం కలిగించింది. ఆ తర్వాత తన బ్యాంక్ ఖాతా నుంచి తొలుత రూ.7,62,900, మరో బ్యాంక్ ఖాతా నుంచి రూ.5,89,659లను విడతల వారీగా వంచకులు తమ ఖాతాల్లోకి బదలాయించుకున్నారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.

గంజాయి సీజ్-నిందితుల అరెస్టు



అరెస్టయిన నిందితులతో పోలీసులు

శ్రీనివాసపురం: ముళబాగిలు రోడ్డులో మంగళవారం అబ్కారీ పోలీసులు దాడి జరిపి టాటా ఏస్ వాహనంలో తరలిస్తున్న 430 గ్రాముల గంజాయిని, టీవీఎస్ ద్విచక్రవాహనంలో తరలిస్తున్న 300 గ్రాముల గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. సల్మాన్, మహమ్మద్ హుసేన్ సాబ్ అనే వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి గంజాయిని, ద్విచక్రవాహనం, టాటా ఏస్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం- 1985 కింద కేసులను నమోదు చేశారు. దాడిలో అబ్కారీ అధికారులు రోహిత్, పుష్ప, మంజునాథ్, రాఘవేంద్ర, శివానంద్ పాల్గొన్నారు.

అధికారిణికి ఘనంగా వీడ్కోలు

కోలారు: బెంగళూరుకు బదిలీపై వెళుతున్న జిల్లా సమాచార శాఖ అధికారిణి సౌమ్యను మంగళవారం కోలారు పాత్రికేయుల సంఘం సభ్యులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడిన రాష్ట్ర పాత్రికేయుల సంఘం కార్యవర్గ సభ్యుడు కేఎస్ గణేష్ పాత్రికేయుల సమస్యలపై స్పందించడం ద్వారా అధికారిణి పాత్రికేయులతో సత్సంబంధాలను కలిగి ఉన్నారన్నారు. ఆమె మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో సమాచార శాఖ అధికారిణి అయిన సౌమ్య పాత్రికేయులకు ఉత్తమ సేవలందించారన్నారు. జిల్లాకు కొత్త సమాచార శాఖ అధికారిగా వచ్చిన చేతన్‌కుమార్ మాట్లాడుతూ తాను జిల్లాకు కొత్తవాడినైనా పాత్రికేయులందరి సహకారంతో ఉత్తమ సేవలందిస్తానన్నారు. సమాచార శాఖ నుంచి పాత్రికేయులకు అందాల్సిన అన్ని సౌకర్యాలను అందిస్తానన్నారు. ఈసందర్భంగా పాత్రికేయులు కోనా మంజునాథ్, అబ్బణి శంకర్, సచ్చిదానంద, చాంద్‌బాషా, వెంకటేష్ బాబా, మునివెంకటేగౌడ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: పాఠశాలల అభివృద్ధికి ఆయా పాఠశాలల్లో చదివిన విద్యార్థులు సహకరించాలని పాఠశాల విద్యా శాఖ విద్యాధికారి సీఆర్ అశోక్ తెలిపారు. మంగళవారం మారేనహళ్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన పాత విద్యార్థుల సంఘం వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, ఉత్తమ సంస్కారం అలవర్చుకోవాలన్నారు. తాలూకా అక్షర దాసోహ పథకం అసిస్టెంట్ డైరెక్టర్ సులోచన మాట్లాడుతూ విద్య మార్పుకు ఒక సాధనం. విద్య ద్వారా జీవితంలో సమాజంలో అనేక మార్పులు తేవడానికి సాధ్యమవుతుందన్నారు. విద్యార్థులు దాతలు అందిస్తున్న సహకారంతో ఉన్నత విద్యావంతులు కావాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు మొబైల్‌కు బదులుగా పుస్తకాలు ఇవ్వాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు ధర్మేష్, పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సుపరిపాలన అందిస్తాం



భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

తుమకూరు: రాష్ట్రంలో బీజేపీ, జేడీఎస్ పార్టీలు ఏకమైనా తమకు ఎలాంటి భయం లేదని, కాంగ్రెస్ పార్టీ సమష్టిగా ఉంటూ ప్రజలకు ఉత్తమ పాలన అందించడమే తమ కర్తవ్యమని ఆరోగ్య శాఖ మంత్రి దినేష్ గుండూరావు అన్నారు. మంగళవారం తుమకూరు నగర సమీపంలోని శ్రీ సిద్ధార్థ వైద్య విద్యా కళాశాల, ఆస్పత్రిలో కొత్తగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా అసెంబ్లీ ఎన్నికల ముందు ఎలా కలిసికట్టుగా పనిచేశామో రాబోయే ఎన్నికల్లో కూడా అదే విధంగా ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో హోం మంత్రి పరమేశ్వర్, విద్యా సంస్థల సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

టాటూ ఆర్టిస్టుకు అవార్డు

తుమకూరు: తుమకూరు నగరానికి చెందిన పచ్చబొట్టు కళాకారుడు సూర్యకు బ్లైండ్‌వింగ్ సంస్థ ఉత్తమ టాటూ అవార్డును ప్రదానం చేసింది. బెంగళూరు విమానాశ్రయం రోడ్డులో ఉన్న తాజ్ హోటల్లో ఈ నెల 16వ తేదీన అవార్డుల వేడుక జరిగింది. బాలీవుడ్ నటి అమృతా రావు నుంచి సూర్య ప్రశస్తిని అందుకున్నాడు. సూర్య తుమకూరులో టాటూ స్టూడియో ద్వారా పచ్చబొట్టు వేయడంలో పేరు గడించాడు.

ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

దొడ్డబళ్లాపురం: రామనగర, బెంగళూరు, బెంగళూరు గ్రామీణ, మండ్య జిల్లాల్లో బైక్‌లను చోరీ చేస్తున్న నిందితుడిని చెన్నపట్టణ పోలీసులు అరెస్టు చేసారు. మైసూరు జిల్లా హుణసూరుకు చెందిన కిరణ్ ఆలియాస్ సుధి (35) పట్టుబడ్డ నిందితుడు. చెన్నపట్టణ తాలూకా కార్యాలయం సర్కిల్లో ఉన్న బైక్‌లను చోరీ చేయడానికి ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా పలు జిల్లాల్లో బైక్‌లు చోరీ చేసినట్టు తెలిపాడు. నిందితుడి నుంచి రూ.6 లక్షల విలువ చేసే 7 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

మైసూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో తమ్ముడిని హత్య చేసిన ఇద్దరు అన్నలను పోలీసులు అరెస్ట్ చేశారు. కరడిగోడు గ్రామానికి చెందిన గిరిజన హాడికి చెందిన సిద్దయ్య కుమారుడు రమేష్ (36) ఇటీవల హత్యకు గురయ్యాడు. పంది మాంసం వాటాల విషయంలో సురేశ్, శివణ్ణలతో గొడవ జరిగింది. తీవ్ర ఆగ్రహంతో రమేశ్‌ను సురేశ్, శివణ్ణలు కత్తితో పొడిచి హత్య చేశారు. సిద్దాపుర పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు.

వైద్య సదుపాయాలు మెరుగుపరచాలి

గౌరిబిదనూరు: ప్రభుత్వాసుపత్రిలో వైద్య సదుపాయాలు మెరుగు పరచాలని, పేదలు ఎక్కువగా వచ్చి ఈ ఆస్పత్రిలో స్కానింగ్, ఇతర వైద్య పరీక్షలకు సౌలభ్యాలు లేవని డీఎస్ఎస్ నాయకుడు ఇడగూరు సోమయ్య అన్నారు. మంగళవారం ప్రభుత్వాసుపత్రి ముందు సౌలభ్యాలు కల్పించాలని డీఎస్ఎస్ కార్యకర్తలు చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అంబులెన్స్ సౌకర్యం లేదని, వైద్యుల కొరత కూడా ఉందన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించడం తగదని అన్నారు. ధర్నాలో నాయకులు సీజీ గంగప్ప, నగరగెరె లక్ష్మీనారాయణ, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

చినుకులు, చలి గాలులు

తుమకూరు: తుమకూరు నగరంలో రెండురోజుల నుంచి జల్లులతో కూడిన వర్షం, చల్లని ఈదురుగాలులు వీస్తుండడంతో ప్రజలు బయటకు రావడం లేదు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు కూడా అయిష్టంగానే వస్తున్నారు. జన సంచారం తగ్గిపోవడంతో గిరాకీలు పడిపోయినట్లు వ్యాపారులు వాపోయారు. వృద్ధులు, పిల్లలు ఇళ్లకే పరిమితమయ్యారు.

సేవా కార్యక్రమాలు



రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే

బనశంకరి: తిరుమల తిరుపతి పాలక మండలి సభ్యుడు, యలహంక ఎమ్మెల్యే ఎస్ఆర్ విశ్వనాథ్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున రక్తదానం చేశారు. అదే విధంగా ఉచిత వైద్య శిబిరం, విద్యార్థులకు నోటు పుస్తకాలు, బ్యాగులు వితరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు విశ్వనాథ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

తుంగా నది పరవళ్లు



నగరంలో తుంగా నదిని తిలకిస్తున్న ప్రజలు



శివమొగ్గ నగరం వద్ద నిండుగా ప్రవహిస్తున్న తుంగా నది

- డ్యాం నుంచి భారీగా నీటి విడుదల
- మండ్య, మైసూరు రైతుల్లో హర్షం

శివమొగ్గ: కొన్ని రోజులుగా మలెనాడు ప్రాంతంలో కురుస్తున్న కుండపోతకు శివమొగ్గ జిల్లాలో ఉన్న ప్రముఖ నదులు వరద నీటితో నిండి నిండుగా ప్రవహిస్తున్నాయి. తుంగా నదిలోకి వరద ప్రవాహం ఎక్కువగా ఉంది. గాజనూరులో ఉన్న తుంగా డ్యాంలోకి పై నుంచి అనుక్షణం నీటి రాక పెరుగుతోంది. జలాశయం గరిష్ట నీటిమట్టానికి చేరుకోవడంతో నీటిని పెద్దమొత్తంలో కిందికి వదులుతున్నారు. దాంతో శివమొగ్గ నగరం మీదుగా ప్రవహిస్తున్న తుంగా నది పరవళ్లు తొక్కుతోంది. నది హోరును నగరవాసులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు. నదిపై నున్న వంతెన మీద వెళ్లేవారు వాహనాలు దిగి మరీ నదిని చూసి ఫొటోలు తీసుకోవడంతో రద్దీ ఏర్పడింది.

నిండుగా కన్నంబాడి

మండ్య: కావేరి నది పరిధిలో కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల కన్నంబాడి (కేఆర్ఎస్) జలాశయంలోకి వరద నీరు చేరుతోంది. డ్యాం గరిష్ట నీటి మట్టం 124 అడుగులు కాగా, ఇప్పుడు 100 అడుగులకు నీరు చేరింది. మంగళవారం కెఆర్ఎస్‌లోకి 48,025 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. సోమవారం సాయంత్రం 97.50 అడుగులు ఉన్న నీటి మట్టం ఒక్కరోజుకే 3 అడుగులు పెరిగింది. జలాశయం పరిధిలో కుండపోత వర్షాలు పడుతుండడంతో జలాశయానికి నీరు పోటెత్తుతోంది. మరోవైపు కొడగు జిల్లాలో కావేరి నదిపైనున్న హారంగి జలాశయం పూర్తిగా నిండింది. అక్కడ వదులుతున్న జలాలు కేఆర్ఎస్‌కు వస్తున్నాయి. ఇక హేమావతి జలాశయంలోకి వరద నీరు చేరుతుంది. తొలకరి జల్లులు నెలరోజులు ఆలస్యమైనప్పటికీ ఇబ్బంది లేకుండా వర్షాలు వస్తున్నాయని మండ్య, మైసూరు రైతులు సంతోషం వ్యక్తంచేశారు.



కేఆర్ఎస్ డ్యాం నుంచి విడుదలవుతున్న కావేరి జలాలు

హత్య కేసులో జీవితఖైదు



హోసూరు: గొడవపడి వ్యక్తిని బీర్‌బాటిల్‌తో హత్య చేసిన కేసులో దోషికి హోసూరు కోర్టు యావజ్జీవ జైలు శిక్ష విధించింది. వివరాల మేరకు ఉద్దనపల్లి సమీపంలోని కొమ్మేపల్లి గ్రామానికి చెందిన నరసింహన్ (28), అదే ప్రాంతానికి చెందిన సురేష్‌రెడ్డి(42)ల మధ్య స్థానిక సంస్థల ఎన్నికల గురించి పాతకక్షలుండేవి. గత ఏడాది మే 10న హోసూరులో ఇద్దరి మధ్య కొట్లాట జరగ్గా, సురేష్‌రెడ్డి బీరు సీసాతో నరసింహన్‌పై దాడి చేశాడు. తీవ్ర గాయాలేర్పడిన నరసింహన్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. పట్టణ పోలీసులు సురేష్‌రెడ్డిని అరెస్ట్ చేసి హత్య కేసు నమోదు చేశారు. ఈ కేసు హోసూరు కోర్టులో విచారణ జరుగుతూ వచ్చింది. మంగళవారం కేసును విచారణ జరిపిన న్యాయమూర్తి రోస్లిన్ దురై... దోషి సురేష్డ్డికి యావజ్జీవ జైలు శిక్షతో పాటు రూ. 2 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

నెంబర్ ప్లేట్ మార్చి వీలింగ్

మైసూరు: పోలీసులకు పట్టుబడకుండా ఉండటం కోసం స్కూటర్‌కు నకిలీ నెంబర్ వేసి వీలింగ్ చేస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మైసూరు నగరంలోని శాంతి నగరకు చెందిన అర్బాజ్ అహ్మద్ అనే యువకుడు ఇటీవల పుష్పాశ్రమం సర్కిల్ వరకు వీలింగ్ చేశాడు. ఈ దృశ్యాలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి బైక్‌ను పరిశీలించగా వాహనానికి నకిలీ నెంబర్ పెట్టినట్లు ఒప్పుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు పంపించారు.

వేటగాళ్లు అరెస్టు

దొడ్డబళ్లాపురం: పట్టపగలు నాటు తుపాకులు ఉపయోగించి వన్యజీవులను వేటాడుతున్న ముగ్గురిని దొడ్డ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణంలోని రామన్నబావి వద్ద నాటు తుపాకులతో వన్యజీవులను వేటాడుతుండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనాస్థలానికి వచ్చిన పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. నిందితుల నుంచి నాటు తుపాకులు, మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు.

సేవా సింధు కేంద్రానికి తాళం

శివమొగ్గ: గృహలక్ష్మీ పథకం లబ్ధిదారుల నమోదు ప్రక్రియ ఆరంభమైంది. సేవా సింధు కేంద్రాలకు మహిళలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఇదిలా ఉంటే సేవా సింధూ కేంద్రాల్లో ఒక అర్జీకి వంద రూపాయలు వసూలు చేస్తుండటంతో శివమొగ్గ నగరంలోని సేవా సింధు కేంద్రానికి మహిళలు తాళం వేశారు. విషయం తెలుసుకున్న సీడీపీఓ చంద్రప్ప సేవా కేంద్రానికి వచ్చి విచారణ చేశారు. దరఖాస్తుకు వంద రూపాయలు వసూలు చేస్తున్నారని అక్కడి మహిళలు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఒక్క పైసా కూడా తీసుకోవద్దని ఆదేశాలు జారీ చేసినా కొన్ని చోట్ల డబ్బులు వసూలు చేస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకుంటామని సీడీపీఓ అన్నారు.

ఎమ్మెల్యే ప్రదీప్ అధికార దుర్వినియోగం

చిక్కబళ్లాపురం: ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని మాజీ నగరసభ అధ్యక్షుడు ఆనంద్‌బాబురెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ప్రదీప్ ఈశ్వర్ ఇటీవల తన నీట్ అకాడమీ కార్యాలయంలో తాలూకా అధికారులను బెంగళూరు రప్పించి సమావేశం నిర్వహించడం తప్పని అన్నారు. చిక్కబళ్లాపురంలో సమావేశం నిర్వహించాల్సి ఉండగా బెంగళూరుకు రప్పించడం ఏమిటని ధ్వజమెత్తారు. ఇటీవల కలెక్టర్, సబ్ కలెక్టర్లను బదిలీ చేయించారని ఆరోపించారు. సమావేశంలో నగరసభ సభ్యులు సుబ్రహ్మణ్యాచారి, సంతోశ్‌రాజు, మునిరాజు, యతీశ్ తదితరులు పాల్గొన్నారు.



బెంగళూరులో అధికారులతో ఎమ్మెల్యే సమావేశమైనప్పటి ఫొటోలను ప్రదర్శిస్తున్న దృశ్యం

రూ.30 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

బనశంకరి: బిల్డర్ ఇంట్లో చోరీకి పాల్పడి పెద్ద ఎత్తున నగలు ఎత్తుకెళ్లిన దొంగను మంగళవారం సుబ్రమణ్యపుర పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని తమిళనాడుకు చెందిన రామస్వామిగా గుర్తించారు. ఈనెల 6న బిల్డర్ వెంకటేశ్ కుటుంబ సమేతంగా అమరనాథ్ యాత్రకు వెళ్లారు. ఇంటి తాళం బద్దలు కొట్టిన దొంగ బీరువాలో ఉన్న రూ. లక్షల విలువైన బంగారు నగలు ఎత్తుకెళ్లాడు. యాత్ర నుంచి వచ్చిన వెంకటేశ్ విషయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివిధ ప్రాంతాల్లో గాలించి రామస్వామిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ. 30 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

ఉడుపిలో నగ్న వీడియోల కలకలం

యశవంతపుర: ఉడుపి పట్టణంలోని మహిళా నర్సింగ్ కాలేజీ బాత్‌రూమ్‌లో ఓ వర్గానికి చెందిన విద్యార్థినుల నగ్న వీడియోలు తీశారంటూ ప్రచారం జరుగుతోంది. వారం రోజులుగా ఉడుపిలో ఈ వార్త కలకలం రేపుతోంది. ముంబైలో నివాసం ఉంటున్న ఉడుపి వాసి, సమాజ సేవకురాలు రశ్మి సమంత్ ట్వీట్ చేసి మరో వర్గానికి చెందిన ముగ్గురు యువతులు వీడియో తీశారంటూ పెట్టిన పోస్టు సంచలనం కలిగించింది. విషయం పెద్దది కావడంతో ముగ్గురు విద్యార్థులను కళాశాల యాజమాన్యం సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి ఉడుపి ఎస్పీ అక్షయ్ మశ్చింద్రను వివరణ కోరగా సోషల్ మీడియాలో మరో రకమైన వీడియో చూపించారని, అందులో వాయిస్ ఎడిట్ చేసి వైరల్ చేసినట్లు తెలిపారు. సుమోటా కేసుగా నమోదు చేసినట్లు చెప్పారు.

చర్యలు తీసుకుంటున్నాం :

బాత్‌రూమ్‌లో వీడియో తీసిన మాట నిజమేనని నేత్రాజ్యోతి నర్సింగ్ కళాశాల డైరెక్టర్ రశ్మీ తెలిపారు. మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కారకులపై చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్లు ఆమె తెలిపారు.

వార్డుల్లో మేయర్ పర్యటన

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలోని 33వ వార్డు శాంతినగర్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం మేయర్ ఎస్.ఏ.సత్య పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని వినతిపత్రాలను స్వీకరించారు. తాగు నీరు, మురికి కాల్వలు తదితర సమస్యల గురించి ప్రజలు ఫిర్యాదులు చేశారు. సమస్యలను వెంటనే కార్పొరేషన్ యంత్రాంగంతో చర్చించి పరిష్కరిస్తామని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇంద్రాణి, నాగరాజ్, కార్యకర్తలు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీతో పనిచేస్తాం

బాగేపల్లి: నిజాయితీగా పనిచేసి ప్రజల మన్ననలను పొందుతామని తాలూకా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరప్ప అన్నారు. మంగళవారం ఆయన చేళూరు ఆర్ఐగా బాధ్యతలు స్వీకరించి సిబ్బందితో మాట్లాడారు. తాలూకాలో 17 రెవెన్యూ సర్కిళ్లు ఉన్నాయని, ప్రజా సమస్యలు పరిష్కారానికే ప్రాధాన్యత అన్నారు.

జేబు దొంగలు అరెస్ట్

శివాజీనగర: బస్టాండ్‌లు, బస్సుల్లో జేబు దొంగతనాలకు పాల్పడుతున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని సంపంగి రామనగర పోలీస్ స్టేషన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కద్రివేలు, కన్యాకుమార్, మహేశ్, సుందర్‌రాజ్, సయ్యద్ సలీం అరెస్ట్ అయిన నిందితులు.

గుండెపోటుతో ఐఐఎం విద్యార్థి మృతి

బనశంకరి: బెంగళూరు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) విద్యార్థి ఆయుష్‌గుప్తా (27) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఇతను బెంగళూరులో మేనేజ్‌మెంట్ కోర్సులో పీజీ రెండో సంవత్సరం చదువుతున్నారు. ఆయుష్ గుప్త మృతిపై గురించి ట్వీట్ చేసి ఐఐఎం యాజమాన్యం సోమవారం తరగతులను రద్దు చేసింది.

వధువును చూపిస్తామని మోసం

శివాజీనగర: పెళ్లి సంబంధాల వెబ్‌సైట్‌లో వధువు కోసం ఆరా తీస్తున్న ఓ కుటుంబాన్ని మోసం చేసిన సుధాకర్ రెడ్డి అనే వ్యక్తి హెణ్ణూరు కేసు నమోదు చేశారు. వివరాలు... బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన రవిచంద్రన్ తన కుమారుడు చంద్రశేఖర్‌కు వధువు కోసం పెళ్లి సంబంధాల వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకుని వివరాలు సేకరించేవారు. ఇదే సమయంలో రవిచంద్రన్‌కు సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తి పరిచయం చేసుకుని తాను బ్రాహ్మణ వేదిక ట్రస్ట్ సభ్యుడిగా పరిచయం చేసుకున్నాడు. వధువును వెతికి పెడతామని దశలవారీగా రూ. 86 వేలు తీసుకున్నాడు. ఆ తరువాత అదృశ్యమయ్యాడు. నగదు పోగొట్టుకున్న రవిచంద్రన్ హెణ్ణురు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పాడి రైతుల నిరసన

గౌరిబిదనూరు: పాల కొనుగోలు ధరను కొచిముల్ లీటరుకు రెండున్నర రూపాయలు తగ్గించడం అన్యాయమని న్యాయవాది, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఎంఆర్ లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం నగర శివారులో వున్న పాల శీతల కేంద్రం వద్ద వివిధ కన్నడ సంఘాలు, రైతు సంఘం వారు ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఐదేళ్లుగా పాడి ఎంతో కష్టంగా మారిందని, పశువులకు వస్తున్న వ్యాధులను భరిస్తూ, దాణా కొనుగోలు చేస్తూ నెట్టుకురావడం ఎంతో భారంగా ఉందన్నారు. ఇప్పుడు పాల ధరను తగ్గించడం అన్యాయమని, ఈనెల 30లోపు ప్రభుత్వం స్పందించకుంటే తీవ్ర పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిరసనలో డీఎస్ వెంకటరెడ్డి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సిద్దగంగప్ప, కరవే ప్రభు, రైతు సంఘం అధ్యక్షుడు లోకేశగౌడ, అశ్వత్థనారాయణ, రాజణ్ణ, అరుణ్ కుమార్ లక్ష్మి, రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.



మేనేజర్‌కు వినతిపత్రమిస్తున్న రైతు నాయకులు

హోసూరు వార్తలు..

అనుమతి లేని నర్సరీల్లో కొనుగోలు చేయొద్దు

హోసూరు: క్రిష్ణగిరి జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న కాయగూరల మొక్కలు, వరినాట్లను కొనుగోలు చేసి మోసపోవద్దని వ్యవసాయశాఖాధికారులు రైతులను హెచ్చరించారు. జిల్లాలో వ్యవసాయశాఖాధికారులు అనుమతి లేకుండా కొందరు నర్సరీలు నిర్వహిస్తున్నారని, ఆ నర్సరీలలో నకిలీ విత్తనాలు, వరినాట్లతో పాటు కాయగూరల మొక్కలను పెంచుతున్నారని, రైతులు అనుమతిలేని నర్సరీల్లో మొక్కలు కొనుగోలు చేసి మోసపోవద్దని, సమీపంలోని వ్యవసాయ శాఖ కేంద్రాల్లో, విత్తన గిడ్డంగుల్లో నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి నాట్లు వేసుకోవాలని విత్తన గిడ్డంగి డెప్యూటీ డైరెక్టర్ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

రైతు పథకాలపై వీధి నాటకం



వీధినాటక ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారులు

కెలమంగలం: వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందజేస్తున్న సంక్షేమ ఫలాలను వివరిస్తూ మంగళవారం కెలమంగలం సమితిలో వీధినాటక ప్రదర్శన నిర్వహించారు. జెక్కేరి పంచాయతీలో కెలమంగలం వ్యవసాయ శాఖ ఉప డైరెక్టర్ కళ అధ్యక్షతన జరిగిన ఈ ప్రదర్శనలో జగదేవి వినాయక కోలాట సాంస్కృతిక బృందం కళాకారులు ప్రభుత్వం రైతులకు అందజేసే రాయితీలు, ఉపకరణాలపై, విత్తనాల గురించి ఆటపాటలతో చాటిచెప్పారు.

కంపెనీ యజమాని ఆత్మహత్య

హోసూరు: వ్యాపారంలో నష్టం రావడంతో ప్రైవేట్ పరిశ్రమ యజమాని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన సిప్‌కాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. హోసూరు సమీపంలోని అనుమేపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్ (36) పరిశ్రమను నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో నష్టం రావడంతో దిక్కుతోచని స్థితిలో రాజశేఖర్ సోమవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. సిప్‌కాట్ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

లారీ ఢీకొని విద్యార్థి మృతి

క్రిష్ణగిరి: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో పాలిటెక్నిక్ విద్యార్థి మృతి చెందిన ఘటన సూళగిరి పరిధిలో జరిగింది. వివరాల మేరకు హోసూరు సమీపంలోని బీర్జేపల్లి గ్రామానికి చెందిన మురుగేషన్ కొడుకు కార్తికేయన్ (23) సూళగిరి సమీపంలోని కోనేరుపల్లి వద్ద ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం కళాశాల నుంచి బైక్‌పై బేగేపల్లి– ఉద్దనపల్లి రోడ్డుపై వెళతుండగా ఎదురుగా లారీ ఢీకొనింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన కార్తికేయన్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు.

మణిపూర్ దాడులపై ఆందోళన

హోసూరు: మణిపూర్‌లో హింసాకాండను అదుపు చేయడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ హోసూరు రైల్వే స్టేషన్ ముందు మంగళవారం విడుదల చిరుత పార్టీ ఆందోళన చేపట్టింది. క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి రామచంద్రన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మణిపూర్ మహిళలను నగ్నంగా ఊరేగించిన అమానవీయ ఘటన సహించలేనిదని, ఈ ఘటన జరిగి మూడు నెలలైనా నిందితులపై కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు. ప్రజారక్షణలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రాబోవు ఎన్నికల్లో నరేంద్రమోదీని ఇంటికి పంపించడం ఖాయమన్నారు. ఆందోళన కార్యక్రమం అనంతరం కార్యకర్తలు రైల్‌రోకో చేపట్టేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆటో మునిరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

కళలను కాపాడుకోవాలి





మాట్లాడుతున్న శంకర బిదరి, (కింది ఫొటో) ప్రణతి నాట్య ప్రదర్శన

బనశంకరి: సాంప్రదాయక కళలను కాపాడుకోవాలని విశ్రాంత పోలీస్ డైరెక్టర్ జనరల్ శంకర బిదరి తెలిపారు. ఆదివారం రాత్రి రవీంద్ర కళాక్షేత్రంలో జరిగిన ప్రణతి ఎస్ వాటాళ్ నృత్య అరంగేట్రం కార్యక్రమాన్ని బిదరి ప్రారంభించి మాట్లాడారు. మన పూర్వీకులు మన సంక్షేమం కోరి ఇటువంటి కళలను మనకందించారు, నేటితరం ఇటువంటి కళలను భావి తరాలకు అందించాలన్నారు. సంగీతం, నృత్యం దైవకళలన్నారు. మంగళూరు నృత్య భారతి సంస్థ గీతా సరళాయి మాట్లాడుతూ... ప్రణతి గురువైన విద్యాశ్రీ తన శిష్యురాలికి ఉత్తమ బోధన చేశారని అన్నారు. కార్యక్రమంలో నృత్య విద్వాంసులు డా.ఎం. సూర్యప్రకాశ్, మండ్యకు చెందిన నృత్య గురువు డా చేతనా రాధాకృష్ణ, భారతి సురేశ్, విద్య శిశిధర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిగుండ ప్రవేశం

కెలమంగలం: రాయకోట సమీపంలోని తోట్టం ప్రాంతంలో వెలసిన గ్రామదేవతల ఆలయాల్లో మంగళవారం ఉదయం అగ్నిగుండ మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. 21 నుంచి జాతరలో భాగంగా వివిధ హోమాలు, జ్యోతులు, గ్రామదేవతల ఊరేగింపు తదితర కార్యక్రమాలను చేపట్టారు. రాయకోట సోమనాథేశ్వరస్వామి ఆలయ పూజారి వివేకానంద గురువులచే అగ్నిగుండ మహోత్సవాన్ని ఘనంగా జరిపించారు. గ్రామదేవతలు మారియమ్మ, సల్లాపురమ్మ గ్రామదేవతలను ఎత్తుకుని అగ్నిగుండంలో నడిచారు. పరిసర గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని అగ్నిగుండంలో దిగి మొక్కులు తీర్చుకొన్నారు.



గ్రామదేవతలను ఎత్తుకుని నిప్పుల మీద నడుస్తున్న పూజారులు

క్లుప్తంగా...

వ్యవసాయ రంగ అభివృద్ధికి వెన్నెముక నాబార్డ్

- గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్
- ఘనంగా నాబార్డు ఆవిర్భావ దినోత్సవం



నాబార్డు కార్యకలాపాలపై బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ నజీర్

సాక్షి, అమరావతి: దేశంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి నాబార్డు వెన్నెముకగా నిలుస్తోందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. విజయవాడలో మంగళవారం నాబార్డు ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు సులభంగా రుణ సౌకర్యం అందుబాటులోకి తేవడం నాబార్డు సాధించిన అతి పెద్ద విజయమన్నారు. వ్యవసాయ పరపతి స్వరూపాన్ని సమూలంగా మార్చేసి రైతులకు ప్రయోజనకారిగా నిలిచిందని చెప్పారు. నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.ఆర్.గోపాల్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.2.86 లక్షల కోట్ల పరపతి సౌకర్యం కల్పించాలని నిర్ణయించామన్నారు. 1982లో కేవలం రూ.4,500 కోట్ల మూలధనంతో ఏర్పడిన నాబార్డు 2022-23 నాటికి రూ.8.01 లక్షల కోట్ల స్థాయికి చేరుకుందని వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను గవర్నర్ సందర్శించి నాబార్డు కార్యకలాపాలపై రూపొందించిన బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్, సహకారశాఖ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి, ఆర్‌బీఐ రీజనల్ డైరెక్టర్ భాస్కర్ పాల్గొన్నారు.

జ్యోతిబా పూలే ప్రతిభా పురస్కారాల ప్రదానం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సచివాలయ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జ్యోతిబా పూలే ప్రతిభా పురస్కారాల ప్రదానం కార్యక్రమం మంగళవారం జరిగింది. పది, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన ఎనిమిది మంది విద్యార్థులను సన్మానించి ఒక్కొక్కరికి రూ.2,116 చొప్పున నగదు బహుమతులు అందించారు. రాష్ట్ర సచివాలయంలోని ఐదవ బ్లాక్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి సంఘ అధ్యక్షుడు బి.అప్పారావు అధ్యక్షత వహించారు. శాసన మండలిలో ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి, వైస్ చాన్సలర్ డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

రాజ్యసభ — ఏపీ ఇన్ పార్లమెంట్ — లోక్‌సభ

రూ.1.20 లక్షల కోట్లతో సాగరమాల ప్రాజెక్టులు

రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో సాగరమాల పథకం కింద రూ.1.20 లక్షల కోట్లతో 113 ప్రాజెక్టులు చేపట్టినట్లు కేంద్ర నౌకాయానశాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. రాజ్యసభలో మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఈ పథకం కింద ప్రస్తుతం ఉన్న పోర్టులు, టెర్మినళ్లు, రోల్ ఆన్, రోల్ ఆఫ్, టూరిజం జెట్టీల ఆధునికీకరణ, పోర్టుల కనెక్టివిటీ, విస్తరణ, ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అభివృద్ధి, స్కిల్ డెవలప్‌మెంట్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు వంటి ప్రాజెక్టులు చేపడుతున్నామని వివరించారు. సంబంధిత శాఖలు, స్టేట్ మారిటైం బోర్డులు, మేజర్ పోర్టులు, పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యంతో స్పెషల్ పర్పస్ వెహికల్ సమన్వయంతో ప్రాజెక్టులు అమలు చేస్తున్నామని చెప్పారు. విశాఖ పోర్టు అథారిటీ, ఎన్‌హెచ్‌ఏఐ, రాష్ట్ర రోడ్డు విభాగం, పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంట్, ఇండియన్ రైల్వే, ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ, విద్యుత్తు శాఖ, ఏపీ టూరిజం అభివృద్ధి కార్పొరేషన్, ఏపీ మారిటైం బోర్డు తదితర సంస్థలు ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో చేపట్టిన మొత్తం ప్రాజెక్టుల్లో ఇప్పటికే రూ.32 వేల కోట్ల విలువైన 36 ప్రాజెక్టులు పూర్తిచేశామని, మిగిలిన రూ.91 వేల కోట్లతో చేపట్టిన 77 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. పోర్టు ఆధునికీకరణ, కనెక్టివిటీ పెంపు, పరిసర ప్రాంతాల్లో పరిశ్రమల అభివృద్ధి, కోస్టల్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, కోస్టల్ షిప్పింగ్, ఇన్‌ల్యాండ్ వాటర్ ట్రాన్స్‌పోర్టుకు సంబంధించి రూ.32,210 కోట్లతో చేపట్టిన 36 ప్రాజెక్టులు పూర్తయ్యాయని తెలిపారు. రూ.17,741 కోట్లతో చేపట్టిన 27 ప్రాజెక్టులు పురోగతి దశలోను, రూ.73,527 కోట్లతో చేపట్టిన మిగిలిన 50 ప్రాజెక్టులు అమలు దశలోను ఉన్నట్లు చెప్పారు.

రైతులకు అందుబాటులో నానో డీఏపీ

నానో డీఏపీని మార్కెట్లోకి ప్రవేశపెట్టి రైతులకు అందుబాటులో ఉంచినట్లు కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ సహాయ మంత్రి భగవంత్ కుబా తెలిపారు. విజయసాయిరెడ్డి మరో ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఇఫ్కో సమాచారం ప్రకారం నానో డీఏపీ ద్రవరూపంలో ఉండగా, సంప్రదాయ డీఏపీ కణికల రూపంలో ఉంటుందని చెప్పారు. నానో డీఏపీ విత్తనాలు, వేర్లు, ఆకులకు అందేలా వినియోగిస్తారని, సంప్రదాయ డీఏపీ మట్టిలో మాత్రమే వినియోగిస్తారని తెలిపారు. వినియోగ సామర్థ్యం 20 నుంచి 30 శాతంగా ఉన్న సంప్రదాయ డీఏపీతో పోలిస్తే నానో డీఏపీ వినియోగ సామర్థ్యం 80 నుంచి 90 శాతం ఉంటుందని చెప్పారు. సంప్రదాయ డీఏపీకి రాయితీ ఇస్తుండగా, నానో డీఏపీకి మాత్రం సబ్సిడీ లేదని పేర్కొన్నారు.

ఏపీలో 126 ఆయుష్ సెంటర్లు అమలులో..



ఆంధ్రప్రదేశ్‌కు 203 ఆయుష్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు (హెచ్‌డబ్ల్యూసీ)అనుమతించగా 126 అమలులో ఉన్నాయని ఆయుష్ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. ఆయుష్ హెచ్‌డబ్ల్యూసీలన్నింటినీ 2023-24లోగా దశల వారీగా ఏపీ ప్రభుత్వం అమలులోకి తీసుకురావాల్సి ఉందని వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ఏపీలో 10 లక్షలకుపైగా నానో యూరియా బాటిళ్ల విక్రయం

ద్రవరూపంలోని నానో యూరియా 500 మిల్లీలీటర్ల ధర రూ.225 అని, ఇది సంప్రదాయ యూరియా 45 కిలోల బ్యాగ్ ధర కంటే 16 శాతం తక్కువ అని కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ సహాయ మంత్రి భగవంత్ కుబా తెలిపారు. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మరో ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. నానో యూరియా పంటల పోషక అవసరాలను సమర్థంగా పరిష్కరిస్తుందని చెప్పారు. ఆగస్టు 2021 నుంచి 18 జూలై 2023 వరకు 500 మిల్లీలీటర్ల నానో యూరియా బాటిళ్లు ఏపీలో పదిలక్షలకు పైగా అమ్మకాలు జరిగినట్లు తెలిపారు.

రాష్ట్రాల ఉమ్మడి సహకారంతోనే పరిష్కారం

ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ పునర్విభజన చట్టం-2014 అమలుపై తెలంగాణ, ఏపీ, కేంద్ర ప్రభుత్వాల్లోని వివిధ శాఖలతో కేంద్ర హోంశాఖ ఇప్పటివరకు 31 సమీక్ష సమావేశాలు నిర్వహించిందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్ తెలిపారు. ఇప్పటికే అనేక అంశాల అమలు జరిగిందని, మిగతా కొన్ని అంశాల అమలు వివిధ దశల్లో ఉందని.. లోక్‌సభలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. పునర్విభజన చట్టం అమలుకు సంబంధించి రెండు రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి సహకారంతోనే వివాదాలు పరిష్కారమవుతాయని చెప్పారు. విశాఖపట్నం కేంద్రంగా రూ.106.89 కోట్లతో సౌత్ కోస్ట్ రైల్వేస్ జోన్ ఏర్పాటుకు గతేడాది నవంబర్ 10న ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. దీనికి 2023-24లో రూ.10 కోట్లు కేటాయించామన్నారు. దుగరాజపట్నంలో మేజర్ పోర్టు ఏర్పాటు ఆచరణ సాధ్యం కాకపోవడంతో దీనికి బదులుగా రామాయపట్నం వద్ద మేజర్ పోర్టును అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సూచించిందన్నారు. అయితే.. రామాయపట్నం నాన్-మేజర్ పోర్ట్‌గా నోటిఫై చేసినందున.. డీనోటిఫై చేయాలని, లేదా మరో స్థలాన్ని గుర్తించాలని కేంద్రం ఏపీకి సూచించినట్లు తెలిపారు. వైఎస్సార్ జిల్లాలో సమీకృత ఉక్కు కర్మాగారం లాభదాయకం కాదని సెయిల్ నివేదించిందన్నారు. దీంతో రాష్ట్రంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు సాధ్యాసాధ్యాల సమస్యలు, రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయడానికి ఉక్కుశాఖ జాయింట్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. ఏపీలో కేంద్ర విద్యా సంస్థలు, పోలవరం ప్రాజెక్టు, రాజధాని నగర సహాయం కోసం రూ.21,154.568 కోట్లను కేంద్రం విడుదల చేసిందని మంత్రి వివరించారు.

కిసాన్ డ్రోన్ల ప్రదర్శన కేంద్రాలు



ఏపీ కిసాన్ డ్రోన్ల ప్రదర్శనకు కేంద్రాలు గుర్తించినట్లు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ సంజీవ్‌కుమార్ ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. వెంకటరామన్నగూడెంలోని వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ, ఎమ్మిగనూరు, కరకంబాడిల్లో కృషివిజ్ఞాన కేంద్రాలను డ్రోన్ల ప్రదర్శనకు గుర్తించినట్లు తెలిపారు. వీటితోపాటు రాజమండ్రిలోని కేంద్ర పొగాకు పరిశోధనకేంద్రం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌పామ్ రీసెర్చ్‌లను గుర్తించామన్నారు.

ఆ సిఫార్సు రాలేదు



వీరశైవ లింగాయత్/లింగబలిజ వర్గాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలని ఏపీ, తమిళనాడుల నుంచి సిఫార్సులు రాలేదని కేంద్ర సామాజిక న్యాయ శాఖ సహాయమంత్రి ప్రతిమ భౌమ్నిక్.. ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రశ్నకు జవాబిచ్చారు.

గిరిజనుల అభ్యున్నతే ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి
- షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఆర్డర్ 5వ రాజ్యాంగ సవరణ బిల్లుపై రాజ్యసభలో చర్చ

సాక్షి, న్యూఢిల్లీ: గిరిజనుల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఆర్డర్ 5వ రాజ్యాంగ సవరణ బిల్లుపై మంగళవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే కాదు.. దేశంలో ఎక్కడైనా గిరిజనులకు మేలు చేకూర్చే ఎలాంటి చర్యలనైనా వైఎస్సార్‌సీపీ సమర్థిస్తుందని, సంపూర్ణ సహకారం అందిస్తుందని చెప్పారు. అంతకుముందు సభలో టీడీపీ సభ్యుడు చేసిన ఆరోపణలను ఆయన ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత గిరిజనుల అభ్యున్నతి కోసం చేపట్టిన పలు చర్యలను వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు మంజూరు చేసిన గిరిజన విశ్వవిద్యాలయాన్ని గిరిజన నివాసిత ప్రాంతంలోనే నెలకొల్పేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపారని తెలిపారు. ఇందుకు ప్రధానమంత్రి మోదీని ఒప్పించారని గుర్తుచేశారు. గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అవసరమైన వందలాది ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిందన్నారు. గిరిజన యూనివర్సిటీ భవనాలు, క్యాంపస్ నిర్మాణం ప్రారంభమయ్యాయని చెప్పారు. అనాదిగా వైద్య, ఆరోగ్య సౌకర్యాలకు నోచుకోని గిరిజనుల కోసం ఏజెన్సీ ప్రాంతమైన పాడేరులో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో కూడిన వైద్యకళాశాల నిర్మాణం చేపట్టారన్నారు. పోడు వ్యవసాయమే గిరిజనుల జీవనాధారం అయినందున అటవీహక్కుల గుర్తింపు చట్టం కింద పోడు సాగు చేసే భూములకు పట్టాలు పంపిణీ చేసే కార్యక్రమానికి అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. 1.30 లక్షల ఎకరాల్లో 55 వేలమంది గిరిజనులకు పట్టాల పంపిణీ జరిగిందని తెలిపారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ గిరిజనుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక పోడుసాగు చేసే గిరిజనులకు తిరిగి పట్టాల పంపిణీ ప్రారంభించారని చెప్పారు.

ఎస్టీ జాబితాలోకి వాల్మీకి, బోయ కులాలను చేర్చాలి

మైదాన ప్రాంతంలో ఆర్థికంగా, సామాజికంగా బాగా వెనుకబడిన వాల్మీకి, బోయ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఈ ఏడాది మార్చిలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించిందని విజయసాయిరెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కేంద్రం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 డి కింద ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించారని, దాని ప్రకారం ఎస్టీ జాబితాలోని కులాలకు 7 శాతం రిజర్వేషన్ ఇచ్చారని చెప్పారు. కొత్తగా ఏవైనా కులాలను ఎస్టీ జాబితాలో చేరిస్తే జనాభా ప్రాతిపదికపై రిజర్వేషన్ పరిమితి పెంచాల్సి ఉంటుంది కాబట్టి అప్పటికే ఎస్టీ జాబితాలో ఉన్న కులాలకు ఎలాంటి అన్యాయం జరగదని తెలిపారు. మహిళలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని వైఎస్సార్‌సీపీ తొలినుంచి డిమాండు చేస్తోందని చెప్పారు. లోక్‌సభ నుంచి మొదలుపెట్టి స్థానిక సంస్థల వరకు మహిళలకు 50 శాతం స్థానాలను రిజర్వు చేయడం వలన గిరిజనులకు వారికి కేటాయించిన 7 శాతం రిజర్వేషన్ కాకుండా అదనంగా చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కుతుందని తెలిపారు.

కనకమేడల ప్రసంగానికి ఖండన

అంతకుముందు చర్చలో టీడీపీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ ఏపీలో స్థితిగతులంటూ పేర్కొనడాన్ని విజయసాయిరెడ్డి ఖండించారు. బిల్లు గురించి మాత్రమే మాట్లాడాలని ఉపసభాపతి హరివంశ్ పలుసార్లు చెప్పినప్పటికీ రవీంద్రకుమార్ తన ప్రసంగం తీరు మార్చుకోలేదు. చివరికి ప్రసంగం తీరు మార్చుకోకుంటే మరో సభ్యుడికి అవకాశం ఇవ్వాల్సి ఉంటుందని ఉప సభాపతి స్పష్టం చేశారు. బిల్లుయేతర అంశాలు పరిశీలించి వాటిని రికార్డుల నుంచి తొలగిస్తామని విజయసాయిరెడ్డికి హామీ ఇచ్చారు.

అమ్మఒడి దేశవ్యాప్తంగా అమలు చేయాలి: వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య



ఏపీలో సీఎం వైఎస్ జగన్ తీసుకొచ్చిన అమ్మ ఒడి పథకం దేశవ్యాప్తంగా అమలయ్యేలా చూడాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ పథకం ద్వారా పిల్లలను బడికి పంపే తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేస్తున్నారని, విద్యాదీవెన, వసతిదీవెన వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని వివరించారు. షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఆర్డర్ 5వ రాజ్యాంగ సవరణ బిల్లుపై మంగళవారం రాజ్యసభలో జరిగిన చర్చలో కృష్ణయ్య మాట్లాడారు. చదువు ద్వారానే జీవన ప్రమాణాలు పెరుగుతాయని, ఆ దిశగా గిరిజనుల్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని చెప్పారు. కులాల వారీగా విద్య, ఉపాధి, రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. గిరిజనులు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఎదిగేలా చర్యలు తీసుకోవడంతోపాటు భారతీయ సంస్కృతిలో వారు మమేకమయ్యేలా చూడాల్సిన బాధ్యత కేంద్రానిదేనని చెప్పారు. గిరిజనుల చదువు, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఏకలవ్య పాఠశాలలు మరిన్ని ఏర్పాటు చేసి ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని కోరారు. ఏపీలో గిరిజనుల చదువు కోసం సీఎం జగన్ ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల కోసం సబ్‌ప్లాన్ తీసుకొచ్చారని గుర్తు చేశారు. గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, మార్కెటింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

స్టేట్ ఫస్ట్

ప్రతి నెలా విక్రయాలు జరిగాయిలా (రూ.లలో)	
ఏప్రిల్	51,80,767.43
మే	50,14,770.65
జూన్	29,48,891.42
జూలై 25 వరకూ	23,97,490.00
మొత్తం	1,55,41,919.50



కోరంగిలోని చేయూత మహిళా మార్ట్

- లాభాల బాటలో చేయూత మహిళా మార్ట్
- ఇప్పటి వరకూ రూ.కోటిన్నర దాటిన విక్రయాలు
- రాష్ట్రంలోనే ప్రథమ స్థానం
- మహిళా సంఘాల ఆనంద హేల

తాళ్లరేవు: మహిళా సంఘాల ఆర్థిక పరిపుష్టే ధ్యేయంగా, గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్ లాభాల బాటలో నడుస్తోంది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరంగిలో ఏర్పాటు చేసిన ఈ మార్ట్ ప్రారంభించిన సుమారు నాలుగు నెలల వ్యవధిలోనే రూ.కోటిన్నరకు పైగా విక్రయాలతో రికార్డు సృష్టించింది. మంగళవారం నాటికి రూ.1.55 కోట్ల మేర అత్యధిక సరాసరి విక్రయాల ద్వారా కోరంగిలోని చేయూత మహిళా మార్ట్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. తాళ్లరేవు మండలంలోని సుమారు 2,200 మహిళా సంఘాల్లోని దాదాపు 22 వేల మంది మహిళల భాగస్వామ్యంతో ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీన రూ.70 లక్షల పెట్టుబడితో కోరంగి మహిళా మార్ట్‌ను ప్రారంభించారు. కార్పొరేట్ మార్ట్‌లకు ఏమాత్రం తీసిపోని విధంగా దీనిలో అన్ని సౌకర్యాలూ కల్పించారు. ఇక్కడ పూర్తిగా మహిళలే వ్యాపార లావాదేవీలు సాగిస్తారు. మహిళా గ్రూపుల సభ్యులతో పాటు ఇతర ప్రజలు కూడా ఈ మార్ట్‌లో సరకులు కొనుగోలు చేస్తున్నారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల నిత్యావసర వస్తువులతో పాటు, స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన వివిధ రకాల వస్తువులను సైతం ఇక్కడ విక్రయిస్తున్నారు. సరసమైన ధరలకు విక్రయిస్తుండటంతో ఈ మార్ట్‌లో అన్ని వర్గాల ప్రజలూ సరకులు కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా మార్ట్ లాభాల బాటలో నడుస్తోంది. దీనిపై స్వయం సహాయక సంఘాల మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అందరి సహకారంతో..

కోరంగిలోని చేయూత మార్ట్ లాభాల బాటలో నడుస్తోంది. ప్రారంభించిన రెండు నెలల్లోనే విక్రయాలు రూ.కోటి దాటగా, మూడు నెలలు పూర్తయ్యేసరికి రూ.కోటిన్నర పైగా అమ్మకాలు చేసి, రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. మంచి లాభాలు వస్తున్నాయి. గ్రామ సంఘాల అసిస్టెంట్లు, కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల సహాయ సహకారాలతో ఈ ఘనత సాధించాం. – రెడ్డి సన్యాసిరావు, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతి పథం

ప్రజల నుంచి విశేష స్పందన

అన్ని రకాల నిత్యావసరాలతో పాటు కార్పొరేట్ మార్ట్‌లలో ఉండే అత్యాధునిక వస్తువులు సైతం మా వద్ద అందుబాటు ధరల్లో లభ్యమవుతున్నాయి. దీంతో ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. ప్రజల ఆకాంక్షల మేరకు వారికి అవసరమైన వస్తువులను సైతం మావద్ద ఉంచుతున్నాం. ఉదయం నుంచి రాత్రి వరకూ స్టోర్ తెరచి ఉంచడంతో ఆశించిన స్థాయిలో విక్రయాలు జరుగుతున్నాయి. – తాతపూడి మహేష్, స్టోర్ మేనేజర్, చేయూత మహిళా మార్ట్

చాలా ఆనందంగా ఉంది

కోరంగిలోని చేయూత మహిళా మార్ట్ లాభాల బాటలో నడవడం చాలా ఆనందంగా ఉంది. మా మార్ట్‌లో సుమారు 10 మంది మహిళలు ఉపాధి పొందుతున్నారు. వస్తువుల విక్రయాల నుంచి సరఫరా వరకూ అన్నీ మహిళలే చేస్తారు. మార్ట్ నిర్వహణకు సంబంధించి మహిళా సంఘాల సభ్యులతో కొనుగోలు, పర్యవేక్షణ, నిర్వహణ, తనిఖీలకు నాలుగు కమిటీలు వేశాం. వ్యాపార లావాదేవీలు పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. వ్యాపార రంగంలో సైతం మహిళలు సత్తా చాటుకునే విధంగా తోడ్పాటు అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. – దండుప్రోలు నూకరత్నం, ప్రెసిడెంట్, చేయూత మహిళా మార్ట్, కోరంగి, తాళ్లరేవు మండలం





ఉరిశిక్ష అమలుకు వినియోగించే తాళ్లు

ఆఖరి ఉరికి 48 ఏళ్లు

రాష్ట్రంలో ఉరిశిక్ష అమలు చేసి అర్ధ శతాబ్దం సమీపిస్తుందంటే ఆశ్చర్యంగా ఉంది కదూ. ఔను నిజమే. వివిధ పరిస్థితుల నేపథ్యంలో శిక్షల అమలులో ఆలస్యం అనివార్యమవుతోంది. దేశంలో కేంద్ర కారాగారాలన్నింటిలోనూ ఈ శిక్ష పడిన ముద్దాయిలు వివిధ అప్పీళ్లతో క్షణాలు లెక్క పెట్టుకుంటున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలోనూ ఇదే పరిస్థితి. రాష్ట్రంలో ఉరి తీసేందుకు వీలున్న ఏకైక సెంట్రల్ జైలు ఇక్కడే ఉంది. ఎక్కడ ఉరి శిక్ష పడినా ముద్దాయిని ఇక్కడి సెంట్రల్ జైలుకు తరలిస్తారు. ఈ జైలులో ఇప్పటివరకూ 48 మందిని ఉరి తీసినట్లు సమాచారం. స్వాతంత్ర్యం వచ్చాక 27 మందిని ఉరి తీశారు. ఆఖరిసారిగా 1976 ఫిబ్రవరి 22న అనంతపురానికి చెందిన నంబి కిష్టప్పను ఉరి తీశారు. అప్పటి నుంచి అంటే ఈ 47 ఏళ్ల కాలంలో ఉరి శిక్ష అమలు కాలేదు. 1997 మార్చిలో ఇద్దరిని ఉరి తీయాల్సి వచ్చినా అనూహ్య పరిణామాల మధ్య సినిమా తరహాలో చివరి క్షణంలో శిక్ష అమలు కాలేదు.

– డెస్క్, రాజమహేంద్రవరం

1602లో డచ్‌వారి హయాంలో రాజమహేంద్రవరం కేంద్ర కారాగార భవనాన్ని నిర్మించారు. బ్రిటిష్ హయాంలో 1864లో దీనిని జైలుగా మార్చారు. 1870లో దీనికి పూర్తి జైలు రూపం వచ్చింది. 1990లో దీనిని ఆధునీకరించారు. పాత కట్టడం ఉన్నప్పుడు లోపలికి ప్రవేశించగానే ఎడమ వైపు ఉరి (హ్యాంగ్) సెల్ ఉండేది. తర్వాత కొత్తగా నిర్మించిన జైలు పరిపాలనా భవనం కింది భాగంలోకి దీనిని మార్చారు. దేశంలో భూగర్భ హ్యాంగ్ సెల్ ఇదొక్కటేనని చెబుతారు.

తలారీ కోసం తలనొప్పులు

ఉరిశిక్షను అమలు చేసే తలారీ (హ్యాంగ్‌మన్) పోస్టు అంటూ ప్రత్యేకంగా ఉండదు. శిక్ష అమలు చేసినప్పుడల్లా తలారీ ఎంపిక తలనొప్పిగానే పరిణమిస్తుంది. ఈ శిక్ష అమలు చేసేవారికి మనో నిబ్బరం ఉంటాలి. అనారోగ్యం లేదా గుండె సంబంధ సమస్యలు ఉండకూడదు. సాధారణంగా ఉరిశిక్షను అమలు చేసే వ్యక్తి కుటుంబం నుంచి వారసత్వంగా ఎవరో ఒకరు ముందుకు వస్తుంటారు. 1997లో ఇక్కడి జైలులో ఉరి శిక్ష అమలు కావాల్సి ఉండగా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో కృష్ణా జిల్లా తిరువూరు సబ్‌జైలులో పని చేసిన ధర్మరాజు సంసిద్ధత తెలిపారు. అధికారులు ఆయనను రాజమహేంద్రవరానికి డిప్యుటేషనుపై తీసుకువచ్చారు. తీరా వచ్చాక ఆఖరి సమయంలో ఉరి అమలు కాలేదు.

ప్రత్యామ్నాయ విధానాలపై కమిటీ

ఉరి శిక్షకు ఇకపై ఉరి పడుతుందా.. మరణ శిక్ష అమలులో ప్రత్యామ్నాయ మార్గాలు అనుసరిస్తారా అనేది చర్చనీయాంశంగా ఉంది. సున్నితమైన ఈ వ్యవహారంపై ఓ కమిటీ వేయాలని కేంద్ర ప్రభు త్వం నిర్ణయించింది. మరణ శిక్ష కింద ఉరి కాకుండా ప్రత్యామ్నాయ విధానాలను అనుసరించాలని 2017లో న్యాయవాది రిషి మల్హోత్రా సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థీవాలాల ధర్మాసనం ఈ ఏడాది మార్చి చివరిలో విచారణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకట రమణి దీనిపై సమాధానం చెబుతూ.. కేంద్ర ప్రభుత్వం నిపుణుల కమిటీ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉందన్నారు.

అచ్చం సినిమా తరహాలోనే..

1993లో జరిగిన చిలకలూరిపేట బస్సు దహనం కేసులో చలపతిరావు, విజయ వర్ధన్‌లకు 1995లో గుంటూరు సెషన్స్ కోర్టు ఉరి శిక్ష విధించింది. 1997 మార్చి 14న ముద్దాయిల క్షమాభిక్ష పిటిషన్‌ను అప్పటి రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ తిరస్కరించారు. దీంతో అదే నెల 29న వీరిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో ఉరి తీసేందుకు ఏర్పాట్లు జరిగిపోయాయి. శిక్ష అమలుకు ముందు రోజు మార్చి 28న రాష్ట్రపతి శంకర్‌దయాళ్‌శర్మను జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత మహాశ్వేతాదేవితో పాటు మరికొందరు ప్రముఖులు కలిశారు. క్షమాభిక్ష వినతిని మరోసారి పరిశీలించాలని అభ్యర్థించారు. ఆయన పిటిషన్‌ను స్వీకరించారు. దీంతో వారు వెంటనే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాష్ట్రపతి నిర్ణయం వెలువడేవరకూ శిక్ష అమలును నిలిపివేయాలని అభ్యర్థించారు. ఆ రాత్రికి రాత్రే సుప్రీంకోర్టు బెంచ్ ఈ కేసు విచారించి రాష్ట్రపతి నిర్ణయం వెలువడేంత వరకూ శిక్ష అమలు చేయవద్దని ఆదేశించింది. అర్ధరాత్రి దాటాక నిర్ణయం రావడంతో సినిమా తరహాలో చివరి క్షణంలో శిక్షను నిలిపివేశారు. తర్వాత రాష్ట్రపతి నారాయణన్ వీరి ఉరి శిక్షను జీవితకాల కారాగార శిక్షగా మార్చాలని నిర్ణయించారు. ముద్దాయిల్లో విజయ వర్ధన్ ఇప్పటికీ 30 ఏళ్లుగా రాజమహేంద్రవరం జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. చలపతిరావు మరో జైలులో ఉన్నారు.

రోజూ ప్రాణ సంకటమే..

ఉరి శిక్ష అమలు చేస్తే క్షణాల్లో ప్రాణం పోతుంది. కానీ శిక్ష అమలవుతుందో లేదో తెలియక ఏళ్ల తరబడి ఆశనిరాశల మధ్య నలిగిపోతున్నారు ఉరి శిక్ష ఖైదీలు. 2021లో ఉరి శిక్ష పడిన మున్నా గ్యాంగ్‌కు చెందిన కొందరు ఇక్కడి కేంద్ర కారాగారంలోనే ఉన్నారు. ప్రస్తుతం ఇక్కడ 18 మంది ఉరి శిక్ష ఖైదీలున్నట్లు జైలు వర్గాలు తెలిపాయి. పై కోర్టులకు అప్పీలు వంటి వివిధ దశల్లో వీరి కేసులు కొనసాగుతున్నాయి. 1997లో తన ఉరి శిక్ష యావజ్జీవ ఖైదుగా మారిన నేపథ్యంలో 30 ఏళ్లకు పైబడి కారాగారంలో ఉంటున్నానని చిలకలూరిపేట బస్సు దహనం కేసు ఖైదీ విజయ వర్ధన్ ఆవేదన వ్యక్తం చేశాడు.



రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులోని ఉరికంబం

ఆ రాత్రి ఎప్పటికీ గుర్తే..



1975లో జైళ్ల సర్వీసులో చేరాను. రాజమండ్రిలో ఇద్దరిని ఉరి తీయాలని తెలిసింది. తీస్తానని ముందుకు వచ్చాను. తిరువూరు నుంచి డిప్యుటేషనుపై రాజమండ్రికి బదిలీ చేశారు. తెల్లవారితే ఉరి అనగా ఆ రాత్రి జైలులోనే ఉన్నాను. నిద్ర పట్టలేదు. మనసంతా ఆలోచనలే. నా చేతుల మీదుగా ఇద్దరు ప్రాణాలు పోతాయనే ఆలోచన ఇబ్బంది పెట్టేది. కర్తవ్యం కదా అని సమాధానం చెప్పుకునేవాడిని. ఒంటిగంటన్నర తర్వాత కలత నిద్రలోకి జారుకున్నాను. ఇంతలో సహచరులు వచ్చి లేపి శిక్ష అమలు కావడం లేదన్నారు. ఆ సమయంలో ముద్దాయిల కంటే ఎక్కువగా సంతోష పడ్డాను. 2007లో రిటైరయ్యాను. ఇప్పటికీ రామమండ్రి జైలులో ఉరి రాత్రి గుర్తుకొస్తూనే ఉంటుంది.

– ధర్మరాజు, కాపవరం, కోరుకొండ మండలం

ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు



ప్రస్తుతం కేంద్ర కారాగారంలో మరణ శిక్ష పడిన ఖైదీలు 18 మంది వరకూ ఉన్నారు. రాష్ట్రంలో ఎక్కడ శిక్ష పడినా అమలుకు ఇక్కడికే తీసుకువస్తారు. 47 ఏళ్లుగా శిక్ష అమలు చేయనప్పటికీ హ్యాంగ్ సెల్‌లో ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేపడుతుంటాం. ఉరికంబం గదిలో ఐరన్ లివర్, కింద నిలబడే ఐరన్ పలకలను జాగ్రత్తగా ఉండేలా చూస్తాం. ఆదేశాలొస్తే అమలుకు సిద్ధంగా ఉంటాం.

– రాహుల్, సూపరింటెండెంట్, కేంద్ర కారాగారం, రాజమహేంద్రవరం

జాప్యం అనివార్యం



శిక్ష పడిన తర్వాత ఖైదీలకు వివిధ పై కోర్టుల్లో అప్పీలుకు అవకాశం ఉంటుంది. తర్వాత హోం శాఖ ద్వారా రాష్ట్రపతిని క్షమాభిక్ష కోరే వీలుంటుంది. ఈ దశలు దాటడానికి చాలా సమయం పడుతుంది. అప్పటికే కొన్నేళ్లుగా శిక్ష అనుభవిస్తున్న ముద్దాయి జీవితానికి సంబంధించిన అంశాలు పైకోర్టులు పరిశీలిస్తాయి. ఇవన్నీ ప్రభావితం చేస్తాయి. మరీ క్రూరం, అత్యంత అమానవీయ సంచలన కేసుల్లో మినహా మిగిలిన కేసులన్నింటికీ ప్రొసీజర్ వల్ల జాప్యం అనివార్యం.

– ఎం.విశ్వేశ్వరరావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, కాకినాడ

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
బుధవారం ॥ 26-7-2023

న్యూస్‌మేకర్స్

'గొడ్ల చావిడిలో పశువుల ఆలనా పాలనా స్త్రీలు చూసినప్పుడు వాటికి వైద్యం మేమెందుకు చేయలేము' అంటున్నారు నేటి యువతులు. శ్రీ వెంకటేశ్వర పశు వైద్యశాల 12వ స్నాతకోత్సవంలో 'బ్యాచులర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్' చదివిన లొగుడు ప్రత్యూష ఏకంగా **7 గోల్డ్ మెడల్స్** సాధిస్తే, తీర్థాల హేమనయని **5 గోల్డ్ మెడల్స్** సాధించింది. వెటర్నరీ రంగంలో 60 శాతం సీట్లు అమ్మాయిలే సొంతం చేసుకుంటున్నారని పశు వైద్యరంగంలో తమ సామర్థ్యం చూపి ఉపాధి అవకాశాలు అందుకుంటున్నామని వారు అంటున్నారు.

ఇంటి పేరు గోల్డ్ మెడల్


ప్రత్యూష

ఆంధ్రప్రదేశ్‌లో పశువైద్యానికి సంబంధించిన ఏకైక యూనివర్సిటీ– శ్రీ వేంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయంలో విద్యార్థినులు అద్భుత ప్రతిభ చూపిస్తున్నారు. జూలై 22న జరిగిన 12వ స్నాతకోత్సవంలో 'బ్యాచులర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్' (బి.వి.ఎస్.సి) కోర్సులో ఒకరు ఏడు స్వర్ణాలు, మరొకరు ఐదు స్వర్ణాలు సాధించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రశంసలు అందుకున్నారు. ఒకప్పుడు పశు వైద్యంలో మగవారే 90 శాతం ఉండేవారు. నేడు అరవై నుంచి డెబ్బయి శాతం అమ్మాయిలే ఉంటున్నారు. బి.వి.ఎస్.సిలో రాష్ట్రవ్యాప్తంగా కేవలం 200 పై చిలుకు సీట్లు ఉంటే వాటిలో ప్రతి ఏటా అమ్మాయిలే ఎక్కువ సీట్లు పొందుతున్నారు. తిరుపతి, పొద్దుటూరు, గన్నవరం, గరివిడిలలో ఉన్న నాలుగు కాలేజీలు శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం కిందకే వస్తాయి. సీట్లు తక్కువే అయినా వాటిని పొందుతున్న అమ్మాయిలు ఎక్కువ. 'ఈ రంగంలో మాకు ఆసక్తి ఉంది. చేయగల సామర్థ్యం ఉంది. అవకాశాల పట్ల ఎరుక ఉంది' అంటున్నారు వాళ్లు. 7 స్వర్ణాలు సాధించిన ప్రత్యూష, 5 స్వర్ణాలు సాధించిన హేమనయని అంతరంగాలు...

పశు వ్యాధులను శోధించే సైంటిస్ట్ అవుతాను

నేనిప్పుడు ఉత్తర్ ప్రదేశ్‌లోని బరేలీలో 'ఇండియన్ వెటర్నరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్'లో పిజి సీటు సాధించి వెటర్నరీ మైక్రోబయాలజీ చేస్తుండటం వల్ల మొన్నటి స్నాతకోత్సవానికి హాజరు కాలేకపోయాను. కాని 7 గోల్డ్ మెడల్స్ సాధించడం మాత్రం సంతోషంగా ఉంది. చదువులో బాగా రాణించాలని రోజుకు ఆరు గంటలు చదివాను. సీనియర్లు, అధ్యాపకులు బాగా ప్రోత్సహించారు. బి.వి.ఎస్.సిలో ఐదు సంవత్సరాల్లో 18 సబ్జెక్ట్స్ చదువుతాము. వాటిలో దాదాపు 17 గోల్డ్‌మెడల్స్ ఉంటే నాకు 7 వచ్చాయి. మాది అనంతపురం. మా నాన్న గవర్నమెంట్ టీచర్. నేను తిరుపతి కాలేజీలో బి.వి.ఎస్.సి చేశాను. ఎం.బి.బి.ఎస్ డాక్టర్ కావాలని ఇంటర్‌లో బై.పి.సి చదివి 969 మార్కులు సాధించాను. నీట్‌లో సీట్ రాకపోయినా బాధపడలేదు. ఎంసెట్‌లో 1248వ ర్యాంకు సాధించి వెటర్నరీ కళాశాలలో బి.వి.ఎస్.సి డిగ్రీలో చేరాను. మనుషులకు వైద్యం చేసే డాక్టరైనా పశువులకు వైద్యం చేసే డాక్టరైనా డాక్టరే. చిన్నప్పటి నుంచి నాకు మూగజీవాలంటే ఇష్టం. ఆడవాళ్లు పశువుల ఆలనా పాలనా బాగా చూస్తారు. వైద్యం కూడా బాగా చేయగలరని నా నమ్మకం. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే మన దేశంలో పశు వైద్యానికి సంబంధించిన ఇన్‌ఫ్రా తక్కువే ఉంది. కాని ఇటీవల పెట్స్‌కు డిమాండ్ పెరిగింది. అయితే రేబిస్ వంటి ఏ ఒకటి రెండు వ్యాక్సిన్ల గురించి మాత్రమే కాకుండా పశువులకు సంబంధించిన ఎన్నో వ్యాక్సిన్ల గురించి తగినంత చైతన్యం రావాలి. నాకైతే పశువులకు వచ్చే వ్యాధుల గురించి పరిశోధించే సైంటిస్ట్ కావాలని ఉంది. వైరస్, ఫంగస్, బ్యాక్టీరియా ఇవి పశువులకు ఎలా జబ్బులు కలిగిస్తాయో పరిశోధనలు కొనసాగుతూ ఉంటే పశువులను కాపాడటమే కాదు వాటి వల్ల మనుషులకు వచ్చే జబ్బులను కూడా నిరోధించి మనుషులనూ కాపాడవచ్చు.

- లొడుగు ప్రత్యూష, బి.వి.ఎస్.సి, ఏడు బంగారు పతకాల గ్రహీత, ఎస్.వి. వెటర్నరీ కళాశాల, తిరుపతి

ఆంధ్రా నుంచి అమెరికా వరకు అవకాశాలు

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నుంచి పట్టా అందుకుంటున్న తీర్థాల హేమనయని



మనుషులకు వైద్యం చేసే డాక్టర్లు మనుషులకు మాత్రమే చేస్తారు. కాని మేము భిన్న జంతు జీవాలకు వైద్యం చేస్తాం. కుక్క, పిల్లి, ఆవు, గేదె, గుర్రం, గొర్రె... ఒక్కోదానికి ఒక్కో రీతిన వైద్యం చేయాలి. నేడు పశువైద్యం చదివితే తెలుగు రాష్ట్రాల్లో ఉద్యోగ భద్రత ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగం వస్తుంది. లేదంటే కొద్దిపాటి పెట్టుబడితో పెట్ క్లినిక్ పెట్టుకుంటే మంచి ఉపాధి. ఆంధ్ర ప్రదేశ్ నుంచి అమెరికా వరకు ఎన్నో ఉపాధి అవకాశాలు వెటర్నరీ డాక్టర్లకు ఉండటం వల్ల, రిజర్వేషన్ ప్రయోజనం అదనంగా జతై నేడు ఎక్కువమంది అమ్మాయిలు పశు వైద్యం చదువుతున్నారు. నేను కూడా ఆ అవగాహనతోనే పొద్దుటూరు వెటర్నరీ కాలేజీలో బి.వి.ఎస్.సి చేశాను. నాకు 5 గోల్డ్ మెడల్స్, 1 సిల్వర్ మెడల్ రావడం చాలా సంతోషంగా ఉంది. మాది పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం కొండమంచిలి గ్రామం. నాన్న నా చిన్న వయస్సు నుంచే గల్ఫ్ దేశాలకు వెళ్లారు. నేను బాగా చదవడానికి మా అక్క, అమ్మ ముఖ్య కారకులు. అక్కయ్య సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని సైతం వదులుకొని నాకు అండగా ఉంటోంది. ఇంటర్ వరకు పాలకొల్లులో చదివాను. ఇంటర్ బై.పి.సిలో 987 మార్కులు సాధించి ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నాను. జంతువుల పట్ల ప్రేమతో ఎలాగైనా వెటర్నరీ డాక్టర్ కావాలని ఎంసెట్ రాసి 1499 ర్యాంకును సాధించాను. ఎలాగైనా గోల్డ్ మెడల్ సాధించాలని తపన పడేదానిని. రోజుకు సుమారు 4 నుంచి 6 గంటలు చదివాను. సెలవురోజులలో కళాశాలలో ఉన్న లైబ్రరీలను, ల్యాబ్‌లను సందర్శించి ప్రాక్టికల్‌గా సబ్జెక్ట్‌ను అర్థం చేసుకుని చదివాను. కళాశాల అధ్యాపకుల ప్రోత్సాహం మరువలేనిది. ప్రస్తుతం వెటర్నరీ పీజీ చేయాలని ప్రవేశ పరీక్ష రాశాను. భవిష్యత్తులో పశువైద్య అధ్యాపకురాలుగా రాణించాలని ఉంది.

- తీర్థాల హేమనయని, బి.వి.ఎస్.సి, 5 బంగారు పతకాల గ్రహీత, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ, ప్రొద్దుటూరు.

– పోగూరి చంద్రబాబు, రిపోర్టర్, సాక్షి, తిరుపతి; ఫోటోలు: కేతారి మోహనకృష్ణ

మహిళల్లో క్రీడాస్ఫూర్తికి..

తాన్వీ హన్స్, శ్వేతా సుబ్బయ్య. ఒకరు ఫుట్ బాల్ క్రీడాకారిణి, మరొకరు ఫిట్‌నెస్ ట్రైనర్. ఈ ఇద్దరు ఏడేళ్ల క్రితం బెంగళూరులో మహిళల కోసం సరదాగా ఓ స్పోర్ట్స్ సెషన్‌ను ఏర్పాటు చేశారు. అది మొదలు ఇప్పుడు దేశం అంతటా మహిళల కోసం స్పోర్ట్స్ సెషన్‌లు, నెట్‌వర్కింగ్ ఈవెంట్‌లు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు దాదాపు 5000 మందికి పైగా ఈ మహిళా నెట్‌వర్క్ ఉమెన్ స్పోర్ట్స్ కమ్యూనిటీని విస్తరించడానికి ట్రావెల్ గ్రూప్స్ ఏర్పాటు చేస్తుంటారు. 14 ఏళ్లలోపు అమ్మాయిల నుంచి అరవై ఏళ్లకు పైగా వయసున్న బామ్మలు కూడా వీరి గ్రూప్‌లో సభ్యులు. ఈ నెల నుంచి సెప్టెంబర్ వరకు మహిళల్లో క్రీడాస్ఫూర్తి నింపడానికి ఈవెంట్స్ నిర్వహిస్తున్నారు తాన్వి, శ్వేత.


తాన్వి, శ్వేత

క్రీడల ద్వారా కనెక్ట్ అయిన మహిళల సంఘంగా తాన్వి, శ్వేతలు ఏర్పాటు చేసిన 'సిస్టర్స్ ఇన్ స్వెట్' గురించి చెప్పుకోవచ్చు. ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ ప్లేయర్ అయిన తాన్వీ హన్స్ 2017లో ఢిల్లీ నుంచి బెంగళూరుకు వెళ్లింది. అక్కడ ఆమెకు శ్వేత సుబ్బయ్య పరిచయం అయ్యింది. తన ఫిట్‌నెస్ ఇన్‌స్ట్రక్టర్‌లలో శ్వేత ఒకరు. కొద్దిరోజుల్లోనే వారిద్దరి మధ్య మంచి స్నేహం కుదిరింది. ''ఒకసారి జరిగిన ఫ్రెండ్స్ పార్టీలో లేడీస్ అంతా 'మాకు కూడా క్రీడలు నేర్పించవచ్చు కదా! అని అడిగారు. దాంతో ఆ వీకెండ్‌లో ఒక గ్రౌండ్ బుక్ చేసి, కొంతమంది మహిళలను ఆహ్వానించాం. అదొక ఫన్ సెషన్ అనుకున్నాం. నలుగైదుగురు వస్తారు అనుకుంటే ఏకంగా 17 మంది మహిళలు వచ్చారు' అని నాటి రోజులను గుర్తుచేసుకుంటుంది తాన్వి.

సరదాగా మొదలై..

35 ఏళ్ల వయసున్న మహిళల కోసం గంటన్నర స్పోర్ట్స్ సెషన్‌ను మొదటిసారి ఏర్పాటు చేశారు. ఆ సమయంలో శ్వేత ఫిట్‌నెస్ ట్రైనర్‌గా... తాన్వి క్రీడల కోసం మహిళలు తమ శరీరాన్ని ఎలా సిద్ధం చేసుకోవాలో వివరించింది. అంతా సరదాగా జరిగిన ఈ కార్యక్రమం తర్వాత కొత్త ఆలోచనకు దారి వేసింది. 'ఆ మొదటి సెషన్ తర్వాత లేడీస్ మా వద్దకు వచ్చారు. ఈ ప్రోగ్రామ్ చాలా బాగుందని, ప్రతి వారాంతంలో తమకోసం ఓ సెషన్ ఏర్పాటు చేయాలని కోరారు. అలా ఈ కమ్యూనిటీ మొదలైంది' అని వివరిస్తుంది తాన్వి. స్కూళ్లు, కాలేజీల తర్వాత క్రీడల నుండి తప్పుకుంటున్న మహిళల ఆలోచనల్లో తిరిగి స్పోర్ట్స్ పట్ల జీవం పోయడమే తమ ధ్యేయంగా చెబుతారు వీరు. ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, టచ్ రగ్బీతో సహా ఇతర స్పోర్ట్స్ ఫార్మాట్‌లతో ఈ గ్రూప్ రన్ అవుతోంది.

అన్ని వయసుల వారూ..

''2017లో మొదటి సెషన్ ప్రారంభమైనప్పుడు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసున్న మహిళలు అని మాత్రమే అనుకున్నాం. ఆ తర్వాత సగటు వయసు 25 నుంచి 30కి చేర్చాం. కానీ, మాతో ఆడుకోవడానికి ఉత్సాహం చూపే 12–14 ఏళ్ల వయసున్న అమ్మాయిలు కూడా ఉన్నారు. అలాగే, 65 ఏళ్ల మహిళలు కూడా ఆసక్తి చూపారు. అలా చిన్న వయసు నుంచి సీనియర్ మహిళల వరకు అందరూ మా గ్రూప్‌లో ఉన్నారు. వీరితోపాటు పరిశ్రమల యజమానులు, తల్లులు, గృహిణులు, విద్యార్థులూ ఉన్నారు. కాలేజీల్లో ఆడుకోవడానికి విద్యార్థులకు అవకాశం ఉందని మొదట్లో మేం అనుకునేవాళ్లం. కానీ, అలాంటి వ్యవస్థ చాలా వరకు మన విద్యా సంస్థల్లో లేదని తెలిసింది. మొత్తమ్మీద వివిధ రకాల ప్రొఫైల్స్ మా వద్దకు చేరాయి. సాధారణంగా క్రీడలు అబ్బాయిలు, పురుషుల కోసమే అనే ఆలోచన మన సంస్కృతిలో పాతుకుపోయాయి. స్కూల్ స్థాయిలో మన దగ్గర కొన్ని విద్యా సంస్థలు అమ్మాయిలకు క్రీడల్లో అవకాశాలను ఇస్తాయి. కానీ, వారి ఎంపికలో చాలా వ్యత్యాసాలు ఉంటాయి. కాలేజీల్లోనూ ఇదే తేడా కనిపిస్తుంది. అందువల్లే, క్రీడల్లో పాల్గొనాలని ఉన్నా మహిళలు డ్రాప్‌ఔట్ అవుతుంటారు. వీటన్నింటినీ ఆలోచించి మేం ఈ ఏర్పాటు చేశాం' అని తాన్వి చెబుతుంది. 'మహిళలు ఇతర మహిళలతో ఆడుకోవడానికి మేం అవకాశాలు కల్పిస్తున్నాం. దీని వల్ల వారు సుఖంగా, సురక్షితంగా ఉంటారు. తమ కోసం మంచి సమయం గడుపుతారు' అంటుంది శ్వేత.

ఆడుకోవడానికి ఉత్సాహం చూపే 12-14 ఏళ్ల వయసున్న అమ్మాయిలు కూడా ఉన్నారు. అలాగే, 65 ఏళ్ల బామ్మలు కూడా ఆసక్తి చూపారు. అలా చిన్న వయసు నుంచి సీనియర్ మహిళల వరకు అందరూ మా గ్రూప్‌లో ఉన్నారు.

బెంగళూరులో ప్రతివారం ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, టచ్ రగ్బీ సెషన్స్ నిర్వహిస్తున్నారు ఈ టీమ్. అలాగే, ప్రతి ఆదివారం, మూడు నెలలకోసారి సైక్లింగ్ ఈవెంట్‌లను నిర్వహిస్తున్నారు. స్విమ్ సెషన్స్ కూడా నిర్వహిస్తూ తమ బృంద సభ్యులను మరింత ఉల్లాసపరుస్తున్నారు. ఇందుకోసం స్పెషల్‌గా తమలోనే కోచ్‌లను నియమించుకుంటున్నారు. ఆసక్తి ఉన్నవాళ్లు ఎవరైనా వీరి బృందంలో చేరవచ్చు. 'ఈ స్పోర్ట్స్ కమ్యూనిటీలో చేరడానికి మహిళలు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. క్రీడల్లో పాల్గొనడానికి మాత్రం నామమాత్రపు రుసుము చెల్లించాలి' అని చెబుతున్నారు తాన్వీ, శ్వేత.

ప్రతి ఈవెంట్‌కు స్పాన్సర్లను వెతకడం, వాటి ద్వారా ఖర్చులు తగ్గించడం వల్ల క్రీడల్లో పాల్గొనే మహిళలు ఈ సెషన్స్‌లో సంతోషంగా పాల్గొంటున్నారని వివరిస్తున్నారు.

ఎంబ్రాయిడరీ ఎంపవర్‌మెంట్


షీలాపావెల్

తోడా ఆదివాసీ మహిళలు



తోడా ఆదివాసీలు... నీలగిరుల్లో ఉంటారు. వారి జీవనం ప్రకృతి ఒడిలో ప్రకృతితో మమేకమై సాగుతుంది. వారి చేతిలో రూపుదిద్దుకున్న ఎంబ్రాయిడరీ డిజైన్‌లు కూడా వారు నివసిస్తున్న ప్రకృతి సౌందర్యాన్ని ప్రతిబింబిస్తాయి. పూలు, లతలు, పౌరాణిక గాథలు కుట్టులో రూపుదిద్దుకుంటాయి. తెల్లటి వస్త్రం, గోధుమ వర్ణంలోని వస్త్రం మీద నల్లటి దారాలతో ఈ ఎంబ్రాయిడరీ చేస్తారు. సాధారణంగా ఎంబ్రాయిడరీ చేస్తే ఒక వైపు చక్కటి డిజైన్ కనిపిస్తే వెనుక వైపు దారాల ముడులుంటాయి. తోడా ఆదివాసీలు చేసే ఎంబ్రాయిడరీలో రెండు వైపులా డిజైన్ అందంగా కనిపిస్తుంది. ఇలాంటి అందమైన పనితనం కొండలకే పరిమితమైపోతే ఎలాగ అనుకున్నారు షీలాపావెల్. నీలగిరుల్లో తోడా ఆదివాసీలు నివసించే కుగ్రామాలన్నింటిలో పర్యటించారామె. వారిని స్వయం సహాయక బృందంగా సంఘటితపరిచారు. 'షాలోమ్ ఊటీ' పేరుతో తోడా ఆదివాసీ మహిళలను ఒక వేదిక మీదకు తీసుకువచ్చారు షీలా పావెల్. ఇప్పుడు తోడా ఆదివాసీ మహిళలు వారానికి ఐదు వందల నుంచి ఐదు వేల రూపాయలు సంపాదించుకోగలుగుతున్నారు. 'వారి చేతిలో ఉన్న కళ గొప్పతనం వారికి తెలియజేశాను, ఆ కళను ప్రపంచానికి పరిచయం చేశాను' అన్నారు షీలా పావెల్.


ఎంబ్రాయిడరీ చేస్తున్న ఆదివాసీ మహిళ

సాధికారత కుట్టారు

షీలా పావెల్ వయసు 59. తమిళనాడులోని ఊటీలో నివసిస్తారు. ఆమె 2005లో షాలోమ్ ఊటీ స్వయం సహాయక బృందాన్ని ప్రారంభించారు. అప్పుడు 250 మందితో మొదలైన బృందంలో ఇప్పుడు 150 మంది చురుగ్గా ఉన్నారు. అప్పటి సంగతులను తెలియచేస్తూ ''తోడా ఆదివాసీ మహిళల చేతిలో ఏం నైపుణ్యం ఉందో తెలియదు. అందమైన ఎంబ్రాయిడరీతో చక్కటి శాలువాలు వాళ్ల చేతిలో రూపుదిద్దుకోవాల్సిందే. ఈ మహిళలు తాము ఎంబ్రాయిడరీ చేసిన శాలువాలను సమీపంలోని ఊటీ పట్టణానికి తెచ్చి అమ్ముకునేవారు. ఊటీలో దుకాణాల వాళ్లు తక్కువ ధరకు కొని వాటిని పర్యాటకులకు మంచి ధరకు అమ్ముకునేవారు. ఈ మహిళలకు మరొక ప్రపంచం తెలియకపోవడంతో ఆ వచ్చిన డబ్బుతో సంతృప్తి పడేవారు. వారిని సంఘంగా ఏర్పరిచి, వారు తయారు చేసిన శాలువాలు, కీ చైన్‌లు, మఫ్లర్‌లు, పర్సులు వంటి వాటిని తమ బృందం పేరుతో లేబుల్ అతికించి అమ్మడం మొదలు పెట్టారు. వ్యవస్థీకృతంగా లేని పనిని, కళ చేతిలో ఉన్న వారిని వ్యవస్థీకృతం చేయడమే నేను చేసింది. అప్పట్లో షాల్ కోసం వాళ్లు తీసుకునే క్లాత్‌కంటే కొంచెం మెరుగైన క్లాత్ కొని ఇవ్వడం, మార్కెటింగ్ మెళకువలు నేర్పించడం వంటివి చేశాను. గతంలో ఐదు వందలకు అమ్మిన శాలువాలను ఇప్పుడు వెయ్యి రూపాయలకు అమ్మగలుగుతున్నారు. నా కళ్లముందే వారి జీవన స్థాయులు పెరిగాయి. నేను కోరుకున్న లక్ష్యాలు రెండూ నెరవేరాయి. వీరి కళ విలువ వీరికి తెలిసింది, వీరి కళ గురించి బయటి ప్రపంచానికి తెలిసింది. క్రాఫ్ట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో అనుసంధానం చేయగలిగాను. తోడా ఎంబ్రాయిడరీ వస్తువులు చెన్నై, బెంగళూరు, ముంబయి, హైదరాబాద్‌లో కూడా లభిస్తున్నాయిప్పుడు.

కళ కొనసాగాలి

ఈ కళ ఎదుర్కొంటున్న మరో చాలెంజ్ ఏమిటంటే... కొత్తతరం ఈ ఎంబ్రాయిడరీ నేర్చుకోవడం లేదు. చదువుకుని ఉద్యోగాలకు వెళ్లడం మంచి పరిణామమే. కానీ ఈ కళను కూడా నేర్చుకోవచ్చు కదా అనిపిస్తుంది. తోడా ఆదివాసీల జనాభా పదమూడు వందలుంటే అందులో ఏడు వందల వరకు మహిళలున్నారు. డెబ్బై ఏళ్ల వాళ్లతో కలుపుకుంటే ఈ ఎంబ్రాయిడరీ వచ్చిన వాళ్లు మూడు వందలలోపే ఉన్నారిప్పుడు. ఇతరులకు నేర్పించే ఆలోచనలో ఉన్నాను'' అని తెలియ చేశారు షీలా పావెల్.

యూత్ పల్స్

నేస్తమా పుస్తకం విందామా!



పుస్తకం హస్తభూషణం అన్నారు. చేతిలో ఉండాల్సిన పుస్తకం 'ఆడియో బుక్స్' రూపంలో చెవికి చేరువవుతోంది. వ్యక్తిత్వ వికాసం నుంచి కాల్పనిక సాహిత్యం వరకు పుస్తకాలను 'ఆడియో బుక్స్' రూపంలో వినడానికి యూత్ ఆసక్తి ప్రదర్శిస్తోంది...

పుస్తకాలు బాగా చదివే అలవాటు ఉన్న బెంగళూరుకు చెందిన విరజ, పుస్తకాల విలువ గురించి తెలుసుకొని వాటిపై ప్రేమ పెంచుకున్న భోపాల్‌కు చెందిన చైత్రకు పుస్తకాలకు చేరువ కావడానికి ఒకప్పుడు టైమ్ దొరికేది కాదు. ఇప్పుడు మాత్రం వీరిద్దరికి మాత్రమే కాదు యువతరంలోని ఎంతోమందికి పుస్తకాలు దగ్గర కావడానికి 'టైమ్' అనేది సమస్య కావడం లేదు. దీనికి కారణం... ఆడియో బుక్స్.

మిలీనియల్స్, జెన్‌జెడ్ జెనరేషన్‌కు 'ఆడియో బుక్స్' హాట్ ఫేవరెట్‌గా మారాయి.

'ఒక పుస్తకం చదవడానికి రకరకాల కారణాల వల్ల నెల రోజులు పట్టిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఆడియో బుక్స్ వారానికి ఒకటి వినగలుగుతున్నాను. వినడం పూర్తయిన వెంటనే ఆ పుస్తకానికి సంబంధించిన నోట్స్ రాసుకుంటాను' అంటుంది విరజ.

గూగుల్ ప్లేలో ఆడియో బుక్స్ సెక్షన్ ప్రారంభమైన కొత్తలో యువత అంత దగ్గర కాలేదు. అయితే ఇప్పుడు దృశ్యం మారింది. వారి ప్రధానమైన ఆసక్తులలో 'గూగుల్ ఆడియో బుక్స్' కూడా ఒకటి.

గూగుల్ ప్లేలో డబ్బు చెల్లించే ఆడియో బుక్స్‌తో పాటు చెల్లించనవసరం లేనివి కూడా ఉన్నాయి.

'ఓకే గూగుల్, హూ ఈజ్ అథర్?' 'ఓకే గూగుల్, స్టాప్ ప్లేయింగ్ ఇన్ 20 మినిట్స్'...ఇలాంటి కమాండ్స్ గూగుల్ అసిస్టెంట్‌కు ఇవ్వవచ్చు.

గ్లోబల్ ఆడియో బుక్స్ మార్కెట్ లీడర్‌గా ఉన్న 'ఆడిబుల్' ఇండియన్ మార్కెట్‌లోకి ప్రవేశించిన తరువాత ఆడియో బుక్స్‌కు ఊపు వచ్చింది. రకరకాల వయసుల వారిని దృష్టిలో పెట్టుకొని 'ఆడిబుల్ ఇండియా'లో వేలాది ఆడియో బుక్స్‌ను రొమాన్స్, థ్రిల్లర్, ఆధ్యాత్మికం, హారర్, డ్రామా జానర్‌లలో తీసుకువచ్చారు.

ఇంగ్లిష్‌తో సహా హిందీ, మరాఠీ, ఉర్దూ, బెంగాలీ... మొదలైన భాషలలో ఆడియో బుక్స్ ఉన్నాయి.

'ఆడియో బుక్స్ సక్సెస్ కావడానికి కారణం మన మూలాల్లోనే ఉంది. చిన్నప్పుడు కథలను వినేవాళ్లం' అంటుంది ముంబైకి చెందిన స్మిత.

ఒక పుస్తకం విజయాన్ని అంచనా వేసే ప్రమాణాలలో ఆడియో బుక్స్ కూడా చేరాయి. మాతృభాషలో పుస్తకాలు చదవడానికి ఇబ్బంది పడే యువతరానికి ఆడియో బుక్స్ ఆత్మీయనేస్తాలయ్యాయి.

'పాడ్‌కాస్ట్‌తో పాటు ఆడియో బుక్స్‌కు ఆదరణ పెరిగింది' అంటున్నాడు 'వన్ బై టు' మీడియా కో–ఫౌండర్ రాజేష్ తాహిల్.

ఫిక్షన్, రొమాన్స్ జానర్స్ కోసం యాపిల్ బుక్ 'మాడిసన్' 'జాక్సన్' 'హెలెన్' అనే డిజిటల్ నేరేటర్‌లను క్రియేట్ చేసింది.

యూఎస్, యూరోపియన్ దేశాలలో పబ్లిషర్స్‌కు ఆడియో కంటెంట్ క్రియేట్ చేయడానికి సొంతంగా స్టూడియోలు ఉన్నాయి. మన దేశంలో అలాంటి పరిస్థితి వచ్చినట్లు లేదు. ఒక ఆడియో బుక్‌కు కనీసం లక్ష రూపాయలు ఖర్చు అవుతుందని అంచనా.

'స్పాటిఫై' అనగానే గుర్తుకు వచ్చేది సంగీతం. ఆడియో బుక్స్ ఆదరణను పసిగట్టిన ఈ డిజిటల్ మ్యూజిక్ సర్వీస్ యూఎస్‌తో పాటు నాలుగు దేశాల్లో ఆడియో బుక్ ఫీచర్‌ని ప్రవేశపెట్టింది. మూడు లక్షల ఆడియో బుక్స్‌ను తీసుకువచ్చిన 'స్పాటిఫై' యూజర్‌ల కోసం 'ఆడియో కామెంట్' తీసుకురానుంది.

ఆడియో బుక్ ఇండస్ట్రీ ఊపందుకోవడాన్ని గమనించిన పబ్లిషర్‌లు రానున్న రోజుల్లో ఆడియో బుక్స్ స్పేస్‌ను పెంచాలనుకుంటున్నారు. క్లాసిక్స్‌పై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.

'గతంతో పోల్చితే ఆడియో బుక్స్ వినడానికి వెచ్చిస్తున్న టైమ్ పెరిగింది' అంటున్నాడు 'స్టోరీ టెల్ ఇండియా' కంట్రీ మేనేజర్ యోగేష్ దశరథ్.

ఆడియో బుక్స్ యూత్‌ను ఆకట్టుకోవడానికి ప్రధాన కారణం ప్రయాణాలలో, బారెడు క్యూలలో నిలబడిన సందర్భాలలో కూడా వాటిని వినే అవకాశం ఉండడం. కొందరైతే వ్యాయామాలు చేస్తూ కూడా ఆడియో బుక్స్ వింటున్నారు.

'ఆడియో బుక్స్ వల్ల పుస్తకం చదివే దృశ్యం అదృశ్యం కానుందా?' అనే ప్రశ్నకు ఇంజనీరింగ్ స్టూడెంట్ సౌమ్య మాటల్లో జవాబు దొరుకుతుంది.

'పుస్తకం చదవడం అంటేనే నాకు ఇష్టం. అంతమాత్రాన ఆడియో బుక్స్‌కు దూరం కాలేదు. సమయ సందర్భాలను బట్టి చదవాలా, వినాలా అనేదాన్ని ఎంచుకుంటాను' అంటుంది సౌమ్య.

ఆడియో బుక్ రీడ్ బై సెలబ్రిటీ


సోహా అలీఖాన్

ఆడియో బుక్స్ విజయంలో పుస్తకంలోని కంటెంట్‌తో పాటు నేరేటర్ ప్రతిభ కూడా ఆధారపడి ఉంటుంది. వినే కొద్దీ వినాలనుకునే గొంతులు ఆడియో బుక్స్ విజయంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. 'ఆడియో బుక్ రీడ్‌బై సెలబ్రిటీస్' ధోరణి మన దేశంలోనూ పెరగనుంది. ఆడియో బుక్ రీడింగ్‌లో బాలీవుడ్ నటి సోహా అలీఖాన్ మంచి పేరు తెచ్చుకుంది. వుడీ ఎలెన్ 'కౌంట్ డ్రాకులా'తో పాటు ఎన్నో పుస్తకాలు ఆమె స్వరంలో యువత మంత్రముగ్ధులై విన్నారు.



సాకేత్ జోడీ శుభారంభం

అట్లాంటా ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నీలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. అమెరికాలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్, ఢిల్లీ ఆటగాడు యూకీ బాంబ్రీ ద్వయం 6-3, 6-4తో కెవిన్ కింగ్-ఆండ్రెస్ మార్టిన్ (అమెరికా) జంటపై గెలిచింది. 68 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకేత్, యూకీ ఒక ఏస్ సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశారు.



పోరాడి ఓడిన అంకిత రైనా

వార్సా ఓపెన్ డబ్ల్యూటీఏ-250 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ అంకిత రైనా పోరాటం ముగిసింది. పోలాండ్‌లో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 200వ ర్యాంకర్ అంకిత రైనా 6-4, 4-6, 6-7 (4/7)తో ప్రపంచ 95వ ర్యాంకర్ జోడీ బరేజ్ (బ్రిటన్) చేతిలో ఓడిపోయింది. 2 గంటల 37 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇద్దరూ తమ సర్వీస్‌లో తడబడ్డారు. 12 సార్లు చొప్పున తమ సర్వీస్‌ను చేజార్చుకున్నారు. అంకితకు 2,930 డాలర్ల (రూ. 2 లక్షల 39 వేలు) ప్రైజ్‌మనీ దక్కింది.

హైదరాబాద్, వైజాగ్‌లో క్రికెట్ కిక్

భారత జట్ల టెస్టు, టి20 మ్యాచ్‌లు కేటాయింపు ● స్వదేశంలో 2023-2024 సీజన్ షెడ్యూల్



ఉప్పల్ స్టేడియం



వైజాగ్ స్టేడియం

ముంబై: టీమిండియా సొంతగడ్డపై ఆడే షెడ్యూల్‌ను భారత్ క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పర్యటనలు-టెక్నికల్ కమిటీ మంగళవారం ఖరారు చేసింది. వచ్చే 2023-24 సీజన్‌కు సంబంధించిన షెడ్యూల్‌లో మేటి జట్లయిన ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లు ఉండటంతో క్రికెట్ కిక్ మరింత క్రేజీని పెంచనుందనడంలో అతిశయోక్తి లేదు. ఈ కొత్త సీజన్‌లో సొంతగడ్డపై టీమిండియా 16 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడుతుంది. ఇందులో 5 టెస్టులు, మూడు వన్డేలు, 8 టి20 మ్యాచ్‌లున్నాయి. ప్రతిష్టాత్మక వన్డే వరల్డ్‌కప్ భాగ్యానికి నోచుకోలేకపోయిన వేదికలకు ఈ సీజన్‌లో న్యాయం చేశారు. ఆయా రాష్ట్రాల క్రికెట్ ప్రియులకు గట్టి ప్రత్యర్థులతో వినోదాన్ని అందివ్వనున్నారు.

ఈ సీజన్ సంగతులివి...

కొత్త సీజన్ ఆస్ట్రేలియా జట్టు రాకతో మొదలవుతుంది. మెగా ఈవెంట్‌కు ముందు మూడు వన్డేల సిరీస్ ఆడుతుంది. మొహాలీ, ఇండోర్, రాజ్‌కోట్ 50 ఓవర్ల మ్యాచ్‌లకు వేదికలు కాగా... వన్డే ప్రపంచకప్ ముగిశాక ఐదు టి20ల ద్వైపాక్షిక టోర్నీ ఆడుతుంది. కొత్త ఏడాదిలో మూడు టి20లను అఫ్గానిస్తాన్‌తో ఆడుతుంది. ఇదయ్యాక వెంటనే ఇంగ్లండ్‌తో సమరానికి సిద్ధమవుతుంది. ఇరు జట్ల మధ్య జనవరి 25 నుంచి ఐదు టెస్టుల సిరీస్ మొదలవుతుంది.

ఇదీ... హైదరాబాద్, వైజాగ్ ముచ్చట

వచ్చే సీజన్ తెలుగు రాష్ట్రాల క్రికెట్ ప్రియుల్ని తెగ మురిపించనుంది. గట్టి ప్రత్యర్థి ఆసీస్‌తో ఐదు టి20ల సిరీస్ వైజాగ్‌లో మొదలైతే... హైదరాబాద్‌లో ముగుస్తుంది. ఈ నవంబర్ 23న వైజాగ్‌లోని వైఎస్ రాజశేఖరరెడ్డి క్రికెట్ స్టేడియంలో తొలి మ్యాచ్, డిసెంబర్ 3న హైదరాబాద్‌లో ఆఖరి మ్యాచ్ జరుగుతాయి. మళ్లీ కొత్త సంవత్సరం జనవరి 25-29 వరకు ఇంగ్లండ్‌తో తొలి టెస్టు హైదరాబాద్‌లో, ఫిబ్రవరి 2-6 వరకు రెండో టెస్టు వైజాగ్‌లోని వైఎస్ఆర్ స్టేడియంలో నిర్వహించనున్నారు.

స్వదేశంలో భారత జట్టు షెడ్యూల్		
ఆస్ట్రేలియా జట్టుతో మూడు వన్డేలు (2023)		
సెప్టెంబర్ 22	తొలి వన్డే	మొహాలి
సెప్టెంబర్ 24	రెండో వన్డే	ఇండోర్
సెప్టెంబర్ 27	మూడో వన్డే	రాజ్‌కోట్
ఆస్ట్రేలియా జట్టుతో ఐదు టి20లు (2023)		
నవంబర్ 23	తొలి టి20	వైజాగ్
నవంబర్ 26	రెండో టి20	త్రివేంద్రం
నవంబర్ 28	మూడో టి20	గువాహటి
డిసెంబర్ 1	నాలుగో టి20	నాగ్‌పూర్
డిసెంబర్ 3	ఐదో టి20	హైదరాబాద్
అఫ్గానిస్తాన్ జట్టుతో మూడు టి20లు (2024)		
జనవరి 11	తొలి టి20	మొహాలి
జనవరి 14	రెండో టి20	ఇండోర్
జనవరి 17	మూడో టి20	బెంగళూరు
ఇంగ్లండ్ జట్టుతో ఐదు టెస్టులు (2024)		
జనవరి 25-29	తొలి టెస్టు	హైదరాబాద్
ఫిబ్రవరి 2-6	రెండో టెస్టు	వైజాగ్
ఫిబ్రవరి 15-19	మూడో టెస్టు	రాజ్‌కోట్
ఫిబ్రవరి 23-27	నాలుగో టెస్టు	రాంచీ
మార్చి 7-11	ఐదో టెస్టు	ధర్మశాల

భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌పై
రెండు మ్యాచ్‌ల నిషేధం

బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో అనుచిత ప్రవర్తనపై ఐసీసీ చర్య



దుబాయ్: భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) చర్య తీసుకుంది. మైదానంలోనూ, మైదానం బయట క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించడంతో పాటు అనుచిత ప్రవర్తనకు పాల్పడటంతో హర్మన్‌పై ఐసీసీ రెండు అంతర్జాతీయ మ్యాచ్‌ల నిషేధం విధించింది. దీని ప్రకారం ఈ ఏడాది జరిగే ఆసియా క్రీడల్లో భారత్ ఆడే తొలి రెండు మ్యాచ్‌లకు హర్మన్ దూరం కానుంది.

వివరాల్లోకెళితే... గత శనివారం మిర్పూర్‌లో భారత్, బంగ్లాదేశ్ మహిళల మధ్య మూడో వన్డే జరిగింది. 'టై'గా ముగిసిన ఈ మ్యాచ్‌లో వేర్వేరు సందర్భాల్లో హర్మన్ దురుసుగా వ్యవహరించింది. ముందుగా తనను అంపైర్ అవుట్‌గా ప్రకటించడంతో అసంతృప్తిని వ్యక్తం చేస్తూ తన బ్యాట్‌తో స్టంప్స్‌ను బలంగా కొట్టి పడేయడంతో పాటు వెళుతూ వెళుతూ అంపైర్‌ను చూస్తూ ఏవో వ్యాఖ్యలు చేసింది. దీనిపై మూడు డీమెరిట్ పాయింట్లు శిక్షగా విధించగా, మ్యాచ్ ముగిసిన తర్వాతా అంపైరింగ్ ప్రమాణాలు బాగా లేవంటూ విమర్శించింది. దీనిపై ఒక డీమెరిట్ పాయింట్ శిక్ష పడింది. అనంతరం వేదికపై బంగ్లాదేశ్ కెప్టెన్ నిగార్ సుల్తానాతో కలిసి ట్రోఫీ అందుకునే సమయంలో 'మ్యాచ్ టై చేసింది అంపైర్లే తప్ప మీరు కాదు. ఫొటో దిగేందుకు వాళ్లనూ రమ్మనండి' అంటూ బంగ్లాదేశ్ ఆటగాళ్లను ఉద్దేశించి చెప్పింది. దీనిపై సుల్తానా కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తూ కాస్త మర్యాద నేర్చుకోమంటూ సహచరులతో కలిసి వేదిక నుంచి దిగేసింది. 4 డీమెరిట్ పాయింట్లు అంటే 2 సస్పెన్షన్ పాయింట్లతో సమానం. దాంతో రెండు మ్యాచ్‌ల నిషేధం పడింది. దీంతోపాటు ఆమె మ్యాచ్ ఫీజులో కూడా 75 శాతం కోత పడింది. ఐసీసీ లెవల్-2 నిబంధన ప్రకారం నిషేధానికి గురైన తొలి మహిళా క్రికెటర్ హర్మన్ కావడం గమనార్హం.

కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ

న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం కెరీర్ బెస్ట్ ర్యాంక్‌కు చేరుకుంది. మంగళవారం విడుదల చేసిన



తాజా ర్యాంకింగ్స్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ మూడు నుంచి రెండో ర్యాంక్‌కు చేరుకుంది. వీరిద్దరి ఖాతాలో 87,211 పాయింట్లు ఉన్నాయి. 91,629 పాయింట్లతో ఫజర్ అల్ఫియాన్-అర్దియాంతో (ఇండోనేసియా) ద్వయం టాప్ ర్యాంక్‌లో కొనసాగుతోంది. గతవారం సాత్విక్-చిరాగ్ జోడీ కొరియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో డబుల్స్ టైటిల్ గెలిచింది. ప్రస్తుతం జపాన్ ఓపెన్ టోర్నీలో ఈ జంట పోటీపడుతోంది.

ఖండాంతరాలను చుట్టొచ్చే పారిస్ ఒలింపిక్స్ టార్చ్ ఇదే



పారిస్: వచ్చే ఏడాది పారిస్ ఆతిథ్యమిచ్చే ఒలింపిక్స్ క్రీడలకు ముందు ఖండాంతరాలను చుట్టొచ్చే జ్యోతి (టార్చ్)ని మంగళవారం ఆవిష్కరించారు. 70 సెంటిమీటర్ల పొడవున్న ఈ సొగసైన మెరిసే టార్చ్ బరువు కేజిన్నర. తళతళ మెరిసే స్టెయిన్‌లెస్ స్టీల్‌తో దీన్ని డిజైన్ చేశారు. వచ్చే ఏడాది మే 8న ఒలింపిక్స్ జ్యోతి రిలే ప్రారంభవుతుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు పది వేల మంది టార్చ్‌ను పట్టుకొని పరుగులు తీయనున్నారు.

కేసీ పెయిర్ ఘనత



సిడ్నీ: ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీల్లో మ్యాచ్ ఆడిన అతి పిన్న వయస్కురాలిగా దక్షిణ కొరియా అమ్మాయి కేసీ పెయిర్ (16 ఏళ్ల 26 రోజులు) రికార్డు సృష్టించింది. కొలంబియాతో మంగళవారం జరిగిన మహిళల ప్రపంచకప్ మ్యాచ్‌లో కేసీ పెయిర్ కొరియా తరఫున 78వ నిమిషంలో బరిలోకి దిగింది. గతంలో ఈ రికార్డు ఐఫెనీ చిజ్నీ (నైజీరియా; 16 ఏళ్ల 34 రోజులు; 1999 ప్రపంచకప్‌లో) పేరిట ఉంది.

పాకిస్తాన్‌కు ఆధిక్యం

కొలంబో: శ్రీలంక, పాకిస్తాన్ జట్ల మధ్య రెండో టెస్టులో రెండో రోజు 10 ఓవర్ల ఆట సాధ్యపడింది. ఈ పది ఓవర్లలో పాక్ 33 పరుగులు చేసింది. వర్షంతో ఆట నిలిచే సమయానికి పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 38.3 ఓవర్లలో 2 వికెట్లకు 178 పరుగులు చేసి 12 పరుగుల ఆధిక్యాన్ని సంపాదించింది.

సంచలనాలతో బోణీ...

ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్, ప్రణయ్



ప్రణయ్

టోక్యో: జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో తొలి రోజు భారత అగ్రశ్రేణి క్రీడాకారులు అదరగొట్టే ప్రదర్శన చేశారు. పురుషుల సింగిల్స్‌లో హెచ్ఎస్ ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్ తమకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న ఆటగాళ్లను బోల్తా కొట్టించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రపంచ పదో ర్యాంకర్ ప్రణయ్ 21-17, 21-13తో ప్రపంచ ఆరో ర్యాంకర్, ఈ ఏడాది ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ చాంపియన్ లీ షి ఫెంగ్ (చైనా)పై... ప్రపంచ 20వ ర్యాంకర్ శ్రీకాంత్ 21-13, 21-13తో ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)పై సంచలన విజయాలు సాధించారు. లీ షి ఫెంగ్‌పై ప్రణయ్‌కిది వరుసగా మూడో విజయంకాగా... చౌ తియెన్ చెన్‌పై శ్రీకాంత్‌కిది రెండో గెలుపు. 2014లో హాంకాంగ్ ఓపెన్‌లో చౌ తియెన్ చెన్‌ను తొలిసారి ఓడించిన శ్రీకాంత్ ఆ తర్వాత ఈ చైనీస్ తైపీ ప్లేయర్‌తో ఆడిన ఆరుసార్లు ఓటమి చవిచూశాడు. మహిళల సింగిల్స్‌లో భారత రైజింగ్ స్టార్ ఆకర్షి కశ్యప్ పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. ప్రపంచ నంబర్‌వన్ అకానె యామగుచి (జపాన్)తో జరిగిన మ్యాచ్‌లో ఆకర్షి 17-21, 17-21తో ఓడిపోయింది.

మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ 11-21, 21-15, 21-14తో సయాకా హొబారా-యు సుజు (జపాన్) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ (భారత్) జోడీ 21-18, 9-21, 18-21తో యె హోంగ్ వె-లీ చియా సిన్ (చైనీస్ తైపీ) ద్వయం చేతిలో ఓడిపోయింది.



శ్రీకాంత్

సినిమా



● విజయ్ దేవరకొండ

జటాయు?

హీరో విజయ్ దేవరకొండ వరుస సినిమాలతో దూసుకెళుతున్నారు. ఇప్పటికే మూడు ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్న ఆయన తాజాగా ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో ఓ సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. శివ నిర్వాణ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ నటిస్తున్న తాజా చిత్రం 'ఖుషి'. ఈ సినిమా సెప్టెంబర్ 1న విడుదలకు సిద్ధమవుతుండగానే గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో 'వీడీ 12'(వర్కింగ్ టైటిల్), పరశురామ్ డైరెక్షన్‌లో 'వీడీ 13' (వర్కింగ్ టైటిల్) సినిమాలకు కొబ్బరికాయ కొట్టారు విజయ్. తాజాగా ఇంద్రగంటి-విజయ్‌ల కాంబినేషన్‌లో ఓ సినిమా రానుందంటూ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత 'దిల్' రాజు పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తారని టాక్. ఈ మూవీకి 'జటాయు' అనే టైటిల్‌ని పరిశీలిస్తోందట చిత్రబృందం. ఈ సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్ భారీగా ఉంటాయని, ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా ప్రారంభమయ్యాయని భోగట్టా. కాగా 'గీత గోవిందం' వంటి హిట్ తర్వాత విజయ్ దేవరకొండ - పరశురామ్ కాంబినేషన్‌లో ప్రారంభమైన 'వీడీ 13' చిత్రాన్ని 'దిల్' రాజు నిర్మిస్తున్నారు. ఈ సినిమా పూర్తయిన వెంటనే విజయ్-ఇంద్రగంటి కాంబినేషన్ చిత్రాన్ని ఆరంభించాలనుకుంటున్నారట 'దిల్' రాజు.

తారా తీరం



● రామ్ చరణ్ ● సూర్య ● ఎన్టీఆర్ ● నాగ చైతన్య

ప్రతీకారం కోసం ఒకరు... ఆట కోసం ఇంకొకరు. ప్రేమ కోసమై మరొకరు... ఇలా ఒక్కో కారణం కోసం ఒక్కో స్టార్ తీర ప్రాంతాలకు పయనమవుతున్నారు. తీర ప్రాంతాల నేపథ్యంలో ఆ తారలు చేస్తున్న చిత్రాలపై ఓ లుక్కేద్దాం.

గోవా... కంగువా

ఇటీవల విడుదలైన 'కంగువా' సినిమా గ్లింప్స్ వీడియోను బట్టి ఈ చిత్రం చారిత్రాత్మక నేపథ్యంతో సాగుతుందని ఊహించవచ్చు. కానీ కథ పరంగా ఈ చారిత్రాత్మక నేపథ్యం సినిమాలో కొంత భాగం వరకే ఉంటుందని, ఈ సినిమా కథ ప్రధానంగా తీర ప్రాంతమైన గోవా నేపథ్యంలో ఉంటుందనే వార్తలు వినిపిస్తున్నాయి. గత ఏడాది సెప్టెంబరు, అక్టోబరులో 'కంగువా' సినిమా గోవాలో ఓ భారీ షెడ్యూల్ చిత్రీకరణను పూర్తి చేసుకున్న సంగతి గుర్తుండే ఉంటుంది. ఇక సూర్య, దిశా పటానీ హీరో హీరోయిన్లుగా శివ దర్శకత్వంలో 'కంగువా' సినిమా తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. యూవీ క్రియేషన్స్‌తో కలిసి స్టూడియో గ్రీన్ జ్ఞానవేల్ రాజా ఈ సినిమా నిర్మిస్తున్నారు. 'కంగువా' రెండు భాగాలుగా రిలీజ్ కానుంది, తొలి భాగం తమిళ సంవత్సరాదికి ఏప్రిల్ 12న విడుదల కానుందనే టాక్ వినిపిస్తోంది.

ధనుష్‌తో జోడీ?

తెలుగు, తమిళ, కన్నడ, హిందీ చిత్రాలతో జోరు మీదున్నారు హీరోయిన్ రష్మికా మందన్న. వరుస చాన్స్‌లు అందుకుంటున్న ఈ బ్యూటీ తాజాగా హీరో ధనుష్‌కి జోడీగా నటించనున్నారని టాక్. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్ హీరోగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో గత ఏడాది నవంబరులో ఓ సినిమాకి శ్రీకారం జరిగిన సంగతి తెలిసిందే. సోనాలి నారంగ్ సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ చిత్రంలో ధనుష్ సరసన రష్మికా మందన్న నటించే చాన్స్ ఉందట. ఈ మేరకు చిత్ర యూనిట్ ఆమెతో చర్చలు జరుపుతోందని టాక్. ఇదే సినిమాలో హీరో నాగార్జున ఓ కీలక పాత్ర చేయనున్నారనే వార్తలు వస్తున్నాయి. ఇక ప్రస్తుతం రష్మిక తెలుగులో 'పుష్ప 2', రెయిన్ బో' చిత్రాలతో పాటు హిందీలో 'యానిమల్' మూవీ చేస్తున్నారు.



● రష్మికా మందన్న

గేమ్ స్టార్ట్

సముద్రతీర ప్రాంతాల్లో కబడ్డీ ఆడనున్నారట హీరో రామ్‌చరణ్. తొలి చిత్రం 'ఉప్పెన'తో దర్శకుడిగా ప్రేక్షకుల మెప్పు పొందిన బుచ్చిబాబు సన దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. వెంకట్ సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మించనున్నారు. ఇది స్పోర్ట్స్ డ్రామా అని సమాచారం. అలాగే ఈ సినిమా కథ 'ఉప్పెన' తరహాలో మత్స్యకారుల నేపథ్యంలో సాగుతుందట. అందుకే వైజాగ్, కాకినాడ వంటి లొకేషన్స్‌లో ఈ సినిమా మేజర్ షూటింగ్‌ని జరిపేలా చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తోందనే టాక్ వినిపిస్తోంది. అంతే కాదు.. కథ రీత్యా ఈ సినిమాలో రామ్‌చరణ్ అన్నదమ్ములుగా ద్విపాత్రాభినయం చేయనున్నారని, ఈ అన్నదమ్ముల్లో ఓ పాత్ర దివ్యాంగుడని భోగట్టా. ఇక ఈ సినిమాలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్, రష్మికా మందన్న, జాన్వీ కపూర్ వంటి వార్ల పేర్లు తెర పైకి వచ్చాయి. వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమా షూటింగ్ ఆరంభమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

తీర ప్రాంత దేవర

'జనతా గ్యారేజ్' వంటి హిట్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో 'దేవర' చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రకథ సముద్ర తీర ప్రాంతం నేపథ్యంలో ఉంటుందని ఈ సినిమా ప్రారంభోత్సవంలో కొరటాల శివ వెల్లడించిన సంగతి గుర్తుండే ఉంటుంది. దేశంలో విస్మరణకు గురైన సముద్ర తీర ప్రాంతంవారి నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందట. ఇందులో తండ్రీకొడుకులుగా ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని, ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే ఎన్టీఆర్ సీన్స్ సినిమాకు ప్రధాన హైలైట్‌గా ఉంటాయని టాక్. అలాగే 'దేవర' సినిమాకు సంబంధించిన ఓ షూటింగ్ షెడ్యూల్ గోవాలో జరగనుందని తెలిసింది. కాగా ఈ సినిమా ఆరంభం అయిన దగ్గర్నుంచి ఎక్కువగా యాక్షన్ సన్నివేశాలనే చిత్రీకరిస్తున్నారు. స్టంట్ కొరియోగ్రాఫర్స్ కెన్నీ బెట్స్, సాల్మోన్, పీటర్ హెయిన్స్ కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లను డిజైన్ చేశారు. ఈ సన్నివేశాలను ఎక్కువగా సెట్స్‌లోనే తీశారు. అయితే మేజర్ యాక్షన్ సీన్స్‌ను తీసిన తర్వాత టాకీ, సాంగ్స్‌పై ఫోకస్ పెడతారట. కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల కానుంది.

ప్రేమ తీరం

ప్రేమ తీరం చేరేందుకు సముద్రంలో బోటు డ్రైవర్‌గా ప్రయాణం చేయనున్నారట నాగచైతన్య. లవ్‌స్టోరీస్ సినిమాల్లో ఆడియన్స్‌ను ఎక్కువగా అలరిస్తుంటారు నాగ చైతన్య. 'ఏ మాయ చేసావె', 'ప్రేమమ్' వంటి ప్రేమ కథా చిత్రాలతో ఇప్పటికే ఈ విషయాన్ని నాగచైతన్య నిరూపించుకున్నారు. కాగా దర్శకుడు చందు మొండేటి ఇటీవల నాగచైతన్యకు ఓ ప్రేమకథ వినిపించారని, ఇందులో బోటు డ్రైవర్ అయిన మత్స్యకారుడి పాత్రలో నాగ చైతన్య నటిస్తారనే ప్రచారం జరుగుతోంది. సూరత్‌లో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా ఈ సినిమా కథ ఉంటుందనే టాక్ కూడా వినిపిస్తోంది. నాగచైతన్య కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో గీతా ఆర్ట్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుందని, ఇందులో కీర్తీ సురేష్ హీరోయిన్‌గా నటిస్తారనే ప్రచారం జరుగుతోన్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఈ సినిమా గురించి అధికారిక ప్రకటన రానుందని ఫిల్మ్‌నగర్ భోగట్టా.

రీల్స్

సుమన్‌కి నటకేసరి



శతాధిక చిత్ర దర్శకులు దివంగత కోడి రామకృష్ణ జయంతి వేడుకలు వాసవి ఫిల్మ్ అవార్డ్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగాయి. తెలుగు రాష్ట్రాల్లోని సామాజిక సేవా తత్పరులు, ప్రతిభావంతులకు ఈ పురస్కారాలు అందించారు. నటుడు సుమన్‌కి 'నట కేసరి' బిరుదు ప్రదానం చేశారు. ''కోడి రామకృష్ణగారి పేరు చిరస్థాయిగా నిలిచేలా చేయడమే ఈ పురస్కారాల ముఖ్యోద్దేశం'' అన్నారు నిర్వాహకులు టి. రామ సత్యనారాయణ, వీబీజీ రాజు, కొత్త వెంకటేశ్వరరావు. దర్శకులు కార్తీక్ వర్మ దండు, రామ్ అబ్బరాజు, వెంకట్ పెదిరెడ్ల, రచయిత భాను తదితరులు పురస్కారాలు అందుకున్నారు. కోడి రామకృష్ణ కుమార్తె, నిర్మాత కోడి దివ్య పాల్గొన్నారు.

నవ్వు.. ఎమోషన్...



● సంజయ్ రావు

సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా నటించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. ఏఆర్ శ్రీధర్ దర్శకత్వంలో అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో సంజయ్ రావు మాట్లాడుతూ– ''ఏఆర్ శ్రీధర్ ఈ సినిమా కథ చెబుతున్నప్పుడు నాన్నగారు (నటుడు బ్రహ్మాజీ) కూడా బాగా నవ్వుకున్నారు. మంచి కామెడీ ఫిల్మ్. క్లైమాక్స్‌లో ఎమోషనల్ సీన్స్ ఉన్నాయి. ఇక ఓ యాక్టర్‌గా పరిణితి చెందాలనే గ్యాప్ తీసుకున్నాను. 'పిట్టకథ'కు దర్శకత్వ విభాగంలో చేసిన సాయి కృష్ణతో ఓ సినిమా చేస్తున్నాను. తమిళంలో శింబు హీరోగా చేయనున్న సినిమాలో నేను నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్ర చేసే చాన్స్ ఉంది'' అన్నారు.


చనువుగా చూసిన...



● విరాట్ కర్ణ, ప్రగతి

విరాట్ కర్ణ, ప్రగతి శ్రీవాస్తవ జంటగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'పెదకాపు-1'. మిర్యాల రవీందర్ రెడ్డి ఈ సినిమా నిర్మిస్తున్నారు. శ్రీకాంత్ అడ్డాల గత చిత్రాలకు సంగీతం అందించిన మిక్కీ జె. మేయర్ ఈ చిత్రానికి కూడా సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలోని 'చనువుగా చూసిన...' అంటూ సాగే పాట ప్రోమోను విడుదల చేశారు మేకర్స్. ''పొలిటికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం 'పెదకాపు-1'. అణచివేత, ఘర్షణల నేపథ్యంలో కథ సాగుతుంది'' అని చిత్ర బృందం పేర్కొంది.

తారకాసుర 2 షురూ



● విజయ్, జైపాల్ ముదిరాజ్

కన్నడలో హిట్‌గా నిలిచిన 'తారకాసుర' చిత్రానికి సీక్వెల్‌గా తెలుగులో 'తారకాసుర 2' ఆరంభమైంది. విజయ్ భాస్కర్ రెడ్డి పాల్యం లీడ్ రోల్‌లో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి పటాన్ చెరువు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, జైపాల్ ముదిరాజ్ క్లాప్ కొట్టారు. పటాన్ చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ గౌరవ దర్శకత్వం వహించారు. ''తారకాసుర'ని అదే పేరుతో తెలుగులో రిలీజ్ చేయనున్నాం'' అన్నారు విజయ్ భాస్కర్ రెడ్డి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	29	66,356
నిఫ్టీ △	8	19,681

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	14,173	△	114
డోజోన్స్	35,449	△	88
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,692	△	13
డాక్స్	16,212	△	21
షాంఘై	3,232	△	67
నికాయ్	32,683	△	18

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	59,143	▽	291
బంగారం (22 క్యారట్)	58,906	▽	290
వెండి (కిలో)	73,939	▽	251

లాభాల్లోకి టాటా మోటార్స్

- క్యూ1లో ఆర్జన రూ. 3,301 కోట్లు
- రూ. 1,01,528 కోట్లకు ఆదాయం



న్యూఢిల్లీ: ఆటో రంగ దేశీ దిగ్గజం టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో రూ. 3,301 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 4,951 కోట్ల నికర నష్టం ప్రకటించింది. లగ్జరీకార్ల బ్రిటిష్ అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్‌రోవర్(జేఎల్ఆర్)తోపాటు వాణిజ్య వాహన బిజినెస్ పుంజుకోవడం కంపెనీ పటిష్ట పనితీరుకు దోహదపడ్డాయి. ఇక మొత్తం ఆదాయం సైతం రూ. 71,228 కోట్ల నుంచి రూ. 1,01,528 కోట్లకు జంప్‌చేసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 77,784 కోట్ల నుంచి రూ. 98,267 కోట్లకు ఎగశాయి. ఈ కాలంలో టాటా మోటార్స్ స్టాండెలోన్ నష్టం రూ. 181 కోట్ల నుంచి రూ. 64 కోట్లకు తగ్గింది. మొత్తం ఆదాయం రూ. 14,793 కోట్ల నుంచి రూ. 15,733 కోట్లకు బలపడింది.

జేఎల్ఆర్ జూమ్...

ప్రస్తుత సమీక్షా కాలంలో జేఎల్ఆర్ ఆదాయం 57 శాతం జంప్‌చేసి 6.9 బిలియన్ పౌండ్లను తాకగా.. 43.5 కోట్ల పౌండ్ల పన్నుకు ముందు లాభం ఆర్జించింది. కొత్త ఏడాదిని పటిష్టంగా ప్రారంభించినట్లు జేఎల్ఆర్ కొత్త సీఈవో అడ్రియన్ మార్డెల్ పేర్కొన్నారు. క్యూ1లో రికార్డ్ క్యాష్‌ఫ్లోను సాధించినట్లు వెల్లడించారు. ఈ ఏడాది మొత్తం క్యూ1 స్థాయి పనితీరు చూపగలమని విశ్వసిస్తున్నట్లు గ్రూప్ సీఎఫ్‌వో పీబీ బాలాజీ పేర్కొన్నారు. కాగా.. వాణిజ్య వాహన విభాగం ఆదాయం 4.4 శాతం పుంజుకుని రూ. 17,000 కోట్లను తాకింది. దేశీయంగా హోల్‌సేల్ అమ్మకాలు 14 శాతం క్షీణించి 82,400 యూనిట్లకు చేరగా.. రిటైల్ విక్రయాలు ఇదే స్థాయిలో నీరసించి 77,600 యూనిట్లకు పరిమితమయ్యాయి. ప్రయాణికుల వాహన విభాగం ఆదాయం 11 శాతం ఎగసి రూ. 12,800 కోట్లను తాకినట్లు కంపెనీ ఈడీ గిరీష్ వాగ్ తెలియజేశారు. అమ్మకాలు 8 శాతం వృద్ధితో 1,40,400 యూనిట్లకు చేరినట్లు వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు 1.6 శాతం లాభంతో రూ. 639 వద్ద ముగిసింది.

ఎల్అండ్‌టీ లాభం హైజంప్

- క్యూ1లో రూ. 3,116 కోట్లు
- రూ. 10,000 కోట్లతో బైబ్యాక్



న్యూఢిల్లీ: ఇంజినీరింగ్ దిగ్గజం ఎల్అండ్‌టీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 36 శాతం జంప్‌చేసి రూ. 3,116 కోట్లను తాకింది. ఇందుకు అధిక ఆదాయం సహకరించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,293 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 36,547 కోట్ల నుంచి రూ. 49,028 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 33,619 కోట్ల నుంచి రూ. 44,696 కోట్లకు పెరిగాయి. కాగా.. సొంత ఈక్విటీ షేర్ల కొనుగోలు(బైబ్యాక్)కి రూ. 10,000 కోట్లవరకూ వెచ్చించేందుకు బోర్డు ఆమోదించినట్లు కంపెనీ వెల్లడించింది. అంతేకాకుండా వాటాదారులకు షేరుకి రూ. 6 చొప్పున ప్రత్యేక డివిడెండును సైతం బోర్డు ప్రకటించింది. 2025–26కల్లా రిటర్న్ రేషియోలను మెరుగుపరచుకునే వ్యూహాత్మక లక్ష్యాలలో భాగంగా మిగులు నగదును వాటాదారులకు చేరవేయనున్నట్లు కంపెనీ సీఈవో, ఎండీ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో ఎల్అండ్‌టీ షేరు బీఎస్ఈలో 1.7 శాతం నష్టంతో రూ. 2,562 వద్ద ముగిసింది.

సైయంట్ లాభం రూ.168 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇంజనీరింగ్ సేవల్లో ఉన్న సైయంట్ జూన్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 45 శాతం ఎగసి రూ.168 కోట్లు సాధించింది. టర్నోవర్ రూ.1,250 కోట్ల నుంచి రూ.1,686 కోట్లకు ఎగసింది. డిజిటల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ (డీఈటీ) విభాగం ఆదాయం రూ.1,060 కోట్ల నుంచి రూ.1,450 కోట్లకు చేరింది. ఈ త్రైమాసికంలో డీఈటీ సెగ్మెంట్లో కంపెనీ రూ.400 కోట్ల ఆదాయాన్ని సమకూర్చే ఆరు పెద్ద డీల్స్‌ను అందుకుంది. డీఈటీ ఆర్డర్ బుక్ 32.5 శాతం అధికమై రూ.1,584 కోట్లకు చేరుకుంది.

సైయంట్ షేరు ధర బీఎస్ఈలో 1.16 శాతం క్షీణించి రూ.1,466.45 వద్ద స్థిరపడింది.

ఏషియన్ పెయింట్స్ ఫర్వాలేదు

- నికర లాభంలో 52 శాతం వృద్ధి
- మెరుగుపడిన మార్జిన్లు



న్యూఢిల్లీ: ముడి సరుకుల ధరలు తగ్గుముఖం పట్టడంతో జూన్ త్రైమాసికానికి ఏషియన్ పెయింట్స్ బంపర్ లాభాలను ప్రకటించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 52 శాతం పెరిగి రూ.1,575 కోట్లకు చేరుకుంది. డెకరేటివ్ పెయింట్స్ విభాగంలో అధిక అమ్మకాలు కూడా బలమైన పనితీరుకు కలిసొచ్చింది. క్రితం ఏడాది ఇదే కాలంలో కంపెనీ నమోదు చేసిన లాభం రూ.1,036 కోట్లుగా ఉంది. కన్సాలిడేటెడ్ ఆదాయం 6.7 శాతం పెరిగి రూ.9,154 కోట్లకు చేరుకుంది. తయారీలోకి వినియోగించే ముడి సరుకుల ధరలు తగ్గుముఖం పట్టడంతో సంస్థ వ్యయాలు పెద్దగా పెరగకుండా నియంత్రణలోనే ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో వ్యయాలు రూ.7,288 కోట్లు కాగా, సమీక్షా త్రైమాసికంలో అవి రూ.7,305 కోట్లుగా నమోదయ్యాయి. డెకరేటివ్ పెయింట్స్ విభాగంలో విలువ పరంగా, సంఖ్యా పరంగా రెండంకెల వృద్ధిని సంస్థ సాధించింది. ఇండస్ట్రియల్ పెయింట్స్ వ్యాపారంలో ఆదాయం రెండంకెల స్థాయిలో వృద్ధి చెందింది. అంతర్జాతీయ వ్యాపారం ఆదాయం 1.4 శాతం తగ్గి రూ.695 కోట్లుగా ఉంది.

చర్యల ఫలితం..: ''మొత్తం మీద రికార్డు స్థాయిలో మార్జిన్లు పెరిగాయి. ముడి సరుకుల ధరలు తగ్గడం, నిర్వహణ, ఫార్ములేషన్ పరంగా తీసుకున్న చర్యలు అనుకూలించాయి. ఆటో ఓఈ, ఇండస్ట్రియల్ కోటింగ్ వ్యాపారం రెండంకెల వృద్ధిని సాధించాయి. దీనికి ప్రొటెక్టివ్, పౌడర్ కోటింగ్ వృద్ధికి కూడా తోడైంది''అని ఏషియన్ పెయింట్స్ ఎండీ, సీఈవో అమిత్ సిగ్లే వివరించారు. హోమ్ డెకరేషన్ విభాగంలో ఫ్యాబ్రిక్స్, డెకరేటివ్ లైటింగ్, యూపీవీసీ డోర్లు, విండోలు మంచి వృద్ధిని చూస్తున్నాయని చెప్పారు. కాకపోతే కిచెన్, బాత్ విభాగాల్లో స్తబ్దత నెలకొన్నట్టు తెలిపారు. రానున్నది పండుగల సీజన్ కావడంతో బలమైన వృద్ధిని కొనసాగిస్తామన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

ఫలితాల నేపథ్యంలో ఏషియన్ పెయింట్స్ షేరు 4 శాతం క్షీణించి రూ.3,400 వద్ద ముగిసింది.

దక్షిణాదికి ఫుడ్‌లింక్


సంజయ్ వజిరాణి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లగ్జరీ క్యాటరింగ్ కంపెనీ ఫుడ్‌లింక్ ఎఫ్ అండ్‌బీ హోల్డింగ్స్ ఇండియా తాజాగా దక్షిణాదిన అడుగుపెట్టింది. హైదరాబాద్‌లో 15,000 చదరపు అడుగుల్లో అంతర్జాతీయ స్థాయి అత్యాధునిక కిచెన్‌తోపాటు గిడ్డంగిని ఏర్పాటు చేసింది. అంబానీ–పిరమల్, దీపిక–రణ్‌వీర్, కేఎల్ రాహుల్–అథియా శెట్టి, తెలుగు రాష్ట్రాల్లో ఎన్‌టీవీ, రెడ్డి ల్యాబ్స్ కుటుంబ సభ్యుల వివాహ వేడుకల క్యాటరర్‌గా వ్యవహరించిన ఫుడ్‌లింక్‌కు రోజుకు 10 లక్షలకుపైగా అతిథులకు ఆహారం అందించే సామర్థ్యం ఉంది. ఫోర్బ్స్ ఇండియా టాప్–100లోని 75% వ్యాపార సంస్థలు, వారి కుటుంబ సభ్యులకు సేవలు అందించినట్టు ఫుడ్‌లింక్ సీఈవో సంజయ్ వజిరాణి మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. 'లగ్జరీ క్యాటరింగ్, రెస్టారెంట్ల వ్యాపార విస్తరణకు హైదరాబాద్‌లో మూడేళ్లలో రూ.100 కోట్లు వెచ్చిస్తాం. ఇండియా బిస్ట్రో, చైనా బిస్ట్రో, గ్లోకల్ జంక్షన్, ఆర్ట్ ఆఫ్ దమ్ రెస్టారెంట్ల సంఖ్యను ఇప్పుడున్న 35 నుంచి 100కు చేరుస్తాం. ఈ ఆర్థిక సంవత్సరం రూ.450 కోట్ల టర్నోవర్ దాటుతాం. మూడేళ్లలో రూ.1,000 కోట్ల ఆదాయం ఆశిస్తున్నాం. అప్పుడు ఐపీవోకు వెళ్తాం' అని చెప్పారు.

మార్కెట్లో 'ఫెడ్' అప్రమత్తత

- ఒడిదుడుకుల ట్రేడింగ్‌లో స్వల్ప లాభాలు
- సెన్సెక్స్‌కు నష్టం.. నిఫ్టీకి లాభం



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు మంగళవారం మిశ్రమంగా ముగిశాయి. ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయం(నేటి రాత్రి), కీలక కంపెనీల క్యూ1 ఆర్థిక ఫలితాల వెల్లడి నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరల పెరుగుదల మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. సెన్సెక్స్ ఉదయం 146 పాయింట్ల లాభంతో 66,531 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 381 పాయింట్ల పరిధిలో 66,178 వద్ద కనిష్టాన్ని, 66,559 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 29 పాయింట్ల స్వల్ప లాభంతో 66,356 వద్ద నిలిచింది. నిఫ్టీ 57 పాయింట్లు పెరిగి 19,729 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ఇంట్రాడేలో 19,616 – 19,729 శ్రేణిలో ట్రేడైంది. ఆఖరికి ఎనిమిది పాయింట్ల స్వల్ప నష్టంతో 19,681 వద్ద నిలిచింది. బ్యాంకులు, ఎఫ్ఎంసీజీ, ఐటీ షేర్లలో రియల్టీ షేర్లలో అమ్మకాలు తలెత్తాయి. మెటల్, ఇంధన, ఆటో, ఫార్మా, మీడియా రంగాల చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్ నెలకొంది. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.39%, 0.31 శాతం చొప్పున రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,089 కోట్ల షేర్లను కొన్నారు.., దేశీ ఇన్వెస్టర్లు రూ.334 కోట్ల షేర్లను అమ్మేశారు. ఆర్థిక వేత్తలు అంచనాలకు తగ్గట్లే ఫెడ్ రిజర్వ్ కీలక వడ్డీ రేట్లు 25 బేసిస్ పాయింట్లు పెంచొచ్చనే ఆశలతో ప్రపంచ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- చైనాలో కోవిడ్ అనంతరం నెలకొన్న ఆర్థిక సవాళ్లను అధిగమించేందుకు అక్కడి ప్రభుత్వం భారీ ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించవచ్చనే వార్తలతో దేశీయ మెటల్ షేర్లకు డిమాండ్ నెలకొంది. బీఎస్ఈ మెటల్ ఇండెక్స్ మూడుశాతం ర్యాలీ చేసింది. జిందాల్ స్టీల్, హిందుస్థాన్ కాపర్, హిందాల్కో షేర్లు 5.50 – 4% ర్యాలీ చేశాయి. జేఎస్‌డబ్ల్యూ, ఏపీఎల్ అపోలో, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్, నాల్కో షేర్లు 3% లాభపడ్డాయి. సెయిల్, వేదాంత, అదానీ ఎంటర్‌ప్రైజెస్, ఎన్ఎండీసీ, హిందూస్థాన్ జింక్ షేర్లు రెండు శాతం ర్యాలీ చేశాయి.
- దేశీయ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో అదానీ గ్రూప్ షేర్లు లాభపడ్డాయి. అదానీ గ్రీన్ ఎనర్జీ 10%, అదానీ పవర్ 9.3% ర్యాలీ చేశాయి. అదానీ ట్రాన్స్‌మిషన్ 8%, అదానీ విల్మార్ 5%, అదానీ టోటల్ గ్యాస్, ఎన్‌డీటీవీ షేర్లు పెరిగి అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. ఈ గ్రూప్ చెందిన అంబుజా సిమెంట్స్ 4%, ఏసీసీ 5%, లాభపడ్డాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్ 2% పెరిగాయి. పది కంపెనీల షేర్ల ర్యాలీతో గ్రూప్ మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ ఒక్క రోజులోనే రూ.50,501 కోట్లకు పెరిగి రూ.10.60 లక్షల కోట్లకు చేరింది.
- టాటా స్టీల్ షేరు ఆరంభ నష్టాల నుంచి కోలుకొని లాభాల్లోకి వచ్చింది. చివరికి 3% లాభపడి రూ.119 వద్ద స్థిరపడింది.

విన్సిస్ ఐటీ @ రూ. 121-128

ఆగస్ట్ 1–4 మధ్య పబ్లిక్ ఇష్యూ

న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల కంపెనీ విన్సిస్ ఐటీ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూ ఆగస్ట్1న ప్రారంభంకానుంది. 4న ముగియనున్న ఇష్యూకి ధరల శ్రేణి షేరుకి రూ. 121–128గా కంపెనీ ప్రకటించింది. ఇష్యూలో భాగంగా రూ. 10 ముఖ విలువగల 38.9 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది. తద్వారా దాదాపు రూ. 50 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. చిన్నతరహా సంస్థల కోసం స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ ఏర్పాటు చేసిన ఎమర్జ్ ప్లాట్‌ఫామ్ ద్వారా కంపెనీ లిస్టుకానుంది. నిధులను వర్కింగ్ క్యాపిటల్, అనుబంధ సంస్థ రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. 2023 మార్చికల్లా కంపెనీ రూ. 157 కోట్ల ఆదాయాన్ని, రూ. 16 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

టీవీఎస్ సప్లై చైన్ ఐపీవోకు సెబీ గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ టీవీఎస్ సప్లై చైన్ సొల్యూషన్స్ మరోసారి పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. టీవీఎస్ మొబిలిటీ గ్రూప్ కంపెనీ ఇందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి తాజాగా అనుమతి పొందింది. ఇష్యూలో భాగంగా రూ. 750 కోట్ల విలువైన ఈక్విటీని జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 2 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. కంపెనీ ఏప్రిల్‌లో తాజాగా సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థలు టీవీఎస్ ఎల్ఐ యూకే, టీవీఎస్ ఎస్‌సీఎస్ సింగపూర్ రుణ చెల్లింపులకు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. టీవీఎస్ గ్రూప్ కంపెనీ ప్రధానంగా సమీకృత సరఫరా చైన్ సొల్యూషన్లు అందిస్తోంది. కాగా.. ఇండస్ట్రియల్ ప్యాకేజింగ్ సొల్యూషన్ల కంపెనీ పిరమిడ్ టెక్నోప్లాస్ట్ సైతం పబ్లిక్ ఇష్యూకి రానుంది. మార్చిలో ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసిన కంపెనీ ఇందుకు సెబీ నుంచి తాజాగా ఆమోదాన్ని పొందింది.

జాబ్ పాయింట్

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీలో 342 జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ).. జూనియర్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 342
» **పోస్టుల వివరాలు:** జూనియర్ అసిస్టెంట్(ఆఫీస్)–09, సీనియర్ అసిస్టెంట్ (అకౌంట్స్)–09, జూనియర్ ఎగ్జిక్యూటివ్(కామన్ కేడర్)–237, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఫైనాన్స్)–66, జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఫైర్ సర్వీసెస్)–03, జూనియర్ ఎగ్జిక్యూటివ్(లా)–18.
» **అర్హత:** పోస్టును అనుసరించి డిగ్రీ, బీకాం, ఐసీడబ్ల్యూఏ, సీఏ, ఎంబీఏ, బీఈ, బీటెక్, ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణతతోపాటు లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగి ఉండాలి.
» **వయసు:** 04.09.2023 నాటికి సీనియర్/ జూనియర్ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు, జూనియర్ ఎగ్జిక్యూటివ్‌కు 27 ఏళ్లు మించకూడదు.
» **పే స్కేల్:** నెలకు జూనియర్ ఎగ్జిక్యూటివ్‌కు రూ.40,000 నుంచి రూ.1,40,000, సీనియర్ అసిస్టెంట్‌కు రూ.36,000 నుంచి రూ.1,10,000, జూనియర్ అసిస్టెంట్‌కు రూ.31,000 నుంచి రూ.92,000.
» **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, కంప్యూటర్ లిటరసీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్, ఎండ్యూరెన్స్ టెస్ట్, డ్రైవింగ్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.08.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.09.2023.
» **వెబ్‌సైట్:** www.aai.aero

విజయనగరం జిల్లా డీసీహెచ్ఎస్‌లో వివిధ ఉద్యోగాలు

విజయనగరం జిల్లాలోని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ కార్యాలయం(డీసీహెచ్ఎస్), డిస్ట్రిక్ట్ హాస్పిటల్ కాంట్రాక్ట్/అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఏపీవీవీపీ హాస్పిటల్స్‌లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **పోస్టుల వివరాలు:** థియేటర్ అసిస్టెంట్–02, ఆడియో మెట్రీషియన్ /ఆడియోమెట్రిక్ టెక్నీషియన్–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో బీఎస్సీ/డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు థియేటర్ అసిస్టెంట్‌కు రూ. 15,000, ఆడియోమెట్రీషియన్‌కు రూ.32,670
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అవసరమైన ధ్రువపత్రాలను విజయనగరంలోని డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ కార్యాలయం(డీసీహెచ్ఎస్), డిస్ట్రిక్ట్ హాస్పిటల్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.07.2023.
» **వెబ్‌సైట్:** https://vizianagaram.ap.gov.in

జీజీహెచ్ కాకినాడలో వివిధ పోస్టులు

కాకినాడలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కాంట్రాక్ట్/అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 07
» **పోస్టుల వివరాలు:** థియేటర్ అసిస్టెంట్–01, మేల్ నర్సింగ్ ఆర్డర్లీ–04, ఫిమేల్ నర్సింగ్ ఆర్డర్లీ–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, డిప్లొమా, ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికేట్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.15,000 చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సూపరింటెండెంట్ కార్యాలయం, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, కాకినాడ, కాకినాడ జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 29.07.2023.
» **వెబ్‌సైట్:** https://eastgodavari.ap.gov.in

ఐఎఫ్‌బీ, హైదరాబాద్‌లో ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టులు

హైదరాబాద్ లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ(ఐఎఫ్‌బీ) ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 04
» **పోస్టుల వివరాలు:** జూనియర్ ప్రాజెక్ట్ ఫెలో(జేపీఎఫ్)–02, ప్రాజెక్ట్ అసిస్టెంట్–01, ఫీల్డ్ అసిస్టెంట్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి 10+2/బీఎస్సీ/ఎంఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వేతనం:** నెలకు రూ.17,000 నుంచి రూ.20,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఇంటర్వ్యూ వేదిక:** ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ(ఐఎఫ్‌బీ), దూలపల్లి, కొంపెల్లి (ఎస్.ఓ.), హైదరాబాద్, తెలంగాణ–500100.
» **ఇంటర్వ్యూ తేది:** 02.08.2023.
» **ఇంటర్వ్యూ సమయం:** ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.
» **వెబ్‌సైట్:** http://ifb.icfre.gov.in

ఇంటర్న్‌షిప్.. నైపుణ్యాలపై గురి!

చదువుకుంటూనే ఇండస్ట్రీ స్కిల్స్ సొంతం చేసుకుని.. జాబ్ మార్కెట్‌లో ముందంజలో నిలిచేందుకు మార్గం.. ఇంటర్న్‌షిప్! అకడమిక్‌గా చదువుకున్న సబ్జెక్ట్ అంశాలను వాస్తవ పరిస్థితుల్లో అన్వయించి.. రియల్ టైమ్ నైపుణ్యాలు అందుకునేందుకు అవకాశం కల్పిస్తుంది ఇంటర్న్‌షిప్!! అందుకే ఇప్పుడు ఏఐసీటీఈ అకడెమిక్స్‌లో ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేసింది. ఈ నేపథ్యంలో..ఇంటర్న్‌షిప్ ప్రాధాన్యత, విద్యార్థులకు ప్రయోజనాలు, అందుకునేందుకు మార్గాలపై ప్రత్యేక కథనం..

» ఇంటర్న్‌షిప్‌తో క్షేత్ర నైపుణ్యాల సాధన
» భవిష్యత్తు అవకాశాలకు మెరుగైన మార్గం
» ఇంటర్న్ ట్రైనీగా చూపిన ప్రతిభతో శాశ్వత కొలువు
» ఇంటర్న్‌షిప్ చేసేందుకు ఎన్నో మార్గాలు



ఇంజనీరింగ్, ఎంబీఏ ప్రోగ్రామ్‌ల కరిక్యులంలో ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేస్తూ.. ఏఐసీటీఈ మార్గదర్శకాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. విద్యార్థులు అప్పటి వరకు తాము అకడమిక్‌గా అధ్యయనం చేసిన అంశాలను.. వాస్తవ పరిస్థితుల్లో అన్వయించేలా క్షేత్రస్థాయిలో శిక్షణ పొందడమే ఇంటర్న్‌షిప్. ఆయా కోర్సులు చదువుతున్న సమయంలోనే క్షేత్ర నైపుణ్యాలు పొందేందుకు చక్కటి మార్గంగా ఇంటర్న్‌షిప్స్‌ను పేర్కొనొచ్చు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో అనుసరిస్తున్న విధానం ప్రకారం–ఇంటర్న్‌షిప్ అంటే విద్యార్థులు కొద్దిరోజుల పాటు ఏదైనా ఒక సంస్థలో వాస్తవ పని వాతావరణంలో విధులు నిర్వర్తించడం! దీనివల్ల విద్యార్థులకు సదరు ఇండస్ట్రీలోని క్షేత్ర పరిస్థితులపై అవగాహన లభించడమే కాకుండా.. తాజా నైపుణ్యాలు కూడా సొంతమవుతాయి.

క్రెడిట్స్ కేటాయింపు

ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం–బీటెక్‌లో చేరిన ప్రతి ఒక్కరూ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ల తర్వాత తప్పనిసరిగా ఇంటర్న్‌షిప్ చేయాలి. ప్రతిసారి రెండు నెలలు చొప్పును మొత్తంగా కోర్సు వ్యవధిలో ఆరు వందల నుంచి ఏడు వందల గంటల పాటు ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాలి. ఈ ఇంటర్న్‌షిప్స్‌కు ఏఐసీటీఈ క్రెడిట్స్‌ను కూడా కేటాయించింది. ప్రతి 40–45 గంటల వ్యవధికి ఒక క్రెడిట్ చొప్పున మొత్తం 14 నుంచి 20 క్రెడిట్స్ లభిస్తాయి. ఇప్పటికే పలు సెంట్రల్ యూనివర్సిటీలు, ఐఐఎంలు, ఐఐటీలు వంటి ప్రముఖ విద్యాసంస్థలు ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేస్తూ.. వాటిని తమ విద్యార్థులకు ఇప్పించడానికి ఇండస్ట్రీ వర్గాలతో ఒప్పందాలు కూడా చేసుకుంటున్నాయి.

అన్ని రకాల కోర్సులకు

ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటర్న్‌షిప్ అన్ని విభాగాలకు విస్తరిస్తోంది. కొన్నేళ్ల క్రితం వరకు ఇంటర్న్‌షిప్ అంటే టెక్నికల్, మేనేజ్‌మెంట్ విద్యార్థులకే అనే భావన ఉండేది. కానీ.. ఇటీవల కాలంలో ఇంటర్న్‌షిప్ ట్రెండ్ సంప్రదాయ, నాన్–టెక్నికల్ డిగ్రీ విభాగాలకూ విస్తరిస్తోంది. ముఖ్యంగా బ్యాచిలర్ డిగ్రీ విద్యార్థులకు ఈ–కామర్స్ సంస్థలు, స్టార్ట్–అప్ కంపెనీలు ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తున్నాయి. ఇందుకోసం తమ సంస్థల వెబ్‌సైట్స్ లేదా జాబ్ పోర్టల్స్ ద్వారా ప్రకటనలను విడుదల చేస్తున్నాయి.

ఇంటర్న్ ట్రైనీ అవకాశాలు

ఇంటర్న్‌షిప్ అవకాశాల కోసం ప్రస్తుతం పలు మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. కొన్ని సంస్థలు కోర్సు చివరి సంవత్సరంలో అడుగుపెట్టే విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి.. ఇంటర్న్ ట్రైనీగా పని చేసే అవకాశం కల్పిస్తున్నాయి. ఆ సమయంలో విద్యార్థుల డొమైన్‌కు అనుగుణంగా.. సంస్థలోని వివిధ విభాగాలను కేటాయిస్తున్నాయి. విద్యార్థులు తమ డొమైన్ సంబంధిత విభాగాల్లో, సంస్థల్లో ఇంటర్న్‌షిప్ కోసం అన్వేషణ సాగించి.. అవకాశాలు అందిపుచ్చుకోవాలి. దీనివల్ల భవిష్యత్తులో ఉద్యోగ సాధనలో ముందంజలో నిలిచే అవకాశం లభిస్తుంది అంటున్నారు నిపుణులు.

ఆన్‌లైన్ నియామకాలు

పలు సంస్థలు తమ వెబ్‌సైట్స్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో ఇంటర్న్ ట్రైనీ అవకాశాలు కల్పిస్తున్నాయి. తమ వెబ్‌సైట్‌లో కెరీర్స్/కరెంట్ ఆపర్చునిటీస్ ఆప్షన్‌లో ఇంటర్న్‌షిప్ ఖాళీల వివరాలు ప్రకటిస్తున్నాయి. వీటికి దరఖాస్తు చేసుకుని ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. ఇంటర్న్ ట్రైనీగా అవకాశం లభిస్తుంది. ఈ ఎంపిక ప్రక్రియలో సంస్థలు అభ్యర్థుల అకడమిక్ నైపుణ్యాలతోపాటు ప్రాక్టికల్ థింకింగ్, అనలిటికల్ స్కిల్స్‌ను పరిశీలించే విధంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నాయి.

జాబ్ సెర్చ్ పోర్టల్స్

ఇంటర్న్‌షిప్ అందుకునేందుకు మరో మార్గం.. జాబ్‌సెర్చ్ పోర్టల్స్. ఇవి.. క్లయింట్ సంస్థల్లోని ఇంటర్న్‌షిప్ ఖాళీల సమాచారాన్ని పొందుపరుస్తున్నాయి. గతంలో కేవలం జాబ్ లిస్టింగ్స్‌కే పరిమితమైన ఈ పోర్టల్స్.. ఇప్పుడు ఇంటర్న్ ఖాళీల వివరాలను కూడా అందుబాటులోకి తెస్తున్నాయి. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని అకడమిక్ వర్గాలు సూచిస్తున్నాయి.

సోషల్ వేదికలు

ట్విటర్, లింక్డ్‌ఇన్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలు సైతం ఇంటర్న్‌షిప్ అవకాశాల సమాచారాన్ని వెల్లడిస్తున్నాయి. వీటిల్లో ఆయా సంస్థలు, రంగాలకు చెందిన నిపుణులు పోస్టింగ్స్ పెడుతున్నారు. దీంతో.. విద్యార్థులు సోషల్ నెట్‌వర్కింగ్ సైట్స్ ద్వారా సదరు రంగాల్లోని నిపుణుల ద్వారా ఇంటర్న్ ట్రైనీ ఖాళీలకు సంబంధించిన వివరాలు తెలుసుకునే వీలుంది.

డిజిలాకర్‌లో సమాచారం

ఇంటర్న్‌షిప్ అవకాశాలను తెలుసుకునేందుకు ప్రభుత్వ స్థాయిలో సైతం పలు మార్గాలు అందుబాటులోకి వచ్చాయి. నేషనల్ ఈ–గవర్నెన్స్ విభాగంలోని డిజిలాకర్‌లో నిరంతరం తాజా ఇంటర్న్‌షిప్ ఖాళీలను పొందుపరుస్తున్నారు.

వీటిని అందుకోవాలంటే..అభ్యర్థులు డిజిలాకర్ ఇంటర్న్‌షిప్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుని దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో పనిచేసే డిజిలాకర్‌లో అధిక శాతం ఖాళీలు కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ తదితర సాంకేతిక విభాగాల్లోనే ఉంటున్నాయి. అదే విధంగా గ్రామీణ మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ జస్టిస్ వంటి ఇతర శాఖల్లోనూ ఇంటర్న్‌షిప్ నియామకాలు జరుగుతుంటాయి. కాబట్టి విద్యార్థులు వీటి కోసం ఆయా శాఖల వెబ్‌సైట్స్‌ను పరిశీలిస్తుండాలి.

ఐఐటీలు, ఐఐఎంల్లో ఇలా

దేశంలో ప్రతిష్టాత్మక విద్యా సంస్థలైన ఐఐటీలు, ఐఐఎంలు కార్పొరేట్ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. దీంతో బీటెక్ మూడో సంవత్సరం, ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్, ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ పేరుతో సంస్థల్లో ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తున్నాయి. ఇలా ఎంపికైన వారిని ఇంటర్న్ ట్రైనీగా పేర్కొంటున్నారు. వీరు ఆరు నుంచి ఎనిమిది వారాల వ్యవధిలో ఆయా సంస్థల్లో ఇంటర్న్ ట్రైనీగా రియల్ టైమ్ విధులు నిర్వర్తిస్తారు. అంతేకాకుండా సమ్మర్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్, ప్రీ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ పేరుతో ఇంటర్న్‌ట్రైనీగా ఎంపికైన వారికి సంస్థలు స్టయిఫండ్ పేరుతో ఆకర్షణీయ ఆర్థిక ప్రోత్సాహకాన్ని సైతం అందిస్తున్నాయి.

ఇంటర్న్‌షిప్ శిక్షణ

ఇంటర్న్‌షిప్ అందుకున్న అభ్యర్థులు సంస్థలో చేరిన తర్వాత చక్కటి పని తీరు చూపాలి. తమకు కేటాయించిన విభాగం, విధులకు సంబంధించి టీమ్ సభ్యులతో కలిసి పనిచేయాలి. ఏదైనా సందేహం తలెత్తితే.. టీమ్ లీడర్ లేదా ఇతర సీనియర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలి. ఇంటర్న్‌షిప్ సమయంలో సంస్థ ఉద్యోగి మాదిరిగా పూర్తి అంకితభావంతో పనిచేయాలి. ఫలితంగా క్షేత్ర నైపుణ్యాలతోపాటు భవిష్యత్ అవకాశాలకు మార్గం ఏర్పడుతుంది.

రియల్ టైమ్ స్కిల్స్

ఇంటర్న్ ట్రైనీగా ఇండస్ట్రీలో విధులు నిర్వహించడం ద్వారా రియల్ టైమ్ నైపుణ్యాలు లభిస్తాయి. వీటితోపాటు ఇంటర్ పర్సనల్ నైపుణ్యాలు, నెగోషియేషన్ స్కిల్స్, టీం వర్కింగ్ కల్చర్, డెసిషన్ మేకింగ్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలు వంటివి సొంతమవుతాయి. టీమ్ మెంబర్స్, టీమ్ లీడర్స్‌తో చర్చించి టాస్క్‌ని సమర్థవంతంగా పూర్తి చేయగలిగే నైపుణ్యం లభిస్తుంది. సంబంధిత రంగంలో.. తాజా పరిణామాల గురించి ఇతరులతో చర్చించడం, సమస్యకు తమ స్థాయిలోనే పరిష్కారం కనుగొనే విధంగా అనలిటికల్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్ వంటివి అలవడతాయి.

శాశ్వత కొలువు

ఇంటర్న్ ట్రైనీలు.. సంస్థలో శాశ్వత కొలువు సైతం సొంతం చేసుకునే వీలుంది. ఇంటర్న్ ట్రైనీగా చూపే ప్రతిభ, పనితీరు సంస్థ యాజమాన్యం మెచ్చే రీతిలో ఉంటే.. పూర్తి స్థాయి ఉద్యోగం కూడా లభిస్తుంది. ఐఐటీలు, ఐఐఎంల నుంచి ఆయా సంస్థల్లో ఇంటర్న్ ట్రైనీగా ఎంపికైన వారిలో 50 శాతం మేరకు.. శిక్షణ సందర్భంగా ప్రతిభ చూపి.. అదే సంస్థలో ఫైనల్ ప్లేస్‌మెంట్ ఆఫర్స్ అందుకుంటున్నారు.

క్లుప్తంగా...

ఆగస్ట్ 2 నుంచి డిపార్ట్‌మెంటల్ టెస్ట్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆగస్ట్ 2 నుంచి 7వ తేదీ వరకు డిపార్ట్‌మెంటల్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి జె.ప్రదీప్‌కుమార్ మంగళవారం తెలిపారు. హాల్‌టికెట్లను https:// psc.ap.gov.in లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

బీపీటీ, బీఎస్సీ పారామెడికల్ ఫలితాల విడుదల

లబ్బీపేట (విజయవాడ తూర్పు): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ బీపీటీ, బీఎస్సీ పారామెడికల్ ఫలితాలను మంగళవారం విడుదల చేసింది. ఈ ఏడాది జూన్, జూలైల్లో నిర్వహించిన బీపీటీ ఫస్టియర్ నుంచి నాలుగో సంవత్సరం వరకూ, బీఎస్సీ పారామెడికల్ ఫస్టియర్ నుంచి థర్డ్ ఇయర్ వరకూ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. రీటోటలింగ్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ.500 చెల్లించి ఆగస్ట్ 2లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పరీక్షల విభాగం కంట్రోలర్ శ్రీనివాసరావు సూచించారు.

విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించడంతోపాటు అన్ని యాజమాన్యాల్లోని విద్యార్థుల వివరాలను స్టూడెంట్ ఇన్ఫర్మేషన్ పోర్టల్‌లో నమోదు చేసేలా కలెక్టర్లు, డీఈవోలు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల యాజమాన్యాలు అందించిన విద్యార్థుల వివరాలను అధికారులు తనిఖీ చేసి ధ్రువీకరించాలన్నారు. ఇప్పటికే వలంటీర్లు చేసిన సర్వే ప్రకారం18 లక్షల మంది విద్యార్థుల పేర్లు ఇంకా స్టూడెంట్ ఇన్ఫర్మేషన్ పోర్టల్‌లో అప్‌డేట్ కాలేదన్నారు. గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో ప్రారంభించి బుధవారానికి వంద రోజులు అవుతున్నందున అన్ని స్కూళ్ల హెచ్‌ఎంలు అప్‌లోడ్ చేసేలా కలెక్టర్‌లు తీసుకోవాలన్నారు. విద్యార్థుల వివరాలు అప్‌లోడ్ చేయకుంటే కఠిన చర్యలు తప్పవని మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.



విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద జల కళ

ఆల్మట్టిలో పెరిగిన వరద ఉద్ధృతి

1.16 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

- 74.67 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ
- తుంగభద్రలోకి 83,842 క్యూసెక్కులు
- ప్రకాశం బ్యారేజ్ నుంచి 11,840 క్యూసెక్కులు సముద్రంలోకి

సాక్షి,అమరావతి/గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో మంగళవారం కృష్ణా ప్రధాన పాయలో వరద ప్రవాహం పెరిగింది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 1.16 లక్షల క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 74.67 టీఎంసీలకు చేరింది. విద్యుదుత్పత్తి చేస్తూ ఆల్మట్టి నుంచి విడుదల చేస్తున్న జలాలకు, స్థానికంగా కురిసిన వర్షాల వల్ల వస్తున్న వరద తోడవుతుండటంతో నారాయణపూర్ డ్యామ్‌లోకి 13,681 క్యూసెక్కులు చేరుతున్నాయి. నారాయణపూర్‌లో నీటి నిల్వ 20.36 టీఎంసీలకు చేరింది. కృష్ణా ప్రధాన పాయ, భీమా నుంచి జూరాల ప్రాజెక్టులోకి 10 వేల క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 8.53 టీఎంసీలకు చేరుకుంది. కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలోనూ వరద ఉద్ధృతి మరింత పెరిగింది. టీబీ డ్యామ్‌లోకి 83,842 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 32.86 టీఎంసీలకు చేరింది. జూరాలలో విద్యుదుత్పత్తిని ఆపేయడంతో శ్రీశైలంలోకి చేరుతున్న ప్రవాహం కనిష్ట స్థాయికి చేరుకుంది. మంగళవారం సాయంత్రం 6 గంటలకు 1236 క్యూసెక్కులు వస్తోంది. నీటి నిల్వ 37.08 టీఎంసీలకు చేరుకుంది. శ్రీశైలానికి దిగువన కురిసిన వర్షాల వల్ల సాగర్‌లోకి 6,438 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 142.44 టీఎంసీలకు చేరింది. మూసీ వరద పులిచింతలలోకి నిలకడగా కొనసాగుతోంది. ప్రాజెక్టుకు 12,560 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. ఇక్కడ నుంచి ప్రకాశం బ్యారేజీకు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువన మున్నేరు, కట్టలేరు, వైరా కూడా పరవళ్లు తొక్కుతున్నాయి. దీంతో బ్యారేజ్‌కు 11,840 క్యూసెక్కుల వరద వస్తోంది. బ్యారేజ్ 16 గేట్లను అడుగు మేర ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు సముద్రంలోకి వదిలేస్తున్నారు. పరివాహక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు బ్యారేజీకి 50 వేల క్యూసెక్కులు అంతకు మించి వరద పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. బ్యారేజీ దిగువ ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

సంగమేశ్వరుడిని సమీపిస్తున్న కృష్ణాజలాలు

కొత్తపల్లి (నంద్యాల): నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం పరిధిలోని సప్తనదుల సంగమ ప్రాంతంలో వెలసిన సంగమేశ్వరాలయాన్ని కృష్ణా జలాలు సమీపిస్తున్నాయి. సంగమేశ్వరాలయం వద్ద భీమలింగం కొలను పూర్తిగా మునిగిపోయి ఆలయ సమీపంలోని మెట్ల మార్గం వరకు చేరుకున్నాయి. దీంతో సందర్శకుల తాకిడి ఎక్కువైంది. సంగమేశ్వరుడిని దర్శించుకొనేందుకు భక్కులు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వస్తున్నారు.

గోదావరిలో మళ్లీ పెరుగుతున్న వరద

భద్రాచలం వద్ద 38.9 అడుగులకు నీటి మట్టం

- పోలవరం స్పిల్ వే ద్వారా 7,62,000 క్యూసెక్కులు దిగువకు
- కాటన్ బ్యారేజ్ నుంచి 6,76,760 క్యూసెక్కులు సముద్రంలోకి
- డెల్టా కాలువలకు 9,900 క్యూసెక్కులు విడుదల
- వరద మరింత పెరిగే అవకాశం



సాక్షి, అమరావతి/పోలవరం రూరల్/ధవళేశ్వరం: పరీవాహక ప్రాంతం (బేసిన్)లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటం, ఉప నదులు ఉప్పొంగుతుండటంతో గోదావరిలో వరద ఉద్ధృతి పెరుగుతోంది. మంగళవారం సాయంత్రం 6 గంటలకు భద్రాచలం వద్ద ప్రవాహం 7,59,015 క్యూసెక్కులకు పెరిగింది. దాంతో నీటి మట్టం 38.9 అడుగులకు చేరింది. పోలవరం ప్రాజెక్టు వద్దకు ఎగువ నుంచి వచ్చిన వరదను వచ్చినట్టుగా 48 గేట్ల ద్వారా అధికారులు దిగువకు వదిలేస్తున్నారు. పోలవరం నుంచి 7,62,000 క్యూసెక్కుల నీరు దిగువకు వెళుతోంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్‌లోకి 6,86,660 క్యూసెక్కులు చేరుతుండగా.. నీటి మట్టం 9.40 అడుగులకు చేరింది. గోదావరి డెల్టాకు 9,900 క్యూసెక్కులను వదులుతూ మిగులుగా ఉన్న 6,76,760 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఎగువన వరద పెరిగిన నేపథ్యంలో బుధవారం ధవళేశ్వరం బ్యారేజ్‌కి చేరే ప్రవాహం పెరగనుంది. గోదావరిలో ఎగువన తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజ్‌లోకి 5,79,730 క్యూసెక్కులు, తుపాకుల గూడెం వద్ద ఉన్న సమ్మక్క బ్యారేజ్‌లోకి 7.55 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం ప్రభావం వల్ల బుధవారం, గురువారం బేసిన్‌లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో గోదావరిలో వరద ఉద్ధృతి మరింత పెరిగే అవకాశం ఉంది.

బలపడిన అల్పపీడనం..

నేడు వాయుగుండం

- రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- ఎన్టీఆర్, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో కుండపోత
- మరో 3 రోజులు భారీవర్షాలు
- 6 జిల్లాలకు రెడ్ అలర్ట్

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరంలో ఏర్పడిన అల్పపీడనం బలపడింది. బుధవారానికి అది వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణశాఖ (ఐఎండీ) తెలిపింది. రుతుపవన ద్రోణి ప్రస్తుతం జైసల్మేర్ నుంచి ఉత్తరాంధ్ర మీదుగా సముద్రమట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో అల్పపీడన ప్రాంతం మధ్యలో పయనిస్తోంది. మరోవైపు కోస్తాంధ్ర, రాయలసీమలపై నైరుతి రుతుపవనాలు కూడా చురుగ్గా ఉన్నాయి. వీటి ప్రభావంతో విస్తారంగా కురుస్తున్న వర్షాలు మరో మూడురోజులు కొనసాగుతాయని ఐఎండీ మంగళవారం రాత్రి బులెటిన్‌లో వెల్లడించింది. బుధవారం అల్లూరి సీతారామరాజు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, పల్నాడు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ అత్యంత భారీవర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ జిల్లాలకు రెడ్ అలెర్ట్‌ను ప్రకటించింది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీవర్షాలు, ఎస్పీఎస్సార్ నెల్లూరు, అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తాయని వివరించింది. వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులు, పిడుగులు సంభవిస్తాయని, గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో గాలులు, తీరం వెంబడి 45 నుంచి 55.. గరిష్ఠంగా 65 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయంది. మూడురోజులు మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం హెచ్చరించింది. మంగళవారం భారీవర్షాలు కురిశాయి. ఎన్టీఆర్, శ్రీకాకుళం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. అనకాపల్లి జిల్లా గొలుగొండలో అత్యధికంగా 10.2, విశాఖ రూరల్‌లో 7.7 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

వైద్య విద్య యూజీ కోర్సుల ఫీజుల ఖరారు

- 2023–24 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ ఫీజులు ఖరారు
- ఎంబీబీఎస్ కన్వీనర్ కోటాకు రూ.16,500
- బీ కేటగిరికి రూ.13.20 లక్షలు, సీ కేటగిరికి రూ.39.60 లక్షలు



సాక్షి, అమరావతి: 2023–24 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రైవేట్ వైద్య, డెంటల్ కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు ఫీజులు ఖరారు చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులిచ్చారు. హైకోర్టు తుది తీర్పునకు లోబడి ఫీజుల అమలు ఉంటుందని పేర్కొన్నారు. 2022–23లో అమలైన ఫీజులపై 10% మేర పెంపుదల చేసి కొత్త ఫీజులను ఖరారు చేశారు. ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా ఫీజును రూ.16,500గా నిర్ణయించారు. బీ కేటగిరికి రూ.13.20 లక్షలు, సీ కేటగిరి (ఎన్ఆర్ఐ కోటా)కు రూ.39.60 లక్షలు చొప్పున ఫీజులు ఉన్నాయి. బీడీఎస్ కన్వీనర్ కోటాకి రూ.14.300..బీ కేటగిరీకి రూ.4.40 లక్షలు, ఎన్ఆర్ఐ కోటాకి రూ.13.20 లక్షలు చొప్పున ఫీజు ఖరారు చేశారు. 2020లో ఖరారు చేసిన ఫీజుల ప్రకారం 2022–23 విద్యా సంవత్సరం వరకు ప్రవేశాలు చేపట్టారు. నీట్ యూజీ–2023లో ఏపీలో 42,836 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య వర్సిటీ ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చింది. నీట్ యూజీ అర్హత సాధించినవారు దరఖాస్తు చేసుకుంటున్నారు.

వ్యాయామ కళాశాలల్లో కోర్సులకు ఇలా..

ప్రైవేట్, అన్-ఎయిడెడ్ వ్యాయామ కళాశాలల్లో డీపీఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ కోర్సులకు ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ సిఫారసుల మేరకు 2023–26 విద్యా సంవ్సతరానికి ఫీజులను ప్రభుత్వం ఖరారు చేసింది. కన్వీనర్ కోటా కింద రెండేళ్ల కోర్సుల్లో భాగంగా డిప్లొమో (డీపీఈడీ)కు రూ.14 వేల నుంచి రూ.16 వేలు, బ్యాచ్‌లర్ (బీపీఈడీ)కు రూ.15 వేల నుంచి రూ.24,500, మాస్టర్స్ (ఎంపీఈడీ)కు రూ.25 వేల నుంచి రూ.35 వేల మధ్య ఆయా కళాశాలల్లోని వసతులు, విద్యా బోధనను బట్టి ఫీజులను నిర్ణయించింది. ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోని ఒక కళాశాలతో పాటు, గత అడ్మిషన్లలో 25% కంటే తక్కువ నమోదైన 5 కళాశాలలకు అడ్మిషన్లను 2023–26 విద్యా సంవత్సరానికి బ్లాక్ చేసినట్లు ఉన్నత విద్య ముఖ్య కార్యదర్శి శ్యామలరావు ఉత్తర్వులిచ్చారు.

ఏపీ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ఫలితాల విడుదల

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ) ఆధ్వర్యంలో జరిగిన పదో తరగతి, ఇంటర్ పరీక్షల ఫలితాల్లో బాలికలు మెరుగైన ఉత్తీర్ణత సాధించారు. పదో తరగతిలో 13,320 మంది పరీక్షలకు హాజరు కాగా 7,619 మంది (57.20%), ఇంటర్‌లో 25,097 మంది పరీక్ష రాస్తే 15,676 మంది (62.46%) ఉత్తీర్ణులయ్యారు. పదో తరగతిలో బాలికలు 52.60%, బాలురు 41.75%, ఇంటర్‌లో బాలికలు 65.32%, బాలురు 60.92% ఉత్తీర్ణత సాధించినట్లు ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ కేవీ శ్రీనివాసులు రెడ్డి మంగళవారం తెలిపారు. జూన్ 26 నుంచి జూలై 4 వరకు నిర్వహించిన పరీక్షల ఫలితాలు, మార్కుల మెమోలను www.apopenschool.ap.gov.in లో పొందుపరిచారు. పదో తరగతిలో 88.19% ఉత్తీర్ణతతో కాకినాడ జిల్లా ప్రథమ స్థానంలో, 16.83%తో ఎన్టీఆర్ జిల్లా చివరి స్థానంలో, ఇంటర్‌లో 84.68% ఉత్తీర్ణతతో తూర్పు గోదావరి ప్రథమ, 41.71% ఉత్తీర్ణతతో పశ్చిమ గోదావరి చివరి స్థానంలో నిలిచాయన్నారు. జూలై 27 నుంచి ఆగస్టు 4 వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.